
# చరిత్రలో మతాలు

సెర్గియ్ తొకరెవ్



ప్రజాశక్తి బుక్‌హౌస్

# చరిత్రలో మతాలు

సెర్గియ్ తొకరేవ్

ప్రజాశక్తి బుక్‌హౌస్

*1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

అనువాదం : ఫాతిమా

ప్రచురణ సంఖ్య : 942
ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 1998
ద్వితీయ ముద్రణ : ఏప్రిల్, 2005
తృతీయ ముద్రణ : మార్చి, 2006

వెల : రు.35/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# ఒక మాట

ప్రస్తుత ప్రపంచంలో పలు రకాలైన మత విశ్వాసాలు కలిగిన వారు అనేకంగా వున్నారు. ఏ మత విశ్వాసానికీ కట్టుబడని వారున్నప్పటికీ సంఖ్యరీత్యా వారు చాలా స్వల్పమనే చెప్పాలి. దీనినిబట్టి ప్రపంచంలో మతానికున్న స్థానమేమిటో తెలుసుకోవచ్చు. నిజానికి జాతీయ మతాలు, ప్రపంచ మతాలు అని చెప్పుకోదగినవి కొన్ని మాత్రమే వున్నప్పటికీ వీటి శాఖలు ఉప శాఖలు మాత్రం అసంఖ్యాకంగా వున్నాయి. ఉదాహరణకు క్రైస్తవం, ఇస్లాం, హిందూ, బౌద్ధ మతాలను తీసుకుంటే వీటిల్లో వందల సంఖ్యలో శాఖా భేదాలు వున్నాయి. ఒక్కొక్కప్పుడు అతి స్వల్పమైన కారణాలపై విభేదాలు తలెత్తి శాఖలుగా చీలిపోవడం జరుగుతుంది. ఈ శాఖోపశాఖలు ఎన్ని వున్నప్పటికీ భగవంతుడు, పవిత్ర గ్రంథము, జన్మాంతర నరక స్వర్గములు వంటి వాటిలో ఏకాభిప్రాయం వుండటం కద్దు.

విద్యా గంధమబ్బనివారేగాక విద్యాధికులూ, ఉన్నత స్థాయి ఉద్యోగులు, అధికారులు, ప్రభుత్వ నేతలు సైతం మత విశ్వాసాలకు లోబడి స్వామీజీలను, బాబాలను అమ్మవార్లను ఆరాధించడం చూస్తూ వుంటాము. తమ మనో వాంఛితాలు నెరవేరాలన్న ఆశతో మత విశ్వాసులు చెట్టును పుట్టను పూజించడం, క్షేత్రాలు తిరగడం, తీర్థమాడటం వంటివి కూడా చేస్తుంటారు. నానాటికీ పెరుగుతున్న శాస్త్ర విజ్ఞానం తోడ్పాటుతో తమలోని మూఢ నమ్మకాలను వదిలించుకోవడానికి మారుగా ఆ మూఢనమ్మకాలకు శాస్త్రం రంగు పులిమే విద్యాధికులు కూడా మనకు తారసిల్లుతుంటారు. ఉగ్గు పాలతో మూఢ విశ్వాసాలను రంగరించి పోసే సామాజిక వాతావరణమూ, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించలేని విద్యా విధానమూ, మూఢ విశ్వాసాలను తొలగించేందుకు ఏ మాత్రం శ్రమించని పాలకవర్గాలు యీ దుస్థితికి కారణమని చెప్పవచ్చు.

"అతి పురాతన కాలంలో తమ స్వంత స్వభావాన్ని గురించీ, తమను చుట్టివున్న బాహ్య ప్రకృతిని గురించీ అపభ్రంశ రూపకమయిన మానవుని మొరటు భావాల నుండి మత విశ్వాసం ఆవిర్భవించిందని" కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలలో ఒకరైన ఎంగెల్స్ చెపుతారు. ఈ భావాన్నే మార్క్స్ మరింత వివరంగా చెపుతాడు. "శ్రమ ఉత్పాదకశక్తి ప్రాథమిక స్థాయిని మించి అభివృద్ధి చెందనప్పుడు తత్ఫలితంగా భౌతిక జీవనంలో సాంఘిక సంబంధాలు (మనిషికి–మనిషికీ మధ్య, ప్రకృతికి–మనిషికి మధ్య సంబంధాలు) సంకుచితంగా వున్న

దశలో మతం ఆవిర్భవించి మనగలుగుతుంది.”

ప్రకృతి శక్తులను ఆరాధించడం, వృక్ష పూజ, జంతు పూజ తొలినాటి మత రూపాలుగా వున్నాయి. వీటి అవశేషాలే తదనంతర మతాలలో కూడా కనిపిస్తాయి. ఈనాడు ప్రముఖ మతాలనుకొన్న అన్నింటిలో ప్రాచీన తెగల పూజా విధానాలు కనిపిస్తాయి. అదే విధంగా వివిధ ప్రజా బృందాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు ఓడిపోయిన వారితోపాటు వారి దేవతలు కూడా గెలుపొందిన వారి దేవతలకు లొంగిపోయారు. విజితులైన వారి దేవతల స్వభావం వాటి పూజా విధానం విజేతలైన వారి దేవతలకు ఎంతో కొంత మేరకు సంక్రమించాయి. ఈ విధంగానే ప్రాచీన తెగలు, గణాలు పెద్ద రాజ్యంగా ఏర్పడినప్పుడు ఆయా తెగల, గణాల దేవతలు కూడా ఒకే సమూహంగా ఏర్పడి చివరికి శక్తి సంపన్నుడైన ఒకే ఒక దేవుడు ఆవిర్భవించడానికి దారితీసింది. పలువురు రాజుల స్థానంలో ఒకే రాజు వచ్చినప్పుడు పలువురు దేవతల స్థానంలో ఒకే దేవుడు రావటం సహజం.

ఆదిమ సమాజంలో ప్రజలకు, మానవాతీత శక్తులకూ మధ్య తాంత్రికులు, భూత వైద్యులు వున్నారు. అయితే వీరు ప్రజల నుండి పూర్తిగా విడగొట్టుకొని తమ మధ్యవర్తిత్వాన్ని ఒక వృత్తిగా మలచుకోలేదు. కాని వర్గాలు వునికిలోకి రావడంతో ప్రత్యేకంగా పూజారి వర్గం ఏర్పడింది. ఈ వర్గం ప్రజల నుండి పూర్తిగా విడగొట్టుకున్నది. తనదైన జీవన మార్గాన్ని, జీవితాదాయాన్ని ఏర్పరచుకున్నది. మరో విశిష్టత ఏమిటంటే యీ వర్గం పాలక వర్గానికే గాని పాలిత వర్గం పట్ల ఎన్నడూ సానుభూతి చూపలేదు. పైగా పాలిత వర్గాన్ని అణచివేయడంలో పాలకవర్గానికి ఒక పనిముట్టుగా ఉపయోగపడింది.

పాలిత వర్గాలు ముఖ్యంగా బీదాబిక్కీ జనం తమదైన మతాన్ని రూపొందించుకున్నప్పటికీ అది కూడా కొద్ది కాలంలోనే పాలకవర్గ మతంగా రూపాంతరం చెందేది. ఇందుకు క్రైస్తవం మంచి ఉదాహరణ. రోమన్ సామ్రాజ్యంలోని అణగారిపోయిన జనాల మతంగా క్రైస్తవం ఆవిర్భవించింది. “బీదలకు సువార్త ప్రకటింపబడుతున్నది” (మత్తయి 11-6) అని చెప్పిన క్రైస్తవం తదనంతర కాలంలో ధనిక వర్గానికి అనుకూలంగా మారిపోయింది. క్రీ.శ. 313లో రోమ్ సామ్రాజ్య చక్రవర్తి కాన్‌స్టాంటిన్ క్రైస్తవాన్ని రాజ్య మతంగా గుర్తించాడు. ఆయనకు ముందున్న చక్రవర్తులు క్రైస్తవ సమాజాలను అణచివేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. కాని కాన్‌స్టాంటిన్ ఇందుకు విరుద్ధంగా దాన్ని రాజ్య మతంగా గుర్తించడం ద్వారా తన రాజ్య ప్రయోజనాలను కాపాడుకోవాలనుకున్నాడు. అతని అంచనా తప్పుకాలేదు. క్రైస్తవం రాజ్య మతంగా గుర్తింపు పొందగానే దాని స్వభావంలోనే మార్పు వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే అది పాలితవర్గాల మతంగా కాక పాలకవర్గాల మతంగా మార్పు చెందింది. ఈ విషయాన్ని క్రైస్తవ మత విశ్వాసులు సైతం అంగీకరిస్తారు. ఆంధ్ర ఎవాంజిలికల్ లూథరన్ చర్చికి చెందిన సుప్రసిద్ధ గ్రంథకర్త టి. జాన్ రత్నం తన “ఆది క్రైస్తవ సంఘ చరిత్ర”లో ఇలా పేర్కొంటారు. “బాహ్యమునకు క్రైస్తవ సంఘం రోమా సామ్రాజ్యమును జయించినట్లు కనపడినను, వాస్తవిక దృష్ట్యా రోమా సామ్రాజ్యమే క్రైస్తవ మతమును జయించెను.” (పేజీ: 102) దాదాపుగా ప్రతి మతంలోను యీ లక్షణమే

కనపడుతున్నది. హిందూ దురాచారాలకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన బౌద్ధం చివరికి హైందవంలో కలసిపోవడం మన దేశంలో చూస్తాము. అయితే కొన్ని సందర్భాలలో కొంతమంది మతవాదులు ప్రజల పక్షాన నిలిచిన ఉదాహరణలు కూడా వున్నాయి.

మార్క్స్ మాటల్లో చెప్పాలంటే "మతం అనేది బడుగుజీవి నిట్టూర్పు, హృదయరహిత ప్రపంచంలో హృదయం, ఆత్మరహిత లోకంలో ఆత్మ, ప్రజలకు నల్లమందు" ఈ నల్లమందు కష్ట జీవులను ఆధ్యాత్మికంగా బానిసలను చేసే స్వభావాన్ని కలిగివుంది. ఇకముందు కూడా అలాగే వుంటుంది.

వర్గ సమాజంలో ప్రజలకు నల్లమందుగా మారిన మతం ఛాందస భావాలకు దారితీస్తున్నది. పీడితవర్గ ప్రయోజనాలకు యీ మార్పు వ్యతిరేకం గనుకనే మత భావాలపై పోరాటం చేయవలసి వుంది. అయితే కొందరు భావిస్తున్నట్లుగా ప్రజలను విద్యావంతులను చేయడం వలన మాత్రమే మతాన్ని ఎదిరించలేము. మతాన్ని సృష్టించే, కొనసాగించే పరిస్థితులపై పోరాటంగా యిది వుండాలి. అంటే దోపిడీ విధానానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఇది అంతర్భాగం కావాలి.

పాలిత వర్గాలను అణచివేయడానికి పాలక వర్గాలు మతాన్ని ఒక సాధనంగా వినియోగించుకుంటున్నాయన్న సంగతి తెలియాలంటే మతాన్ని గురించి సవిమర్శనాత్మక అవగాహన అవసరం. అందుకు యీ చిన్న పుస్తకం కొంత మేరకు తోడ్పడగలదు. ఈ పుస్తకంలోని బౌద్ధ, యూదు, క్రైస్తవ, ఇస్లాంలకు సంబంధించిన అధ్యాయాలు Sergei Tokarev రచించిన **History of Religion** అన్న గ్రంథములోని వాటికి స్వేచ్ఛానువాదము. 'భారత దేశంలో మతం' అన్న అధ్యాయాన్ని కొద్దిపాటి మార్పులతో అనువాదం చేయడం జరిగింది. పాఠకులు యీ చిన్న పుస్తకాన్ని ఆదరిస్తారనే ఆశిస్తాము.

**-ప్రచురణకర్తలు.**

# విషయ సూచిక


1. భారతదేశంలో మతం ........... 7
2. యూదు మతం ......... 35
3. క్రైస్తవ మతం ......... 61
4. ఇస్లాం మతం ....... 101

# భారతదేశంలో మతం

ప్రాచీన నాగరికత గల దేశాలలో భారతదేశమొకటి. నాగరికతాభివృద్ధితో పాటే మత విశ్వాసాలుకూడా పెరుగుతూ వచ్చాయని ప్రపంచ చరిత్ర తెలియచెప్తున్నది. భారత దేశం ఇందుకు మినహాయింపుకాదు. సింధు లోయలో లభించిన ఆధారాలను బట్టి క్రీస్తు పూర్వం రెండు వేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో మత విశ్వాసాలు వ్యాప్తిలో వున్నట్లు తెలియవస్తున్నది. అయితే ఇక్కడ వ్యాప్తిలో వున్న మతం పట్ల స్పష్టమైన అవగాహనకు యీ ఆధారాలు తోడ్పడటం లేదనే చెప్పాలి.

సింధు లోయలో అభివృద్ధి చెందిన మొహంజదారో–హరప్పా సంస్కృతి ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడింది. ఇక్కడి ప్రజలకు లోహాల గురించి తెలియడంతో పాటు వివిధ రకాలైన చేతివృత్తుల గురించి కూడా అవగాహన వున్నది. ఇటుక రాళ్ళతో పెద్ద పెద్ద కట్టడాలను నిర్మించగలిగారు. వీరికి లిపి గురించి కూడా తెలుసుననడానికి సాక్ష్యాలున్నాయి. కాని ఈ లిపిని ఇప్పటి వరకు ఎవరూ చదవలేకపోయారు. కనుక వాటి వివరాలు నిగూఢంగానే వుండిపోయాయి. స్టీటైట్ రాయితో తయారుచేసిన చిన్నచిన్న బిళ్ళలు సింధులోయలో అసంఖ్యాకంగా లభించాయి. వీటిపై రకరకాల జంతువుల బొమ్మలు వున్నాయి. ముఖ్యంగా ఎద్దు, ఏనుగు, ఖడ్గ మృగం, పులి వంటివి చిత్రితమయ్యాయి. వీటినిబట్టి ఇక్కడ జంతు పూజ అమలులో వుండేదని వూహిస్తున్నారు. ఇప్పటికీ ఈ పూజారీతులు ద్రవిడ సంస్కృతిలో కనపడతాయని పరిశోధకుల భావన. ఆ కాలంలో జంతు పూజతోపాటు వృక్ష పూజ కూడా వుండవచ్చునని భావిస్తున్నారు. స్త్రీ పురుషుల బొమ్మలు చిత్రితమైన స్టీటైట్ బిళ్ళలు కూడా లభించాయి. రెండు కొమ్ములు, మూడు ముఖాలు వున్న పురుష దేవుని బొమ్మ కూడా కనిపిస్తుంది. ఆసీన భంగిమలో వున్న యీ పురుషమూర్తి చుట్టూ జంతువుల బొమ్మలు చిత్రితమై వున్నందున దీనిని పశుపతి అని పిలవడం జరుగుతున్నది. నేటి శివుని ప్రాథమిక రూపం ఈ పశుపతే అన్న విశ్వాసం కలదు.

ఆర్యుల ప్రవేశంతో భారతదేశంలో మత విశ్వాసాలు ఒక నిర్దిష్ట రూపాన్ని తీసుకోవడం ప్రారంభించాయి. రమారమి క్రీస్తుకు పూర్వం రెండు వేల సంవత్సరాల క్రిందట ఆర్య తెగలు వాయవ్యభారతంలోకి అడుగుపెట్టాయి. సంస్కృతీపరంగా చూస్తే మధ్య ఆసియా నుండి వచ్చిన ఆర్యులు స్థానికులైన సింధు లోయవాసులకన్నా చాలా దిగువస్థాయిలో

వున్నారు. ఆనాటికింకా ఆర్యులకు వ్యవసాయం గురించి తెలియదు. వారు పశు పాలకులుగానే యీ దేశంలోకి ప్రవేశించారు. కనుకనే సంచార జీవనం సాగిస్తూ వుండేవారు. భారతదేశంలోకి ప్రవేశించే నాటికే వారిలో పితృస్వామ్య వ్యవస్థ వుంది. తదనుగుణంగానే తెగల నిర్మాణం వుండేది. వీరిలో యుద్ధతంత్రం కూడా బాగా అభివృద్ధి చెందింది. ఆ రకంగా ఆర్యులు గోపాలకులుగానే గాక యుద్ధ వీరులుగా కూడా ప్రసిద్ధికెక్కారు. ఆర్యుల మత విశ్వాసాల గురించి అనేక సాక్ష్యాలు లభిస్తున్నాయి. ఆర్యుల రాక నుండి నేటి వరకు నడచిన మత చరిత్రను సులభంగా అర్థం చేసుకోవడానికి గాను దానిని వైదిక, బ్రాహ్మణ, హిందూ అన్న మూడు భాగాలుగా విభజించవచ్చు.

వేదాలను బట్టే తొలి దశకు ఆ పేరు ఇవ్వడం జరిగింది. 'వేద' శబ్దమునకు జ్ఞానమని అర్థము. ఈ వేద సారస్వతము అపారమైనది. ఈ సారస్వతాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. ఋగ్యజుస్సామాథర్వ వేదములని యీ భాగాలను పిలిచారు. ఋగ్వేదము ప్రార్థనలతో కూడినది కాగా, యజుర్వేదము కర్మకాండలకు సంబంధించినది. గానానుకూలమైన గేయములతో కూడినది సామవేదము. కాగా ప్రాపంచిక విషయాలతో కూడినది అధర్వ వేదము. మొదటి మూడును మత కర్మకాండకు సంబంధించినవి కాగా అధర్వ వేదము దీర్ఘాయుర్దాయ సాధనాల గురించీ, ఐశ్వర్యప్రాప్తి, బాధా నివారణ, వశీకరణములు మొదలైన వాటి గురించి తెలియజేస్తుంది. ప్రతి వేదము, మంత్రసంహిత, బ్రాహ్మణములని రెండు భాగాలుగా విడివడి వున్నది. దేవతల స్తోత్రములు, అర్థవంతములైన వాక్యములు మంత్రములు. దీనినే ***సంహిత*** భాగమంటారు. అసలైన వేదాలుగా యీ భాగాన్నే గుర్తిస్తారు. "యజ్ఞాద్యనుష్టానములను వివరించునవి ***బ్రాహ్మణములు***. వృద్ధి చెందునది, చెందించునది బ్రహ్మము. యజ్ఞమునకు బ్రహ్మ శబ్దము వాడుతున్నారు. దానిని వివరించునవి బ్రాహ్మణములు. వానప్రస్థులకు ఉచితములగు విషయాలను తెలుపునవి, యజ్ఞాదికర్మలను గుహ్యములుగా ఆధ్యాత్మిక విషయాలుగా అర్థం చేసుకొనునవి, అరణ్యములందు పఠనీయములగు వేద భాగములు ***ఆరణ్యకములు***. ఈ మూడును కర్మకాండ. వేదముల అంతిమ భాగములు ***ఉపనిషత్తులు:*** ఇవి జ్ఞానకాండ. వాటిలో ఎక్కువగా బ్రహ్మ-ఆత్మల, అనగా జగత్కారణమును గురించి, మానవుని స్వభావము, అతని గతి – వీటిని గూర్చి విచారము గలదు*. ఈ వేద సారస్వతం అపారమైనదని ముందే చెప్పుకున్నాము గదా! ఒక్క ఋగ్వేదంలోనే 1017 సూక్తాలు వున్నాయి. వీటిలో 10,500 వరకు ఋక్కులు (మంత్రాలు) వున్నాయి. ఈ వేదం మొత్తం 10 మండలాలుగా విభజితమై వుంది. ఈ వేద సాహిత్యం కొన్ని శతాబ్దాలపాటు మౌఖికంగానే తరం నుండి తరానికి సంక్రమిస్తూ వచ్చింది.

వేద సాహిత్యం ఆవిర్భవించిన కాలంలో బహు దేవతారాధన ఉనికిలో ఉన్నదని చెప్పవచ్చు. వేదంలో కనిపించే దేవతలు 33 వరకు వుంటారని ఒక అంచనా. కాని 3,399 మంది దేవుళ్ళు వున్నట్లు వేదం చెప్తున్నది. అయితే ఈ దేవుళ్ళలో ఒకరు ప్రధాన దేవతగా

---

* విజ్ఞాన సర్వస్వము, సంపుటి -7, పుట. 55

వుండేవారని, ప్రజలు ఆయననే ఎక్కువగా పూజించేవారని తెలుస్తున్నది. దీనినే ఉపాస్య దేవతా శ్రేష్ఠత్వవాదము (Henotheism) అని మాక్స్ మిల్లర్ పిలిచాడు. ఏ దేవత గురించి పూజలు చేస్తున్నారో లేక చెప్తున్నారో ఆ సమయంలో ఆ దేవతనే పరమోత్కృష్టమని భావించటం ఉపాస్య దేవతా శ్రేష్ఠత్వవాదమని అంటారు. ఉదాహరణకు వేదములలో కొన్నిచోట్ల అగ్నిని, మరి కొన్నిచోట్ల ఇంద్రుని విశ్వాధిపతిగా ప్రస్తుతించారు.

ఆర్యులు కొలిచిన తొలి దేవతలలో ఇంద్రుడు ముఖ్యుడు. దాదాపు 250 సూక్తాలలో ఇంద్రుని స్థుతించడమేగాక ఇంకా అనేక రూపాలలో ఇంద్రుని ప్రశంస కనిపిస్తుంది. యుద్ధాలలో విజయం కోసం ఇంద్రుని ప్రార్థించడం కనిపిస్తుంది. ఇతడు వజ్రాయుధుడు. ఉరుములు, మెరుపులు ఇతని స్వాధీనంలో వుంటాయి. ఆర్యులు తెగ జీవితం గడుపుతున్నప్పుడే ఇంద్ర పూజలు ప్రారంభమై వుండవచ్చు. త్రిత్సు తెగ పేరు మీదుగా యీ ఇంద్ర శబ్దం వచ్చిందన్న అభిప్రాయం వుంది. తొలి దశలో యుద్ధ దేవతైన ఇంద్రుడు తదనంతర కాలంలో ప్రకృతి దేవతగా మారాడు.

ఋగ్వేదంలో ఇంద్రుడు యుద్ధ దేవతగానే చిత్రితమయ్యాడు. మరికొన్నిచోట్ల మహావీరునిగాను. స్వర్గాధిపతిగాను వర్ణితమయ్యాడు. వృత్రాసురుని సంహరించిన వీరునిగా స్థుతులందుకున్నాడు. వృత్రాసురునికి భయపడి మిగిలిన దేవతలందరూ పారిపోగా ఇంద్రుడు మాత్రం ఎదిరించి గెలవగలిగాడు.

వేద సాహిత్యంలో కనిపించే మరో ముఖ్య దేవుడు వరుణుడు. సహస్ర స్తంభములు గల సౌధములో ఇతని నివాసము. లోకములో జరుగు సర్వకార్యములు ఇతనికి తెలియును. తనవద్దనున్న పాశములతో ఆయన మానవులను బంధిస్తాడు. సత్పురుషులకు మాత్రం బంధవిముక్తి కల్పిస్తాడు. ఈ వరుణుడే భారతీయుల తొలి దేవత అని కూడా భావిస్తారు.

ఆర్యులు పూజించిన మరో ముఖ్య దేవుడు సూర్యుడు. ఈ సూర్యారాధన అన్ని దేశాలలోనూ ప్రముఖంగా కనిపిస్తుంది. సూర్యదర్శనంతో చీకట్లు తొలగిపోయి వెలుతురు వస్తుంది కనుకనే ప్రాక్తన కాలంలో సూర్యుడు సకల జనారాధకుడయ్యాడు.

ఈ అనేకానేక దేవతలతోపాటు ఆర్యులు పితృ దేవతలను కూడా ఆరాధించేవారు. మృతి చెందిన పూర్వీకులే పితృ లేదా పితరులు. ఆర్యులు పితృస్వామ్య సమాజంలో వున్నందునే యీ ఆరాధన ఉద్భవించింది. దేవతలకు బలులు ఇచ్చినట్లుగానే పితృ దేవతలకు పిండాలు సమర్పించేవారు.

అయితే యీ దశలో దేవతా విగ్రహాలుగాని, దేవాలయాలు గాని లేవు. వేద సారస్వతంలో దేవాలయ ప్రసక్తే వుండదు. దేవతలకు అర్పించే బలులను ఇళ్ళ వద్దనో, లేక ప్రత్యేకంగా నిర్మించిన యజ్ఞ వేదికల మీదనో సమర్పించేవారు. దేవతలకు సంబంధించిన యీ రకమైన విశ్వాసాలతోపాటు మరో పరిణామం కూడా సంభవించింది. ఈ పరిణామం చాతుర్వర్ణ వ్యవస్థకూ, కుల పద్ధతికీ దారితీసింది. భారత దేశంలోకి ప్రవేశించిన ఆర్యులందరూ ఒకే సమూహానికి చెందిన వారుకాదు. వారు పలు గోత్రీయ సమాజాలకు చెందినవారని పరిశోధనలలో వెల్లడైంది. అయితే యీ గోత్రీయ సమాజాలలో కొందరు

ఉన్నతులు మరికొందరు అల్పులనే భావన ఆనాటికి పొటమరించలేదు. "అయితే యుద్ధాలు, దండయాత్రలు చేసి పురోగమించవలసిన సమాజం వారిదైనందువల్ల దాని బాధ్యతలను నెరవేర్చడానికై కొంత మంది వ్యక్తులను ప్రత్యేకంగా వుంచవలసిన అవసరమేర్పడింది. అదేవిధంగా యుద్ధాలకు, ఆక్రమణలకు బయలుదేరి వెళ్ళేవారిలో గోత్రీయ వర్గ సోదరత్వాన్ని నెలకొల్పడానికి కొన్ని కర్మకాండలు కూడా చేయవలసి వచ్చినది. వీటిని నిర్వర్తించడానికి మరికొందరిని ప్రత్యేకించవలసి వచ్చింది. అనగా తర్వాతి కాలంలో క్షత్రియులనీ, బ్రాహ్మణులని చెప్పబడ్డ శాఖల తొలి రూపం ఒక్కొక్క గోత్రీయ వర్గంలోనూ రూపుదిద్దుకొని వున్నది. అయితే నాలుగు వర్ణాలు, కుల భేదాల రూపంలో హెచ్చు తగ్గులు ఈ కాలంలో ఆర్యుల సమాజాలలో లేవు.

"...ఆర్యేతరులు చేస్తూవున్న వ్యవసాయ, కుటీర పరిశ్రమలు, వాణిజ్యం మున్నగు వాటిని స్వీకరించిన ఒక కొత్త శాఖ ఆర్యులలో రూపొందింది. ఆ శాఖీయులే తర్వాత కాలంలో వైశ్యులుగా మారారు.

"అదే విధంగా యుద్ధాలలో ఆర్యులచేత ఓడింపబడ్డ ఆర్యేతరులు 'బానిస'లనే హీనస్థితికి దిగజారారు. సమాజంలో హెచ్చు తగ్గుల ప్రారంభం, హక్కులు లేని ఒక ప్రజా సమూహ ఉద్భవం ఇలాగే జరిగాయి.

"ఈ మార్పులతో పాటు ఇంతక్రితమే రూపొంది వున్న రెండు వర్ణాల వారు క్షత్రియులు, బ్రాహ్మణులుగా ఇతరులకన్నా ఉచ్ఛస్థితిని పొందారు."★

ఈ విధంగా వర్ణ వ్యవస్థకూ, కుల వ్యత్యాసాలకూ ప్రాచీన కాలంలోనే బీజాలు పడి క్రమేణా పెరిగి పెద్దవై అతి హేయమైన సామాజిక నిర్మాణం భారతదేశంలో నెలకొన్నది. ఈ వ్యత్యాసాలకు మత విశ్వాసాలను జోడించి యీనాటికీ సమర్థించడం జరుగుతున్నది.

తొలి దశకు చెందిన వేద దేవతలలో విభిన్నమైన రెండు తరగతులకు చెందిన వారున్నారు. ఒకరు అసురులు కాగా రెండవ వారు దివ్యులు. మొదటి తరగతిలోకి ద్యౌః వరుణ, మిత్ర, సావిత్రి, అదితి తదితరులు వస్తారు. మిగిలిన వారిలో ఎక్కువ భాగం రెండవ తరగతి క్రిందకు వస్తారు. అసుర తరగతికి చెందిన దేవతలు ప్రాక్తనకాలంలో పూజలందుకొని వుంటారని భావిస్తున్నారు. అయితే తరువాతి కాలంలో యీ పద్ధతి మారిపోయింది. అసురులు దుర్మార్గులుగానూ, దివ్యులు (సురలు) సచ్ఛీలురుగానూ మారిపోయారు. ఈ సమయంలోనే రాక్షస గణం కూడా ఉనికిలోకి వచ్చింది. ఇంద్రుడు తన దేవగణాల తోడ్పాటుతో యీ రాక్షసులను సంహరించిన గాథలు పుట్టుకొచ్చాయి. ఆర్యులతో శత్రుత్వం కలిగిన ద్రవిడ తెగలకు ప్రతీకాత్మక రూపమే యీ రాక్షసులని ఊహించడానికి అవకాశం వున్నది.

వేద కాలంలో దేవతల ప్రీత్యర్థం సోమరసం, ఆవు పాలు, వెన్న సమర్పించేవారు. సోమరసం దేవతలకు శక్తిని, తృప్తిని ఇస్తుందని భావించేవారు. సోమరసాన్ని సేవించి తమ శత్రువులను నాశనం చేయవలసిందిగా ఇంద్రుని కోరే ఋక్కులు వేదంలో కన్పిస్తాయి.

★ భారతదేశ చరిత్ర – ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, పేజి. 24–5

అయితే ఆనాటికింకా పురోహిత వ్యవస్థ బలపడలేదు.

మరణానంతర జీవితాన్ని గురించి కూడా వేదాలలో స్పష్టమైన ప్రస్తావనలు కనిపించవు. మరణానంతరం లభించే స్వర్గ, నరకాల ప్రసక్తి పురాణ కాలం నాటికి బాగా వ్యాప్తి చెందింది. శరీరం నుండి ఆత్మ వేరవుతుందన్న భావన ఆనాటికింకా బలపడలేదు.

వేద కాలంనాటి మతాన్ని గురించి క్లుప్తంగా ఇలా చెప్పుకోవచ్చు. ఆనాటికి బహు దేవతారాధన ఉనికిలో వున్నది. బలి సమర్పణలకు అత్యధిక ప్రాధాన్యత వున్నది. నాటి దేవతల్లో ఎక్కువ భాగం ప్రకృతికి ప్రతిరూపాలే. పురుష దేవుళ్లకే గాని స్త్రీ దేవతలకు ప్రాధాన్యత లేదు. ఈ అంశం పితృస్వామ్య సమాజం బలంగా వున్నదనటానికి నిదర్శనం. దేవాలయాలు, దేవతా విగ్రహాల ప్రసక్తేలేదు. పురోహితవర్గం ఏర్పడలేదు. శరీరం వేరు, ఆత్మ వేరు అన్న భావన ఇంకా తలెత్తలేదు.

క్రీస్తుకు పూర్వం తొలి సహస్రాబ్దం ప్రారంభంలో భారతీయ సమాజం అనేక మార్పులకు లోనైంది. ఆనాటికి సింధు, గంగా మైదానాలలో ఆర్యులు స్థిరపడ్డారు. పశుపోషణతో పాటు వ్యవసాయాన్ని కూడా ప్రారంభించి సంచార జీవితానికి స్వస్తి పలికారు. చిన్న చిన్న రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి. ఈ మార్పు భారతీయ సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసింది. మత విశ్వాసాలపై కూడా దీని ప్రభావం పడింది.

యుద్ధం లేదా సామరస్యం ద్వారా ఆర్యేతరులను ఆర్యులు తమ ప్రభావం క్రిందకు తెచ్చుకున్నారు. ఆ రకంగా ఆర్యులు తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలిగారు. ఈ తరుణంలోనే విజేతలకు, పరాజితులకూ మధ్య, అదేవిధంగా విజేతల మధ్య సామాజిక వైరుధ్యాలు పెరగసాగాయి. వివిధ రాజ్యాల మధ్య తరచుగా జరిగే యుద్ధాల రూపంలో యీ వైరుధ్యాలు బయటపడుతుండేవి. క్రీస్తుకు పూర్వం 500 నాటికే గంగా మైదానంలో ఆర్యులు బలపడగలిగారు. మగధ కేంద్రంగా ఉత్తర భారతంలోని విస్తృత ప్రాంతం ఒక సామ్రాజ్యం క్రిందకు వచ్చింది.

ఈ తరుణంలోనే కుల వ్యవస్థకు పునాదులు పడ్డాయి. తొలి దశలో వున్న నాలుగు వర్ణాలు కాక అనంతరకాలంలో అసంఖ్యాకమైన కులాలు, ఉప కులాలు ఉనికిలోకి వచ్చి యీనాటికీ నిలిచి వున్నాయి. వృత్తుల విభజన, కుల విభజన దాదాపు ఒకేరకంగా తయారైంది. ఏ కులంలో జన్మించిన వారు ఆ కుల వృత్తిని చేపట్టడం ధర్మంగా ప్రచలితమైంది. కుండలు తయారు చేయడం నుండి పౌరోహిత్యం వరకు ఇదే పద్ధతి అమలులోకి వచ్చింది. వేదకాలంలో కనిపించని పురోహిత వ్యవస్థ ఉనికిలోకి వచ్చి మత కర్మకాండల నిర్వహణను పూర్తిగా తన చేతిలోకి తీసుకున్నది. కుల వ్యవస్థలోని నిర్బంధాలకు, దోపిడీకి యీ వ్యవస్థ మత విశ్వాసాల ముసుగు తొడిగింది. వేద విద్యపైనా, మత కర్మకాండలపైనా బ్రాహ్మణులకు తిరుగులేని ఆధిపత్యం సంక్రమించింది. పాలకవర్గ వంశీయులు క్షత్రియులుగా రూపుదాల్చారు. పశుపాలకులు, వ్యవసాయదారులు, వర్తకులు వైశ్యులుగా రూఢి అయ్యారు. వీరు విజేతలైన ఆర్యులలోనివారే. కనుకనే స్వేచ్ఛా జీవనం చేయగలిగారు. ఈ మూడు వర్ణాలకు చెందిన వారికి సమాజంలో ఆధిపత్య స్థానం

లభించింది. ఈ మూడు వర్ణాలకే విద్య పరిమితమైంది. (విద్యా బోధన మాత్రం బ్రాహ్మణుల చేతిలోనే వుండిపోయింది.) ఆర్యులుగానూ, ఉన్నత వర్ణంగాను వీరు చెలామణి అయ్యారు. యజ్ఞోపవీతం ధరించి ద్విజులుగా ప్రసిద్ధికెక్కారు. అయితే యీ మూడు వర్ణాలలోనూ అంతరాలు లేకపోలేదు. కాని మిగిలిన కులాలకన్నా వీరు అధికులుగా నిలిచిపోయారు.

విజితులైన స్థానికులతో నాల్గవ వర్ణం ఏర్పడింది. వీరినే శూద్రులన్నారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలలో శాఖలు, ఉప శాఖలు ఏర్పడినట్లుగానే శూద్రులలో అనేకానేకమైన కులాలు, ఉప కులాలు ఏర్పడ్డాయి.

ఈ వర్ణ వ్యవస్థను పటిష్టం చేయడానికి కల్పిత గాథలు పుట్టుకువచ్చాయి. విరాట్పురుషుని ముఖము, బాహువులు, ఊరువులు, పాదములు వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల జన్మ స్థానాలని ఋగ్వేదంలోని పురుష సూక్తం చెపుతున్నది. ఈ వర్ణన ప్రక్షిప్తమని కొందరు చెపుతున్నప్పటికీ తదనంతర కాలంలో యీ భావనే భారతీయ సమాజంలో బలంగా పాతుకుపోయింది.

కుల వ్యవస్థకు మత విశ్వాసాలతోకూడిన శాసన రూపాన్ని కల్పించిన మొట్ట మొదటి గ్రంథం మనుస్మృతి. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్ది మొదలు రెండు వేల సంవత్సరాల వరకు దీని కాలాన్ని ఊహించినవారున్నారు. కాని దీని కాలాన్ని క్రీ.పూ. రెండవ శతాబ్దిగానే ఎక్కువ మంది పరిగణిస్తున్నారు. ప్రాతఃకర్మలు మొదలుకొని రాజ్య పాలన వరకు గల అనేకానేక విషయాలు దీనిలో వున్నాయి. వర్ణ వ్యవస్థకు ఒక ఖచ్చితమైన రూపాన్ని మనుస్మృతి ఇచ్చింది. వర్ణ వ్యవస్థ సంకరం కాకుండా కాపాడటం, బ్రాహ్మణాధిక్యతను నిలబెట్టడం రాజుల కర్తవ్యంగా మారిపోయింది. ఆ రకంగా బ్రాహ్మణాధిక్యత సమాజంలో వేళ్ళు తన్నుకున్నది. ఈ జగత్తు అంతా దైవాధీనమని, దైవం మంత్రాధీనమని, మంత్రం బ్రాహ్మణాధీనమని కనుక బ్రాహ్మణుడే భూలోక దైవమని (భూసురుడు) ప్రచారం జరిగింది. బ్రాహ్మణాధిక్యతను, బ్రాహ్మణుల మహిమలను, ఘనత్వాన్ని ప్రతి పురాణము నొక్కి చెప్పింది.

మనుస్మృతి అనంతర కాలంలో మత కర్మకాండలు పెచ్చుమీరాయి. వేద దేవతలైన ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, వాయువు వెనక్కిపోయారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రాధాన్యత పొందారు. అయితే శివుడు ప్రాక్తన దేవుడేననడంలో సందేహంలేదు. మత కర్మకాండలు వ్యయభరితంగా మారాయి. కనుక సంపన్నులకే అవి అందుబాటులో వుండే స్థితి వచ్చింది. ఈ కర్మకాండల సందర్భంగా బ్రాహ్మణులకు భూరిదానాలు చేసే సంప్రదాయం బలపడి కొనసాగింది. కర్మ సిద్ధాంతం వ్యాప్తిలోకి రాసాగింది. శరీరం వేరు, ఆత్మ వేరు అన్న విశ్వాసం కూడా బలంగా వ్యాపించింది. వాస్తవానికి యీ ఆత్మ సిద్ధాంతం మనుస్మృతికన్నా ముందే వెలువడిన ఉపనిషత్తులలో చోటు చేసుకున్నది.

ఉపనిషత్తు అనగా అవిద్యను నాశనము చేయునది. బ్రహ్మమును పొందించునది. దు:ఖమును తొలగించునది అని అర్థం చెపుతారు. జగత్కారణమేమిటి, సుఖ దు:ఖములు ఎలా కలుగుతున్నాయి. శాశ్వతానందమునిచ్చునదేది. మరణానంతరం మానవునిలో మిగులునదేమిటి వంటి అనేకానేక విషయాలను యీ ఉపనిషత్తులు చర్చకు పెట్టాయి. ఇవి

దాదాపు 183 వున్నాయని చెపుతారు. ఉపనిషత్తులలో ఒకటైన ముక్తికోపనిషత్తు 108 ఉపనిషత్తులను పేర్కొన్నది. ఇవి ప్రాచీనవైనవని భావిస్తారు. వీటిలో కూడా పది ఉపనిషత్తులను అత్యంత ప్రాచీనవైనవిగా పేర్కొంటారు. అవి ఈశ, ఛాందోగ్య బృహదారుణ్యకములు (క్రీ.పూ. 700): ఐతరేయ, తైత్తిరీయములు (క్రీ.పూ. 600–500): ప్రశ్న, కేన, కఠ, ముండక, మాండూక్యములు (క్రీ.పూ. 500–400): వీటికి కౌషీతకి, మైత్రి, శ్వేతాశ్వతరములను (క్రీ.పూ. 200–100) కూడా కొందరు కలుపుతారు.

ఈ ఉపనిషత్తులనే వేదాంతమని అంటారు. ఈ వేదాంత దర్శనంతో పాటు సాంఖ్య, న్యాయ, వైశేషిక, యోగ, మీమాంసలను కలిపి షడ్దర్శనములని పిలుస్తారు. వేద ప్రామాణ్యాన్ని తిరస్కరించిన లోకాయత దర్శనము కూడా విశిష్టమైనదే. వీరు పరలోకాన్ని, యజ్ఞయాగ ఫలాలను త్రోసిపుచ్చారు. దీనినే చార్వాక దర్శనమని కూడా అంటారు. భగవంతుని ఉనికినే త్రోసిపుచ్చిన లోకాయతులు వైదిక మతానుయాయుల ఆగ్రహానికి గురయ్యారు.

ఈ దర్శనాలతోపాటు జైన, బౌద్ధ దర్శనాలు కూడా పుట్టుకొచ్చాయి. ఈ రెండు మతాల కర్తలు క్షత్రియులు కావటం విశేషం. క్రీ.పూ. 5, 6 శతాబ్దాలలోనే యివి ఆవిర్భవించాయి. జైన మతాన్ని వర్ధమాన మహావీరుడు స్థాపించగా బౌద్ధాన్ని బుద్ధుడు ప్రచారం చేశాడు.

జైనుల సంప్రదాయం ప్రకారం మొత్తం ఇరవై నలుగురు తీర్థంకరులు యీ మతాన్ని ప్రచారం చేశారు. వీరిలో రుషభ దేవుడు ప్రథముడు కాగా, వైశాలీ నగరంలో జన్మించిన వర్ధమానుడు చివరివాడు. రాగద్వేషాదులను జయించుటచే ఈయనను మహావీరుడని పిలిచారు. తల్లిదండ్రులు మరణించిన తరువాత అన్న అనుమతితో ఇంటినీ ఇల్లాలిని వదిలి జైన ధర్మాన్ని బోధించసాగాడు.

జైనుల విశ్వాసం ప్రకారం సర్వకర్మల క్షయమే మోక్షము. ఈ మోక్షమునకు సమ్యక్ దర్శనము, సమ్యక్ జ్ఞానము, సమ్యక్ చారిత్రము అనునవి మూడు మార్గములు. జైన తీర్థంకరులు చెప్పిన తత్వార్థములయందు శ్రద్ధ కలిగి వుండటమే సమ్యక్ దర్శనం. జైన శాస్త్ర ప్రతిపాదితమగు సత్యమును నిశ్చయంగా తెలుసుకొనుటయే సమ్యక్ జ్ఞానము. సదాచార జీవనాన్ని గడపటం సమ్యక్ చారిత్రము. సత్యాహింసలకు జైనులు విపరీతమైన ప్రాధాన్యతనిస్తారు. క్షుద్ర కీటకాన్ని సైతం చంపరాదనేది వీరి వాదము.

ఇరవై మూడవ తీర్థంకరుడైన పార్శ్వనాథుని ప్రకారం యతులైన వారు వస్త్రధారణ చేయవచ్చు. కాని మహావీరుడు యీ వస్త్రధారణ వలదని త్రోసిపుచ్చాడు. అయితే మహావీరుని మరణానంతరం మగధయందలి జైన భిక్షువులు, యతులు తెల్లబట్టలు ధరించవచ్చునని ప్రకటించారు. కాని కొందరు దీనిని అంగీకరించలేదు. అలాంటివారు దిగంబరులని, వస్త్రధారణను ఒప్పుకున్న వారు శ్వేతాంబరులని పేరు పొందారు. స్త్రీలు మోక్షాన్ని పొందాలంటే ముందుగా వారు పురుష జన్మ ఎత్తాలని దిగంబరులు వాదించారు.

మహావీరుని కాలంలోనే మాయాదేవి శుద్ధోదన దంపతులకు క్రీ.పూ. 563 ప్రాంతాన సిద్ధార్థుడు జన్మించాడు. మహావీరుని వలెనే సిద్ధార్థుడు కూడా సంసారాన్ని

త్యజించి జ్ఞానపిపాసతో ఇల్లు వదిలాడు. జరామరణ భయాదుల నుండి ప్రపంచ ప్రజలను విముక్తి చేయటమే ఆయన లక్ష్యం. ఈ జ్ఞాన సముపార్జన నిమిత్తం బోధ గయలో ఆయన ఆరేళ్ళపాటు భీకర తపస్సు చేశాడని బౌద్ధుల విశ్వాసం. ఈ ధ్యాన ఫలితంగా చిట్ట చివరికాయనకు జ్ఞానోదయము కలిగింది. దాని సారాంశం యిలా వుంటుంది. దుఃఖము వున్నది. దానికి సముదయము (హేతువు) వున్నది. దానికి నిరోధము (నాశనము)వున్నది. ఈ నాశనమునకు మార్గమున్నదని ఆయన తెలుసుకున్నాడు. వీటినే తన శిష్యులకు, ప్రజలకు ఆయన బోధించాడు.

తాను తెలుసుకున్న సత్యాన్ని మొదటగా ఐదుగురు భిక్షువులకు బోధించాడు. ఈ ప్రదేశమే సారనాథ. ఇది బౌద్ధులకు పవిత్ర స్థలము. ఈ ప్రథమ బోధననే ప్రథమ ధర్మచక్ర ప్రవర్తితము అంటారు. బుద్ధుని తదనంతర కాలంలో బౌద్ధంలో కూడా హీనయాన, మహాయానాదుల వంటి శాఖలు పుట్టుకొచ్చాయి. హింసతో కూడిన కర్మకాండను బుద్ధుడు పూర్తిగా వ్యతిరేకించాడు. సత్యాహింసలు ఆయన బోధల్లో ప్రముఖమైనవి.

జైనం కన్నా బౌద్ధం ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. జైనంలో వున్న తీవ్ర ఆంక్షలు బౌద్ధంలో లేకపోవడమే దీనికి కారణమనవచ్చు. భూమిని దున్నితే నేలలోని క్రిమికీటకాదులు చనిపోతాయి గనక సేద్యాన్ని జైనం తప్పుగా భావించింది. చివరికి ఉచ్ఛ్వాసనిశ్వాసాల కారణంగా క్రిములు చావకుండా వుండటానికై నోటికి గుడ్డ కట్టుకొనే ఆచారం ప్రబలింది. కనుకనే ముఖ్యంగా గ్రామీణులు జైనానికి దూరంగా వున్నారు. బౌద్ధం ఇంతటి తీవ్ర ఆంక్షలను విధించలేదు. ఈ కారణంగానే సామాన్య ప్రజలలో సైతం బుద్ధుని బోధలు వ్యాపించాయి. చివరకు మౌర్య (క్రీ.పూ. 3), కుషాణ (క్రీ.పూ. 1-2) వంశస్థుల కాలంలో బౌద్ధం జాతీయ మతంగా రూపుదాల్చింది. ఈ పరిణామం బ్రాహ్మణ మత పెద్దలకు భయం గొల్పిందనడానికి సందేహంలేదు. బౌద్ధాన్ని అణచి తమ మతాన్ని నిలబెట్టుకునేందుకు బ్రాహ్మణ మతానుయాయులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగానే అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామం ఒక నూతన శకానికి దారితీసింది. దానినే హిందూ మత శకంగా పిలవవచ్చు. మతపరమైన కర్మకాండలు విపరీతంగా పెరిగిపోయాయి. రకరకాలైన ఆచారవ్యవహారాలతోపాటు దేవాలయాలు, తీర్థ క్షేత్రాలు పుట్టుకొచ్చాయి. భారతదేశ చరిత్రలో మొట్ట మొదటిసారిగా దేవాలయాలు యీ కాలంలోనే నిర్మితమయ్యాయి. ముందుగా బౌద్ధ ఆరామాలు వచ్చాయి. వాస్తవానికి ఇవి పెద్ద మట్టి దిబ్బలవంటివి. వీటిపైన స్థూపాలను నిర్మించేవారు. కాని హిందూ దేవాలయాలు బృహత్తరమైనవి. అసాధారణ శిల్ప విన్నాణంతో శోభిల్లినవి. వీటిలో పూజలు చేసేందుకు సాధారణ ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారు. అయితే సవర్ణులైన వారికే ఆలయ ప్రవేశం లభించేది. అవర్ణులనే పేరుతో అనేక మందిని దేవాలయానికి దూరంగా వుంచారు. ఈ ఆలయాలలో బ్రహ్మాండమైన విగ్రహాలు చోటు చేసుకున్నాయి. ఊరేగింపుల కోసం ఉత్సవ విగ్రహాలు కూడా వచ్చాయి.

ఈ మార్పులతో పాటు దేవతల విషయంలో కూడా అనేక మార్పులు

చోటుచేసుకున్నాయి. ఆకాశంలో వుండే దేవతలు భూలోకానికి విచ్చేశారు. ఇందుకు 'అవతారాలు' ఉపయోగపడ్డాయి. చివరకు బుద్ధుడిని కూడా దశావతారాలలో ఒకటిగా మార్చివేశారు. రాముడు, కృష్ణుడు బాగా వ్యాప్తిలోకి వచ్చారు. ఒక రకంగా వేద దేవతలు వెనక్కుపోయి కొత్త దేవతలు ముందుకు వచ్చారు. ఇంద్రుడు స్వర్గాధిపతిగా మాత్రమే మిగిలి ఉపేంద్రుడు జగత్ప్రభువుగా మారాడు. బ్రహ్మ, శివుడు యీయనకు జత కలవడంతో వీరు త్రిమూర్తులయ్యారు. వీరికి సంబంధించిన అనేక కథలు వ్యాప్తిలోకి వచ్చి పురాణాలుగా రూపుదిద్దుకున్నాయి. ఈ పరిణామంతో పాటే హైందవంలో అనేక శాఖలు ప్రాదుర్భవించాయి. ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క గురువు వెలిశాడు. ప్రజలలో మతవ్యాప్తి చేయడంలో యీ గురువులు కీలకపాత్ర వహించారు. ఈ గురువుల మాట వేదవాక్కుగా చెలామణి అయింది. కుల దేవతలూ, గృహ దేవతలూ విరివిగా పుట్టుకురావడంతో దేవతల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయింది. జంతు పూజ, వృక్ష పూజ కూడా ప్రబలింది. పాములు, కోతులు, ఏనుగులు, ఆవులు పూజలందుకున్నాయి. ఈ జంతువులు కొంతమంది దేవుళ్ళకు అలంకారాలుగానో, వాహనాలుగానో మారిపోయాయి. వాస్తవానికి యీ పూజలు ఆర్యులు రాకముందునుండే వున్నాయి. కాని కొత్త రూపంలో ఇవి తిరిగి అవతరించాయి. విలక్షణమైన పూజలతో కూడిన వామాచారాల వంటివి కూడా ప్రబలాయి. మద్య, మాంస, మత్స్య, ముద్ర, మైథునము వీరి దృష్టిలో అత్యంత పవిత్రము. మద్యాన్ని శక్తిస్వరూపిణిగానూ, మాంసాన్ని శివస్వరూపంగానూ వీరు భావించారు. శవభక్షణను సైతం చేసే అఘోరులు కూడా తయారయ్యారు. ఈ శాఖీయులు కూడా పూర్వం నుంచే వున్నారు. ఘోరాచారములను సైతం ఘోరములుగా పరిగణించనివారు కావున వీరిని అఘోరులని అంటారు. వీరినే కాపాలికులని కూడా పిలుస్తారు. మానవుల కపాలములను హారములుగా ధరించడం, వివస్త్రులై తిరగడం, చితాభస్మమును ఒంటికి అలదుకోవటం, శవభక్షణ వంటివి వీరి ఆచారాలలో కొన్ని. నరబలులు కూడా ఇవ్వడం వీరికి అలవాటు.

ఇలాంటి శాఖలు అనేకం వున్నా శైవ, వైష్ణవ సంప్రదాయాలు ఎక్కువగా వ్యాపించాయి. వీటి మధ్య వైరాలు వుండేవి. ఎవరి పురాణాలు వారివి. ఎవరి పూజా విధానాలు వారికి వుండేవి. ఈ విభేదాలను పోగొట్టడానికి శివకేశవుల సిద్ధాంతం కూడా ప్రబలింది. ఈ సందర్భంగా మరో అంశాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఆర్యేతర ప్రజల పూజలందుకుంటున్న గ్రామ దేవతలు కూడా కాలక్రమంలో ఆర్య సంస్కృతి నుండి ప్రభవించిన దేవతల సరసన చేరిపోయారు. అయితే ఒకప్పుడు వ్యవసాయ దేవతలుగా వున్న యీ గ్రామ దేవతలు తరువాత కాలంలో క్షుద్ర దేవతులుగా మారిపోయారు.

భారత దేశంలో ఆవిర్భవించిన యీ మతాలు, వాటి శాఖలతోపాటు పరాయి సీమలలో పుట్టి పెరిగిన ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు కూడా యీ దేశంలోకి ప్రవేశించి బలపడ్డాయి. మొత్తం మీద చూస్తే భారతదేశం పలు రకాలైన మత విశ్వాసాలకు పట్టుగొమ్మగా వున్నది. హిందూ మత విశ్వాసాలు బలంగా వున్నట్టు కనిపించినప్పటికీ యీ విశ్వాసాలు ఒకే రకమైనవి కావు. సిక్కులను, బౌద్ధులను, జైనులను హిందువులుగా పరిగణిస్తున్నప్పటికీ

నిజానికి వీరి మత విశ్వాసాలు, సంప్రదాయాలు వేర్వేరుగా వున్నాయి. అదే విధంగా ఒకే మతంలో పలు రకాలైన శాఖలు పుట్టుకొచ్చి తమ తమ సంప్రదాయాలను పాటిస్తున్నాయి.

మతం పేరుతో అత్యంత హేయమైన ఆచారాలు కూడా భారతదేశంలో స్థిరపడ్డాయి. వీటిలో ముఖ్యంగా అస్పృశ్యత గురించి చెప్పాలి. జనాభాలో అత్యధికులను శూద్రులుగా లెక్కించారు. ద్విజులతో వీరికి సమాన సామాజిక స్థాయి లభించలేదు. పంచములుగా పేరుపడిన వారు అత్యంత నికృష్ట జీవనాన్ని గడపవలసి వచ్చింది. వీరిని తాకితేనే మైల సోకుతుందని ప్రచారం జరిగింది. నిజానికి వీరిని అతిహేయంగా చూశారు. నీచమైన పనులకే వీరిని నిబంధించారు. వీరితోపాటు స్త్రీలను కూడా ఆటవిక ఆచారాలకు బలిచేశారు. సహగమనం, బాల్య వివాహాలు, వితంతు వివాహ నిషేధం శతాబ్దాలపాటు కొనసాగాయి. ఒక్క మాటలో చెప్పాలంటే జనాభాలో సగ భాగంగా వున్న స్త్రీలు గృహ బానిసలుగా బ్రతికారు. మతపరమైన యీ దురాచారాల కారణంగా స్త్రీలు, అస్పృశ్యులు విపరీతమైన అణచివేతకు గురయ్యారు.

ఈ అణగారిన జీవులను ఉద్ధరించడానికి అనేక సంస్కరణోద్యమాలు తలెత్తాయి. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం యిలాంటివే. అస్పృశ్యతా రక్కసిని పారద్రోలడానికి కూడా ఎన్నో ఉద్యమాలు నడిచాయి. ఈ మత సంస్కరణోద్యమాలతోపాటు హిందూ మత పునరుజ్జీవన ప్రయత్నాలు కూడా జాతీయోద్యమంలో చోటుచేసుకోవడం గమనించదగిన పరిణామం. స్వాతంత్ర్యోద్యమం వైపుకు ప్రజలను ఆకర్షించేందుకై శివాజీ ఉత్సవాలు, గణేష్ పూజలు నిర్వహించేవారు. పూసల్లో దారంలాగా ముస్లిం వ్యతిరేకత కూడా యీ కార్యక్రమాలను అంటిపెట్టుకొని వుండేది.

ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం యీ సంప్రదాయాన్ని అత్యుగ్రరూపంలో భారతీయ జనతాపార్టీ ముందుకు తెస్తున్నది. హిందూత్వవాదాన్ని ముస్లిం వ్యతిరేకతను ప్రచారం చేస్తూ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నది. వర్గరీత్యా చూస్తే బూర్జువా భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే యీ పార్టీ రాజకీయాధికారాన్ని సంపాదించేటందుకై తన వర్గతత్వాన్ని కప్పిపుచ్చుతూ మతోన్మాదాన్ని ఆశ్రయిస్తున్నది.

భారతీయులు వివిధ కులాలుగా చీలి పలు రకాలైన మత విశ్వాసాలను కలిగివున్నప్పటికీ జాతీయోద్యమం సమయంలో యీ విభేదాలను ప్రక్కనపెట్టి సమైక్యంగా నిలిచారు. అనేకత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించారు. ఈ సత్సంప్రదాయాన్ని మంటగలపడమే లక్ష్యంగా యీనాడు కొన్ని మతశక్తులు పనిచేస్తున్నాయి. మత సామరస్యతను రూపుమాపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా తమ పబ్బం గడుపుకోవాలని యీ దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలను వమ్ముచేసి భారత దేశాన్ని ఒకటిగా నిలపవలసిన బాధ్యత లౌకికశక్తులపై వున్నది.

# బౌద్ధ మతం

ఒకనొకప్పటి లేదా ఇప్పటికీ మిగిలివున్న తెగల, జాతుల మతాలైన ప్రాచీన మతాలకు ప్రతిగా ప్రపంచ మతాలు (బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం) అభివృద్ధి చెందాయని మార్క్సిస్టు సిద్ధాంత స్థాపకులు భావించారు. వీటి మధ్యనున్న తేడాలు గణనీయమైనవి. సాపేక్షికంగా చూస్తే ప్రపంచ మతాలు అర్వాచీనమైనవి. మతాల చరిత్రలో ఇవి పూర్తిగా విభిన్నమైన స్థానాన్ని కలిగినవి. వేర్వేరు జాతులు, భాషలు, రాజకీయాలు గలిగిన ప్రజల మధ్య మతపరమైన సంబంధం చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. తాము జన్మించిన ప్రాంతంతోనూ, తాము మాట్లాడే భాషతోనూ, తాము నివసించే లేదా పౌరసత్వం కలిగిన దేశంతోనూ నిమిత్తం లేకుండా ఒకే విధమైన విశ్వాసం కలిగిన వారితో ప్రజలు ఐక్యమయ్యారు. ప్రపంచ మతాల పుట్టుక, పరివ్యాప్తి అనేవి అరుదైన చారిత్రక పరిస్థితులలోనే సంభవించాయి.

ప్రపంచ మతాలలో బౌద్ధం ప్రాచీనమైనది. ఐరోపాలో క్రైస్తవం, మధ్యప్రాచ్యం, ఉత్తరాఫ్రికాలలో ఇస్లాం వలెనే ఆసియా చరిత్రలో బౌద్ధం ప్రధానమైన పాత్రనే పోషించింది.

బౌద్ధమత ఆవిర్భావం గురించి విస్పష్టమైన ఆధారాలు లేవనే చెప్పాలి. బౌద్ధం ఆవిర్భవించిన కాలానికి చెందిన లిఖిత ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు. బహుశా అసలు వుండివుండకపోవచ్చు. అశోకచక్రవర్తి (క్రీ.పూ. 3వ శతాబ్ది) వేయించిన శాసనాలే మొట్ట మొదటి లిఖిత ఆధారాలుగా వున్నాయి. ఆసరికే బౌద్ధ సంఘాల నిర్మాణము, సిద్ధాంతమూ, సంప్రదాయాలు బాగా అభివృద్ధి చెందాయి. అశోకునికి ముందు కాలానికి చెందిన బౌద్ధ మత చరిత్రను తదనంతర బౌద్ధ గ్రంథాల వలన మాత్రమే తెలుసుకోగలుగుతున్నాము. విభిన్న కాలాలలో రచించిన యీ గాథలు కాలక్రమంలో సంకలితమైన బౌద్ధమతానికి చెందిన పవిత్ర గ్రంథంగా విస్తృత రూపాన్ని సంతరించుకున్నాయి.

తొలినాటివైన త్రిపిటకాలకు చరిత్రకారులు ఎంతో విలువనిస్తారు. బౌద్ధ మతానికి నియమనిబంధనలకూ సంబంధించినవే యీ త్రిపిటకాలు. ఇవి పాళీ భాషలో విరిచితమయ్యాయి. వీటిలో ఎక్కువ భాగం శ్రీలంకలో లభ్యమయ్యాయి. క్రీస్తు పూర్వం ప్రథమ శతాబ్దికి చెందిన యీ త్రిపిటకములు మూడు భాగాలుగా వున్నాయి. ***వినయ పిటకము:*** బౌద్ధ సంఘాల ఆచారాలు దీనిలో వుంటాయి. ***సుత్త పిటకము*** బుద్ధుని ఉపదేశములతో కూడినది. ***అభిదమ్మ పిటకము :*** దర్శన భాగము, దర్శన సంబంధ

విషయాలపై బుద్ధుడు చేసిన ప్రసంగాలు, బోధలు దీనిలో వుంటాయి. తదనంతరకాలంలో వెలువడిన బౌద్ధ మత రచనలు (సంస్కృతం, చైనా, టిబెట్, ఖ్మేర్, జపాన్ భాషలలో) చాలా వున్నాయి. చారిత్రకంగా చూస్తే ఇవి అంత విలువైనవికాదు.

అత్యంత ప్రాచీనమైన బౌద్ధగాథలు యీ మతస్థాపకుడైన బుద్ధుని గురించి తెలియజేస్తున్నాయి. బుద్ధుడు చారిత్రక వ్యక్తి అని క్రీ.పూ. ఆరు, అయిదు శతాబ్దాలలో ఉత్తర భారత దేశంలో నివసించాడని, అక్కడే ఆయన తన బోధలు వినిపించాడని ఇవి తెలుపుతున్నాయి. తదనంతరకాలానికి చెందిన బౌద్ధ రచనలు బుద్ధుడిని దైవంగా పేర్కొంటూ ఆయన జన్మకు, జీవితానికి సంబంధించిన మహిమాన్విత విశేషాలను, పూర్వ జన్మలను పేర్కొంటున్నాయి.

త్రిపిటకముల ప్రకారం బుద్ధుని కథ యీ విధంగా తెలియవస్తుంది. బౌద్ధ మత స్థాపకుడైన బుద్ధుడు ఉత్తర భారతానికి చెందిన ఒక రాజు కుమారుడు. శాక్య వంశానికి చెందిన ఈయన హిమాలయ పర్వత ప్రాంతానగల ఒక నగరంలో జన్మించాడు. అసలు పేరు సిద్ధార్థుడు. ఆ తరువాత గౌతమునిగానూ, శాక్యముని (శాక్య వంశానికి చెందిన ముని) గానూ ప్రసిద్ధి పొందాడు. ఈయనను తథాగత, భగవాన్, జిన అని కూడా బౌద్ధ గాథలు పేర్కొంటున్నాయి. సిద్ధార్థునికి ఏ రకమైన విచారమూ కలగకుండా ఆయన తండ్రి శుద్ధోదనుడు సమస్త భోగాలను కల్పించి చిన్నతనం నుండి చాలా జాగ్రత్తగా పెంచాడు. విషాదము, వ్యాకులత లేదా విచారము కల్గించే దేనినీ ఈ యువరాజు చూడలేదు. దుఃఖము, జరామరణముల గూర్చి ఆయనకు లేశమైనా తెలియదు. తన సుందర హర్మ్యాన్ని, ఉద్యానవనాన్ని విడచి సిద్ధార్థుడు ఎన్నడూ బయటకు అడుగుపెట్టలేదు. తన సమయాన్నంతటినీ విందుల్లోనూ, వినోదాల్లోనూ గడిపేవాడు. తనకు అత్యంత ప్రేమాస్పదమైన యువతిని పెండ్లాడి ఒక కుమారునికి తండ్రి కూడా అయ్యాడు. తొలిసారిగా క్రూర వాస్తవాన్ని కనుగొన్నప్పుడు ఆయన మనసులో అల్లకల్లోలం చెలరేగడానికి యీ నేపథ్యమే దారితీసింది. ఆయన మనసును కలచివేసిన నాలుగు ఘటనలు జరిగినట్లు తదనంతరకాల సాహిత్యం చెపుతున్నది. తొలుత ఆయన ఒక రోగిని చూశాడు. తరువాత ఒక వృద్ధుడినీ, శ్మశానానికి తీసుకువెళుతున్న ఒక శవాన్నీ చూశాడు. చిట్టచివరిగా ఇహలోక భోగాలను, ఆనందాలను త్యజించిన సన్యాసిని చూశాడు. ఈ సన్యాసినే ఆయన ఆదర్శంగా స్వీకరించాడు.

ఒకానొక దినాన సిద్ధార్థుడు ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచాడు. రాజ్యాన్ని సంపదను విడనాడి సన్యాసిగా మారాడు. ఆ తరువాత సిద్ధార్థుడు ఏడేళ్ళపాటు భీషణ తపస్సు చేశాడు. శరీరాన్ని శుష్కింపచేసుకున్నాడు. ఆత్మ సాక్షాత్కారానికీ, సత్య శోధనకూ తపస్సును అప్పటిలో మత ఛాందసులు ఒక మార్గంగా భావించేవారు. కాని నిరాహారంగా వుండి, శరీరాన్ని శుష్కింపచేయడంలో సిద్ధార్థునికి సంతృప్తి కలగలేదు. ఇది సరైన మార్గంకాదని ఆయన భావించాడు. చిట్ట చివరకు దీర్ఘకాల ధ్యానం పిమ్మట ఆయనకు సత్య సాక్షాత్కారం లభించింది. బౌద్ధ గాథల ప్రకారం ఆయన ఒక రోజున బోధి వృక్షం క్రింద కూర్చొని ధ్యాన నిమగ్నుడయ్యాడు. అలాంటి సమయంలో ఆకస్మికంగా ఆయనకు జ్ఞానోదయమైంది.

సత్యసాక్షాత్కారం లభించింది. ఆ క్షణం నుండి సిద్ధార్థుడు బుద్ధుడిగా (జ్ఞానిగా) మారాడు.

అతి సర్వత్ర వర్జయేత్ అనే నిర్ధారణకు గౌతముడు వచ్చాడు. అనంతమైన కామోపభోగాలలో మునిగి తేలటం లేదా నిరాహారుడై దేహాన్ని శుష్కింపచేసుకోవడం అనే యీ రెండు సత్య మార్గాలు కావని నిశ్చయించుకున్నాడు. మొదటిది ఆత్మను శిథిలమొనర్చేది, విలువలేనిది, అప్రధానమైనది కాగా రెండవది అజ్ఞాన తిమిరంతో నిండినది, విలువలేనిది, అప్రధానమైనది. కనుక మధ్యే మార్గమే ప్రధానమైంది. స్థిరమైన ధ్యానం ద్వారానే సత్యాన్ని తెలుసుకోగలము. తద్వారా మాత్రమే ఆత్మశాంతి, జ్ఞానము లభిస్తాయి.

సత్య మార్గాన్ని సాక్షాత్కారింపచేసుకున్న గౌతమ బుద్ధుడు దానిని బోధించ ప్రారంభించాడు. మొదటగా కాశీ సమీపంలోని ఋషిపత్తన మృగదావము వద్ద తాను తెలుసుకున్న ధర్మమును బోధించాడు. ఆ తరువాత ఆయనకు శిష్యులు, అనుచరులు ఏర్పడ్డారు. నానాటికీ వారి సంఖ్య పెరిగింది. వారిలో కొందరిని ఎంపిక చేసి ధర్మ ప్రచారకులుగా నియమించాడు. తాను కూడా శిష్య గణంతో సంచరిస్తూ ధర్మాన్ని బోధించాడు. ఈ రకంగానే ఆయన శేష జీవితం గడచిపోయింది. బౌద్ధ గాథలలో మనకు దొరికే బుద్ధుని జీవిత చిత్రమిది. బుద్ధుని మరణం నాటికే, ప్రత్యేకించి ఈశాన్య భారతంలో అనేక బౌద్ధ సంఘాలు వెలిశాయి. బుద్ధుడు మరణించడానికి (నిర్వాణం) ముందు అనేక సంవత్సరాల పాటు దేశ సంచారం చేశాడు. భారతీయ సంప్రదాయాన్ననుసరించే బుద్ధునికి ఆయన శిష్యులు అంత్యక్రియలు జరిపారు.

శైశవ బౌద్ధం గురించి ప్రాచీన గాథలకు, అర్వాచీన గాథలకు చాలా తేడా వున్నది. ప్రాచీన గాథలలో పరమాద్భుత మనిపించే విషయాలు వుండవు. కాగా అర్వాచీన గాథలలో నమ్మశక్యంగాని అనేక అంశాలు వున్నాయి. కనుక వీటిల్లోని ప్రత్యక్షరమూ సత్యమేననుకోవటం పొరపాటే కాగలదు. అదే విధంగా బుద్ధుని చారిత్రక నేపథ్యాన్ని పూర్తిగా త్రోసివేసి అతనిని కేవలం కల్పిత పురాణ వ్యక్తిగా చూడటం కూడా తప్పే అవుతుంది. బౌద్ధ మత స్థాపకుని చారిత్రక వ్యక్తిగా ఆమోదించిన పరిశోధకులూ వున్నారు. అయితే బుద్ధుని జీవితం గురించి మనకేమీ తెలియటంలేదని, ఆయన జీవిత గాథలుగా చెప్తునవి నమ్మశక్యంగానివని వీరు భావిస్తారు. ఇది ఎలా వున్నప్పటికీ యీ గాథలు ఆనాటి ఉత్తర భారత ప్రాంతంలోని చారిత్రక పరిస్థితులను వెల్లడిస్తున్నాయి.

బౌద్ధానికి చెందిన తొలి ఆధారాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే బౌద్ధ మత ఆవిర్భావానికి కారణమైన చారిత్రక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

అస్పష్టంగా వున్న అంశాలలో బౌద్ధం ఆవిర్భావానికి సంబంధించిన సమస్య ఒకటి. బుద్ధుని జీవితాన్ని గురించి బౌద్ధ గాథలు విభిన్నమైన తేదీలను యిస్తున్నాయి. బుద్ధుని జీవిత కాలం క్రీ.పూ. 6వ శతాబ్దమని దాక్షిణాత్యులు చెప్తుండగా, క్రీ.పూ. 2420 అని కొంత మంది ఔత్తరాహులు చెప్తున్నారు. దాక్షిణాత్య బౌద్ధులు ఇచ్చే సమాచారం మనకు కొంత మేరకు ఉపయోగపడుతుంది.బౌద్ధులు పేర్కొన్న వివరాల ప్రకారం గౌతమ బుద్ధుని పరి నిర్వాణం తరువాత వంద సంవత్సరాలకు ప్రథమ సంగీతి (బుద్ధుని మరణానంతరం

బౌద్ధ భిక్షువులు ఏర్పాటు చేసిన తొలి సమావేశం) జరిగింది. ఇది జరిగిన 118 సంవత్సరాలకు అశోక చక్రవర్తి పట్టాభిషేకం జరిగింది. గ్రీకులు ఇచ్చిన ఆధారాల ప్రకారం అశోకుని రాజ్యపాలన క్రీ.పూ. 268-232 అని నిర్ణయించగలుగుతున్నారు. దీనిని బట్టి బుద్ధుని మరణం క్రీ.పూ. 490 అని ఊహించవచ్చు. ఆ రకంగా క్రీ.పూ. 6వ శతాబ్ది ద్వితీయార్థంలోనో, 5వ శతాబ్ది ప్రథమ పాదంలోనో బుద్ధుడు జీవించి వుంటాడని అంచనా వేయవచ్చు. ఈ రకమైన అంచనా వల్ల బౌద్ధ మత సంస్థాపకుడు కన్‌ఫ్యూషియస్‌కు సమకాలీనుడవుతాడు.

ఉత్తర భారతంలో భయంకరమైన వర్గ పోరాటం సాగుతున్న తరుణంలో బౌద్ధం అభివృద్ధి చెందింది. క్రీ.పూ. 6, 5 శతాబ్దాల నాటి మగధను ఇందుకు ఉదాహరణగా చూపవచ్చు. ఇక్కడ వర్గ వైరుధ్యాలు తీవ్ర స్థాయికి చేరాయి. సుసంపన్నులైన బానిస యజమానులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, రాజ కుటుంబీకులు భోగాలలో తులతూగుతుండగా మరోవైపు బానిసలు, అర్ధ బానిసలు, నిమ్న కులాలు దారిద్ర్యంలో మగ్గుతుండేవి. అగ్రవర్ణులైన బ్రాహ్మణ, క్షత్రియులలో ఆధిపత్యం కోసం కక్షలు, కార్పణ్యాలు సాగుతుండేవి. ఖడ్గపాణులైన క్షత్రియులు బ్రాహ్మణుల నుండి అధికారాన్ని లాగివేసుకున్నారు. దీనితో సంప్రదాయక ప్రాపంచిక దృక్పథంలో సంక్షోభం తలెత్తింది. బ్రహ్మ నుండి పుట్టుకొచ్చిందని చెప్తున్న వర్ణ వ్యవస్థను ప్రజలు ప్రశ్నించసాగారు. ఆశ్రమ జీవనం, సన్యాసులుగా మారి దేశ సంచారం చేయడం ఆనాడు బాగా వ్యాప్తిలో వుండేది. వీరిలో ఎక్కువ మంది అగ్ర కులాలకు చెందినవారే. ఆనాటి ప్రజల అసంతృప్తిని ఇది తెలియజేస్తున్నది. సాధు జీవితాన్ని సమర్థించే సిద్ధాంతాలు, తెగలు యీ పరిస్థితి నుండే ఆవిర్భవించాయి. చార్వాకం వంటి నిరీశ్వరదర్శనాలు కూడా పుట్టుకువచ్చాయి. సామాజికంగా నెలకొన్న అసంతృప్తి, అస్థిరత, నిరాశలను ప్రతిబింబించిన నూతన విశ్వాసాలలో ఒకటి బౌద్ధమతం.

అర్వాచీన రచనలు వచ్చి చేరడం వల్ల బౌద్ధ మత ప్రాపంచిక దృక్పథంలోని నికర సారాంశం మరుగునపడింది. వాస్తవానికి యిది ఒక మతంగా గాక, తాత్విక దర్శనంగాను, నైతిక బోధగాను మాత్రమే అభివృద్ధి చెందింది.

జ్ఞానోదయాన్ని పొందిన గౌతమ బుద్ధునికి సాక్షాత్కరించిన వాటిగా చెప్తున్న నాలుగు సత్యాలపై తొలినాటి బౌద్ధం ఆధారపడింది. మొదటిసారిగా ఆయన చేసిన బోధ వీటి గురించే సాగినది. ఈ తొలి బోధనే ప్రథమ ధర్మచక్ర ప్రవర్తన అంటారు. ఆయన బోధించిన నాలుగు సత్యాలు ఇవి. దుఃఖము వున్నది. దానికి సముదయము (కారణము) వున్నది. దానికి నిరోధము వున్నది. ఈ నిరోధమునకు మార్గము ఉన్నది.

బుద్ధుని అభిప్రాయం ప్రకారం జీవితం నిరంతర దుఃఖమయము. పుట్టుక దుఃఖము, వృద్ధాప్యము దుఃఖము, వ్యాధి దుఃఖము, వివాహము దుఃఖము, ప్రియతముల నుండి విడిపోవటం దుఃఖము, అభీష్టసిద్ధి సాధనలో అశక్తత దుఃఖము. ఈ దుఃఖానికి కారణం జీవితం పట్ల మమకారము, అస్థిత్వం పట్ల అభిమానము. ఈ దుఃఖాన్ని తొలగించుకోవాలంటే వాంఛాజనిత వ్యామోహాన్ని విడనాడాలి. అస్థిత్వం పట్ల కాంక్షను,

వాంఛను, అనురాగాన్ని అణచివేయాలి.

అయితే ఇది ఎలా సాధ్యపడుతుంది? పైన తెలిపిన నాలుగు సత్యాలలోని చివరిదానిలో దీనికి సంబంధించిన వివరాలు వున్నాయి. దుఃఖోపశమనానికి అష్టాంగమార్గాన్ని ఇది బోధిస్తుంది. అవి 1) సమ్యక్ దృష్టి 2) సమ్యక్ సంకల్పము 3) సమ్యక్ వాణి 4) సమ్యక్కర్మ 5. సమ్యక్ అజీవిక 6) సమ్యక్ ప్రయత్నము 7) సమ్యక్ స్మృతి 8) సమ్యక్ సమాధి ఎవరైతే యీ అష్టాంగ మార్గాన్ని అనుసరిస్తారో వారు అర్హతులవుతారు. నిర్వాణ స్థితిని పొందుతారు. ఏ సాధువైనా చిట్టచివరికి కోరుకునేది యీ నిర్వాణస్థితినే.

అయితే అసలు యీ నిర్వాణం అంటే ఏమిటి? బౌద్ధ దర్శనంలో యీ భావన కీలకమైనదనప్పటికీ దీనిని సూటిగా నిర్వచించలేదు. తత్ఫలితంగా బౌద్ధ రచనల్లో వివిధ నిర్వచనాలు కనిపిస్తాయి. కొంతమంది చెప్పేదాని ప్రకారం నిర్వాణమంటే పరిపూర్ణ శిథిలత, సంపూర్ణ శూన్యస్థితి. మరికొందరి ప్రకారం నిర్వాణమంటే దుఃఖక్షయము. తెలియని మరో దానికి పరివర్తన చెందటం. నిర్వాణ స్థితిని జీవిత కాలంలోనే పొందవచ్చునని కొందరు భావిస్తుండగా, మరణానంతరం మాత్రమే సాధ్యపడగలదని మరికొందరి నమ్మిక. ఇది ఎలా వున్నప్పటికీ నిర్వాణమనేది జన్మ పరంపర నిలచిపోయి మరు జన్మలేనిస్థితిగా చెప్పవచ్చు.

జన్మ పరంపరనే బౌద్ధులు సంసారమన్నారు. నిరంతర దుఃఖ కారణంగా ప్రతి జీవి ఒక జన్మను విడచి మరో జన్మను పొందుతుంది. మరణం ఒక వ్యక్తిని దుఃఖం నుండి విముక్తి చేయలేదు. ఎందుకంటే మరో జన్మకు కూడా అది సంక్రమిస్తుంది. అనేక జన్మలెత్తడం ద్వారా అర్హతుడిగా మారి సత్యాన్ని అవగాహన చేసుకొని పవిత్ర సాధు జీవితం గడిపినవారు మాత్రమే యీ దు:ఖవలయం నుండి బయటపడగలరు. జీవి అనేది కేవలం మనుష రూపంలోకేకాదు. ఏ రూపంలోకైనా మారవచ్చునని బ్రాహ్మణుల వలెనే బౌద్ధులు కూడా చెపుతారు. అది జంతువుగా, వ్యక్తిగా, దేవతగా, దెయ్యంగా ఎలాగైనా జన్మించవచ్చు. వీటిలో అత్యుత్తమైనది మానవ జన్మ. ఈ జన్మ ద్వారా మాత్రమే నిర్వాణస్థితి పొందగలగడం సాధ్యమవుతుంది. బుద్ధుడు సిద్ధార్థుడిగా జన్మించడానికి ముందు అనేక జన్మలెత్తినట్లు బౌద్ధులు చెపుతారు. వివిధ కులాలకు, వృత్తులకు చెందిన వానిగా ఆయన ఇహలోకంలో జన్మించాడు. బ్రహ్మతో సహా వివిధ దేవతల రూపంలో ఆకాశంలో నివసించాడు. జ్ఞానము పొందిన తొలి వ్యక్తి ఇతనే. కనుకనే మరో జన్మ లేకుండాపోయింది. బుద్ధుని మరణాన్ని నిర్వాణంగా భావిస్తారు. కనుకనే బౌద్ధులు తమ మతస్థాపకుడు మరణించాడని చెప్పకుండా మహాపరి నిర్వాణం చెందాడని చెపుతారు.

తొలినాటి బౌద్ధ దర్శన ప్రకారం ఒక వ్యక్తి అర్హతుడై తద్వారా నిర్వాణం పొందడానికి వున్న ఒకే ఒక్క మార్గమేమిటంటే అష్టాంగిక మార్గానుసరణమే. సంసార దు:ఖం నుండి విముక్తి చేసి, నిర్వాణ స్థితికి చేర్చే మార్గాన్ని అనుసరించకపోతే ఏ ఒక్కరినీ ఏ ఒక్కరూ కాపాడలేరు. మానవుడు దేవతలపై ఆధారపడరాదు. బుద్ధుడు దేవతల ఉనికిని త్రోసిపుచ్చనప్పటికీ దు:ఖం నుండి మానవుని దేవతలు కాపాడలేరని బోధించాడు. ఎందుకంటే

వారు కూడా సంసార దు:ఖం నుండి విముక్తి చెందలేదు. కనుక బుద్ధుని ప్రకారం జ్ఞానియైన మానవుడు దేవతలకన్నా గొప్పవాడు. అయితే బుద్ధుడు కూడా దు:ఖ భాజనులను రక్షించలేదు. సంసార దు:ఖమునుండి వారికి విముక్తి కల్పించలేదు. నిర్వాణ స్థితికి వారిని నడిపించలేదు. ఆయన చేసిందల్లా సత్య బోధన, ధర్మమార్గాన్ని చూపించాడు. ప్రతి వ్యక్తి యీ మార్గంలో ఏకాకిగా ప్రయాణం చేయవలసిందే.

తత్ఫలితంగా తొలినాటి బౌద్ధ మత బోధలు నీతి మీద అంటే ప్రవర్తనా నియమావళిపై దృష్టిని నిలిపాయి. ధ్యానము, తపస్సు ద్వారా సత్యాన్ని తెలుసుకుని, మోక్ష మార్గాన్ని చేరుకోవచ్చు. పవిత్ర బోధనలను అనుసరించడం ద్వారా పరిపూర్ణతను సాధించవచ్చు.

తొలినాటి బౌద్ధ మత బోధనలలో బౌద్ధులు వ్యవహరించవలసిన చర్యల జాబితా వున్నది. ప్రతి ఒక్కరూ పాటించ వలసిన ఐదు నియమాలు వున్నాయి. వీటినే పంచశీలములు అన్నారు. అవి 1) ప్రాణాతిపాతవిరతి (ప్రాణములను తీయకుండుట), 2) అదత్తాదాన విరతి (ఇవ్వని దానిని తీసుకొనకపోవుట), 3) కామమిధ్యాచారవిరతి (కాముకత్వాన్ని వీడుట), 4) మృషావాద విరతి (అసత్యభాషణము మానుట), 5) సురా మైరేయి ప్రమాదస్థాన విరతి (మద్యము మొదలగు ప్రమాదం కలిగించు వస్తువులను ఉపయోగించకుండుట). ఎవరైనా గాని పరిపూర్ణ స్థితిని పొందాలంటే యీ పంచశీలములను పాటించవలసి వుంటుంది. అయితే యివి రానురాను కఠిన రూపాన్ని దాల్చాయి. ప్రాణము తీయరాదన్న ఆదర్శము క్షుద్ర కీటకములకు కూడా వర్తింపచేశారు. కనుకనే నీటిని వడగట్టకుండా త్రాగటం దోషమైంది. ఎందుకంటే వడగట్టకుండా తాగితే దానిలోని సూక్ష్మ క్రిములు చనిపోయే ప్రమాదముంటుంది. నాగలికర్రుకు తగిలి అనేక క్రిమికీటకాదులు చనిపోయే అవకాశమున్నందున భూమిని దున్నటం కూడా తప్పుగా పరిగణించారు. ఇంకా యిలాంటివే కొన్ని పుట్టుకొచ్చాయి. వైవాహిక ప్రమాణాల ఉల్లంఘనపై విధించిన నిషేధం సంపూర్ణ పరిశుద్ధస్థాయిని చేరుకున్నది. ఇతరుల సంపదను గ్రహించడం పై వున్న నిషేధం అసలు ఏ ఆస్థీ వుండరాదన్న వాదనకు దారితీసింది. సురాపానాన్ని నిషేధించటానికి బదులుగా దైనందిన భోజనాన్నే విడవమని చెప్పారు. అయితే తరుచుగా ఆకలితో మరణించే బ్రాహ్మణ సన్యాసుల స్థాయికి వారు చేరుకోలేదు. అన్నిరకాల సౌఖ్యాలను, సంతోషాలను, భోగాలను విడవమని కూడా బౌద్ధులు చెప్పారు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రాపంచిక సుఖాలను వర్జించిన సన్యాస జీవితాన్ని బౌద్ధం బోధించింది.

బౌద్ధ బోధలలో అత్యంత ప్రధానమైన నీతి ఏమిటంటే జీవులపట్ల ప్రేమ, దయ కలిగివుండటం. వీటి మధ్య వివక్షతను చూడరాదని బౌద్ధం చెపుతున్నది. మంచి చెడు మధ్య, మనుషులకు – జంతువులకు మధ్య సమాన దృష్టి అవసరమని చెపుతుంది. ఒకరిపట్ల ప్రత్యేక ప్రేమను ప్రదర్శించడాన్ని బౌద్ధం తిరస్కరిస్తుంది. ఏదిఏమైనప్పటికీ జీవులపట్ల బౌద్ధుల ప్రేమ క్రియాశీలమైనదికాదు. నిష్క్రియాతత్వంతో కూడుకున్నది. శుభాకాంక్షితమైనది, చెడును ప్రతిఘటించకపోవటం, అవమానాలను క్షమించటం, చెడును చెడుతో ఎదుర్కోరాదని

బౌద్ధులు భావించారు. ఎందుకంటే దానివల్ల చెడు తొలగిపోదు. పగ, దు:ఖము పెరుగుతాయి. హింసకు గురైన యితరులను రక్షించబూనుకోవటమూ అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవటం, హంతకునికి శిక్ష వేయడం కూడా తప్పేనన్న ధోరణి పెరిగింది. చెడుపట్ల ప్రశాంతంగాను, సహనంగానూ, భావోద్వేగరహితంగానూ వుండాలని, దానిలో భాగస్వామి కాకుండా వుండటానికే ప్రయత్నించమని బౌద్ధులు చెపుతారు.

తొలినాటి బౌద్ధ దర్శనంలో ఆధ్యాత్మిక అంశాలు నైతిక అంశాలకన్నా తక్కువ స్థానాన్ని పొందాయి. పూర్తిగా తాత్వికమైన ప్రశ్నల పట్ల బుద్ధుడు అంతగా ఆసక్తి చూపలేదు. మానవ జీవితానికి సక్రమమైన మార్గాన్ని బోధించడమే ఏకైక పద్ధతి అని ఆయన భావించాడు. బుద్ధుడి బోధలను పోలుస్తూ ఒకచక్కని కథ వ్యాప్తిలో వున్నది. అడవిలో వున్న మొత్తం చెట్ల ఆకులకన్నా గుప్పెడు ఆకులు చాలా తక్కువ. అలాగే బుద్ధుడు తన శిష్యులకు ప్రకటించిన సత్యం ఆయన స్వయంగా తెలుసుకున్న సత్యంకన్నా చాలా తక్కువ. మిగిలినదానిని చెప్పకపోవడానికి కారణం అది నిరుపయోగమైనదని ఆయన భావించడమే. ఆసక్తికరమైన మరో అంశాన్ని కూడా బుద్ధుడు చెప్పాడు. ఎవరైనా ఒక వ్యక్తి విషం పూసిన బాణం తగిలి గాయపడినప్పుడు అతడికి చికిత్సచేయడానికి బదులుగా అతడిని గాయపరచిన శత్రువు గురించి, అతని తెగ లేదా కులం గురించి, అతని తల్లిదండ్రుల గురించి అడుగుతూ కూర్చుంటే వైద్యుడిని తీసుకురావడానికి ముందే అతడు మరణిస్తాడు. అదేవిధంగా యీ ప్రాపంచిక చెడుగుల నుండి విముక్తి పొందాలని కోరుకునే వ్యక్తి ప్రపంచ సారమేమిటి, పుట్టుక ఎలా జరిగింది అంటూ నిరుపయోగమైన ప్రశ్నలు వేయకూడదు. ధర్మమార్గాన్ని మాత్రమే అతడు ఎంచుకోవాల్సి వుంది.

అత్యంత ప్రధానమైన ప్రశ్నలకు కూడా బౌద్ధ దర్శనంలో స్పష్టమైన సమాధానాలు లేకపోవడానికి కారణం ఇదే. వ్యక్తి స్వభావిక స్థితి గురించే బుద్ధుని బోధలు సాగుతాయి. ఆత్మ ఐక్యత, శాశ్వతత్వాలను బౌద్ధం తిరస్కరిస్తుంది. మానవ స్వభావానికి ఆధారం అతని ఆత్మకాదు వ్యక్తిగత ధర్మమే. ఈ ధర్మ అనే పదానికి చాలా నిర్వచనాలు వున్నాయి. న్యాయమూ, ఉపదేశమూ, మతమూ, యధార్ధసత్తా, గుణము తదితర అర్థాలున్నాయి. అయితే బౌద్ధదర్శనంలో దీని ప్రధానమైన అర్థమేమిటంటే 'స్వలక్షణమును ధారణ చేయునది ధర్మము', 'ఆధ్యాత్మిక గుణమును ధారణ చేయునది ధర్మము'. ఈ రకమైన గుణములను, ధర్మములను మానవుడు అనేకంగా ధారణ చేయుచున్నాడు. వీటికి సంబంధించి వివిధ బౌద్ధ శాఖలు విభిన్న సంఖ్యలను పేర్కొంటాయి. 75-84-100 ఇంకా ఎక్కువ కూడా పేర్కొంటాయి.

బౌద్ధ దర్శనానికి ధర్మ సిద్ధాంతమే ఆధారంగా వున్నది. ఇది శైశవ, మార్మిక రూపాలలో వున్నప్పటికీ స్పష్టమైన గతి తార్కిక లక్షణాలను కలిగివున్నది.

తొలినాటి బౌద్ధ దర్శనాన్ని కొన్ని సందర్భాలలో 'దైవరహిత మతము, నిరీశ్వరమతము' అని పిలవడం జరిగింది. ఈ వాదనలో కొంతమేరకు నిజం వున్నప్పటికీ పూర్తి నిజం మాత్రం కాదు. వైదిక మత దేవతల వునికిని బుద్ధుడు త్రోసిపుచ్చలేదు. అయితే వారిని మానవునికి సహాయపడలేని అశక్తులుగా భావించాడు. స్వీయ ప్రయత్నం ద్వారా

మాత్రమే మానవుడు దు:ఖవిముక్తి పొందగలడని ఆయన బోధించాడు. సర్వ స్వతంత్రమైన చిత్తస్థితిని, క్రియను యీ బోధ ప్రతిబింబిస్తున్నదని తొలిచూపుకు తోస్తుంది. కాని జీవన బంధనాల నుండి నిష్క్రియాపరత్వంతో వైదొలగడమే విముక్తికి మార్గమని నిజానికి బుద్ధుడు భావించాడు. దు:ఖము యొక్క అస్థిత్వం నుండి ఒక వ్యక్తి విముక్తుడు కావాలంటే ఆ అస్థిత్వాన్ని త్రోసిపుచ్చుట మొక్కటే మార్గం.

భిక్షు జీవితాన్ని గడపాలని తొలినాటి బౌద్ధం తన అనుయాయులను ఆదేశించింది. తొలినాటి బౌద్ధ సంఘాలు దారిద్ర్య పీడితులైన భిక్షువులతోనూ, భిక్షుణిలతోనూ నిండి వుండేవి. వివిధ కులాలకు చెందినవారు వీటిల్లో చేరేవారు. అయితే బానిసలు, సైనికులు, నేరస్థులు, అప్పులలో చిక్కుకున్నవారు, తల్లిదండ్రుల అనుమతి లేనివారు వీటిల్లో చేరడానికి అవకాశం లేదు. బౌద్ధ సంఘ నియమాలు చాలా కఠినంగా వుండేవి. నూలుతో నేసిన కాషాయ వస్త్రాలు మినహా మరేమీ ఉంచుకోకూడదు. ధర్మ మార్గానుసారులై జీవించాలి. రోజుకు ఒకసారి, అది కూడా సూర్యాస్తమయానికి ముందు మాత్రమే భుజించాలి. కాని బుద్ధుని అనుయాయులందరూ యీ రకమైన జీవనాన్ని ఎంచుకోలేదు. చాలా మంది లౌకిక జీవనాన్ని గడిపారు. ఈ తరహాకు చెందినవారిని ఉపాసకులు (పురుషులు), ఉపాసికలు (స్త్రీలు) అని పిలిచేవారు. వీరు పంచశీలాలను పాటిస్తూ బౌద్ధారామాలకు విరాళాలు ఇచ్చేవారు. ఈరకమైన అనుయాయులను బౌద్ధం అనుమతించటమేకాదు, వారి అవసరం బౌద్ధ సంఘాలకు ఎంతైనా వుంది. బౌద్ధ భిక్షువులు ఏ పనీచేయరు. వాళ్ళు కేవలం ధర్మావలంబకులుగా మాత్రమే వుంటారు.

ఈ కొత్త మతం భారతదేశంలో మంచి ఆదరణను పొందింది. వివిధ తరగతులకు చెందిన ప్రజల అవసరాలను, వాంఛలను అది గుర్తించింది. బ్రాహ్మణుల ఆధిపత్యానికీ, వారు పొందే సౌకర్యాలకూ, కుల వివక్షతకూ వ్యతిరేకంగా పోరాడే పట్టణ క్షత్రియులకు బౌద్ధం మంచి ఆయుధంగా పనికివచ్చింది. ఇకపోతే దారిద్ర్యం నుండి, యీతిబాధల నుండి తప్పించుకునే మార్గాన్ని కనలేని అణగారిన ప్రజలకు బుద్ధుని ఉపదేశాలు కొంత ఉపశమనం కలిగించాయి. ఇవి వారిని ఉద్ధరించలేనివైనప్పటికీ వారు ఆకర్షితులయ్యారు. బ్రాహ్మణ మతం యీ పని చేయలేకపోయింది. బ్రాహ్మణులు అహంకారంతో ప్రజలను నీచంగా చూశారు. కాగా బౌద్ధ ఆరామాలలోకి ప్రవేశించిన నిమ్న కులాలవారు కొన్ని మానవీయ హక్కులను పొందగలిగారు. అక్కడ వారికి వివక్షతలు ఎదురుకాలేదు. కనుక బ్రాహ్మణ మతం నిర్లక్ష్యం చేసిన సాధారణ ప్రజానీకాన్ని ఉద్దేశించి బౌద్ధుల బోధలు సాగాయని చెప్పవచ్చు. ఈ కొత్త బోధలు ప్రజలను ఆకర్షించడానికి ఈ అంశం చాలు. అంతేకాక వ్యయభరితమైన కర్మకాండలను, క్లిష్టమైన లేదా బహు భారమైన ఆచారాలను బౌద్ధ మతం బోధించలేదు. దీనితోపాటు గౌతమ బుద్ధుడు అతని శిష్యులు ప్రాచీన వేద భాషలోగాక ప్రజల భాషలో (ప్రకీర్తి) బోధలు చేశారు.

బౌద్ధ సంస్థలలోని పటిష్టమైన నిర్మాణం కూడా బౌద్ధ మత వ్యాప్తికి బాగా తోడ్పడింది. భిక్షువులందరూ తమ శిక్షణకు లొంగి పెద్దలకు విధేయంగా మెలిగేవారు.

ఈ నూతన మతాన్ని ప్రతిఘటించేందుకు బ్రాహ్మణ మతానుయాయులు విఫల యత్నం చేశారు. కాని ప్రజలపై వారి ప్రభావం బలహీనంగా వుండటం వల్ల అశక్తులయ్యారు. అయితే ఇంతకు ముందే పేర్కొన్నట్లుగా బ్రాహ్మణ మతం క్రమక్రమేణా కూడదీసుకొని బౌద్ధంపై దాడి చేసింది. కాగా బ్రాహ్మణ మతంతో సాగించిన పోరాటంలో బౌద్ధం అనేక మార్పులకు లోనైంది.

క్రీ.పూ. 3వ శతాబ్దిలో సువిశాలమైన మగధ రాజ్యంలో బౌద్ధం ఆధిపత్య మతంగా రూపుదాల్చింది. క్షత్రియ వంశస్తులు అనుసరించిన విధానాలకారణంగా అక్కడ బ్రాహ్మణ మతం బలహీనంగా తయారైంది. ప్రత్యేకించి మౌర్య వంశరాజులు (వీరు నిమ్న కులాల నుండి వచ్చారు) బౌద్ధాన్ని ఆదరించారు. తమ అధికారానికి బ్రాహ్మణ మతాధిపత్యాన్ని పునాదిగా చేసుకోవాలని వారు భావించలేదు. కుల వివక్షతలను పాటించని బౌద్ధ సంఘాలు మౌర్య రాజులకు పూర్తి మద్దతు తెలిపాయి. ప్రజలలో తమ పలుకుబడి పెరిగిన తరువాత యీ మద్దతు మరింత ఎక్కువైంది. స్థానికమైన, తెగలకు సంబంధించిన పూజా విధానాలతో బౌద్ధానికి సంబంధం లేనందున మౌర్యులకు కూడా బౌద్ధం అనుకూలంగా కనిపించింది. బౌద్ధ సంఘాలలో కఠినమైన క్రమశిక్షణ వుండేది. పైగా ఒకే నాయకుని క్రింద వుండేవి. అంతేగాక చెడుపట్ల బౌద్ధుల నిష్క్రియాపరత్వ ప్రతిఘటన కూడా మౌర్యులకు ఎంతో ఉపయోగపడింది. తొలుత బౌద్ధులను హింసించినప్పటికీ మౌర్య వంశంలోని మూడవ చక్రవర్తి బౌద్ధం పట్ల తన దృక్పథాన్ని మార్చుకోవడానికి యీ కారణాలే దారితీశాయి. ఆయన బౌద్ధాన్ని జాతీయ మతంగా ప్రకటించారు.

బౌద్ధాన్ని గురించి అత్యంత ప్రాచీనమూ, అధికారయుతమూ అయిన సమాచారం అశోకుని శిలా శాసనాల నుండి, ఉత్తర్వుల నుండి మనకు లభిస్తుంది. ఈయన కాలంలోనే బౌద్ధ సంఘాలు ఉనికిలోకి వచ్చాయి. బుద్ధుని అవశేషాలపై స్థూప నిర్మాణం జరిగింది. బౌద్ధ మతం భారతదేశమంతటా వ్యాప్తి చెందటమేగాక ఇతర దేశాలకు కూడా పాకింది. తొలుత శ్రీలంకకూ (క్రీ.పూ. 3) తరువాత ఇండో చైనా, ఇండోనేషియాలో వ్యాప్తి చెందింది. ఈ దేశాలలోనే బౌద్ధ మతం, భారతీయ వాణిజ్య విస్తరణతోపాటు చెట్టాపట్టాలు వేసుకొని ప్రవేశించింది.

క్రీ.శ. ఒకటి రెండు శతాబ్దాలలో సాగిన కుషాణ వంశీయుల పాలనా కాలంలో సైతం బౌద్ధం తన ప్రభావాన్ని నెరపింది. పూర్తిక స్థానికమైన ఆచార వ్యవహారాలతో ముడిపడి వున్న బ్రాహ్మణ మతం మద్దతు సహజంగానే యీ విదేశీ వంశ పాలకులకు లభించలేదు. దీనితో బౌద్ధ స్థూపాలను, ఆరామాలను నిర్మించడానికి కుషాణులు చేతనైనంత సాయం చేశారు. ఈరకమైన కార్యకలాపాలను జరిపించడంలో కనిష్కుడు (క్రీ.శ. 78-123) ప్రత్యేకించి చెప్పుకోదగ్గవాడు. కనిష్కుని కాలంలో బౌద్ధం ఉత్తరానికి వ్యాపించి, మధ్య ఆసియా, చైనాలలో అడుగుపెట్టింది.

ప్రత్యేకించి భారత దేశానికి వెలుపల బౌద్ధం విశేషంగా వ్యాప్తి చెందింది. ఆధిపత్యమతంగా కూడా స్థిరపడింది. అయితే ఇదే సమయంలో దాని అసలైన సిద్ధాంతంలో

చెప్పుకోదగిన మార్పులు సంభవించాయి. ఈ మార్పులు పాక్షికంగాను, సద్యోజనితంగాను సంభవించాయి. బుద్ధ సంగీతి రూపంలో యీ మార్పులు సంభవించాయి. ప్రథమ, ద్వితీయ సంగీతిల గురించి మనకు ప్రాచీన గాథల ద్వారా మాత్రమే తెలుస్తున్నది. ప్రథమ సంగీతి గౌతమ బుద్ధుని మరణానంతరం, రెండవది ఆ తరువాత వంద సంవత్సరాలకు జరిగింది. తృతీయ సంగీతి అశోకుని కాలంలోనూ చతుర్థ సంగీతి కనిష్కుని కాలంలోనూ జరిగింది.

బౌద్ధ దర్శనంలో రెండు రకాలైన మార్పులు సంభవించాయి. ఒకవైపు బౌద్ధ దర్శనం అభివృద్ధి చెంది క్లిష్టరూపం దాల్చింది. మేధావులకూ, శ్రమణులకూ మాత్రమే అది పరిమితమైంది. రెండవ దేమిటంటే ప్రత్యేకించి భారత దేశం వెలుపల సామాన్య జనులలోకి బౌద్ధం ప్రవేశించినప్పుడు ఆయా దేశాలకు చెందిన ప్రజల స్థానిక ఆచారాలు, ఆదిమ విశ్వాసాలు బౌద్ధంలో కలిశాయి. వాస్తవానికి ఈ రెండు పరస్పర విరుద్ధమైనవి. ఇవి పరస్పరం ప్రభావితం చేసుకున్నాయి.

ప్రాచీన గాథల ప్రకారం చూస్తే నిబంధనలకు గట్టిగా కట్టుబడి వుండటం గురించి ద్వితీయ సంగీతిలో వివాదం తలెత్తింది. బౌద్ధంలో రెండు శాఖలు ఏర్పడటానికి యీ వివాదం దారితీసింది. తదనంతర కాలంలో మరికొన్ని శాఖలు తలయెత్తి విభిన్నమైన సిద్ధాంతాలు బయలుదేరాయి. దృశ్య ప్రపంచం గురించి, దానిని అవగాహన చేసుకునే శక్తి తదితరాల గురించి వివాదం తలెత్తింది. కాలక్రమంలో ముప్ఫై వరకు బౌద్ధ శాఖలు ఉనికిలోకి వచ్చాయి. అయితే చెప్పుకోదగిన చీలిక ప్రథమ శతాబ్దిలో వచ్చింది. బౌద్ధం రెండుగా విభజితమైంది. ఒకటి హీనయానం కాగా రెండవది మహాయానం. తొలినాటి బుద్ధుని బోధలకు తూ.చ. తప్పకుండా కట్టుబడి వుండాలని హీనయానులు భావించారు. కాగా బుద్ధుని బోధలలో అనేకమైన వాటిని మహాయానులు త్రోసిపుచ్చారు.

సుప్రసిద్ధ బౌద్ధభిక్షువు ఆచార్య నాగార్జునుడు (ప్రథమ శతాబ్ది) మహాయాన సిద్ధాంత స్థాపకుడు. దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. మహాయానంలో చెప్పుకోదగిన మార్పులు, చేర్పులు జరిగాయి. ఇవన్నీ కూడా బ్రాహ్మణ మతానికి దొరికిన మంచి రాయితీలని చెప్పవచ్చు. అంతేగాక యీ కొత్త మతాన్ని స్వీకరించిన బ్రాహ్మణులు తమ పాత ప్రాపంచిక దృక్పథాన్ని దీనిలో చొప్పించారు.

ప్రతి వ్యక్తి తన స్వీయ ప్రయత్నాల ద్వారా మాత్రమే నిర్వాణం పొందగలడన్న బౌద్ధ మత మౌలిక సిద్ధాంతం సామాన్య మానవునికి అందుబాటులో లేనిదని మహాయానవాదుల విశ్వాసం. ఈ సంక్లిష్ట మార్గాన్ని అతి కొద్ది మంది మాత్రమే అనుసరించగలరు. సాధారణ ప్రజలకు సులభ మార్గం కావాలి. దేవుడు లేదా దేవుళ్ళు లేని మతం ప్రజలకు అందుబాటులోకి రాదు. విశ్వాసులకు దేవుడి అవసరం ఎంతైనా వున్నది. ఈ రకమైన అభిప్రాయాలతో మహాయానవాదులు జ్ఞాన బోధకుడైన గౌతమ బుద్ధుని భగవంతునిగా మార్చి వేశారు. కాలక్రమంలో బుద్ధారాధన ప్రారంభమైంది. అనేకమంది బౌద్ధులలో గౌతమ బుద్ధుడు ఒకడని మహాయానులు విశ్వసిస్తారు. ఈ బుద్ధుల్లో బ్రాహ్మణ మత దేవుళ్ళు కూడా వున్నారు. విదేశాలలో ఆయా దేశాల దేవుళ్ళు కూడా చేరారు.

క్రమక్రమేణా బుద్ధుల సంఖ్య పెరిగింది. విశ్వనాయకులనదగ్గ 995 మంది బుద్ధులున్నారని ఒక నమ్మకం. ప్రజలను పాపభారం నుండి తొలగించేవారు 35 మంది బుద్ధులున్నారు. ఉత్తర భారత దేశంలోని బౌద్ధ ఆరామాలలో కొన్నిచోట్ల వేయి మంది బుద్ధుల ప్రతిమలు వున్నాయి. బౌద్ధ మత స్థాపకుడైన శాక్యముని (గౌతమ బుద్ధుడు)ని ఎక్కువ మంది ఆరాధిస్తారు. భవిష్యత్‌లో రానున్న బుద్ధుడు మైత్రేయుడు. వేయి మంది బుద్ధులలో చిట్ట చివరివాడు వజ్రపాణి. తెలివి తేటలకు పేరెన్నికగన్న వాడు మంజుశ్రీ. ప్రపంచ సృష్టికర్త ఆది బుద్ధుడు. అమితాభుడు స్వర్గాధిపతి.

బుద్ధులనేకాక బోధిసత్వులను కూడా మహాయానులు పూజిస్తారు. అస్థిత్వ వాంఛను అధిగమించి నిర్వాణస్థితిని కోరుకునే జీవియే బోధిసత్వుడు. అయితే ఇతర జీవులను కాపాడేందుకై బోధిసత్వులు కొంతకాలంపాటు భూలోక వాసాన్ని ఎంపిక చేసుకుంటారు. తత్ఫలితంగా బోధిసత్వుడు అంతర్గత బుద్ధుడవుతాడు. బోధిసత్వులందరిలోకి ప్రత్యేకించి అవలోకితేశ్వరునికి బౌద్ధులు ఎక్కువ గౌరమిస్తారు.

భిక్షువులుకాని వారికి కూడా నిర్వాణస్థితి లభిస్తుందని చెప్పడం ద్వారా బౌద్ధ దర్శనానికి మహాయానులు మరో ముఖ్యమైన అంశాన్ని చేర్చారు. నిర్వాణ స్థితి అనేది కేవలం భిక్షువులకు మాత్రమే అందుబాటులో వుండేదికాదని మొట్ట మొదటగా నాగార్జునుడు బోధించాడు.

కాని ఈ రాయితీలు తగినంతగా లేవు. నిర్వాణానికి సంబంధించిన యధార్థ ఆదర్శము ఆధునిక తత్వవేత్తలను, మేధావులను ఆకర్షించిందిగాని ప్రజలకు మాత్రం స్పష్టంగా బోధపడలేదు. మరింత సులభంగా వుండేదాన్ని వారు వాంఛించారు. మహాయాన బౌద్ధం స్వర్గం గురించిన బోధలను ప్రారంభించడంతో అసలు సిసలైన బౌద్ధంతో అది పూర్తిగా విడివడినట్లయింది. అనిర్వచనీయానందలోకమైన సుఖావతిలో వీరి స్వర్గమున్నది. నయనానందకరమైన ఉద్యానవన సీమల విహారాలు, సకల భోగభాగ్యాలు ఆ లోకంలో పుణ్యాత్ములకు లభిస్తాయి. దీనికి అమితాభ బుద్ధుడు అధిపతి. నిర్వాణానికి తుది గమ్యంగా యీ సుఖావతి స్వర్గం ఎలా సాధ్యపడింది? నిర్వాణాన్ని పొందటానికి మరొక్కసారి మాత్రమే భూలోకంలో జన్మించవలసి వున్న పుణ్యాత్ముల ఆత్మలతో యీ సుఖావతి లోకం నిండి వుంటుందని బౌద్ధులు చెపుతారు. కాని ప్రజల విషయం వచ్చేసరికి సుఖావతి అనేది మధ్య మజిలీకాదు, అదే చివరిది.

స్వర్గానికి తోడు నరకాన్ని కూడా బౌద్ధులు సృష్టించారు. బుద్ధుడు విధించిన నియమాలను ఉల్లంఘించిన వారికి నరకంలో పెట్టే చిత్రహింసలకు సంబంధించిన కథలు విశ్వాసులలో భయాన్ని రేకెత్తించాయి.

తాత్విక, నైతిక అంశాలకు సంబంధించి తొలినాటి బౌద్ధ విధానాలను కొద్దిపాటిగా మాత్రమే మహాయాన సిద్ధాంతం నిలుపుకున్నది. ఏదిఏమైనప్పటికీ ఇతర దేశాలలోకి ప్రవేశించడానికి మహాయాన సిద్ధాంతం అవకాశాలను విస్తృతపరచింది.

బౌద్ధ మత వ్యాప్తి అనేది భారతీయ సంస్కృతీ ప్రభావము, భారతీయ వాణిజ్య

విస్తరణలతో కలసి చెట్టపట్టాల్ వేసుకొని సరిహద్దులు దాటింది. శ్రీలంకలో బౌద్ధ భిక్షువులుగా మారినవారు బుద్ధుని బోధనలను అక్కడి నుండి బర్మా సయామ్ (క్రీ.శ. 5వ శతాబ్దికి ముందే) ఇండోనేషియాలకు (క్రీ.శ. 5వ శతాబ్ది నుండి) తీసుకువెళ్ళారు. ఇండోనేషియాలో బౌద్ధ మతం బ్రాహ్మణ మతంతోపాటు 14వ శతాబ్ది వరకు నిలిచింది. ఆ తరువాత ఇస్లాం వాటి స్థానాన్ని ఆక్రమించింది. (బలి ద్వీపంలో మాత్రమే బౌద్ధ మత విశ్వాసాల జాడలు కనిపిస్తాయి.) ఈ దేశాలన్నింటా హీనయాన రూపంలోనే బౌద్ధం ప్రవేశించింది. కనుకనే హీనయానం దక్షిణాది బౌద్ధంగా ప్రచలితమైంది. చైనాలో క్రీ.శ. ప్రథమ శతాబ్దిలో హీనయానం ప్రచారం పొందినప్పటికీ ఎక్కువ కాలం నిలువలేదు. అయిదవ శతాబ్దం నుండి మహాయానం ఆధిపత్యం వహించింది. చైనాలో అనుకూలమైన పరిస్థితులు వుండడంతో మహాయానం నిలదొక్కుకోగలిగింది. స్థానికంగా వున్న కన్‌ఫ్యూషియన్, టావో మతాల వలెనే ఇది కూడా ప్రజలను ప్రభావితం చేసింది. బౌద్ధ మతం చైనా నుండి నాలుగవ శతాబ్దంలో కొరియాలోకి అక్కడ నుండి ఆరవ శతాబ్దిలో జపాన్‌లోకి ప్రవేశించింది. జపాన్‌లో స్థానికంగా వున్న షింటో మతం తోనూ, కొరియాలో స్థానిక మతాచారాలతోనూ, కన్‌ఫ్యూషియన్ మతంతోనూ బౌద్ధం పోటీ పడవలసి వచ్చింది. భారతదేశానికి సరిహద్దున వున్న నేపాల్‌లోకి అశోకుని కాలంలోనే బౌద్ధం ప్రవేశించింది. కాలక్రమంలో అది టిబెట్ బౌద్ధంగా మారింది. అయితే 18వ శతాబ్దంలో గూర్ఖా విజేతలు (హిందూ) ఆధిపత్యాన్ని సంపాదించారు. ఈ కారణంగా ఈనాడు నేపాల్ జనాభాలో బౌద్ధుల సంఖ్య 10 శాతం కూడా లేదు.

టిబెట్‌లో మహాయాన సిద్ధాంతం విస్తృత రూపాన్ని దాల్చింది. కేవలం రాజకీయ కారణాల రీత్యా ఏడవ శతాబ్దిలో బౌద్ధ మతాన్ని టిబెట్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సమయంలో టిబెట్‌లో వర్గ సమాజం అభివృద్ధి చెందుతున్నది. స్రోంగ్-సాన్-గాంపో రాజు టిబెట్‌ను ఐక్యం చేసే ప్రయత్నంలో వున్నాడు. ఈ ఏకీకరణ గురించి ప్రజలకు నచ్చచెప్పే సిద్ధాంతం అవసరమని ఆయన భావించాడు. పొరుగు దేశాలైన భారత్, నేపాల్, చైనాలతో సంబంధాలు పెట్టుకున్నాడు. నేపాల్ నుండి లిఖిత భాషను, బౌద్ధ మతాన్ని టిబెట్ స్వీకరించింది. బోధిసత్వుడైన అవలోకితేశ్వరుని అవతారమే స్రోంగ్-సాన్-గాంపో అంటూ తదనంతర కాలంలో పురాణ గాథలు పుట్టుకువచ్చాయి. నిజానికి బౌద్ధం మొదటిలో హీనయాన రూపంలోనే టిబెట్‌లోకి ప్రవేశించింది. కాని ప్రాచీన ఆచారాలతో కూడిన బోన్ మతాన్ని ఆరాధిస్తున్న ప్రజలలోకి బౌద్ధం తొందరగా వెళ్ళలేకపోయింది. చాలాకాలం పాటు బౌద్ధం రాజకుటుంబీకుల మతంగానే వుండిపోయింది.

తొమ్మిదవ శతాబ్ది నుండి ప్రజలు బౌద్ధ మతాన్ని ఆరాధించడం ప్రారంభించారు. అయితే మహాయాన బౌద్ధాన్ని వీరు ఆదరించారు. దీని ప్రచారకర్త పద్మసంభవుడు (8వ శతాబ్ది) ఈయనకు అనేక మహిమలున్నవని, ఆత్మలతో సంభాషించగలిగిన శక్తిగలదని ప్రచారం జరిగింది.

ఈయన శిష్య గణం బౌద్ధంలోకి అనేక మంది దేవతలను తీసుకువచ్చారు. విశ్వాసులకు సుఖావతి స్వర్గవాసం లభిస్తుందని, పాపులకు చిత్రహింసలతో కూడిన నరకం

లభిస్తుందని వీరు చెప్పేవారు. ఈరకమైన పద్ధతి ప్రజలలో ప్రచారం చేయటానికి బాగా ఉపయోగపడింది. పాలకులు కూడా దానిని సమర్థించారు. ఇది ఎలా వున్నప్పటికీ ప్రాచీన తెగల సంప్రదాయాలకు కట్టుబడిన వారి కారణంగా బౌద్ధం చెప్పుకోదగిన ప్రతిఘటననే ఎదుర్కొన్నది. పదవ శతాబ్ది ప్రారంభంలో (లాంగ్-దర్-మా పాలనలో) బౌద్ధ విశ్వాసులు విచారణను ఎదుర్కొన్నారు. బౌద్ధుల విజయంతో యీ పోరాటం ముగిసింది. బౌద్ధులు కుట్రచేసి క్రీ.శ. 925లో లాంగ్-దర్-మాను చంపివేశారు. బౌద్ధ సాహిత్యంలో యీయనను మహా పాపిగా పేర్కొన్నారు. పదకొండవ శతాబ్దిలో బౌద్ధ మతం టిబెట్‌లో పూర్తి విజయాన్ని సాధించింది. ఈ సమయంలోనే తంత్ర యానం అనే కొత్త ధోరణి తలెత్తి బలాన్ని పుంజుకొన్నది.

తంత్ర యాన స్థాపకుడు పద్మ సంభవుడు. పదకొండవ శతాబ్ది మధ్యలో భారతదేశం నుంచి టిబెట్‌ను చేరుకొన్న జు-ఆదిషు యీ వాదానికి చెప్పుకోదగిన ప్రతినిధి. తొలినాటి బౌద్ధంతో ఎలాంటి సంబంధంలేని మార్మిక బోధనలతో యీ తంత్ర యానం నిండి వున్నది. చావు పుట్టుకలు లేని మహోన్నతుడిగా ఆది బుద్ధుడిని తంత్రయానులు గౌరవిస్తారు. అనేకంగా వున్న బుద్ధులను మూడు తరగతులుగా తంత్రయానులు విభజిస్తారు. వారు మానుష, ధ్యాన, నిరాకార బుద్ధులు. తంత్రయానంలో ప్రధానమైనది ధ్యానమూ, మహిమ గల మంత్రమూ (ధారణ). వీటి ద్వారా నిర్వాణం పొందవచ్చునని తెలిపారు. ఆరకంగా తొలినాటి బౌద్ధంలోని వ్యక్తిగత ప్రయత్నం మరుగునపడి తంత్రంలో సిద్ధహస్తులైన సాధువుల మాయాజాలం పైకి వచ్చింది. ఆ విధంగా బౌద్ధం మహోన్నతమైన తాత్విక చింతన నుండి అతి సామాన్యమైన మంత్రాల వూబిలోకి దిగజారిపోయింది.

11, 12 శతాబ్దాలలో టిబెట్‌లో అనేక బౌద్ధ సంఘములు వుండేవి. వీటిల్లో పలువురు భిక్షువులు వుండేవారు. వీరిని లామాలని పిలిచేవారు. (కనుకనే టిబెట్ – మంగోల్ బౌద్ధానికి లామా మతమన్న పేరు వాడుకపడింది). మత గ్రంథాలు సంస్కృతం నుండి టిబెట్ భాషలోకి తర్జుమా అయ్యాయి. మంగోలు విజేతలు ప్రత్యేకించి కుబ్లిఖాన్ టిబెట్‌లో బౌద్ధానికి చేతనైనంత సాయాన్ని అందించాడు. విపరీతమైన పలుకుబడి కలిగిన బౌద్ధ సంఘనేత (సాస్క్య సంఘం) పగ్బలామా, చక్రవర్తి ప్రతినిధిగా మారాడు. క్రీ.శ. 1368–1644 మధ్య కాలంలో చైనాను పాలించిన మింగ్ వంశీయులు టిబెట్‌లో బౌద్ధ మతాన్ని సమర్థించినప్పటికీ దానిని బలహీనపరచటానికి కూడా ప్రయత్నించారు. ఇతరుల సహాయంతో బౌద్ధ సంఘాలు బలం పుంజుకోకుండా అరికట్టారు.

కాలక్రమంలో టిబెట్‌లోని బౌద్ధమతంలో ఇరువురు వ్యక్తులు ఆధిపత్యం వహించారు. ఒకరు పంచన్ లామా, రెండవ వారు దలైలామా. వీరిరువురూ తాము దేవతల అపరావతారమని చెప్పుకున్నారు. అమితాభ బుద్ధుని అవతారాన్నని పంచన్ లామా చెప్పుకొంటే, అవలోకితేశ్వరుని అవతారాన్నని దలైలామా చెప్పుకున్నాడు. ఆధ్యాత్మికంగా చూస్తే దలైలామా కన్నా పంచన్‌లామా అధికుడు. పంచన్‌లామా బుద్ధుని అపరావతారమైతే దలైలామా బోధిసత్వుని అవతారము. పంచన్‌లామా ఆధిక్యతకు ఇదే కారణం.

బౌద్ధం ఇతర దేశాలకు వ్యాపించడానికి టిబెట్ కేంద్రంగా మారింది. ఆయా దేశాలలో ఫ్యూడల్ అధికారానికి బౌద్ధం మద్దతునిచ్చింది. యువాన్ వంశీయుల కాలంలో బౌద్ధం మంగోలియాలోకి ప్రవేశించింది. అయితే ఆ తరువాత ఫ్యూడల్ వ్యవస్థలో ఏర్పడిన ఒడుదుడుకుల కారణంగా బౌద్ధం అంతరించిపోయింది. 16వ శతాబ్ది తరువాత మంగోలియా రాజులు మరోసారి బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు. టిబెట్ నుంచి బౌద్ధ భిక్షువులను ఆహ్వానించి ఆరామాలను నిర్మింపచేశారు. తొలుత యీ కార్యాన్ని దక్షిణ మంగోలియా రాజులు (ఆల్టన్‌ఖాన్ తదితరులు) చేపట్టారు. 17వ శతాబ్ది ప్రారంభం నాటికి పశ్చిమ మంగోలియన్లు కూడా బౌద్ధాన్ని స్వీకరించారు. ఆ తరువాత రష్యాలోకి కూడా ప్రవేశించింది. ఈ రకంగా బౌద్ధం అనేక దేశాలలోకి ప్రవేశించింది. అనేక కారణాల వల్ల తన అసలు రూపాన్ని పోగొట్టుకొని చివరికి తన ప్రభావాన్ని గణనీయంగా కోల్పోయింది.

# యూదు మతం

ప్రాచీన ప్రపంచానికి చెందిన జాతీయ మతాలలో యూదు మతం ఒకటి. కాలక్రమంలో ఇది కొద్దిపాటి మార్పులకు గురైంది. మొత్తం మీద చరిత్రలో యూదు మతం అత్యంత ప్రధానమైన పాత్రనే నిర్వహించింది. ఆధునిక ప్రపంచంలోని రెండు ప్రధాన మతాలైన క్రైస్తవం, ఇస్లాంలు యూదు మతాన్ని చాలా వరకు కలుపుకున్నాయి.

కొన్ని సందర్భాలలో యూదు మతాన్ని మోషే మతంగా కూడా పిలుస్తారు. యూదులలో సుప్రసిద్ధుడైన స్మృతికర్త పేరుతో మోషే శాసనావళి (బ్రిటన్‌వారైతే మోషిజం అని కూడా అంటారు) ఉనికిలోకి వచ్చింది.

సహజంగానే ఈ మతంపట్ల అత్యంత ఆసక్తి కలుగుతుంది. ఈ మతంతో అపారమైన సాహిత్యం జతపడి వుంది. యూదు మతం నిర్వర్తించిన ప్రత్యేక పాత్ర కారణంగా దాని చరిత్ర అధ్యయనం సంక్లిష్టంగా మారింది. ఐరోపాలో యూదు మత సంప్రదాయాలను క్రైస్తవ మతం స్వీకరించింది. పరిపూర్ణమైన దైవిక సత్యం ఏరకమైన విమర్శకైనా అతీతమని చాలా కాలంగా భావిస్తున్నారు. ఈ సత్యాన్ని ప్రశ్నించినందుకుగాను స్వేచ్ఛా యోచనాపరులైన అనేక మంది విద్వాంసులు తమ ప్రాణాలను మూల్యంగా చెల్లించవల్సి వచ్చింది. ఈనాటికి సైతం యూదు, క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేకించి క్యాథలిక్, సనాతన చర్చి వర్గాలు యూదుల పవిత్ర గ్రంథమైన బైబిల్‌ను మానవ లిఖితమని భావించరు. పవిత్రాత్మ ప్రేరణచే రూపుదాల్చిన ఈ గ్రంథం విశ్వాసానికి, ఆరాధనకు చెందినదని, తిరుగులేని ప్రామాణిక గ్రంథమని భావిస్తారు.

ప్రాచీన యూదు మత అధ్యయనానికి బైబిల్ ప్రధానమైన ఆకరంగా వున్నది. ఇతరమైన స్వతంత్ర ఆకరాలు బహుకొద్ది. గ్రీకు భాషలో బైబిల్ అనే పదానికి పుస్తకాలని అర్థం. యూదులు కూడా ఈ విధమైన అర్థాన్నే చెపుతారు. ఇది అనేక రచనల సంకలనం. అంతేగాని ఒకే ఒక పుస్తకం కాదు. సంప్రదాయం మేరకు వాటిని మూడు తరగతులుగా విభజిస్తారు.

మొట్ట మొదటివి శాసన గ్రంథాలు (టోరా) లేదా ఆది పంచకం అని పిలుస్తారు. పురాణ పురుషుడైన మోషేకు ఈ రచనల కర్తృత్వాన్ని ఆపాదించారు. వీటిల్లో ఆదికాండం ఒకటి. ప్రపంచాన్ని, మానవుని భగవంతుడు సృష్టించిన విధము, తొలి మానవుల స్వర్గ

జీవనము. పాపములో పడటం, స్వర్గ బహిష్కరణ, మానవ జాతి పరివ్యాప్తి, ప్రాచీన చరిత్ర, ప్రపంచాన్ని ముంచివేసిన వెల్లువ, నోవహు ఓడ, పూర్వ వంశీకులు, యూదు ప్రజల నాయకులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబు, యేసేపు అతని సోదరుల వృత్తాంతం, ఈజిప్టులో యూదులు స్థిరపడటం గురించి ఆదికాండం వివరిస్తుంది. నిర్గమకాండంలో మోషే జీవితం గురించి, కార్యకలాపాల గురించి అదే విధంగా ఐగుప్తీయుల నిర్బంధం నుంచి యూదుల (అప్పటిలో వీరిని హెబ్రీయులని పిలిచేవారు) విమోచన, సుప్రసిద్ధమైన పది ఆజ్ఞలు (నిర్గమ-20:1-17) ఇంకా ఇతరమైన మత నిబంధనలు వున్నాయి. లెవీయకాండము మత శాసనాలతో నిండి వున్నది. యూదులు ఐగుప్తును విడిచిపెట్టి పాలస్తీనాను (కనాను దేశం) జయించక పూర్వము వారి చట్టాల గురించి, చరిత్ర గురించి చెప్పేది సంఖ్యాకాండము, ద్వితీయోపదేశ కాండము మత శాసనముల గురించి చెప్తుంది. యెహోషువా గ్రంథం కూడా ఆది పంచకానికి సంబంధించినదే. నూను కుమారుడైన యెహోషువా నాయకత్వాన యూదులు కనాను భూమిని గెలుచుకున్న కథ దీనిలో వున్నది.

బైబిల్‌లోని రెండవ కేటగిరీకి చెందిన వాటిని 'చారిత్రక గ్రంథాలుగా భావిస్తారు. ఇవి న్యాయాధిపతులు, రూతు, రాజులకు చెందిన నాలుగు గ్రంథాలు (సమూయేలు పేరుతో వున్న రెండు గ్రంథాలు, రాజుల పేరుతో వున్న రెండు గ్రంథాలు) దిన వృత్తాంతములకు చెందిన రెండు పుస్తకాలు, యివిగాక ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, యోబు, దావీదు రాజుదని చెప్తున్న కీర్తనల గ్రంథం, సామెతలు, ప్రసంగి, పరమ గీతము అనునవి.

ఆఖరుకు మూడవ కేటగిరి క్రిందకు వచ్చేవి ప్రవక్తల గ్రంథాలు యెషయా, ఇర్మియా, యెహెజ్కేలు, దానియేలు అనునవి. వీటితోపాటు చిన్నా, చితక ప్రవక్తల గ్రంథాలైన హోషేయ, యోవేలు, ఆమోసు, ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా, హగ్గయి,జెకర్యా, మలాకి వంటివి పన్నెండు వున్నాయి.

ఈ పుస్తకాలన్నింటినీ కలిపి పాత నిబంధన పేరుతో క్రైస్తవులు పిలుస్తారు. కాగా క్రైస్తవుల కొత్త నిబంధనను యూదులు ఆమోదించరు.

యూదు మత చరిత్ర ప్రారంభ దశలో అంటే క్రీ.పూ. ద్వితీయ సహస్రాబ్ది ప్రథమార్ధంలో పశుపాలకులైన బెదోయిన్ తెగలతో యూదులు కలిసిపోయారు. తత్కారణంగా ఉత్తర అరేబియాలో వీరు సంచార జీవనం చేశారు. వీరిది పితృస్వామిక సమాజము. ఈ ధోరణినే వారి మతం కూడా ప్రతిబింబించింది.

వీరిలో వంశ సంరక్షకులను, బహుశ పూర్వీకుల ఆత్మలను పూజించే సంప్రదాయం వున్నట్లుగా కన్పడుతోంది. ఈ సంప్రదాయానికి చెందిన ఆధారాలు బైబిల్ రచనలలో కొద్దిపాటిగా కన్పడుతున్నాయి. ఆదికాండంలో యిందుకు సంబంధించిన ఉదాహరణ లభిస్తుంది. యాకోబు, అతని భార్యలు వారి తండ్రి లాబాను ఇంటి నుంచి పారిపోతారు. ఈ భార్యలలో ఒకరైన రాహేలు తన తండ్రి ఇంటిలో వున్న గృహ దేవతల విగ్రహాలను తీసుకు వస్తుంది. హిబ్రూ భాషలోని బైబిల్‌లో ఈ విగ్రహాలకు తెరిఫిమ్స్ అన్న పదాన్ని వాడారు. ఈ మాటకు వంశ సంరక్షకులని అర్థం చెప్పుకోవచ్చు. బైబిల్ ప్రకారం వీరి చర్య

లాబానుకు అమితమైన కోపాన్ని తెప్పిస్తుంది. ఈ కోపం తన కుమార్తెలు అల్లుడు పారిపోయినందుకు కాదు. అతని కోపమంతా పితరుల దేవతలను దొంగిలించినందుకు అతడు వారిని వెంటాడి పట్టుకొని తెరఫిమ్స్‌ను దొంగిలించినందుకు నిందిస్తాడు. అంతేకాక ఈ విగ్రహాలను తిరిగి ఇచ్చివేయమని పట్టుబడతాడు. వంశాచారానికి చెందిన వస్తువుల పట్ల అప్పటిలో యూదులు పట్టుదలతో వుండేవారని దీనినిబట్టి అనుకోవడానికి ఆస్కారమేర్పడుతున్నది.

వంశాచారాల గురించి బైబిల్‌లో ప్రత్యక్ష ప్రస్తావనలు ఉన్నాయి. సౌలు రాజువల్ల తన ప్రాణానికి ముప్పు వుండడంతో యువ వీరుడైన దావీదు (తదనంతర కాలంలో దావీదు మహారాజు) భయపడటం గురించి సమూయేలు-1 గ్రంథం వివరిస్తుంది. స్వస్థలమైన బెత్లెహేముకు వెళ్ళవలసి వున్నందున రాజు ఇచ్చే విందుకు వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరిస్తాడు. బలితర్పణ కార్యానికి హాజరు కావలసిందిగా తన సహోదరుడు తనను ఆహ్వానించినట్టు దావీదు చెపుతాడు.

వంశ పురుషుల పురాణాలు కూడా వంశాచారాలతో ముడిపడి వున్నాయి. బైబిల్ గ్రంథంలో పేర్కొన్న వంశ పురుషులు (మోషేతో సహా అబ్రహాము, ఇస్సాకు, యాకోబు మొదలైనవారు) చారిత్రక వ్యక్తులు కారని పరిశోధకులందరూ అంగీకరించారు. అయితే అలాంటప్పుడు వంశ పురుషులెవరు? వీరి కల్పిత నామాలు దివ్యలోక సంబంధమైనవిగా భావించటం పొరపాటే అవుతుంది. వంశమూ తెగల విభాగాలకు యీ వంశ పురుషులు ఎక్కువగా సంబంధపడి వున్నారు. పూర్వకాలంలో యీ వంశ పురుషులకు మతపరమైన గౌరవాన్ని కల్పించారు.

మతాచారాలను నిర్వర్తించే పవిత్ర స్థలాల్లో వంశ పురుషులకు ప్రాధాన్యత వున్నట్లుగా బైబిల్ రచనలకు చెందిన ప్రాచీనాధారాల వల్ల తెలుస్తుంది. అయితే తదనంతరకాలంలో పూజారుల ప్రాబల్యం పెరిగింది. మత సంబంధమైన ఆచార వ్యవహారాలకు జెరూసలేంను కేంద్రంగా చేయడానికి వీరు తీవ్రంగా ప్రయత్నించారు. కాగా రాహేలు సమాధిని పూజించినట్లుగా చెప్పే నిదర్శనాలు బైబిల్ గ్రంథంలో వున్నాయి.

ఖనన సంప్రదాయం గురించి పెద్దగా చెప్పలేదు. మృతులను భూమిలో పాతిపెట్టేవారు. అయితే దీనికి సంబంధించిన మతాచారాలను వూహించడం క్లిష్టమైన విషయం. తదనంతర కాలంలో సైతం మరణానంతర జీవితంపట్ల యూదులకు స్పష్టమైన అభిప్రాయాలు లేవు. మరణానంతర జీవితం గురించి వారికే మాత్రం విశ్వాసం లేదు. పాపులను బ్రతికి ఉన్నప్పుడే భగవంతుడు శిక్షిస్తాడు లేదా వారి సంతానాన్ని శిక్షిస్తాడు. మరణించిన వారి ఆత్మలు తమను కాపాడుతాయని, తమతో మాట్లాడగలవని యూదులు విశ్వసిస్తారు. మరణించినవారి ఆత్మలకు సంబంధించిన భావనకు రాజుల కాలంలో ఆధారం దొరుకుతుంది. ఇందుకొక ఉదాహరణ యేమిటంటే విగత జీవుడైన సమూయేలు ఆత్మను వెనక్కు పిలవవలసిందిగా సౌలురాజు మంత్రవేత్తలను ఆజ్ఞాపించటం.

ప్రాచీనకాలం నుండి జంతు బలి వున్నట్లుగా తెలుస్తుంది. పస్కా పండుగ దీని

నుండి వచ్చినదే. మొట్ట మొదటిలో ఇది జంతు సంబంధమైన కర్మకాండగా వున్నది మందలో మొట్ట మొదటగా జన్మించిన దానిని దేవునికిస్తారు. ఈ బలికి దారితీసిన గణాచారాలను పరిశోధకులు సరిగానే ఎత్తిచూపారు. తదనంతరకాలంలో పస్కా పండగకు కొత్త అంశాలు తోడయ్యాయి. ఇవన్నీ పూర్తిగా వ్యవసాయక సంబంధమైనవి.

పస్కా పండుగతో ఆత్మలను, దేవుళ్ళను ముడివేయటం జరిగింది. యెరూషలేం పూజారులు దిద్దుబాట్లు చేసినప్పటికీ దీనికి సంబంధించిన ఆధారాలు బైబిల్ గ్రంథంలో లభిస్తాయి. వీటిలో ఒకటి పౌరాణిక వ్యక్తియైన అజాజెల్‌కు చెందినది. ఇతనికి అర్పించడానికి గాను ఒక గొర్రెను తీసుకువస్తారు. ప్రజల పాపాలన్నింటినీ భరించి యీ గొర్రె ఎడారిలోకి వెళ్తుంది. పాపాలనుండి, నేరాల నుండి ప్రజలను విడిపించడానికి యీ ఆచారమొక మార్గం.

అప్పటి కాలంలో ప్రజలు రకరకాలైన ఆత్మలపట్ల నమ్మకం కలిగివుండేవారు. బైబిల్ గ్రంథంలో యిందుకు సంబంధించిన ఆధారాలు లభ్యమౌతాయి. ఐగుప్తీయులలో జన్మించిన మొదటి మగ బిడ్డలను రూపుమాపి, ఇశ్రాయేలీయుల మొదటి మగ బిడ్డలను విడిచిపుచ్చిన ఆత్మను గురించి నిర్గమకాండం పేర్కొంటున్నది. యూదుల వద్దకు దుష్టాత్మను పంపిన దేవుడిని గురించి న్యాయాధిపతులు చెప్తుంది. దేవుడు పంపిన దుష్టాత్మ సౌలు రాజును అనేకసార్లు వెంట తరుముతుంది.

చాంద్రమానానికి సంబంధించిన చంద్రుని పూజ బహుశా సంచార జీవులలో వుండి వుండవచ్చు. సబ్బాతుకు ఇదే మూలం. ఇప్పటికీ యూదు మతంలో దీనికి చాలా ప్రాధాన్యత వున్నది. ఏది ఏమైనప్పటికీ మొట్ట మొదట యిది సెలవు దినం కాదు. నెల పొడుపు లేదా పౌర్ణమినాడు చేసుకునే పండుగ కావచ్చు. రాజుల యుగం ప్రారంభం కావడానికి మునుపే నూతన మాసోత్సవాలను చేసుకునే వాడుక ఉన్నది.

ప్రాచీన కాలంలో అనేక రకాలైన నిషేధాలు వుండేవి. ఇలాంటి వాటిల్లో సంభోగానికి చెందినదొకటి. మతపరమైన తెగ సమాజపు సంప్రదాయాలలో దీని మూలాలున్నట్లుగా కనిపిస్తున్నది. మరొకటి ఆహారానికి సంబంధించినది. ఆహారానికి సంబంధించి అనేక నిషేధాలు వున్నాయి. ఒంటె, కుందేలు, పంది ఇంకా రకరకాలైన పక్షులను తినటంపై నిషేధం వున్నది. పశుపోషణ, సంచార జీవన పరిస్థితుల నుండే యీ నిషేధాలు ఉద్భవించాయి. అయితే యీ సంప్రదాయ మూలాల గురించి మనం ఖచ్చితంగా చెప్పలేము. ఆహారం కోసం ఒంటెను చంపరాదు. ఇకపోతే పందులు, ఇవి స్థిర నివాసులైన వ్యవసాయకుల జంతువులు. వీరితో సంచార జీవులకు శత్రుత్వం వుండేది. ఆహారానికి సంబంధించి ముఖ్యమైన నిషేధమేమిటంటే నెత్తురు. రక్తాన్ని ఆత్మగా భావించేవారు. కనుకనే ఆహారం కోసం వధించిన జంతువుల రక్తాన్ని పూర్తిగా ఓడ్చేవారు.

కొత్తగా జన్మించిన మగ పిల్లలకు సున్నతి చేయించే ఆచారం ప్రాచీన కాలం నుంచీ వుండేదనడంలో సందేహంలేదు. భగవంతుని నుంచి ప్రత్యేక సూచనలు పొందిన అబ్రహాము ద్వారా యీ ఆచారం ఏర్పడిందని బైబిల్ చెపుతున్నది. అయితే యూదులలో యీ సున్నతి ఆచారం ఎలా ప్రారంభమైందీ స్పష్టం కాలేదు. బహుశ యిది కాలగర్భంలో

కలిసిపోకుండా మిగిలిన అతి పురాతన ఆచారం కావచ్చు. మత విశ్వాసాలు కలిగిన తెగ నుంచి యిది సంక్రమించి వుంటుంది. అయితే నవ జాత శిశువులకు కాక యవ్వన ప్రాంగణంలో అడుగుపెట్టిన వారికి యీ సున్నతి సంస్కారం జరిపేవారు. బహు ప్రాచీన కాలం నుండీ యూదులతో సహా అరేబియాలోని సెమిటిక్ తెగలలో యీ ఆచారం వుండేదని కొంత మంది పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ప్రాచీన కాలం నుండీ ఆఫ్రికాలోని అనేక మంది వలెనే యీ సంప్రదాయాన్ని ఈజిప్టు వాసులు కూడా పాటించేవారని, వీరి నుండి యూదులు సున్నతి సంప్రదాయాన్ని స్వీకరించారని మరికొంతమంది పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

ఆదిమ యూదులు చెట్లను, పర్వతాలను, రాళ్ళను, నదులను చివరకు పవిత్ర స్తంభాలను కూడా పూజించేవారు. ఈ తరహా పూజలను బైబిల్ గ్రంథం పలుమార్లు ప్రస్తావించింది.

యాహ్వేను పూజించే పద్ధతి పాలస్తీనా ఏర్పడక ముందు నుంచీ వున్నది. ఈ యాహ్వే తదనంతర కాలంలో ప్రధాన దేవుడిగా మారటమేకాక యూదులకు ఏకైక దేవుడయ్యాడు.

యూదు మతంలో కేంద్ర బిందువైన యీ యాహ్వే పూజా విధానానికి సంబంధించిన ప్రశ్న చాలా కీలకమైనది. ఈ మతాన్ని అధ్యయనం చేయటంలో యిది ప్రధానాంశంగా వున్నది. ఇది చాలా క్లిష్టమైన అంశం కూడా యాహ్వే పేరు (ఇంతకు ముందు దీనిని జెహోవా అని పొరపాటుగా వుచ్చరించేవారు) లోని అర్థాన్ని గ్రహించటం కష్టం. ఇది యూదు పదం కాదు. ఈజిప్టు సరిహద్దులోని సినాయి దేశంలో నివసించే తెగకు యాహ్వే దేవుడిగా వుండేవాడని కొంత మంది పరిశోధకుల అభిప్రాయం. బైబిల్ గాథ ఒకటి దీనినే సూచిస్తున్నది. మిధ్యాను యాజకుని కూతురును పెళ్ళి చేసుకున్న మోషే తన మామ దేశంలోనే నివసిస్తాడు. ఆయన గొర్రెలను మేపుతూ వుంటాడు. అక్కడ హోరేబు పర్వతం పైన యాహ్వే మొట్ట మొదటిసారిగా దర్శనమిచ్చి యీ గొర్రెల కాపరికి తన నామాన్ని ఎరుకపరుస్తాడు. ఇది జరగటానికి ముందు యూదులు యితర పేరులతో దేవుడిని పూజించినట్లు యీ కథ ద్వారానే తెలియవస్తున్నది. ఏదిఏమైనప్పటికీ యాహ్వే పూజ ప్రారంభమైన తొలిచోటు సీనాయి దేశం. హోరేబు పర్వతం. (అతడిట్లు చెప్పెను "ప్రభువు సీనాయి నుండి వచ్చెను..." ద్వితీయోపదేశకాండము 33:2) వాస్తవానికి యాహ్వే మిధ్యాను దేవుడని భావిస్తే యాహ్వే భావన ఎలా ఏర్పడిందనే ప్రశ్నకు సమాధానం లభించదు. ప్రాచీన గణ భావాలలో యాహ్వేకు మూలాలున్నట్లు ఒక వాదన వున్నది. సింహం లేదా వృషభానికి కొంతమేరకు సంబంధముండే సూచనలు వున్నాయి. ఈ సూచనలు స్పష్టంగా లేనప్పటికీ వీటిని త్రోసిపుచ్చడానికి వీలులేదు.

నియమ నిబంధనలను కాపాడే లక్షణం యాహ్వేలో ఎక్కువగా వుండటం మనకు కనపడుతుంది. తనను పూజించే ఇశ్రాయేలీయులందరూ సున్నతి చేయించుకోవాలని యాహ్వే ఆదేశించినట్లుగా బైబిల్ చెపుతుంది. ఇశ్రాయేలీయులలో మొదటగా జన్మించిన మగ బిడ్డలను

తనకు అర్పించాలని కూడా ఆయన గట్టిగా చెపుతాడు. సంరక్షక దేవుడికి యువకులను అర్పించే ఆదిమ సమాజపు ఆచారం నిలచివుండటాన్ని ఇది సూచిస్తున్నది.

యాహ్వే అన్నివేళలా యూదులందరి దేవుడిగా లేడు. యూదుజనులలో కీలకమైన ఇశ్రాయేలీయులందరిని దేవునిగా కూడా తొలుత లేడు. యూదా తెగ దేవునిగానే యాహ్వేను భావించడం పరిపాటి. తదనంతరకాలంలో మాత్రమే యూదులందరి అంటే ఇశ్రాయేలీయుల దేవునిగా యాహ్వే మారాడని వీరు చెపుతారు. అయితే యీ అంశం, మోషే యూదుల తెగవాడుగాక లేవీ తెగకు చెందిన వ్యక్తి అన్న యథార్థంతో విభేదిస్తుంది. మోషే యూదుల స్మృతికారుడు. యాహ్వే తన పేరును తొలుతగా ప్రకటించింది ఆయనకే. ఆయననే తన మధ్యవర్తిగా చేసుకున్నాడు. అంతేకాక చట్టప్రకారం యాహ్వే యాజకులందరూ లేవీ తెగవారే. యాహ్వే పూజా విధిలో యూదులు అర్చకులుగా లేరు. ప్రత్యేకించి లేవీ తెగ దేవుని దయకు పాత్రమైనదని బైబిల్ చెపుతున్నది.

యూదు రాజవంశం (క్రీ.పూ. 10వ శతాబ్దిలో దావీదు రాజుతో ప్రారంభమవుతుంది) యూదా తెగకు చెందినందున, యాహ్వే యూదా తెగకు చెందిన దేవుడని సాధారణంగా పరిశోధకులు భావిస్తుంటారు. ప్రజలలో వ్యాపించి వున్న యాహ్వే పూజా విధానాన్ని రాజ్య మతంగా చేయాలని యీ రాజులు భావించారు.

సంచార జనులైన యూదులు (ఇశ్రాయేలీయులు), కనాను (పాలస్తీనా)లోని వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకొంటున్న దశలో యుద్ధ దేవతగా యాహ్వే ముందుకు వచ్చాడు. క్రీ.పూ.15, 14 శతాబ్దులలో ఇశ్రాయేలీయులు పాలస్తీనాను గెలుచుకోవడం ప్రారంభించారు. చాలా శతాబ్దాలకు ఈ విజయ పరంపర ముగిసింది. ఈ కాలంలో స్థానిక ప్రజలతో ఇశ్రాయేలీయులు భయంకరమైన యుద్ధం సాగించారు. దీర్ఘకాలంపాటు సాగిన యీ భీకర పోరాట ప్రభావం బైబిల్‌పై పడింది. మతంలో కూడా యిది ప్రతిఫలించింది. ప్రారంభంలో ఎవరు, ఏమిటి అన్న ప్రశ్నతో సంబంధంలేకుండా యీ దశలో యాహ్వే ఇశ్రాయేలీయుల లేదా యూదుల జాతి దేవునిగా మారాడు. ఆయన తన ప్రజలను శత్రువులకు వ్యతిరేకంగా నడిపాడు. యాహ్వే నిర్వహించిన యీ పాత్ర బైబిల్ అంతటా కనపడుతుంది. కనుకనే యాహ్వేను తరచుగా 'సబతు' అని కీరిస్తారు. యుద్ధ దేవుడని యీ మాటకు అర్థం.

పాలస్తీనాలోని స్థానిక జనులను నిర్దయగా హతమార్చమని దేవుడు ఆదేశిస్తాడు. మొట్ట మొదటిసారిగా ఆక్రమించుకున్న యెరికో పట్టణం నేలమట్టమవుతుంది. దానిలోని ప్రజలందరూ హతమారిపోతారు. రెండవ పట్టణమైన హాయికి కూడా యీ గతే పట్టింది. తేడా ఏమిటంటే పశువులను చంపరాదన్న యాహ్వే ఆజ్ఞ ప్రకారం నూను కుమారుడైన యెహోషువా దానిని దోచుకుంటాడు. యూదులు సాగించిన యితర యుద్ధాలు కూడా యింతటి రక్తసిక్తమైనవే. దేశం శ్మశానంగా మారింది. అయితే పొరుగునున్న కొందరిని నాశనం చేయకుండా యూదులను దేవుడు నిరోధించాడు. ఇది దయాదాక్షిణ్యాలతో చేసిన పనికాదు. ముమ్ముందు ప్రభవించే ఇశ్రాయేలు తరముల వారికి సైనిక శిక్షణ ఇచ్చేందుకుగాను

వారిని బ్రతుకనిచ్చారు. దీని గురించి బైబిల్ యీ విధంగా చెపుతున్నది. "ఇశ్రాయేలీయులకునూ, కనానీయులకునూ జరిగిన యుద్ధములన్నింటినీ చూడనివారందరినీ శోధించి ఇశ్రాయేలీయుల తరతరములవారికి, అనగా పూర్వము ఆ యుద్ధములను ఏ మాత్రమును చూడనివారికి యుద్ధములు చేయనేర్పునట్లు యెహోవా వుండనిచ్చిన జనములుయివి" (న్యాయాధిపతులు 3:1-3)

మిగిలివున్న యీ జనాలను గాదెబోసిన సజీవ పదార్థాలుగా ఇశ్రాయేలీయులు వాడుకున్నారు. ఈ దేశాన్ని చేజిక్కించుకున్న అనంతరం యూదులు నమ్మశక్యంగాని అమానుష విజయ యాత్రను సాగించారు. పరాజితులను నరికి పోగులుపెట్టారు. ఈవిధంగా చేయవలసిందిగా యాహ్వే వారిని నిరంతరం రెచ్చగొట్టాడు. ఏమాత్రం మెతకదనం కనిపించినా శిక్షించాడు. ఇందుకొక ఉదాహరణయేమంటే అమాలెకి పౌరులపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించనందుకుగాను సౌలురాజు పైనుండి తన ఆశీర్వాదాలను యాహ్వే తొలగిస్తాడు. భగవంతునికి అత్యంత ప్రియతముడైన దావీదు మహారాజు తాను జయించిన దేశాలకు, పట్టణాలకు చెందిన ప్రజలను మామూలుగా కాక పైశాచికమైన రీతిలో వారిని వధిస్తాడు. అమ్మోనీయుల పట్టణమైన రబ్బాను జయించినంతనే దావీదు మహారాజు పట్టణంలో వున్న వారిని బయటకు రప్పించి రంపములచేతనూ, పదునుగల ఇనుప పనిముట్ల చేతనూ, ఇనుప గొడ్డళ్ళ చేతనూ వారిని ముక్కలు ముక్కలుగా తరిగించి ఇటుక ఆవములో వేయిస్తాడు. అమ్మోనీయుల పట్టణములన్నింటిలోనూ అతడు యీవిధంగానే చేసెనని, సమూయేలు-2 (12:31) గ్రంథం చెపుతున్నది. అజెటిక్ యుట్టిలోపోచిట్టికన్ననూ, పానీషియన్ మోలోక్‌కన్ననూ యాహ్వే అమితమైన రక్తదాహాన్ని కలిగివున్నాడు. ఇంతకుముందే పేర్కొన్నట్లుగా ప్రత్యేకించి రక్తపిపాసియైన భగవంతుడనే యీ భావనను రక్తసిక్త యుద్ధ తరుణంలో పెంచి పోషించారు.

పాలస్తీనాపై యూదులు సాధించిన విజయం వారి మొత్తం ఆర్థిక వ్యవస్థలోనూ, సామాజిక నిర్మాణంలోనూ, అదేవిధంగా మత భావాలలోనూ మార్పు తీసుకువచ్చింది. సంచార జీవనం నుండి స్థిరవాసానికీ, పశుపోషణ నుండి వ్యవసాయానికీ యూదులు క్రమక్రమంగా మార్పు చెందారు. అదే సమయంలో స్థానిక కనానీయులతో వివాహ సంబంధాలు పెట్టుకున్నారు. విజయ పరంపరకాలంలో అంటే న్యాయాధిపతుల శకంలో వారు తెగ వ్యవస్థనూ, సైనిక ప్రజాస్వామ్యాన్నీ కొనసాగించారు. ఎంపికైన న్యాయాధిపతులు, సైనిక నాయకులు శత్రువుకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. అయితే కాలక్రమంలో యీ వ్యవస్థ విచ్ఛిన్నమైపోయింది. ధనికులుగా, పౌరులుగా, బానిసలుగా, స్వేచ్ఛా పౌరులుగా సమాజం విడివడిపోయి రాచరిక వ్యవస్థ రూపుదాల్చింది.

ఈ మార్పులన్నీ మతాన్ని ప్రభావితం చేశాయి. స్థానిక ప్రజలతో కలసిపోవటం ప్రారంభించగానే కనానీయులను యూదులు అనుకరిస్తూ వారికున్న బహు దేవతలను (బాల్స్) పూజింప మొదలుపెట్టారు. స్థానిక దేవతల పూజా విధానాలు, మత సంరక్షకులు, పట్టణ సంరక్షకులు సిరియాలోనూ, పాలస్తీనాలోనూ బహు ప్రచారంలో వున్నారు. యెరూషలేంలో

యాహ్వేకు సోలోమన్ రాజు (క్రీ.పూ. 10వ శతాబ్దం) బ్రహ్మాండమైన ఆలయాన్ని నిర్మించినప్పటికీ కేంద్రీకృత పూజా విధానం మాత్రం ఏర్పడలేదు.

వ్యవసాయంతో ముడిపడిన మతపరమైన అనేక విశ్రాంతి దినాలను స్థానిక పాలస్తీనీయుల నుండి యూదులు స్వీకరించారు. వసంతకాలంలో వచ్చే విశ్రాంతి దినమైన మత్‌జోత్‌ను ప్రాచీన కాలానికి చెందిన పస్కా పండుగతో కలిపివేశారు. సబ్బాత్–పెంతెకోస్తు సెలవు దినం గోధుమ నూర్పిడి కాలంలో వస్తుంది. సుక్కోత్ అనునది పళ్ళు కోయటం ముగిసే తరుణంలో వచ్చే విశ్రాంతి దినం.

లేవీ వంశానికి చెందిన ప్రత్యేకమైన, వారసత్వ హక్కు కలిగిన యాజకుల బృందం పూజా కార్యక్రమాలను నిర్వహించేది. పాలస్తీనియన్ శకంలో 'లేవీ' అన్న పదానికి యాజకుడు అన్న అర్థముండేది. (రమారమి యిదే విధంగా మిద్యాను దేశానికి చెందిన మాజెస్‌లు కూడా ఒక తెగ రూపాన్ని విడచి యాజకుల కులంగా రూపుదాల్చారు.)

సంప్రదాయకము, వారసత్వముగల యీ యాజకులతోపాటు పాలస్తీనియన్ల కాలంలో ఇతర రకాల మత నాయకులు కూడా తలెత్తారు. ఇలాంటి వారిలో శకునములు చెప్పేవారినీ, దైవజనులను బైబిల్ గ్రంథం పలుమార్లు ప్రస్తావించింది. వీరు భవిష్యత్ గురించి చెపుతారు. ప్రేతాత్మలతో మాట్లాడతారు. కొన్ని సందర్భాలలో రాజులు వారిని ఇబ్బందుల పాల్జేశారు. అయినప్పటికీ వారు అన్నిచోట్లా విరివిగా వుండేవారు.

నజరేతీయులనే జనులు కూడా యూదులలో వుండేవారు. వీరిని పవిత్రమైన వారిగాను, భగవంతునికి సర్వాన్ని అర్పించినవారుగానూ తలచేవారు. పవిత్ర జీవనం, ఆహారంలో ఆంక్షలు, ద్రాక్ష సారాయికి దూరంగా వుండటం వంటి విధులను వీరు విధిగా ఆచరించేవారు. వీరు మృతదేహాలను తాకేవారుకాదు. జుట్టు కత్తిరించుకునేవారుకాదు. స్త్రీ, పురుష భేదంతో నిమిత్తం లేకుండా ఇలాంటివారిని అసాధారణమైన శక్తిగల పవిత్ర జనులుగానూ, ప్రవక్తలుగానూ భావించేవారు. తాత్కాలికంగా లేదా జీవితకాలం సేవలందించే నజరేతీయులుండేవారు. తాత్కాలిక సేవలకు చెందిన నిబంధనల గురించి సంఖ్యాకాండం (అధ్యా–6) చెపుతున్నది. మహా బలశాలియైన సమ్సోను, సామ్యూలు ప్రవక్త వంటి పురాణ పురుషులైన నజరేతీయుల గురించి బైబిల్ చెపుతున్నది. సమ్సోను అసాధారణమైన పుట్టుక గురించిన పౌరాణిక గాథ న్యాయాధిపతుల గ్రంథంలో వున్నది. అతని తల్లికి ఒక దేవదూత ఇలా చెప్పాడని ఆ గ్రంథం చెపుతున్నది. "...నీవు గర్భవతివై కుమారుని కందువు. అతని తలమీద మంగలి కత్తి వేయకూడదు. ఆ బిడ్డ గర్భమున పుట్టినది మొదలుకొని దేవునికి నాజరు చేయబడినవాడై ఫిలిష్తీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించును" (న్యాయాధిపతులు 13:5) సమ్సోను పెరిగి పెద్దవాడైన తరువాత అసాధారణ బలశాలి అవుతాడు. ఫిలిష్తీనియన్లకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాలలో యూదులకు నాయకత్వం వహించి విజయాలు సాధిస్తాడు. అతని బలమంతా అతని జుట్టులోనే ఉన్నది. అయితే మోసంతో అతని జుట్టును కత్తిరించడంతో సమ్సోను బలం హరించుకుపోతుంది.

క్రీస్తుపూర్వం ఎనిమిదవ శతాబ్దికి ముందే మత నాయకులు ఉన్నట్లు తెలిపే

సాక్ష్యాలు వున్నాయి. వీరు ప్రత్యేకమైన, సంక్లిష్టమైన తరగతికి చెందినవారు. వీరినే ప్రవక్తలని పిలిచారు. బహుశా ఎనిమిదవ శతాబ్దికి ముందే వీరి ఉనికి వుండినా వుండవచ్చు. తొలుత యీ ప్రవక్తలకు భవిష్యత్ చెప్పే యాజకులతో సంబంధం లేనట్లుగా కనపడుతున్నది. తంబుర నాదాలు, ఇతర సంగీత వాద్యాల ఘోష, నృత్యాలు (కొన్ని సందర్భాలలో నగ్నంగా జరిగేవి) కల్పించిన ఉత్సాహోద్వేగ స్థితిలో యీ జోస్యాలు చెపుతూ వుండేవారు. మరో రకంగా చెప్పాలంటే వంచనా శిల్పాన్ని ప్రదర్శించేవారు. ఏదిఏమైనప్పటికీ ఇశ్రాయిల్‌లోనూ, యూదు రాజ్యాలలోనూ (సోలోమన్ మరణానంతరం యూదుల రాజ్యం రెండు భాగాలుగా విభజితమైంది) వర్గ వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో ప్రజలలో రగిలిన అసంతృప్తిని ప్రవక్తలు వ్యక్తం చేయసాగారు. అయితే యీ పనిని వారు నేరుగా చేయలేదు. ప్రజల పాపాలను వెల్లడించేవారిగా ముందుకు వస్తూ జాతి దైవమైన యాహ్వే పూజా విధిని తిరిగి స్థాపించాలని, స్థానిక కనానీయుల దేవతల పూజలను వ్యతిరేకించాలని వారు బోధించారు. తొలి రచనలలో కనిపించని కొన్ని ధోరణులను కొంత మంది ప్రవక్తలు వెలిబుచ్చారు. పూర్తిగా ఆచారాలనేగాక నైతిక పాపమన్న భావనను ముందుకు తెచ్చారు. ప్రవక్తలలో అగ్రగణ్యుడైన యెషయా (క్రీ.పూ. 8) ప్రవచనాల్లో ఇది స్పష్టమవుతుంది. యూదులకు ఆయన యీ విధంగా చెపుతాడు. "మిమ్మును కడుగుకొనుడి, శుద్ధి చేసుకొనుడి, మీ దుష్క్రియలు నాకు కనపడకుండా వాటిని తొలగింపుడి, కీడు చేయుట మానుడి, మేలుచేయు నేర్చుకొనుడి, న్యాయము జాగ్రత్తగా విచారించుడి, హింసించబడువానిని విడిపించుడి, తండ్రిలేని వానికి న్యాయం తీర్చుడి, విధవరాలి పక్షముగా వాదించుడి" (1:16-17).

హృదయ ప్రక్షాళన కోసం, సత్యం కోసం, న్యాయం కోసం చేసిన యీ ప్రవచనం నిర్దిష్టమైన వర్గ దృక్పథాన్ని చెప్పుకోదగిన విధంగా కలిగివున్నది. ప్రవక్తల అభిప్రాయాన్ని అనుసరించి చెడుగులకు లేదా ప్రజల కడగండ్లకు కారణం సామాజిక అసమానతలు దోపిడీకానేకాదు. ఈ కారణం నైతిక వర్తనలోనూ, భగవంతుని ఆజ్ఞల ధిక్కరణలోనూ ఉన్నది.

ఇదే సమయంలో ప్రవక్తలు రాజకీయ ప్రచారకులుగా కూడా వున్నారు. వీరిలో కొందరు లోకవ్యవహారాలలో ఆరితేరినవారుగా కూడా ఉన్నారు. చిన్నవైన యూదు రాజ్యాలకు పొరుగునే వున్న బలమైన అస్సీరియా, బాబిలోనియాల వల్ల ప్రమాదమున్నదని వారు గ్రహించారు. ఈజిప్టుతో పెట్టుకున్న ప్రమాదకరమైన పొత్తు గురించి వారు పాలకవర్గాలను హెచ్చరించారు. శత్రువు దురాక్రమణ వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియచెప్పారు. అయితే అంతిమంగా యాహ్వే విముక్తి కల్పిస్తాడని, తన జనాలను వృద్ధి చేస్తాడన్న ఆశతో ప్రజలను వారు ఓదార్చారు.

దేవాలయాలలోని అధికారిక యాజకులతో యీ ప్రవక్తలకు ఎలాంటి సంబంధమూ లేదు. పైగా కొంత వ్యతిరేకతను చూపారు. ప్రవక్తలను హింసలపాల్చేసినట్లుగా కొంత ఆధారం కూడా వున్నది. కాని యాజకులకూ, ప్రవక్తలకూ మధ్య తీవ్ర పోరాటమేమీ సాగలేదు. పైగా ప్రవక్తల గ్రంథాలు అధికారిక బైబిల్‌లో స్థానాన్ని సంపాదించాయి.

యూదు మత చరిత్రలో తృతీయ దశకు దారితీసిన పరివర్తనా కాలాన్ని

సాధారణంగా నిర్బంధానంతర దశగా పిలుస్తారు. లేదా రెండవ దేవాలయ దశగా చెపుతారు. ఈ దశలో ప్రధానమైన మూడు ఘట్టాలున్నాయి. మొట్ట మొదటిది యూదుల రాజైన యోషియా (క్రీ.పూ. 621) ప్రవేశపెట్టిన మత సంస్కరణలు. ఇవి పూజా విధానాన్ని కేంద్రీకృతమొనర్చాయి. రెండవదేమంటే క్రీ.పూ. 586లో బాబిలోనియా రాజు యెరూషలేమును జయించడం, యూదులలో ఒక భాగాన్ని నిర్బంధించడం. మూడవది క్రీ.పూ. 538లో బాబిలోనియా నిర్బంధం నుండి విముక్తులై యెరూషలేము దేవాలయాన్ని పునరుద్ధరించడం. ఈ దశలోనే యూదు మతం తుది రూపురేఖలను దిద్దుకున్నది. స్వభావ స్వరూపాలనూ, గుణాలనూ సంతరించుకున్నది. ఆరాధకులు తరతరాల నుంచి వారసత్వంగా వస్తున్నారని భావించారు. కచ్చితమైన ఏకేశ్వరారాధన, కచ్చితమైన కేంద్రీకృత పూజా విధానం, పవిత్రమైనవిగా భావిస్తున్న బైబిల్ గ్రంథాలకు అధికార ముద్ర వేయడం యీ దశలోనే జరిగింది.

యోషియా రాజు మత సంస్కరణలు రాజకీయ స్వభావంతో కూడినవి. బయటి శత్రువులు విజృంభిస్తున్న తరుణంలో వీటిని చేపట్టారు. అస్సీరియన్లు ఇజ్రాయిల్ రాజ్యాన్ని ధ్వంసం చేసి తదనంతరం ఈజిప్టు, బాబిలోనియాలకు అదే గతి పట్టించారు. దీనితో తన శక్తులన్నింటినీ కూడదీసుకోవలసిన అవసరం యూదు మతానికి ఎదురైంది. మోషే పంచకంలో అయిదవ గ్రంథాన్ని ద్వితీయోపదేశకాండమని పిలుస్తారు. సంస్కరణలకు ఆధారం ఇదే. ఈ గ్రంథం దొరికిందన్న వదంతి ఉన్నప్పటికీ వాస్తవానికి యీ కాలంలోనే దీనిని రచించడం జరిగింది. యూదులు పాటించవలసిన శాసనాలనూ, కర్మకాండలనూ ద్వితీయోపదేశకాండం క్రమబద్ధీకరించింది. వడ్డీ వ్యాపారానికీ, వెట్టిచాకిరికీ వ్యతిరేకమైన శాసనాలు దానిలో వున్నాయి. వర్గవైరుధ్యాలను కొంతమేరకైనా ఉపశమింపజేయడమే యీ శాసనాల లక్ష్యం. అయితే దీనిలోని ప్రధానమైన అంశమేమంటే ఒకే ఒక దేవుడిని అంటే యాహ్వేను ఆరాధించాలన్నదే. యాహ్వేను మినహా యితర దేవతల పూజా చిహ్నాలను యెరూషలేము దేవాలయం నుండి తొలగించాలని, అన్నిరకాల ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయాలని, పురోహితులను, మంత్రవేత్తలను, శకునములు చెప్పే వాళ్ళను హతమార్చాలని యోషియా రాజు ఆదేశించాడు. అంతేగాక చాలా కాలంగా వాడుకలో నుండి తొలగిపోయిన ప్రాచీనకాలపు పస్కా పండుగను పునరుద్ధరించాడు.

యెరూషలేము దేవాలయ యాజకుల సహాయంతో యాహ్వే పూజా విధి కేంద్రీకరణను రాజు స్థిరపరచగలిగాడు. దీనిని ఆధారంగా చేసుకుని శత్రువును తరిమికొట్టేందుకై దేశ ప్రజలందరినీ ఐక్యంచేస్తూ కేంద్రీకృత రాజకీయ వ్యవస్థను నెలకొల్పాడు. అయితే బలహీనమైన యూదు దేశం ఓడిపోకుండా యీ చర్యలు కాపాడలేకపోయాయి. క్రీస్తుపూర్వం 597లో ఒకసారి, 586లో మరోసారి బాబిలోనియా రాజు యెరూషలేమును పట్టుకొని దాన్ని దోచుకున్నాడు. దేవాలయం నేలమట్టమైంది. సంపన్నులు, యాజకులతో సహా అనేక మంది యూదులు బాబిలోనియా చేరారు. ఏభైయేళ్ళ బాబిలోనియా నిర్బంధం ప్రధానంగా బానిస యజమానవర్గాన్ని, యాజకులను మాత్రమే దెబ్బతీసినప్పటికీ జాతీయ

విషాదంగా యూదుల మనస్సుల్లో దీర్ఘకాలంపాటు నిలిచిపోయింది. బాబిలోనియాలో గడిపిన 50 సంవత్సరాలు వాళ్ళకేమీ ఉపయోగపడలేదు. అయితే దీనివల్ల యూదు మతం ప్రభావితమైంది. పర్షియాకు చెందిన సైరస్ బాబిలోనియాను జయించాడు. ఆయన అనుమతి ఇవ్వటంతో యూదులు తమ మాతృ భూమికి తిరిగి వెళ్ళి యెరూషలేము దేవాలయాన్ని పునరుద్ధరించారు. (క్రీ.పూ. 538). అంతటి మునుపటి దశలకన్నా నిర్బంధానంతర దశ విభిన్నమైనది.

వ్యవసాయక, బానిస యాజమాన్య రాజరిక తరగతులు నిర్బంధం నుండి విముక్తి కాగానే తిరిగి వర్గ వైరుధ్యాలు తీవ్రతరమయ్యాయి. "తమ సహోదరులైన యూదుల మీద జనులును, వారి భార్యలు తీవ్రమైన ఫిర్యాదు చేసిరి. ఏదనగా కొందరు - మేమును, మా కుమారులను, మా కుమార్తెలను అనేకులము కలము. అందుచేత మేము తిని బ్రతుకుటకు ధాన్యము మీ వద్ద తీసుకొందుమనిరి. మరికొందరు క్షామమున్నందున మా భూములను ద్రాక్ష తోటలను, మా యిండ్లను కుదువ పెట్టితిమి కనుక మీ యొద్ద ధాన్యము తీసుకొందుమనిరి.......... మా ప్రాణము మా సహోదరుల ప్రాణము వంటిదిగాదా? మా పిల్లలు వారి పిల్లలను పోలినవారు కారా? మా కుమారులను, మా కుమార్తెలను దాసులగుటకై అప్పగించవలసి వచ్చెను. ఇప్పటికిని మా కుమార్తెలలో కొందరు దాసత్వంలో వున్నారు. మా భూములను, మా ద్రాక్ష తోటలను అన్యుల వశమునుండగా వారిని విడిపించుటకు మాకు శక్తి చాలకున్నది (నెహమ్యా 5:1-3.5).

ప్రజలను శాంతింపచేయడానికి గట్టి చర్యలే చేపట్టవలసి వచ్చింది. యూదులు ఎంతో కాలం స్వతంత్రులుగా లేరు. పర్షియా ఆదుపాజ్ఞలలో వారు వున్నారు.

యెరూషలేము యాజకులు బ్రహ్మాండమైన అధికారాన్ని సంపాదించారు. లౌకిక ప్రభుత్వంతో వారు ఎక్కువ కాలం పోటీ పడవలసిన అవసరం లేకపోవటమే ఇందుకు కారణం. విదేశీ పాలకులు (పర్షియన్లు, ఆ తరువాత గ్రీకు, సిరియన్ రాజులు - సెల్యూసిడియ్) యెరూషలేము యాజకుల మద్దతుపై ఆధారపడ్డారు. యూదులపై తమ అధికారాన్ని బలోపేతం చేసుకోవటానికే యీ విధంగా చేశారు. యెరూషలేము దేవాలయం ప్రక్కన యితర పూజా కార్యక్రమాలను అనుమతించలేదు. యెరూషలేములో యావ్హేకు యూదులు కేవలం బలులను మాత్రమే ఇచ్చేవారు. దేశమంతటా గల భక్తుల నుండి యాజకులు కానుకలు తీసుకొనేవారు. ప్రతి చిన్న పాపానికి యావ్హే భక్తులు కానుకలు సమర్పించుకోవలసి రావడంతో దేవాలయంలో సంపద పోగుపడింది. కొన్ని సందర్భాలలో పాపులు దేవాలయంలో పరిచర్యలు చేయవలసి వచ్చేది. యాజకులు తమ సంపదను వడ్డీ వ్యాపారానికి ఉపయోగించుకొని సంపన్నులయ్యారు. వారికి పోటీ వుండేదికాదు.

అనువంశిక వారసత్వాన్ని కచ్చితంగా పాటించే యెరూషలేము యాజకులు రెండుగా చీలిపోయారు. బోధకులు, లేవీయులు అన్న శాఖలుగా చీలారు. ఈ రెండు శాఖలు తాము లేవీయుల వారసులమనే చెప్పుకొంటారు. మోషే నుంచి ఆయన సోదరుడు ఆరోను వంశం నుంచి వచ్చినట్లు చెప్పుకొంటారు.

అంతరాలతో కూడిన సామాజికాభివృద్ధి ఏకేశ్వరారాధనను ముందుకు తెచ్చింది. నిర్బంధానంతర దశలో యిది సంపూర్ణ రూపంలో వ్యక్తమైంది. ఒకప్పటి తెగ దేవుడైన యాహ్వే విశ్వ సృష్టికర్తగాను సర్వశక్తి సంపన్నుడిగాను రూపుదాల్చాడు.

ఆ రకంగా యూదు మతం, ఏకేశ్వరారాధానను నొక్కి చెప్పి ఆచరణలో పెట్టిన మొట్ట మొదటి మతంగా చరిత్రలో నిలిచిపోయింది. బాబిలోనియా, ఈజిప్టు, ఇరాన్ మతాలలో కూడా యీ ఏకేశ్వరారాధన ధోరణులు పొడచూపాయి. అయితే యీ ధోరణి సర్వేసర్వత్రా రాజకీయ కేంద్రీకరణకు, రాజుయొక్క నిరంకుశాధికారానికి ప్రతిబింబంగానే వున్నది. ఏకేశ్వరారాధనను ప్రవేశపెట్టాలనుకొన్న ప్రతిసారీ స్థానిక దేవతారాధకులు, యితరులు ప్రతిఘటిస్తూనే వచ్చారు. అయితే యీసారి యెరూషలేము యాజకులు గుత్తాధికారం సంపాదించటంతో కచ్చితమైన ఏకేశ్వరారాధనను ఆచరణలోకి తెచ్చారు. గట్టి ప్రత్యర్థులెవరూ లేకపోవడమేకాక పర్షియన్ తదితర రాజుల మద్దతు కూడా వారికి లభించింది.

బైబిలు గ్రంథాన్ని ప్రత్యేకించి మోషే పంచకంలోని ప్రధాన గ్రంథాలను యీ ఏకేశ్వరారాధన స్ఫూర్తితోనే కూర్పుచేశారు. క్రీస్తుపూర్వం అయిదవ శతాబ్ది చివరిలో బైబిలు చిట్ట చివరి ప్రతి తయారైందని పరిశోధకులు అందరూ ఒప్పుకుంటారు. మోషే పంచకంలో ప్రధాన భాగమైన యాజకుల నియమావళి అప్పటిలోనే తయారైంది. అయితే తొలి రచనలను బట్టి చూస్తే యూదులు యాహ్వేతోపాటు ఇతర దేవతలను కూడా పూజించినట్లు అర్థమవుతుంది.

కనుక సనాతన చర్చి అభిప్రాయం ఎలా వున్నప్పటికీ యూదులలో ఏకేశ్వరారాధన తరాల నుండి రావటంలేదు. అది యిటీవలి పరిణామం మాత్రమే.

అణగారిన ప్రజలు నిరసనలు తెలుపకుండా, తమ విముక్తి కోసం పోరాడకుండా చూసేటందుకుగాను ఏదో ఒక మతపరమైన ఓదార్పును అన్వేషించవలసిన అవసరం పాలకవర్గానికి ఎదురౌతుంది. వర్గ వైరుధ్యాలు తీవ్రతరమైనప్పుడు సాధారణంగా ఈ రకమైన అవసరం ఏర్పడుతుంది. ఈ లోకంలో అనుభవించే కష్టనష్టాలకు మరణానంతరం సుఖాలు లభిస్తాయని వర్గ సమాజంలోని అత్యధిక మతాలు ప్రజలకు ఆశపెడుతూ వుంటాయి. అయితే యూదు మతం యీ రకమైన సిద్ధాంతాన్ని ప్రచారం చేయలేదు. ఈ మతం సర్వే సర్వత్రా ఇహలోక జీవితానికే పూర్తిగా ముడిపడి వుంది. కడగండ్లపాలవుతున్న జనావళిని యితర మార్గాలలో యూదు మతం ఓదార్చింది. దేవుని భక్తులు ఎంపిక చేసిన జనములలో చేరతారని యీ మతం పేర్కొన్నది. ప్రత్యేకించి రెండవ దేవాలయ కాలంలో యీ భావం వ్యాప్తి చెందింది. ఒకవేళ యూదులు గాని బాధలను ఎదుర్కొవలసి వస్తే అందుకు తమను తామే నిందించుకోవలసి వుంటుంది. ఈ బాధలకు అర్థమేమిటంటే వారు పాపులు, భగవంతుని ఆజ్ఞలను ధిక్కరించారు. అందుకుగాను ఆయన వారికి శిక్ష విధించాడు. అయినప్పటికీ వారు ఎంపిక అయిన జనములలో వారే. యాహ్వే తన ప్రజలను క్షమించి, భూమిపై నివసించే యితర జనములకన్నా వారిని ఉన్నత స్థాయిలో వుంచే కాలం తప్పక వస్తుంది.

ఈ భావనకు గల మూలాలు ప్రాక్తన కాలంలో వున్నాయి. ఆనాటికి యాహ్వే తెగ దేవునిగానే వున్నాడు. సహజంగానే తెగకు రక్షకుడిగా వున్నాడు. విశ్వకర్తగానూ, శక్తిశాలిగానూ రూపొందిన తరువాత కూడా యాహ్వే తన జనములను ప్రేమించడం మరువలేదు. వారిని కఠినంగా శిక్షించినప్పటికీ యీ ప్రేమ సాగుతూనే వున్నది. ప్రవక్తలందరూ యీ అభిప్రాయాన్నే ప్రకటించారు. అయితే తార్కికంగా చెప్పతగిన వైరుధ్యం తలెత్తుతున్నదనేది యథార్థం. ఒకవేళ యాహ్వే సృష్టికర్త, శక్తిశాలి అయితే తాను ఎంపిక చేసుకున్న జనములను చిన్న బృందంగా ఎందుకు వుంచాడు. మరీ ముఖ్యంగా ప్రతి దశలోనూ ఆయనకు నమ్మకద్రోహం తలపెడుతున్నప్పుడు యిలా ఎందుకు చేశాడు? అయితే ఏ ఒక్కరూ యీ విషయం పైకి తమ చూపును మరల్చలేదు.

నిర్బంధానంతర దశలో, ఎంపిక చేసుకున్న జనములు అన్న భావన మరింత బలపడింది. ఇతరేతరమైన భాషలు, సంస్కృతులు కలిగిన యిరుగు పొరుగు తెగలకూ, యూదులకూ (యూదు మతస్తులకు) కచ్చితమైన తేడాను పాటించడం జరిగింది. యూదులను పాలించేటందుకై క్రీ. పూ. 446లో అర్టాక్సెరెక్సెస్ చేత నియమితుడైన నెహమ్యా యీ విషయంలో గట్టి చర్యలనే చేపట్టాడు. యెరూషలేము ప్రాకారాలను పునర్నిర్మించే పనిని కూడా యీయనకే యిచ్చాడు. యాజకులు, లేవీయులు బలపరిచిన ఆయన పాలనలో యితర తెగలవారిని వివాహమాడకుండా యూదులపై నిషేధం విధించారు. వారితో యితరేతర సంబంధాలు పెట్టుకోవడంపై గట్టి ఆంక్షలు అమలులోకి వచ్చాయి. ఎవరైతే సున్నతి చేయించుకోరో లేదా ఎవరైతే యాహ్వేను ఆరాధించరో అలాంటి యూదుయేతరులను అపవిత్రమైన విగ్రహారాధకులుగా భావించారు.

జాతిపరమైన యిలాంటి ఏకాకితనానికి అర్థమేమిటంటే ప్రజలను అదుపులో వుంచటం, వర్గపరమైన అణచివేతలకు వ్యతిరేకంగా వ్యక్తమయ్యే నిరసనను బలహీన మొనర్చడం.

బాబిలోనియా నిర్బంధం సైతం యూదుల మత విశ్వాసాల యథార్థ భావనపై తన ప్రభావాన్ని చూపింది. విశ్వనిర్మాణం గురించీ, దుష్టాత్మల గురించిన బాబిలోనియా ప్రభావం బైబిల్‌లో చాలా స్పష్టంగా కన్పిస్తుంది. ఉదాహరణకు రెక్కలున్న దేవతల (Cherulims) గురించి బైబిల్‌లో తరుచుగా ప్రస్తావనలు కన్పిస్తాయి. ఇవి బాబిలోనియా దేవతలు మినహా మరేమీకాదు. రెక్కలున్న వృషభాలు వీరి దేవతలు. అస్సీరియన్ బాబిలోనియన్‌ల మర్దుక్, ఇస్తార్‌ల పూజా విధానం బైబిల్‌లోని మొర్దకై ఎస్తేరుల గాథ (ఎస్తేరు గ్రంథం)లో ప్రతిబింబిస్తుంది. తమకు సంభవించనున్న వినాశనం నుండి యూదులు తమను తాము రక్షించుకోవడమే యీ గాథలోని సారాంశం. ఈ సంఘటన జ్ఞాపకార్థమే పురీమ్ విశ్రాంతి దినంగా వాడుకలోకి వచ్చి వుండవచ్చు. అయితే యీ విశ్రాంతి దినం యొక్క మూలాలు బాబిలోనియాలో వున్నాయని పరిశోధకులు భావిస్తారు. చిట్టచివరకు, ఆదికాండం తొలి అధ్యాయాలలో కనిపించే దేవుని సృష్టి కథపై కూడా సృష్టి ప్రారంభం గురించిన బాబిలోనియా పురాణ గాథ ప్రభావం కనపడుతుంది. బైబిల్ ప్రకారం తొలి మానవుని పేరు ఏడం

(ఆదాము). ఇదే విధంగా బాబిలోనియా పురాణాల్లోని తొలి వ్యక్తి పేరు ఎడప.

విశ్వ సృష్టిని గురించిన యూదుల భావాలు గందరగోళమైనవి. పరస్పర వైరుధ్యంతో కూడినవి. ప్రపంచాన్ని, మానవుడిని సృష్టించిన విధానం గురించి ఆదికాండం తొలి అధ్యాయాలలో రెండు విభిన్న గాథలున్నవి. ఒక కథ ప్రకారం భగవంతుడు మొదటగా పురుషుణ్ణి సృష్టించాడు. ఆ తరువాత ఏదెను తోటను వేశాడు. తొలి నరుడు నివసించినదిక్కడే. ఆ తరువాత యీ నరునికి తోడును సృజించాలని నిశ్చయించాడు. ఇందు నిమిత్తము రకరకాలైన జంతువులను సృష్టించాడు. ఈ నరుడు వాటన్నిటికీ పేరులు పెట్టాడు. కాని వీటిలో అతనికి నిజమైన తోడు లభించలేదు. కనుక చిట్ట చివరకు దేవుడు స్త్రీని సృష్టించాడు. నిద్రిస్తున్న నరుని ప్రక్కటెముకను తీసి దానితో యీ స్త్రీని సృష్టించాడు. (ఆదికాండము, 1:20-27). మరో కథ ప్రకారం భగవంతుడు యీ ప్రపంచాన్ని ఆరు రోజుల్లో సృష్టించాడు. అయిదవ రోజున చేపలను, ప్రాకెడు జంతువులను, పక్షులను సృజించాడు. ఆరవ దినమందు జంతువులను అంతిమంగా స్త్రీ పురుషులను ఏకకాలమందు సృష్టించాడు. (ఆదికాండము, 2:7-22). పొందికలేని అంశాలు మరికొన్ని వున్నాయి. ఆదికాండంలోని రెండవ అధ్యాయంలో కనిపించే గాథ యెహోవా అనుచరులకు సంబంధించినదని కొంతమంది పరిశోధకుల అభిప్రాయం. జానపద గాథలు దీనికి ఆధారమని వారి అభిప్రాయం. మొదట అధ్యాయంలోని గాథను యాజకుల స్మృతి నుండి తీసుకొన్నదని రెండవ అధ్యాయంలోని దానికి యిది విభిన్నమైనదని వీరి ఉద్దేశ్యం.

పతనం గురించీ, మరణం గురించీ చెప్పే బైబిల్ గాథలు (తన ఆజ్ఞను ధిక్కరించి మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తిన్నందుకుగాను తొలి మానవులను దేవుడు శిక్షిస్తాడు) మరణాన్ని గురించిన బాబిలోనియన్ పురాణ గాథలకు వక్ర రూపాలు మాత్రమే. బాబిలోనియన్ పురాణగాథల్లో మృత్యువుకు గల కారణానికి తార్కిక విశ్లేషణ వుంది. దేవుళ్ళ మధ్య విభేదాలు, తొలి నరుడు చేసిన పొరపాటు మరణానికి కారణమని యీ గాథ చెపుతుంది. బైబిల్ గాథలో మృత్యువుకు గల కారణం అతార్కికమైనది. మహాశక్తి సంపన్నుడైన దేవుడే మానవుని అమర్త్యునిగానూ, వెనువెంటనే మర్త్యునిగానూ మారుస్తాడు.*

లోకాన్ని ముంచి వేసిన వరద గురించి బైబిల్ గాథ, వరద గురించిన బాబిలోనియన్ పురాణగాథను దాదాపుగా వల్లె వేసింది. ఈ ఉప్పెన నుండి తనను తాను కాపాడుకున్న నోవహు, బాబిలోనియన్ అట్నపిష్టిమ్ తప్ప మరొకరు కాదు. కాని బైబిల్ గాథలో తార్కికత

* ప్రస్తుతం అలభ్యంగా వున్న మూల పాఠంలో యీ గాథ పూర్తి విభిన్నంగానూ, మరింత తార్కికంగానూ వున్నదని జేమ్స్ జార్జిఫ్రేజర్ వాదన. ఈ గాథ ప్రకారం మృత్యు వృక్ష ఫలములను కాక, జీవ వృక్ష ఫలములను తినవలసిందిగా మానవులకు చెప్పమని దేవుడు సర్పాన్ని పంపిస్తాడు. కాని కుయుక్తులలో అన్ని జంతువులను మించిపోయిన సర్పము దేవుని సందేశాన్ని వక్రీకరిస్తుంది. ఆరకంగా జీవ వృక్ష ఫలములను తాను తినవచ్చునని భావిస్తుంది. అయితే సవరించిన బైబిల్ పాఠములో భగవంతుని దూతగా గాక స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. తాను చేసిన వంచనకుగాను దానికి ఎలాంటి స్వీయ ప్రయోజనము సమకూరదు (ఫ్రేజర్ ఫోక్‌లోర్ ఇన్ ది ఓల్డ్ టెస్టమెంట్, లండన్, మాక్మిలన్ అండ్ కో లిమిటెడ్, 1919 సం॥ 1, పేజి 47-51).

వుండదు. బాబిలోనియన్ గాథలో ఆది దేవుడైన ఎన్‌లిల్ అభీష్టానికి వ్యతిరేకంగా 'యా' తనకిష్టుడైన అట్నఫిష్టిమ్‌ను కాపాడుతాడు. ఆ రకంగా మానవ జాతి రూపుమాసిపోకుండా సంరక్షిస్తాడు. బైబిల్‌లో మాత్రం ప్రజలను హతమార్చడానికీ, రక్షించడానికీ ఒకే ఒక ఘనమైన దేవుడు కారణంగా వుంటాడు.

యూదు మతంపై బాబిలోనియన్ల ప్రభావమేగాక కొద్దిపాటిగా మజ్దా మత (అహ్రూ మజ్దాను పూజించే మతం) ప్రభావం కూడా వున్నది. పర్షియన్ల పాలనలో వున్నప్పుడు (క్రీ.పూ. 6–4 శతాబ్దాలు) యూదులు తప్పనిసరిగా మజ్దా మతాన్ని గురించి తెలుసుకొని వుండాలి. దేవుని విరోధి సాతాను – దుష్టాత్మ భావన యీ ప్రభావ ఫలితమే కావచ్చు. ఆదిమ కాలంలో యీ భావన యూదులలో లేదు. బైబిల్‌లో కూడా దాదాపుగా కనిపించదు.

దుష్టాత్మ భావన బైబిల్ గ్రంథంలో విభిన్న రీతులలో వ్యక్తమయింది. యూదులు పరాయి దేవతలను పూజించారు. అందుకుగాను తమ దేవుడి శిక్షకు గురయ్యారు. ఈ దేవుని నుంచి వచ్చిన దుష్టాత్మలు కొన్నిసార్లు ప్రజల వద్దకు వస్తాయి. తదనంతరకాల క్రైస్తవ బోధల ప్రకారం నిషేధిత ఫలాన్ని తినవలసిందిగా స్వర్గంలోని తొలి మానవులను రెచ్చగొట్టినది సాతాను. ఇది ఎలా ఉన్నప్పటికీ బైబిల్ ప్రకారం మానవుడిని రెచ్చగొట్టింది సాతాను కాదు సర్పము. మొట్ట మొదటగా యోబు గ్రంథంలోనే యీ సాతాను కనిపిస్తుంది. యోబులోని ధర్మగుణాన్ని తక్కువగా అంచనా వేసి అతడిని నాశనం చేయాలని చూస్తుంది. అది కూడా దేవుని అనుమతితోనే. కాగా సాతానును చూసినట్లు జెకర్యా ప్రవక్త పేర్కొన్నాడు. (మరియు యెహోవా దూత యెదుట ప్రధాన యాజకుడైన యెహోషువా నిలువబడుటయూ, సాతాను ఫిర్యాదియై అతని కుడి పార్శ్వములో నిలువబడుటయు అతడు నాకు కనపరచెను. (జెకర్యా 3:1–2). సాతాను రూపము, దేవుని రూపము ఒకే పాఠంలో కలగలసిపోయాయి. సమూయేలు రెండవ గ్రంథం ప్రకారం ఇశ్రాయేలీయుల పట్ల దేవునికి కోపం వస్తుంది. జనాభా లెక్కలు తీయమని దావీదు మహారాజును ఆజ్ఞాపిస్తాడు. ఈ పని చేస్తున్నప్పుడే ఆ దేవుడు ప్రజలందరినీ దారుణంగా శిక్షిస్తాడు. పార్లిపోమినాన్ తొలి గ్రంథంలో యిదే కథ పునరావృతమవుతుంది. అయితే యాజకులు దీనిని సవరించారు. దీని ప్రకారం జనాభా లెక్కలు తీయవలసిందిగా దావీదు మహారాజును ప్రేరేపించేది దేవుడుకాదు, సాతాను. ఏదిఏమైనప్పటికీ ప్రత్యేకమైన దుష్టాత్మ, దేవుని విరోధి, సాతాను సామ్రాజ్య పాలన అన్న భావాలు యూదు మతానికి పరాయివేనని చెప్పకతప్పదు.

డైస్‌పరా శకం వరకు (గణాలలో యూదుల వ్యాప్తి) అదేవిధంగా హెలినిస్టిక్ మత–తాత్విక భావాలు పెరిగేవరకూ అమూర్త వేదాంత భావజాల ప్రభావం అంటకుండానే యూదు మతం నిలచివున్నది. మరణానంతర జీవితమూ, ఆత్మ నిత్యత్వమూ, నరకము వంటి భావనలు ప్రాచీన యూదు మతంలో కనిపించవు. ప్రజలకు లేదా వారి వారసులకు దేవుడు మంచి చేసినా, చెడు చేసినా అదంతా భూలోకంలోనే.

రెండవ దేవాలయ కాలంలో వర్గ వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో నూతన పరిస్థితులకు అనుగుణంగా మతాన్ని సంస్కరించేటందుకు ప్రయత్నాలు జరిగాయి. యూదు

విద్వాంసుల బృందం బైబిల్ శాసనాల గురించీ, నీతి గురించీ బోధించడం, వ్యాఖ్యానించడం ప్రారంభించింది. దేవాలయ యాజక వ్యవస్థతో వీరికి ఎలాంటి సంబంధమూ లేదు. పైగా దానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఇది ఎలా ఉన్నప్పటికీ బైబిల్ కూర్పులో వీరు భాగస్వాములుగా వున్నారు.

యూదు మత చరిత్రలో తర్వాతి శకంగా చెప్పుకోదగినది ప్రవాసకాలము (డైస్పరా). ఈ కాలంలో యూదులు పాలస్తీనా వెలుపల వ్యాపించారు. అస్సీరియన్, బాబిలోనియన్ల విజయాలకు ముందే (క్రీ.పూ.7, 6 శతాబ్దాలు) ఇది ప్రారంభమైంది. హెలినిజం వ్యాప్తిలో వున్న కాలంలో ఈజిప్టు, సిరియా, ఆసియా మైనర్ తదితర మధ్యధరా ప్రాంత దేశాలలో యూదులు నివాసాలేర్పరచుకున్నారు. రోమన్ పాలనకు వ్యతిరేకంగా యూదులు చేసిన మొదటి తిరుగుబాటు మరీ ముఖ్యంగా రెండవ తిరుగుబాటు (క్రీ.శ. 66-70, క్రీ.శ. 132-135) విఫలమైన అనంతరం పెద్ద ఎత్తున వలసలు సాగాయి. దాదాపుగా మధ్యధరా దేశాలన్నింటా యూదుల నివాసాలు ఏర్పడ్డాయి. యెరూషలేము దేవాలయాన్ని టైటస్ ఫ్లవియస్ (క్రీ.శ. 70) ధ్వంసం చేసిన తరువాత, అదే విధంగా యెరూషలేము శిథిలమయిన తరువాత (క్రీ.శ. 133) యూదులు తమదైన సంప్రదాయక మత కేంద్రాన్ని పోగొట్టుకున్నవారయ్యారు. ఆ రకంగా నూతన చారిత్రక పరిస్థితులు తలెత్తి మతంలో మార్పులను గొనితెచ్చాయి.

ప్రవాసకాలంలో యూదు సమూహాలు ప్రార్ధనా మందిరాల (Synagogues - గ్రీకు భాషలో Synagoge అంటే సభ అని అర్థం) చుట్టూ కూడుకొని వుండేవి. ఇవి ప్రార్ధనా స్థలాలుగాను, అదే సమయంలో సామాజిక కార్యకలాపాలకు, మతపరమైన స్వీయపాలనకు కేంద్రాలుగా వుండేవి. సంపన్నులు, నాయకులు ఉండేవారు. ఈ ప్రార్ధనా మందిరాలకు స్వంతంగా ఖజానాలుండేవి. ఆస్తులు, ప్రైవేటు విరాళాల ద్వారా వచ్చే ఆదాయాలు వుండేవి. పేద ప్రజలను ఆదుకునే ధార్మిక సంస్థగా యీ ప్రార్ధనా మందిరాలు పనిచేసేవి. ఈ ప్రార్ధనా మందిరాలలో పవిత్ర గ్రంథాలను చదవటం, వ్యాఖ్యానించడం జరిగేది. వీటిల్లోనే ప్రజలు ప్రార్ధనలు చేసేవారు. అయితే యెరూషలేము దేవాలయంలో మాత్రమే యాహ్వేకు సమర్పణలు చేసుకోవాలన్నది యూదుల సంప్రదాయం కావటంతో విరాళాలు మాత్రం ఇచ్చేవారు కాదు. హెలెనిస్టిక్ కాలంలో యీ ప్రార్ధనా మందిరాలు కట్టినట్లుగా కన్పడుతుంది. మొట్ట మొదటి ప్రార్ధనా మందిరం (ఈజిప్టులోని అలెగ్జాండ్రియా సమీపంలో) గురించిన ప్రస్తావన క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ది ద్వితీయార్థ భాగానికి చెందినది. ఈ ప్రార్ధనా మందిరాలు ప్రవాసంలోనేగాక యెరూషలేముతో సహా పాలస్తీనాలో కూడా వుండేవి. యెరూషలేము దేవాలయం శిథిలమైన తరువాత ఇవి ప్రధానమైన పాత్రను నిర్వహించడం మొదలుపెట్టాయి.

స్వాభావికంగా రెండవదైన మార్పు యేమిటంటే యూదుల మత భావాలు, హెలినిస్టిక్ మత-తాత్విక భావాలు ఒండొంటిని ప్రభావితమొనర్చడం పెరిగింది. హెలెనిస్టిక్ సంస్కృతిని స్వీకరించిన యూదులు దేశాలు తిరుగుతున్నప్పుడు గ్రీకు భాష మాట్లాడటం

ప్రారంభించారు. (పాలస్తీనాలోనూ, సిరియా, బాబిలోనియాలోని కొన్ని ప్రాంతాలలోనూ వారు ఆర్మైన్ భాష ఉపయోగించారు. క్రీ.పూ. మూడవ శతాబ్ది ప్రారంభంలోనే దైనందిన వ్యవహారాల నుండి హిబ్రూ భాష వైదొలగింది. ఇది లిఖిత భాషగానూ, చర్చి భాషగానూ మాత్రమే మిగిలిపోయింది.) క్రీ.పూ. 3, 2 శతాబ్దాల మధ్య బైబిల్ గ్రంథాలన్నీ గ్రీకు భాషలోకి తర్జుమా అయ్యాయి. ఈ తొలి అనువాదాలు పాత నిబంధన పేరుతో ప్రసిద్ధి పొందాయి. ప్రవాసంలో వున్న అత్యధిక సంఖ్యాకులైన యూదులకు హిబ్రూ భాష తెలియకపోవడంతోపాటు, యూదేతరులు కూడా యీ మతంపట్ల ఆసక్తిని కనపరచడంతో ఈజిప్టు రాజైన రెండవ టాలమి గ్రీకు అనువాదాలకు ఉత్తర్వులిచ్చాడు. బైబిల్‌కు చేసిన ఈ అనువాదం యూదులను హెలినిస్టిక్ మత తాత్వికులకు సన్నిహితం చేసింది. దానితో ఈ మత – తాత్విక వ్యవస్థలు (అలెగ్జాండ్రియాకు చెందిన ఫైలో, ఆ తరువాత గ్నాస్టిసిజం) క్రైస్తవ సిద్ధాంతాన్ని చెప్పుకోదగిన విధంగా ప్రభావితమొనర్చాయి.

రెండవ దేవాలయ కాలంలో సంభవించిన మతపరమైన ఏకాకితనాన్ని అధిగమించడానికి యీ పరిస్థితులు యూదులకు దోహదపడ్డాయి. ప్రవాసంలో నివసిస్తున్న యూదులు యితర జాతుల ప్రజలతో సన్నిహితమయ్యారు. ప్రాచీనంలో తెగ దేవునిగానూ, తదనంతరం జాతి జనుల దేవుడిగానూ మారిన యాహ్వే పరిమిత పరిధుల నుండి బయటపడి యూదుయేతరులలో కూడా ఆరాధ్యనీయుడయ్యాడు. ఈ కాలంలోనే మత మార్పిడులు జరిగాయి. ఇలా మారిన వారు సున్నతి పొందారు. యూదుయేతరులు యూదుల మతాన్ని స్వీకరించడం, ప్రవాసకాలంలో సంభవించిన గుణాత్మకమైన మార్పు.

రాజకీయ, సామాజిక పరిస్థితుల కారణంగా యూదు మతంలోని సైద్ధాంతిక గుణగణాలు కొత్త లక్షణాలను సంతరించుకున్నాయి. అనేక శతాబ్దాల పాటు యూదులు పరాయి పాలనలో వున్నారు. కనుక వారికి రాజకీయ స్వాతంత్ర్యం లేకపోయింది. వీరు పలుమార్లు తిరుగుబాట్లు చేశారు. కాని తాత్కాలిక విజయాలు మాత్రమే సిద్ధించాయి. (క్రీ.పూ. 165లో మకాబీస్ తిరుగుబాటు) రోమన్ల పాలనా కాలంలో విదేశీ అణచివేత కారణంగా తరచుగా తిరుగుబాట్లు తలెత్తాయి. అయితే విజేతలు వాటిని అతి క్రూరంగా అణచివేశారు. ఏదో మానవాతీత శక్తి కల్పించుకొని అణచివేతదారుల నుండి తమకు విముక్తి ప్రసాదించగలదన్న విశ్వాసం పెరగసాగింది. రక్షకుడైన మెస్సయ్యలో విశ్వాసం పెరిగింది. విదేశీ అణచివేతదారుల నుండి యూదులను విడిపించగల జాతీయ నాయకుడాయన. ప్రత్యేకించి రోమన్ల కాలంలో యీ మెస్సయ్య భావన వ్యాప్తి చెందింది. యూదు మతంలో ఇదొక కొత్త ధోరణి (ప్రభువు కృపవలన తైలాభిషేకం పొందిన రాజులను మాత్రమే తొలుదొల్త మెస్సయ్య అని పిలిచేవారు) క్రైస్తవ సిద్ధాంత ప్రాదుర్భావానికి యీ భావన ఒక ఉపకరణంగా మారింది.

మెస్సయ్య భావనతో సన్నిహితంగా ముడిపడిన మరో కొత్త భావన కూడా తలెత్తింది. ఇదే పరలోక సిద్ధాంతము. పరాయి పాలనపోయి స్వతంత్ర రాజ్య పునరుద్ధరణ గురించి మాత్రమే మొదట్లో యూదులు కలగనేవారు. తదనంతర రచనలలో మరీ ముఖ్యంగా

యూదుల శాసన గ్రంథాలలో పరలోకంలో లభించనున్న మహదానందం గూర్చిన భావన పొడసూపింది. పవిత్ర జీవనులకు ప్రతిఫలం దొరుకుతుంది. మరణానంతర జీవనం గురించి, పునరుత్థానం గురించి అస్పష్టంగా తలెత్తిన భావనలు అంతకుముందు కాలంలో లేవు. ప్రపంచ ప్రళయం, మృతుల పునరుత్థానం, నరకలోకవాసం అన్న భావాలు మజ్దా మత ప్రభావం కారణంగా వచ్చి చేరాయి.

ప్రవాస సమయంలో యూదుల మతంలో మరో వినూత్న దృశ్యం గోచరించింది. యూదు సమాజంలోని వివిధ వర్గాల అభిప్రాయాలనూ, ప్రయోజనాలనూ ప్రతిబింబిస్తూ అనేకమైన శాఖలు తలెత్తాయి. జోసివస్ ప్లవియస్ ద్వారా అదేవిధంగా క్రీస్తు శకం ప్రారంభానికి చెందిన ఆకరాల ద్వారా యీ శాఖల గురించి మనకు తెలియవస్తున్నది.

యెరూషలేముకు చెందిన సనాతనవాద యాజకులు జడోకిట్స్ శాఖగా ఏర్పడ్డారు. యాజకుల వంశానికి మూల పురుషుడిగా చెప్తున్న జడోక్ నుండి యీ పేరు వచ్చింది. వీరు దేవాలయానికి అంటిపెట్టుకొని వుండేవారు. మతపరమైన సంప్రదాయాలను, ఆచారాలను విధిగా పాటించేవారు. మరణానంతర జీవితమన్న భావనను త్రోసిపుచ్చారు. దేవాలయ విధ్వంసంతో యీ శాఖ కూడా కనుమరుగయింది.

పరిసయ్యులు ప్రజలకు సన్నిహితంగా వుండేవారు. వీరిని ఒక ప్రజాతంత్ర శాఖ లేదా ఒకపక్షంగా కొంత మంది పాశ్చాత్య చరిత్రకారులు భావిస్తారు. వాస్తవానికి వీరు తమ వాక్చాతుర్యం ద్వారా మత విశ్వాసులను ఆకర్షించడానికి ప్రయత్నించేవారు. జన్మతః వీరు పాలకవర్గానికి చెందినవారు. ప్రార్థనా మందిరాలలో మత శాసనాలకు భాష్యాలుచెపుతూ భక్తులకు బోధలు చేస్తూ వుండేవారు. జడోకిట్స్ వలే కాకుండా పరిసయ్యులు మరణానంతర జీవితాన్ని విశ్వసించేవారు. ఆరవ దశకంలో యూదులు తిరుగుబాటు చేసినప్పుడు వీరు రోమ్ తరఫున నిలిచారు.

దిగువస్థాయి వర్గాలు, రైతులు, చేతివృత్తులవారు తృతీయ శాఖగా రూపొందారు. సన్యాస జీవితాన్ని గడుపుతూ ఆచారాలను త్రోసిపుచ్చిన ప్రజలతోకూడిన సమాజాలకు చెందినవారు వీరు. ఆస్తి పై సమిష్టి యాజమాన్యాన్ని ఉమ్మడి వినియోగాన్ని వారు బోధించారు. పవిత్రులకు స్వర్గ సౌఖ్యాలు లభించే మరణానంతర జీవితంపట్ల వారికి విశ్వాసం వున్నది.

రెండవ యూదు తిరుగుబాటును (132-135) రోమ్ ఓడించిన తర్వాత పాలస్తీనా నుండి యూదులు వెళ్లిపోవలసి వచ్చింది. రోమన్ సామ్రాజ్యమంతటా వారు చెల్లాచెదురయ్యారు. ఇదే సమయంలో సామ్రాజ్యంలోని మిగిలిన ప్రజలతో వారికి గల సంబంధాలలో మార్పు వచ్చింది. రోమన్ సామ్రాజ్య ఆర్థిక పరిస్థితి దిగజారి పోవడంతోపాటు మూడవ శతాబ్దం నుండి వాణిజ్యమూ, డబ్బు చెలామణి తగ్గిపోవడంతో మిగిలిన జనాలతో యూదుల ఆర్థిక సంబంధాలు క్షీణించాయి. యూదు వర్తకుల ప్రభావం కూడా క్షీణించింది. మత ప్రచారం తగ్గుదలకు యీ పరిస్థితులు దారితీశాయి. జాతిపరంగా, మతపరంగా ఒకప్పటి ఏకాకితనానికి యూదులు తిరిగి చేరుకున్నారు. ఆసరికే క్రైస్తవం యూదు మతం నుండి తనను తాను వేరుపరచుకున్నది. యూదు మతం, హెలెనిస్టిక్ మత తాత్విక భావాలు

ఒండొంటిని ప్రభావితం చేసుకోవటం నిలిచిపోయింది.

మతపరమైన ఏకాకితనం యూదులకు మరోసారి సంక్రమించిన యీ దశలో శాసన గ్రంథాలు (తాల్ముడ్) వెలువడ్డాయి. మతపరమైన, శాసనపరమైన నియమ నిబంధనలతో కూడిన బృహత్తర శాసనావళి యిది. దీనిని మూడు అయిదు శతాబ్దాల మధ్య బాబిలోనియా, పాలస్తీనాలకు చెందిన యూదులు రూపొందించారు. ఇది రెండు భాగాలుగా వుంటుంది. మొదటిది మిష్నహ్. ఇది విస్తృతమైన శాసన భాష్యము. రెండవది గెమరా. ఇది భాష్యాలకే భాష్యము. ఇవి రెండూ హలకాహ్ (శాసనాలకు, ఆచారాలకు చెందిన నిబంధనల సంకలనం) హగ్గదా (పురాణాలు, నీతి కథలు, చట్టానికి సంబంధించిన ఉదాహరణలు మొదలైనవి)లుగా విభజితమయ్యాయి. మిష్నహ్‌ను ప్రాచీన హిబ్రూ భాషలో రచించారు. కాగా తూర్పు ప్రాంత యూదుల వాడుక భాషగా వున్న ఆల్మైన్ భాషలో గెమరాను రచించారు. ఈ శాసన సముచ్ఛయానికి (తాల్ముడ్) రెండు సమాంతర ప్రతులను జాగ్రత్తపరిచారు. అవి యెరూషలేము (తాల్మూడ్ యెరూషల్మి), బాబిలోనియన్ (తాల్ముడ్ బాబ్లి)లు. తదనంతర కాలంలో అంటే ఆరు, పది శతాబ్దాల మధ్య రకరకాల వ్యాఖ్యానాలను జతపరిచారు. దీనినే మిద్రష్ అని పిలిచారు.

ఈ శాసన సముచ్ఛయాన్ని యూదులలోని పై వర్గాలు రూపొందించాయి. వర్తకులకు, బానిస యజమానుల కుటుంబాలకు, వారి ప్రయోజనాలకు వీరు ప్రతినిధులు. యూదు సమాజంలోని వర్గవైరుధ్యాలను యిది ప్రతిబింబించింది. అమ్హారెజ్‌లనే (రైతులు, చేతి వృత్తులవారు తదితరులు) సాధారణ ప్రజలకు వ్యతిరేకంగా విద్వాంసులైన సంపన్న బానిస యజమానులు నిలిచారు. అమ్హారెజ్‌ల పట్ల యీ శాసనావళి బహిరంగ తిరస్కార ధోరణిని ప్రదర్శించింది. అయితే ధార్మిక సంస్థకు విరాళమిచ్చి తోరహ్‌ను చదివి పరలోకంలో ఆనందమయ జీవితాన్ని కొనగలిగిన ధనిక అమ్హారెజ్‌లు కూడా వున్నారు. పేదలకు యీ అవకాశం లేదు. ఈ శాసనాలు బానిసలను పట్టించుకోలేదు. యూదులకు చెందిన బానిస యజమానుల వద్ద వుండే బానిసలు సాధారణంగా ఇతర జాతులకు చెందిన వారు కావడంతో బానిసలను యూదు సమాజ సభ్యులుగా గణించలేదు. క్రైస్తవం వలె బానిసలకు ఎలాంటి ఓదార్పును యూదు మతం ఇవ్వలేకపోయింది.

ఈ దశ ప్రారంభంలో అంటే క్రీస్తుశకం మొదటి శతాబ్దాలలో యూదు సమాజంలో యీ శాసనావళి కీలకమైనదిగా మారింది. కేవలం మతపరమైన అంశాలలోనే కాకుండా సామాజిక, న్యాయ వ్యవహారాలలో కూడా యిది జోక్యం చేసుకున్నది. యూదులకు స్వంత దేశం గానీ లేదా లౌకిక ప్రభుత్వంగానీ లేదు. తత్కారణంగా పరుల భూభాగాలలో పరాయి జనుల మధ్య వారు చెల్లాచెదరుగా జీవించారు. ఈ పరిస్థితుల్లో తమ సంఘ నాయకుల పట్ల వారు విధేయత ప్రకటించారు. ఈ నాయకులనే తదనంతర కాలంలో రబ్బీలని పిలిచారు. తమకేవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు యూదులు రబ్బీల సలహాను అడిగేవారు. వారు శాసనావళి వైపు దృష్టి నిలిపేవారు. తమకెదురయ్యే సమస్యలను అదే విధంగా సామాజిక, వ్యక్తిగత వ్యవహారాలలో ఎదురయ్యే ప్రతి చిన్న అంశానికీ మతపరమైన

పరిష్కారాన్ని కోరే యీ సంప్రదాయం వలన రబ్బీలు మత పండితులుగా మారి తిరుగులేని అధికారాన్ని చెలాయించారు. దీనితో యూదులు మరింత ఒంటరి వారయ్యారు. ఇతర జనుల నుండి వేరుపడ్డారు. సంపన్నవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగానే పేదలైన యూదు ప్రజలను పూర్తిగా పరాధీనులుగా వుంచారు.

మధ్య యుగాల ప్రారంభం నాటికి రోమన్ సామ్రాజ్యంలోనూ, దాని సరిహద్దులకవతల యూదులు దాదాపు అన్ని ప్రాంతాలలోనూ స్థిరపడ్డారు. ప్రత్యేకించి స్పెయిన్‌లోనూ, ఆ తరువాత జర్మనీలోనూ అత్యధిక సంఖ్యలో యూదుల నివసించారు. అరబ్ ఖలీఫత్ దేశాలలో ఎక్కువ మంది యూదులు నివసించారు. ప్రతిచోటా వారు ప్రధానంగా చేతివృత్తులు, వర్తకం, వడ్డీ వ్యాపారం చేపట్టారు. కొన్నిచోట్ల వ్యవసాయం చేశారు. యూదులలో వర్గ వ్యత్యాసాలు అధికం కావటంతో శాసనాలకు భాష్యకారులైన రబ్బీలు మరింత అణచివేతకు పాల్పడ్డారు. ఈ అణచివేతకు నిరసనగా ఆస్తిలేని నిరుపేదల ఆకస్మిక తిరుగుబాట్లు కరైటి లేదా అననైటి (అనన్‌బెన్ డేవిడ్ అన్న నాయకుని పేరుతో యిది వచ్చింది) రూపంలో కొనసాగాయి. కరైటీలు శాసనాలను తిరస్కరించి మోషే పరిశుద్ధ బోధలను ఆచరించాలని చెప్పారు. కరైట్ ఉద్యమం నల్ల సముద్ర ప్రాంతానికీ, ఖజార్‌కు (8 నుండి 10వ శతాబ్దం వరకు ఇక్కడ యూదు మతం రాజ్య మతంగా వున్నది) ఆ తరువాత క్రిమియాకు వ్యాపించింది. ఈనాటికీ క్రిమియా, లిథుయేనియాలలో కరైటీలు వున్నారు. వీరికీ, శాసనాలను అనుసరించే యూదులకూ మధ్య దీర్ఘకాలిక శత్రుత్వం వున్నది.

ఏడు నుండి పన్నెండవ శతాబ్దాల మధ్య కాలంలో అరబ్ ఖలీఫత్‌లో యూదు సమాజాలు ఆర్థికంగా బలపడటమే కాకుండా ఆనాటికి ఆయా దేశాలలో వర్థిల్లుతున్న సంస్కృతిలో భాగమయ్యాయి. ఉత్తరాఫ్రికా, స్పెయిన్‌లు అరబ్ సంస్కృతికి కేంద్రాలుగా వున్నాయి. అటు ముస్లింలలోనూ, యిటు యూదులలోనూ ఇక్కడ స్వేచ్ఛాయోచన అభివృద్ధి చెందింది. సంక్లిష్టమైన ఆర్థిక వ్యవహారాలకు, ఉన్నతస్థాయి శాస్త్ర విజ్ఞానానికి అనుగుణంగా యూదులు తమ ప్రాచీన బైబిల్ శాసనావళిని స్వీకరించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలు రెండు త్రోవలు పట్టాయి. ఇవి ***హేతువాదమూ, మార్మికవాదమూ.***

ఈజిప్టులో నివసించిన (1135–1204) మోజెస్ బెన్ మైమోన్ యూదు దైవిక సిద్ధాంతులలో అత్యంత ప్రధానమైన హేతువాదిగా పేరుపొందాడు. సమకాలీనమైన సైన్స్‌తోనూ, తత్వశాస్త్రంతోనూ మతానికున్న భేదాలను తొలగించడానికి పలు రచనల ద్వారా ఆయన కృషిచేశాడు. అరిస్టాటిల్ తాత్విక చింతనకు కట్టుబడి ముస్లిం హేతువాదుల ముతాజిలిస్టులు లేదా విభజితవాదుల బోధలనే కొన్ని స్వీకరించి బైబిల్ గ్రంథంలో కనిపించే నమ్మశక్యం గాని కథలకూ, 'మహిమలకూ' హేతుబద్ధమైన భాష్యం చెప్పడానికి ప్రయత్నించాడు. యూదు మతంలో కనిపించే అసంఖ్యాకమైన చిన్నా చితకా నియమాలను త్రోసిపుచ్చి మౌలికమైన పదమూడు సూత్రాలను మైమోన్ రూపొందించాడు. భగవంతుని ఉనికిని నిరూపిస్తూ అనేకమైన శాస్త్రీయ వాదనలను ఆయన చేశాడు. ఈ స్వతంత్ర ఆలోచనాపరుని పట్ల రబ్బీలు పూర్తి అనుమానంతో వుండి అతనిని అన్యమతస్తునిగా

ప్రకటించారు.

మరికొందరు యూదు మతానుయాయులు ఇంకొకవైపు దృష్టిని సారించారు. ఇది శుద్ధ మార్మికవాదం. ప్రత్యేకించి స్పెయిన్‌లో బలంగా వున్న కబాలా ధోరణికి ఇది దారితీసింది. ముస్లిం మార్మికవాదం ప్రభావంతోనూ దానికి మూలంగా వున్న నయా ప్లేటోవాదం ద్వారానూ యిది అభివృద్ధి చెందింది. హిబ్రూ భాషలో కబాలా అంటే సిద్ధాంతాన్ని, సంప్రదాయాన్నీ అందుకోవడం. ప్రధానమైన కబాలా రచనను జోహర్ (కాంతి) అని పిలుస్తారు. పదమూడవ శతాబ్దంలో యిది వెలుగుచూసింది. దీనిలోనూ యితర కబాలావాద రచనలలోనూ సారాంశమొక్కటే. దేవుడు నిత్యుడు, అనంతుడు, స్వయం కారణుడు. పేరులోని రహస్యార్థాన్ని, పేరులోని అక్షరాలను, యీ అక్షరాలు ప్రాతినిధ్యం వహించే సంఖ్యలను అర్థం చేసుకోవడం ద్వారానే దేవుడిని తెలుసుకోగలమని వీరు చెపుతారు. అంకెలతో ఏర్పడే వివిధ రకాలైన మార్పులను వారు అధ్యయనం చేశారు. ప్రపంచంలో దుష్టాత్మలేదని వారు బోధించారు. దుష్టాత్మ కేవలం మంచికి బాహ్య రూపమే. మంచి అనేది భగవంతుడు. సాంఘిక అన్యాయాలను సరిదిద్దే మార్గమిది. ఆత్మ మరో శరీరంలో ప్రవేశిస్తుందన్న నమ్మకం కబాలా వాదులకు వున్నది. మృతి చెందిన పాపి ఆత్మ మరో వ్యక్తి లేదా జంతువు శరీరంలోకి వెళ్తుందని వారు బోధించారు. ఆత్మకు పాప విముక్తి లభించే వరకు యిది కొనసాగుతుందని వారి అభిప్రాయం. విముక్తి చెందిన ఆత్మ పరిశుద్ధాత్మల రాజ్యానికి వెళుతుంది. దుష్టాత్మలో వీరికి నమ్మకమున్నది. తమను ఆశ్రయించిన వారిలోని దుష్టాత్మను వెళ్ళగొట్టడానికి వివిధ రకాల పద్ధతులను అనుసరించేవారు.

ఐరోపాలో పెట్టుబడిదారీ యుగం ప్రారంభమై బూర్జువా సంస్కృతి అభివృద్ధి చెందుతున్న కాలంలో కొత్త సైద్ధాంతిక భావనలను యూదులు అభివృద్ధి చేశారు. యూదులలోని సామాజిక వైరుధ్యాలను ఇవి ప్రతిబింబించాయి. మరోసారి మార్మిక, హేతువాద భావాలు పుంజుకున్నాయి. రబ్బీల సంకుచిత మత ఛాందసత్వంతో ప్రజలలో పేర్కొన్న అసంతృప్తి పేరుతో ఇవి వ్యక్తమయ్యాయి. మార్మికవాదం హసిదిజం రూపాన్ని దాల్చింది.

హసిద్ అనే మాటకు హిబ్రూలో సదాచారి అని అర్థం. ఇది మధ్య యుగాలలో పుట్టుకొచ్చింది. అయితే యీ హసిదిక్ ఉద్యమం కేవలం 18వ శతాబ్ది మధ్యలో మాత్రమే నైరుతీ రష్యాలోని యూదులలో ప్రత్యేకించి నిరు పేదలు, ఓటు హక్కులేని యూదులలో అభివృద్ధి చెందింది. హసిదిజం సంస్థాపకుడు ఇజ్రాయిల్ బెన్ ఎలిజర్ (ఈయన గురించి అంతగా తెలియదు) రబ్బీల 'పాండిత్యం'గురించి చెప్పడంతోపాటు ఆచారాలలో అనేకం అవసరంలేదని బోధించాడు. ప్రార్థనలో లభించే ఆనందం పారవశ్యం ద్వారా భగవంతునితో ఎవరైనా ప్రత్యక్ష సంబంధం పెట్టుకోవచ్చునని తెలిపాడు. హసిదిన్ బోధనల ప్రకారం భగవంతునితో సంబంధం పెట్టుకోవడం ప్రతి ఒక్కరికీ సాధ్యంకాదు. ప్రధానంగా సనాతనులైన జడ్డిక్స్‌కు మాత్రమే సాధ్యమవుతుంది. సాధు జనులైన జడ్డిక్స్ వంటి అనువంశిక కుటుంబాలు తల ఎత్తడానికి హసిదిక్ ఉద్యమం వీలుకల్పించింది. వాస్తవానికి యీ సాధు జనులు

వాగాడంబరులు. విశ్వాసులను నిస్సిగ్గుగా దోచుకునేవారు. అందుకు బదులుగా 'ఆశీర్వాదాలను' ఇచ్చేవారు. హసిదిక్ – రబ్బీ అనుయాయుల మధ్య తీవ్రమైన వైషమ్యాలు పొడసూపాయి. తదనంతర కాలంలో కొంతవరకు అణగిపోయాయి.

ఆధునిక చరిత్రలో ప్రత్యేకించి జర్మనీలో యూదులలో ప్రాదుర్భవించిన హేతువాద ఉద్యమం వికసన (హస్కలాహ్) రూపాన్ని దాల్చింది. సారాంశంలో యిది మత సంప్రదాయాల నుండి విడివడింది. మత శాసనాలను సరళీకృతం చేయడానికి ప్రయత్నించింది (మోజెస్ మెండిక్ షాన్ 1729–86 ఆయన సహచరులు). తదనంతరకాలంలో యీ హస్కలాహ్ ఉద్యమం అభివృద్ధి నిరోధకమైన బూర్జువా జాతీయవాద యూదు దురహంకార రూపాన్ని తీసుకున్నది. పాలస్తీనాలో యూదు రాజ్యస్థాపనకు పిలుపునిచ్చింది. యూదుల్లో అత్యధికులు, మరీ ముఖ్యంగా నిరు పేదలు, చేతి వృత్తుల వారు చిన్నచిన్న వ్యాపారస్తులు, శ్రామికవర్గానికి చెందిన కొందరు తాల్ముడిక్ రబ్బీలకు ఆధ్యాత్మిక విధేయతను ప్రకటించారు. తాల్ముడ్ స్ఫూర్తి నిరంతరం ప్రార్థనా మందిర సమావేశాలలో ఆధిక్యతను నిలబెట్టుకుంటూనే ఉన్నది.

వినయ విధేయతలు కలిగిన యూదు విశ్వాసులు దైనందిన జీవితంలో పాటించవలసిన అతి సూక్ష్మ వివరాలను సైతం తాల్ముడ్‌లు నిర్దేశించాయి. ఆదేశాలుగానీ, నిషేధాలుగానీ యిలాంటివి మొత్తం 613 వున్నాయి. వీటిని సులభంగా అర్థం చేసుకోవడానికిగాను 16వ శతాబ్దికి ముందే షుల్హాన్ అరుక్ పేరుతో మత నిబంధనల గ్రంథం వెలువడింది. మత విశ్వాసులైన యూదుల కోసం దీనిని లఘు గ్రంథంగా ప్రకటించారు. సవివరమైన ఇన్ని ఆంక్షలతో కూడిన యిలాంటి మతమేదీ ప్రపంచంలో యింకొకటిలేదు. యూదు మత పురాతన స్వభావాన్ని యీ అంశం ప్రతిబింబిస్తున్నది. అయితే యీ మత సంప్రదాయాల్లోని అనేక అంశాలు ఆధునిక జీవన పరిస్థితులకు అనుగుణమైనవి కావు. కనుకనే వీటిని వ్యాఖ్యానించవలసిన లేదా వీటి చుట్టూ ప్రదక్షిణలు చేయవలసిన అవసరం ఏర్పడుతున్నది. రబ్బీలు చేస్తున్నదిదే. ఏ పరిస్థితులోనైనా ఒక వ్యక్తి ప్రవర్తన ఎలా వుండాలో రబ్బీ సలహా ఇస్తాడు. ఇందుకుగానూ రుసుమును వసూలు చేస్తాడు. సమాజంలోని సంపన్నవర్గాల ప్రయోజనాలనే కాపాడుతాడు. మత న్యాయ స్థానానికి సైతం రబ్బీలే బాధ్యులుగా వుంటారు. ఏవైనా వివాదాలు తలెత్తితే ప్రతి విశ్వాసి ప్రభుత్వ న్యాయ స్థానానికి గాక యీ న్యాయ స్థానానికే విజ్ఞప్తి చేసుకోవాలి.

ఏది ఏమైనప్పటికీ రబ్బీ, చర్చి ఆచార్యుడు కాదు. (క్రైస్తవ లేదా బౌద్ధ మత పూజారి వంటివాడుకాదు) అతనికి ఎలాంటి పదవీ వుండదు. అతను కేవలం మామూలు వ్యక్తి మాత్రమే. అయితే మత గ్రంథాలపై తిరుగులేని అధికారమూ, అపారమైన జ్ఞానమూ వున్న వ్యక్తిగా గౌరవాన్ని పొందుతాడు.

విశ్వాసులను లొంగదీసి వుంచడానికి ప్రార్థనా మందిరాలలో అనుసరించే ధార్మిక విధానం ఒక మార్గం. పరస్పర సహాయమందించుకునే సమాజాలు అవకాశమున్నప్పుడల్లా ఉనికిలోకి వచ్చాయి. మత నిర్మాణంలోనే పేదలు వుండేలా ధార్మికత నిలిపి వుంచింది.

మత విశ్వాసియైన యూదుడు ప్రతిదానినీ మత సంప్రదాయాన్ననుసరించే చేయాలి.

ఆహారమూ, వస్త్రధారణ, దినచర్యలు, ప్రార్థనలు, విశ్రాంతి దినాల పాటింపు మొదలైనవన్నీ యీ నిబంధనలకే లోబడాలి. ఎప్పుడు ఏమి చేయవచ్చునో, ఏమి చేయరాదో యీ సంప్రదాయాలు నిర్దేశిస్తాయి. మగ బిడ్డ పుడితే ఏడవ రోజున సున్నతి చేస్తారు. మత విశ్వాసియైన యూదుడు ప్రతి పనినీ ప్రార్థనతో మొదలుపెడతాడు.

ఆహారానికి సంబంధించి అనేక నియమ నిబంధనలు యీనాటికీ ఆచరణలో ఉన్నాయి. పట్టణాలలో యూదు సమాజాలు వున్నచోట కొషెర్ నిబంధనలకు అనుగుణంగా మాంసాన్ని నరికే వారు వుంటారు. ఈరకమైన మాంసాన్ని ప్రత్యేకమైనే దుకాణాలలో అమ్ముతారు. ఇతరమైన మాంసాన్ని అపవిత్రంగా భావిస్తారు.

వస్త్రధారణకు సంబంధించి కూడా ప్రత్యేకమైన నిబంధనలు వున్నాయి. పురుషులు తొడిగే దుస్తులు పొడవుగా వుండాలి. ఒకే రకమైన గుడ్డతో తయారు చేసినవై వుండాలి. జేబులు నడుము క్రిందనే వుండాలి.నిదురపోయేటప్పుడు సైతం అతని తలపై ముసుగు వుండాలి. మత విశ్వాసియైన యూదుడు గడ్డాన్ని పెంచుతాడు. చెంపలు కూడా పొడవుగా వుంటాయి. ప్రార్థనా సమయంలో ప్రత్యేకమైన ప్రార్థనా వస్త్రాన్ని తన దుస్తులపై వేసుకుంటాడు. స్నానానికి సంబంధించి కూడా అనేక నిబంధనలు వున్నాయి. ముఖ్యంగా మహిళల విషయంలో మరీనూ. పారేనీరులేని కొలనులో మాత్రమే ఒంటిని శుభ్రపరచుకోవాలి.

సబ్బాత్ (శనివారం) విషయంలో కచ్చితమైన నిబంధనలను పాటించవలసి వుంది. ఆ రోజున పనిచేయకపోవడమేకాదు, వంట చేయరాదు. పొయ్యి వెలిగించకూడదు. చేతిలో బరువు వుండరాదు. డబ్బు అంటుకోరాదు ఇంకా ఇలాంటివే మరికొన్ని వున్నాయి.

వార్షిక విశ్రాంతి దినాలలో యూదులు యిప్పటికీ పస్కా పండుగ జరుపుకుంటారు. (పురాతన యూదు క్యాలెండర్ ప్రకారం నిసాన్ నెలలో 14వరోజు) షాబోతు (పస్కా పండుగ వెళ్ళిన 15వ రోజు, ప్రాచీన కాలంలో కోతలప్పుడు వచ్చే విశ్రాంతి దినం), రోస్‌హషన (నూతన సంవత్సర ప్రారంభం, త్రిషి నెలలో ఏడవ రోజున యిది వస్తుంది) యోం కిప్పుర్ (ఆనంద దినము, సంవత్సరాది అనంతరం పదవరోజు), సుక్కోత్ (ఆకురాలు కాలంలో వచ్చే ఏడు రోజుల విశ్రాంతి కాలము. ఈ సమయంలో ప్రత్యేకంగా నిర్మించిన గుడిసెలో నివసిస్తారు). పురీం (ఎస్తేర్, మోర్దుకైలకు సంబంధించిన బైబిల్ కథలను బట్టి వసంతకాలంలో వచ్చే విశ్రాంతి దినము) మొదలైనవి విశ్రాంతి దినాలు.

మతపరమైన విద్యా విధానం కారణంగా యూదుల వ్యవహారాలలో మతం పాత్ర కొట్టవచ్చినట్లు కనపడుతుంది. అయిదారేళ్ళ నుంచే మగ పిల్లలను ప్రార్థనా మందిరాలలోని బళ్ళలో వేస్తారు. వీరి పాఠ్యాంశం ఒకే ఒకటి మతం. పూర్తిగా యాంత్రిక విద్య. విద్యార్థులు బైబిల్, తాల్ముడ్‌లలోని భాగాలను వల్లెవేస్తూ వుంటారు. ఉపాధ్యాయులు మత సాహిత్యంలో ఉద్దండులు. కాని ఇతర జ్ఞానం వారికి శూన్యం.

వర్గపరమైన అణచివేతను యూదు మతం అనుమతించి సమర్థించడమేగాక స్త్రీపురుషుల మధ్య అసమానతను పురికొల్పుతుంది. యూదు మతాన్ని అనుసరించి స్త్రీలు కుటుంబంలోనూ, సమాజంలోనూ లొంగి వుండవలసిందే. స్త్రీలపై అనేకమైన ఆంక్షలు

వున్నాయి. న్యాయస్థానంలో వారు సాక్ష్యమివ్వకూడదు. శాలువా కప్పుకోకుండా బయటకు వెళ్ళకూడదు. ఇంకా ఇలాంటివే మరికొన్ని ఆంక్షలు వున్నాయి. తాల్ముడ్ ప్రకారం భార్య అంటే భర్తకు నమ్మకమైన బానిస. తనను స్త్రీగా పుట్టించనందుకుగాను భగవంతునికి కృతజ్ఞతా స్తుతులు తెలియజేస్తూ మత విశ్వాసియైన యూదు పురుషుడు ప్రతిరోజూ ప్రార్థన చేస్తాడు. తన భర్తకు అణగిమణగి వుండేలా తనను సృష్టించినందుకుగాను భగవంతునికి స్త్రీ కృతజ్ఞతలు తెల్పాలి.

యూదు మతాన్ని ఆధునికీకరించి, ఆధునిక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవహారాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు 19వ శతాబ్దంలో ప్రారంభమైన ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగుతున్నవి. మత సమర్థకులలో చాలా మంది బైబిల్ గాథలకు మతపరమైన వ్యాఖ్యానాలు చేస్తూ తాల్ముడ్ నిబంధనలు వ్యర్థమని చెపుతారు. ప్రార్థనా మందిరాలలోని పూజలు ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయి (స్థానిక భాష, సంగీతాలతో మత కర్మకాండలు నిర్వహించడం). ఇదే సమయంలో పేదలను దృష్టిలో వుంచుకొని అహేతుకమైన సామాజిక బోధలు ప్రారంభమయ్యాయి. యూదు మతానికి చెందిన ఉదారవాదులకూ, సనాతనులకూ మధ్య విభేదాలు వున్నాయి.

నేటి ఇజ్రాయిల్‌లో సనాతన యూదు మత పునరుద్ధరణకు ప్రయత్నాలు సాగుతున్నాయి. రాజ్య మతంగా దీన్ని భావిస్తున్నారు. శాసనాలలోనూ, న్యాయ వ్యవస్థలోనూ బైబిల్, తాల్ముడ్ సూత్రాలు ఉన్నాయి. యూదులకు, యూదేతరులకూ మధ్య జరిగే వివాహాలకూ గుర్తింపు లేదు. పాఠశాలల్లో విద్యా బోధన మత సంబంధమైనదిగానే వుంటున్నది.

# క్రైస్తవ మతం

క్రైస్తవం రెండవ ప్రపంచ మతంగా అభివృద్ధి చెందినది (మొదటిది బౌద్ధ మతం –అను). ప్రాయికంగా ఐరోపాతోను, తదనంతరం అనేక ఐరోపాయేతర దేశాల చరిత్రతోను దీని చరిత్ర సన్నిహితంగా ముడివడి వున్నది.

ఈనాడు ప్రపంచంలో అధికవ్యాప్తి గలిగిన మతం క్రైస్తవం (ప్రధానంగా ఐరోపా, అమెరికాలలో). అయినప్పటికీ క్రైస్తవం అనేక విశ్వాసాల పేరు మీద చర్చీలుగా, శాఖలుగా చీలిపోయి తరచుగా యివి ఒకదానితో మరొకటి కీచులాడుతున్నాయి.

క్రైస్తవ మత చరిత్రలో అత్యంత క్లిష్టమైన సమస్య యేమిటంటే యీ మతం ***పుట్టుకకు సంబంధించిన ప్రశ్న.*** ఇది నిరంతర చర్చకు ఆలవాలంగా మారింది. క్రైస్తవం పుట్టుకకు సంబంధించిన బూర్జువా సాహిత్యం ప్రధానమైన రెండు ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఇందులో ఒకటేమిటంటే రోమన్ చక్రవర్తులైన అగస్టస్, తిబెరియస్ (మొదటి శతాబ్ది ప్రారంభంలో) పాలనా కాలంలో యూదుల భూమిలో నివసించినట్లు భావిస్తున్న ఏసుక్రీస్తు క్రైస్తవాన్ని స్థాపించి తన సిద్ధాంతాన్ని బోధించాడు. దీనినే ఆ తరువాత ఆయన శిష్యులు, అపొస్తలులు ప్రజలలో ప్రచారం చేశారు. ఇది పూర్తిగా మత బోధకుల అభిప్రాయం అయినప్పటికీ యీ అభిప్రాయమే బూర్జువా చరిత్ర పుస్తకాలలో కొద్దిపాటి శాస్త్రరూపంలో సాక్షాత్కరిస్తుంది.

బైబిలు పరిశోధనకు సంబంధించి టుబింజన్ ప్రొటెస్టెంట్ శాఖ సువార్తలపై విమర్శను ఎంతో ముందుకు తీసుకువెళ్ళింది. సువార్తల్లోని కల్పితాలను, మొత్తం మహిమలను, వైరుధ్యాలను తొలగించింది. అయినప్పటికీ మతాధికారాన్ని బలహీనపరచకుండా వుంచేందుకై సువార్త కథల్లో చారిత్రకాంశాలు వున్నాయని చెప్పటానికి టుబింజన్ అనుయాయులు ప్రయత్నించారు. గలిలయ బోధకుడైన జీసస్‌కు సంబంధించిన యథార్థ చారిత్రక సంఘటనలపై సువార్త కథలు ఆధారపడ్డాయని వారు ప్రకటించారు.

తొలిరోజుల నాటి క్రైస్తవ మతాన్ని గురించిన అధ్యయనంలో తలెత్తిన మరో ధోరణిని చర్చి వ్యతిరేక బూర్జువా ధోరణిగా పిలవవచ్చు. 18వ శతాబ్దపు పునర్వికసన సాహిత్యం నుండి ఇది ఆవిర్భవించింది. దేవుళ్ళు, జనం చెప్పుకొనే పురాతన వీరులు దివ్యలోకపు పురాణ పురుషులకు ప్రతిరూపాలుగా ఈ శాఖ అనుయాయులు భావిస్తారు.

జీసస్ క్రీస్తును సూర్య భగవానునిగా వారు భావించినది ఇలానే. ప్రకృతికి సంబంధించిన దేవతలు, వాటి పూజా విధానాలు, వన దేవతల మరణ, పునరుత్థానములతోకూడిన ప్రాచీన ప్రపంచ మతం గురించి 19వ శతాబ్ది మధ్యలో పరిశోధనలు పెరిగినప్పుడు క్రైస్తవానికి ప్రాచీన ప్రాచ్య ఆచారాలకు మధ్య అనేక సారూప్యాలను స్వేచ్ఛా ఆలోచనాపరులైన పరిశోధకులు చూడటం మొదలు పెట్టారు. ప్రాచీన ప్రాచ్య దేవుళ్ళైన ఒసిరిస్, మిత్ర, డైనిసస్ తదితరులు అదే విధంగా కొంతమేరకు, ఎవరిలోనైతే తాము దివ్య లోకపు పురాణ పురుషుల అంశను చూస్తున్నారో, ఆ ప్రాచీన యూదు ప్రవక్తల కలయికయే క్రీస్తు రూపమన్న నిర్ధారణకు వారు వచ్చారు. దీనితో క్రైస్తవంలో స్వత:సిద్ధమైనది లేదన్న నిర్ధారణకు వచ్చారు. యూదు, ఈజిప్షియన్, సిరియన్ తదితరుల పూర్వ దివ్య లోకపు, ఇతర కల్పితాల పునరుక్తిగా క్రైస్తవాన్ని భావించారు. ఏసుక్రీస్తును చారిత్రక వ్యక్తి అనటాన్ని యీ ధోరణికి చెందిన పరిశోధకులు త్రోసిపుచ్చుతారు.

తొలి క్రైస్తవానికి చెందిన అనేక మంది పరిశోధకులు మూఢ విశ్వాసాలను ఎదిరిస్తూ నిరాకార దేవుడన్న భావాలను సమర్థించటానికి ప్రయత్నించారు. టుబిన్‌జెన్ పరిశోధకుల వలెనే స్వేచ్ఛా ఆలోచనాపరులైన పరిశోధకులు సైతం క్రైస్తవం ఆవిర్భవించిన చారిత్రక పరిస్థితుల వైపు కన్నెత్తి చూడకుండా పూర్తిగా మత భావాల పరస్పర ప్రభావంపై ఆధారపడి క్రైస్తవాన్ని అధ్యయనం చేశారు. కాగా క్రైస్తవంలో నూతనత్వాన్ని చూడలేకపోయారు. దీర్ఘకాలిక భావాల స్థానంలో వచ్చి చేరిన యాంత్రిక పూరణగానే దానిని వారు భావించారు.

మార్క్సిజం మౌలికంగా కచ్చితమైన వైఖరిని చేపట్టింది. ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన బ్రూనో బాయెర్ అండ్ ఎర్లీ క్రిస్టియానిటీ తదితర రచనలలో యీ వైఖరి ప్రకటితమైంది. క్రైస్తవం అభివృద్ధి చెందిన చారిత్రక పరిస్థితులను, దాని సామాజిక మూలాలను క్షుణ్ణంగా విశ్లేషించిన తొలి వ్యక్తి ఎంగెల్స్.

***తొలినాటి క్రైస్తవ అధ్యయనానికి ఆకరాలను*** ప్రధానమైన రెండు పాయలుగా విభజించవచ్చు. అవి క్రైస్తవం, క్రైస్తవేతరం. క్రైస్తవ ఆకరాలను మూడు కేటగిరీలుగా విభజించవచ్చు. కొత్త నిబంధనలో చర్చి ఆమోదించిన పుస్తకాలు, అధికార ముద్రపడని రచనలు, పాత నిబంధన నుండి తొలగించిన రచనలు మొదలైన వాటితోపాటు అపొస్తలులు మరి యితర తొలి క్రైస్తవ రచయితల రచనలు.

చర్చి ఆమోదించిన కొత్త నిబంధన గ్రంథాలలో యీ దిగువవి వున్నాయి.

1. నాలుగు సువార్తలు – మత్తయి సువార్త, మార్క్ సువార్త, లూకా సువార్త, యోహాను సువార్త. క్రైస్తవ స్థాపకుడైన ఏసుక్రీస్తు ఇహలోకపు జీవితం గురించి, ఆయన బోధనలు, మహిమలు, మరణము (సిలువ వేయటం), పునరుత్థానం గురించిన కథలు వీటిలో వున్నాయి. సారాంశం రీత్యా తొలి మూడు సువార్తలలోని సమాచారం కొంతవరకు సరిపోలుతుంది, కొంత విభేదిస్తుంది. ఈ సారూప్యాల కారణంగా యీ మూడు సువార్తలను సాధారణంగా ఒకే విధమైన వాటిగా పరిగణిస్తారు. యోహాను సువార్త చెప్పుకోదగిన భిన్నత్వాన్ని కలిగి వున్నది.

2. అపొస్తలుల కార్యములు – దీని కర్తృత్వాన్ని అపొస్తలుడైన లూకాకు ఆపాదిస్తారు. (మూడవ సువార్త రచయితగా పేరొందిన వ్యక్తి) మొట్ట మొదటగా క్రైస్తవాన్ని స్వీకరించిన వారి కార్యకలాపాల గురించి యిది వివరిస్తుంది.

3. అపొస్తలులు రాసిన పత్రికలు – వివిధ క్రైస్తవ సంఘాలకు వారు రాసిన పత్రికలివి. వీటిలో అపొస్తలుడైన పౌలుకు పధ్నాలుగు లేఖల కర్తృత్వాన్ని ఆపాదిస్తారు. కాగా ఏడు లేఖలను యితర ఆపొస్తులులకు (జాకబ్, పేతురు, యోహాను, యూదా) ఆపాదిస్తారు.

4. దైవజనుడు యోహాను ప్రవక్త రాసినట్లు చెప్తున్న చివరి గ్రంథము, లేదా ప్రకటన గ్రంథము (దీని కర్త నాల్గవ సువార్త రచయిత అని చెప్తుంటారు)

ఈ గ్రంథాల రచయితలకు సంబంధించి చర్చి అభిప్రాయమిది. ఇవి మనుజులు రాసినప్పటికీ వారు పవిత్రాత్మచేత ప్రేరణ పొందారని, కనుక వీటిలోని ప్రతి మాట పరమ సత్యమని చర్చి నమ్ముతోంది.

ఇది ఎలా వున్నప్పటికీ కొత్త నిబంధనను యథార్థమైన శాస్త్రగత పరిశీలనకు గురిచేస్తే యీ గ్రంథాల రచయితల గురించీ, అవి రాసిన కాలం గురించి విభిన్నమైన అంశాలు తెలుస్తాయి. జాగ్రత్తగా అధ్యయనం చేస్తే ప్రకటన గ్రంథం మొట్ట మొదటిదని తెలుస్తుంది. బహుశా దీనిని నీరో మరణానంతరం క్రీ.శ. 68, 69లలో రాసి వుంటారు. ఈ గ్రంథం చెప్పే దానిని పరిశీలించండి! ***మరియు ఏడుగురు రాజులు కలరు : అయిదుగురు కూలిపోయారు. ఒకడున్నాడు. కడమవాడు యింకను రాలేదు. వచ్చినప్పుడు అతడు కొంచెముకాలముండవలెను.*** (ప్రకటన గ్రంథము 17–10). రోమ్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా యూదులు తిరుగుబాటు చేస్తున్న సమయంలో దీనిని రచించివుండవచ్చు. వినాశనానికి కారణమైన అణచివేతదారుల పట్ల పగను యీ గ్రంథం ప్రతిబింబిస్తున్నది. క్షమ, సహనము అన్న క్రైస్తవ ఆదర్శాల జాడలు దీనిలో ఎంతమాత్రం కనిపించవు. పూర్తి భిన్నమైన ధోరణితో నిండిన నాల్గవ సువార్త రచయిత ప్రకటన గ్రంథ రచయిత కాకపోవచ్చు. ఆరవ దశకంలో అనేక క్రైస్తవ సమాజాలున్నట్లు ప్రకటన గ్రంథం ద్వారా మనకు తెలుస్తుంది. ఏడింటి పేర్లు దీనిలో వున్నాయి. ఇవన్నీ ఆసియా, ఆసియా మైనర్‌కు చెందినవే. బహుశా యిదే క్రైస్తవానికి పుట్టిల్లుకావచ్చు.

అపొస్తలుడైన పౌలు రచించినట్లుగా చెప్తున్న పత్రికలు ప్రకటన గ్రంథం కన్నా చాలా కాలం తరువాత రాసినట్లుగా కన్పడుతున్నది. వాస్తవానికి వీటిని విభిన్న కాలాలలో, వివిధ రచయితలు రచించి వుంటారు. వీటిని మూడు కేటగిరీలుగా విభజించవచ్చు. మొదటివి ద్వితీయ శతాబ్ది ప్రథమ పాదానికి చెందినవి: తరువాతవి ద్వితీయ పాదానికి చెందినవి : ఆ తరువాతవి ద్వితీయ శతాబ్ది మధ్య భాగానికి చెందినవి. 'చివరి' పత్రికలలోని భావజాలము 'మొదటి' వాటికన్నా చాలా విభిన్నంగా వుంటుంది. ఇతర అపొస్తలులను కర్తలుగా భావిస్తున్న మిగిలిన ఏడు పత్రికలు సారాంశంలోను, వాటి రచనా కాలంలోనూ ఒకదాని నొకటి పోలి వున్నాయి. ఇవి 'పౌలు' పత్రికలకన్నా చాలా విభిన్నంగా వున్నాయి.

రెండవ శతాబ్ది మధ్యలో వీటిని కూర్చినట్లుగా కన్పడుతున్నది.

తొలి రచనలుగా చర్చి భావిస్తున్న సువార్తలు వాస్తవానికి రెండవ శతాబ్ది మధ్య భాగానికి ముందు రాసినవికాదు. తాము రాస్తున్న దేశం గురించి యుగం గురించి తెలియని వారు వీటికి రచయితలుగా వున్నారు. సువార్తల నిండా అసంఖ్యాకమైన భౌగోళిక, చారిత్రక తప్పులు వున్నాయి. అప్పటిరోజుల్లో పాలస్తీనాలో లేని జంతువుల గురించి, మొక్కల గురించీ (ఉదాహరణకు పందులు. యూదులు వీటిని అపవిత్రమైనవిగా భావించారు. కనుకనే పెంచలేదు.) లేదా ఎక్కడా ఉనికిలో లేని వాటిని గురించి (ఉదాహరణకు ఆవాల మొక్క, పెద్ద పెద్ద కొమ్మలు గల చెట్టుగా దీనిని వర్ణించారు.) అవి పేర్కొంటున్నాయి. విభిన్న కాలాలకు చెందిన సంఘటనలను, వ్యక్తులను సైతం కలిపివేశారు. (ఉదాహరణకు క్రీ.పూ. నాల్గవ శతాబ్దిలో మరణించిన హేరోదు రాజు క్రీ.శ. ఆరవ శతాబ్దిలో సిరియాను పాలించిన క్విరినియాస్).

అనేక సందర్భాలలో సువార్తలు ఒకదానితో మరొకటి తీవ్రంగా విభేదిస్తున్నాయి. ఉదాహరణకు మత్తయి, లూకా సువార్తలు ఏసు వంశక్రమాన్ని దావీదు రాజు నుంచి లెక్కిస్తాయి. మత్తయి 28 తరాలను చెప్పగా లూకా 42 తరాలను పేర్కొంటున్నది. ఏసు తాత యాకోబు అని మత్తయి పేర్కొనగా హేలి అని లూకా చెప్తుంది. మత్తయి సువార్త ప్రకారం క్రీస్తు తల్లిదండ్రులు యూదుల పట్టణమైన బెత్లెహాంలో నివసించారు. శిశువులను చంపమంటూ హేరోదు రాజు ఇచ్చిన ఆజ్ఞ నుండి తమ బిడ్డను కాపాడుకోవటానికై శిశువు పుట్టుక అనంతరం వారు ఈజిప్టుకు పారిపోతారు. హేరోదు రాజు చనిపోయిన పిమ్మట వారు ఈజిప్టు నుండి గలిలయ పట్టణమైన నజరేతుకు చేరుతారు. లూకా ప్రకారం ఏసు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ నజరేతులోనే వున్నారు. అయితే బిడ్డ జన్మమప్పుడు. జనాభా లెక్కలప్పుడు వారు బెత్లెహాంలో వున్నారు. ఆ తరువాత వారు నజరేతుకు తిరిగి వచ్చారు. ఈ రకమైన తేడాలు సువార్తలలో అనేకం వున్నాయి.

నయంకాని రోగాలున్నవారికీ, పుట్టు గ్రుడ్డి వారికీ స్వస్థత చేకూర్చటం మృతులను లేపడం, నీళ్ళపై నడవటం వంటి అద్భుత, వూహాతీత ఘటనలతో సువార్త కథలు నిండి వున్నాయి. సువార్తలను అనేకమారులు సవరించినట్లుగా కనపడుతుంది. ముందటి అంశాలతో తరచుగా విభేదించే అనేక ప్రక్షిప్తాలను చేర్చారు. కనుక సువార్తలను చారిత్రక ఆధారాలుగా స్వీకరించడం చాలా కష్టమైన పని.

అపొస్తలుల కార్యక్రమాలకు సంబంధించి చూస్తే తదనంతర రచనలలో దీనిని ఒకటిగా గుర్తించటం జరుగుతున్నది రెండవ శతాబ్ది ప్రథమార్థం తరువాత దీనిని రచించి వుంటారు.

తొలి క్రైస్తవ రచనలలో చర్చి ఆమోదించని రచనలు మరో తరగతికి చెందినవి. వీటిని చర్చి త్రోసిపుచ్చినప్పటికీ, భగవంతుని ప్రేరణతో రచించిన వాటిగా గుర్తించదు. అనేకంగా వున్న సందేహాస్పదమైన సువార్తలు కూడా వీటిలో వున్నాయి. వీటిలో ఎక్కువ భాగాన్ని జాగ్రత్త చేయలేదు. కొన్నింటికి పేరులు మాత్రమే తెలుసు. చర్చి ఆమోద ముద్రపడని

రచనలలో జాగ్రత్త చేసిన వాటిల్లో ముఖ్యమైనవి. ***నికోడిమస్ సువార్త, జేమ్స్ గ్రంథము మరియ జన్మ సువార్త, వడ్రంగి జీసస్ చరిత్ర, అపొస్తలుల కార్యక్రమాలు. గొర్రెల కాపరి, పన్నెండు మంది అపొస్తలుల బోధలు,*** విస్తృతమైన తొలి క్రైస్తవ సాహిత్యానికి చెందిన వీటన్నిటిలోనూ కొన్ని భాగాలే మిగిలివున్నాయి. చర్చీలూ, శాఖలూ తమలో తాము భీకరంగా పోరాడుతున్న సమయంలో క్రైస్తవులే స్వయంగా వీటిలోని చాలా వాటిని ధ్వంసం చేశారు. చర్చి ఆమోదం లభించిన గ్రంథాలకన్నా ముందుగా వెలువడిన కారణం చేత చర్చి ఆమోదం పొందని సాహిత్యంలో కొంత భాగం ఆసక్తికరమైనది. ఉదాహరణకు రెండవ శతాబ్దం ప్రథమార్థానికి ముందే రచించిన ***12 మంది అపొస్తలుల బోధలు*** క్రైస్తవ సమాజపు తొలి దశ చరిత్రను తెలియచెప్తున్నది.

క్రైస్తవానికున్న ఆధారాలలో మూడవది అత్యంత విశ్వసనీయమైన తరగతికి చెందిన సాహిత్యమేమనగా ప్రచారకులు (సాహితీ శత్రువులను ఎదిరించి క్రైస్తవాన్ని రక్షించిన వారు), చర్చి ఫాదర్లు చేసిన రచనలు. ఇవి చాలా విలువైనవి. ఎందుకంటే వీటిని ఎవరు, ఎప్పుడు రాశారు అన్నదాని గురించి మనకు కొద్దో గొప్పో తెలుసు. తాత్వికుడు జస్టిస్ లేదా ప్రాణత్యాగి సెయింట్ జస్టిన్ (క్రీ.శ. 150), అదేవిధంగా నాలుగు అధికార సువార్తలను మొట్ట మొదటగా ప్రస్తావించి, అవి ఎక్కువ, తక్కువ కాకుండా నాలుగు మాత్రమే ఎందుకున్నాయో నిరూపించడానికి సైతం ప్రయత్నించిన సెయింట్ ఇరేనియాస్ (క్రీ.శ. 180), కార్తేజికి చెందిన టెర్టులియన్ (రెండవ శతాబ్దం చివర, మూడవ శతాబ్దం ప్రథమం), సెల్సస్‌కు వ్యతిరేకంగా షడ్గ్రంథాలు (సెల్సస్ క్రైస్తవ విమర్శకుడు, గ్రంథ రచయిత) రచించిన ఓరిగిన్ (మూడవ శతాబ్దం ప్రథమం), అలెగ్జాండ్రియాకు చెందిన క్లిమెంట్ (మూడవ శతాబ్ది ప్రథమం), క్రైస్తవ చర్చి తొలి చరిత్రకారుడు కాసరియాకు చెందిన యుసుబయాస్ (నాల్గవ శతాబ్ది ప్రథమం) రచనలు సైతం వీటిలో వున్నాయి.

తొలి క్రైస్తవ ఆధారాలలో సమాధులు (ముఖ్యంగా రోమ్‌లోని భూగర్భ సమాధులు) శిలా శాసనాల వంటి పురాతత్వ ఆధారాలు కూడా వున్నాయి. అయితే వీటిల్లో ఏదీ రెండవ శతాబ్దికి ముందు నాటివి కాదు.

ఇటీవల దశాబ్దాలలో ప్రధానమైన కొత్త సాక్ష్యాలనేకం లభించాయి. మూడు, నాలుగు శతాబ్దాలకు చెందిన పైపరస్ కట్టలను 1946లో పురాతత్వ శాస్త్రవేత్తలు ఈజిప్టులో కనుగొన్నారు. తొలి క్రైస్తవ సంప్రదాయానికి చెందిన (Gnostics) జ్ఞానమతవాదుల రచనలు వీటిల్లో ఎక్కువగా వున్నాయి. ఈ పైపరస్ కట్టలలో ***సెయింట్ థామస్ సువార్త, ఇవాంజిలిస్టు ఫిలిప్ సువార్త*** తదితరమైనవి వున్నాయి. అధికారిక గ్రంథాలలోని సారాంశాన్నే ఇవి పోలివున్నాయి. ఎస్సినెస్ శాఖకు చెందిన వ్రాత ప్రతులు కీర్బత్ కుమ్రాన్ (మృత సముద్రతీరం)లో దొరికాయి. ఇవి కూడా తొలినాటి క్రైస్తవం గురించి మరింత సమాచారాన్ని యిస్తున్నాయి. రోమ్‌లోనూ జెరూసలెం సమీపంలోనూ మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి.

ఇవన్నీ క్రైస్తవ మత ఆధారాలు. విగ్రహారాధకులైన (Pagans) రచయితల నుండి పొందిన సమాచారం మేరకు ప్రత్యేకించి తొలి దశకు సంబంధించిన యీ ఆధారాలు

అరుదైనవి, సందేహాస్పదమైనవి. నాల్గవ శతాబ్ది ప్రథమంలో క్రైస్తవం విజయం సాధించిన తరువాత సువార్త కథలను విశ్వసనీయమైనవిగా రూపొందించే క్రమంలో పూర్వ రచయితల రచనలలో చర్చి రచయితలు ప్రక్షిప్తాలను చేర్చారు. అప్పటి రోజులలో యీ రకమైన సాహిత్య ఫోర్జరీల పట్ల ఆగ్రహాన్ని చూపేవారు కాదు. కొన్ని ప్రక్షిప్తాలు మొరటుగా వున్నందున తక్షణమే వాటిని గుర్తించగలుగుతాము. మరికొన్ని సానలు దీరి వున్నందున వేరుపరచడం కష్టమవుతుంది. కనుక తొలి క్రైస్తవాన్ని గురించి క్రైస్తవేతర సమాచారమూ ప్రత్యేకించి దీని వ్యవస్థాపకుడిగా చెప్తున్న వారి గురించిన సమస్య పూర్తి క్లిష్ట రూపం దాల్చింది.

తొలి కాలపు విగ్రహారాధకుల సమాచారం క్రీ.శ. 64కు చెందినది. అయితే దీనిని చాలా కాలం తరువాత టాసిటస్ కైపీయతులలో నమోదు చేయడం జరిగింది. (రెండవ శతాబ్ది ప్రారంభంలో) రోమ్‌ను తగుల బెట్టారన్న నిందారోపణలతో క్రైస్తవులను నీరో చక్రవర్తి కిరాతకంగా వధించటాన్ని టాసిటస్ వర్ణించాడు. ఈ గ్రంథంలో యీ వాక్యం వున్నది. "ఎవరిలోనైతే యీ పేరు (క్రైస్తవం –అను) తన మూలాన్ని కలిగివుందో ఆ క్రిస్టస్, టైబిరియస్ పాలనా కాలంలో న్యాయమూర్తి పోంటియాస్ పిలాతు చేతుల్లో దారుణ శిక్షకు లోనయ్యాడు. అమిత హానికరమైన మూఢ విశ్వాసం అప్పటికలా ఆగింది. అయితే యిది మరోసారి సైతానుకు మూలస్థానమైన యూదయలోనేకాక ప్రపంచమంతటా గోప్యమైనవిగా, లజ్జాకరమైనవిగా భావిస్తున్న చేష్టలకు కేంద్రంగా వున్న రోమ్‌లో సైతం ప్రచారాన్ని పొందాయి."

ఈ మాటలను పరిశోధకులు భిన్న రీతులలో వ్యాఖ్యానించారు. తదనంతర కాలంలో క్రైస్తవ సంకలన కర్త చేర్చిన ప్రక్షిప్తంగా కొందరు దీనిని విశ్వసిస్తారు. కేవలం ఒక చిన్న ప్రాంతానికి అధికారి అయిన పిలాతు గురించి టాసిటస్ అంతకుముందు పేర్కొనలేదు. కనుక హఠాత్తుగా అతని గురించి యిక్కడ పేర్కొన్నాడనడం పొసగదని యీ వాదన చేసేవారు చెపుతారు. కొత్త మతం గురించి అగౌరవంగా మాట్లాడటానికి క్రైస్తవ సంకలన కర్త టాసిటస్ కాదుగదా అని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

యూదుల ప్రాచీనత గురించి జోసిపస్ ఫ్లవియస్ యిచ్చిన సమాచారం మరొక ఆకరంగా వున్నది. పిలాతు పాలస్తీనాలో వున్న తరుణంలో ఏసు బోధలు, ఆయనను సిలువ వేయటం, పునరుత్థానం గురించి యిది వర్ణిస్తున్నది. "ఇది జీసస్ గురించి చెప్పాల్సిన సమయం. ఆయన జ్ఞాని, ఆయనను మానవునిగా పిలవడం న్యాయ సమ్మతమే అయితే అద్భుతకార్యాలు సాధించిన వ్యక్తి అతను.... ఆయనే క్రీస్తు...." మొరటుగా వున్న యీ భాగాన్ని ఎవరో క్రైస్తవ రచయిత చేర్చినట్లుగా వున్నది. ఫ్లవియస్ శైలితో ఏ మాత్రం పోలికలేదు. ఏ పరిశోధకుడినైనా మోసగించడం సాధ్యంకాదు. ఇది ఫోర్జరీ అని ఎవరైనా అంగీకరిస్తారు. అయితే యిదే సమయంలో "ఆయనే క్రీస్తు" వంటి విడి పదాలను ఫ్లవియస్ గ్రంథానికి చేర్చి వుంటారని కొంతమంది భావిస్తున్నారు. ఎందుకంటే అసలైన గ్రంథంలో జీసస్ ప్రస్తావన వున్నది. అయితే కొంత విభిన్నంగా..... ఒక బోధకుని రోమన్ అధికారులు సిలువ వేసినట్లు వుంది. ఈ గ్రంథం యొక్క అరబ్బీ అనువాదాన్ని ఆసరా చేసుకొని యీ

వాదనను కొంతమంది సమర్థిస్తున్నారు. దీనిలో సిలువ ఎక్కిన జీసస్‌ను దైవంగానూ, మహిమ గల వ్యక్తిగానూ వర్ణించలేదు.

క్రైస్తవేతర ఆధారాలలో క్రైస్తవులకు సంబంధించి మొట్ట మొదటిగా నమ్మశక్యమైన సమాచారం ప్లిని ఉత్తర ప్రత్యుత్తరాలలో లభిస్తున్నది. బితునియా (ఆసియా మైనర్) ప్రాంతపు అధికారియైన ప్లిని రమారమి క్రీ.శ. 113లో చక్రవర్తి ట్రాజన్‌కు ఒక లేఖ రాస్తూ నేరస్థ సంఘంలో సభ్యులుగా వున్న క్రైస్తవులను ఏమి చేయాలి అని అడగడం జరిగింది. నేరాలకు పాల్పడినందుకు లేదా ఆ సంఘానికి చెందినందుకు వారిని శిక్షించాలా లేదా అన్న సంగతిని తెలియజేయాలని ఆ లేఖలో కోరాడు. మధ్యే మార్గాన్ని అనుసరించాలని, తమ విశ్వాసాన్ని విడువని వారిని మాత్రమే శిక్షించాలని ప్లినీని ఆదేశిస్తూ ట్రాజన్ సమాధానమిచ్చాడు. ట్రాజన్‌తో ప్లినీ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను బట్టి రెండవ శతాబ్దం ప్రారంభంలో ఆసియా మైనర్‌లో అప్పటికే చాలా మంది క్రైస్తవులున్నట్లు తెలుస్తున్నది.

జీసస్ బెన్ – పండిర (పండిర కుమారుడు) అనే బోధకుడిని ఉరితీసినట్లు తాల్ముడ్ పేర్కొంటున్నది. అయితే ఇతనితో బైబిల్ జీసస్‌కు వున్న సంబంధమేమిటో స్పష్టపడలేదు.

క్రైస్తవుల గురించిన విగ్రహారాధకుల సమాచారంలో ఎక్కువ భాగం రెండవ శతాబ్దపు ఉత్తరార్ధానికి చెందినదిగా కన్పిస్తున్నది. ఈ సమాచారాన్ని అందించిన వారు మార్కస్ అరిలియస్ చక్రవర్తి. ప్రాచ్యంలో లూసి యునస్ సయోసటిన్సెస్ ఆసియా మైనర్‌లోని క్రైస్తవ సమాజాలలోని దిన చర్య పెరిగ్రినుస్ అన్న వ్యంగ్య కథ రాసిన వ్యక్తి ఇతడు.

తొలినాటి క్రైస్తవం గురించి విగ్రహారాధక రచయితల సాక్ష్యాధారాలు అరుదైనవి. నమ్మశక్యం కానివని యీ సమీక్ష ద్వారా తెలుస్తున్నది. మత స్థాపకుడైన ఏసుక్రీస్తు గురించి ప్రధానంగా యీ రచయితలు ఏమీ రాయలేదు. ఆయన గురించి క్రైస్తవ లేదా యితర ఆధారాలలో వివాద రహితమైనది ఏదీ లేదు.

***జీసస్ చారిత్రక వ్యక్తేనా*** అని యీనాటికీ పరిశోధకులు వాదోపవాదాలు చేస్తున్నారు. చారిత్రక వ్యక్తి అని చెప్పేవారు. ఆయన వున్నాడని, పురాణ పురుషుడని చెప్పేవారు ఆయన లేడని వాదిస్తున్నారు. ఈ అంశంపై మార్క్సిస్టు పరిశోధకులు కూడా విభిన్నమైన అభిప్రాయాలను కలిగి వున్నారు. దీనికి తోడు జీసస్ జీవితకాలంగా చెప్తున్న సమయంలో వెలువడిన రచనలలో ఆయన గురించిన ప్రస్తావన లేదు. చారిత్రిక వ్యక్తి కాదనడానికి ఈ అంశాన్ని బలంగా ముందు తెస్తున్నారు. మానవాతీత జీవి నుండి ప్రకటన గ్రంథం పేర్కొన్న అమాయక గొర్రె పిల్ల నుండి భూమిపై బోధించి సిలువ ఎక్కిన బైబిలు జీసస్ వరకు క్రీస్తు రూపం క్రమ క్రమేణా రూపొందినట్లు తొలినాటి క్రైస్తవ రచనలను కాలక్రమంలో వుంచి చూస్తే తెలుస్తుంది. ఈ క్రమ పరిణామం క్రైస్తవ విశ్వాసాల అభివృద్ధితో ముడిపడి వున్నది.

పురావస్తు త్రవ్వకాలలో దొరికిన విగ్రహాలు మరిన్ని సాక్ష్యాలు యిస్తున్నాయి. తొలినాటి క్రైస్తవ కళారూపాలలో సిలువ వేసిన జీసస్ రూపం కనిపించదు. ఈ రూపం ఎనిమిదవ శతాబ్దికి ముందు కనిపించదు.

జీసస్ చారిత్రిక వ్యక్తా కాదా అని నిర్ధారించడం ఆవశ్యకతగా మార్క్సిస్టులు

భావించరు. క్రైస్తవ బోధల మూలాలను వ్యక్తుల కార్యకలాపాలలో – వారెవరైనప్పటికీ చూడాలని కోరరు. అయితే ఆనాటి సామాజికార్థిక పరిస్థితులలోనూ ఆ పరిస్థితులను అభివృద్ధి పరచిన భావాల ఘర్షణలోనూ చూడవలసి వున్నది. బైబిలులోని ఏసుక్రీస్తు రూపం ఎవరో ఒక చారిత్రిక వ్యక్తికి ప్రతిరూపం కాదు. సుదీర్ఘకాల సైద్ధాంతిక పోరాటంలో సమిష్టి సృష్టియైన విభిన్న లక్షణాలు గల సంపూర్ణ సాహిత్య కల్పిత వ్యక్తి. మొదటి శతాబ్దంలో జీసస్ అనే పేరుగల బోధకుడు పాలస్తీనాలో జీవించి, మరణించాడా లేదా అన్న విషయం మార్క్సిస్టు పరిశోధకులకు అంత ముఖ్యంకాదు.

***క్రైస్తవం పుట్టుక – చారిత్రక పరిస్థితులు*** అన్న అంశంపై కచ్చితమైన శాస్త్రీయ అధ్యయనం జరిపిన తొలి వ్యక్తి ఫ్రెడరిక్ ఎంగెల్స్. రోమన్ సామ్రాజ్య స్థాపన అత్యంత ప్రధానమైన అంశమని ఆయన పేర్కొంటారు. ప్రపంచ అధికార పీఠం యొక్క సృష్టి యీ మతానికి దారి తీసింది. రోమన్ల విజయంతో స్వతంత్ర రాజ్యాలు ఓటమి పొందాయి. దాని నిరంకుశ, హింసాపూరిత పాలన, అది సాగించిన అణచివేత, అధిక పన్నులు, మానవ హక్కులు మృగ్యం కావడం యివన్నీ ప్రజలలో నైరాశ్యానికీ, అనైతికతకూ దారితీశాయి. ఈ స్థితి బానిసలలోనే కాకుండా స్వేచ్ఛా పౌరులలోను ఏర్పడింది.

రోమ్‌కు చెందిన బానిసలు, అణగారిన ప్రజలు సాగించిన విఫల తిరుగుబాట్లు యీ నైరాశ్యాన్ని, అనైతికతనూ, గందరగోళాన్ని మరింతగా పెంచాయి. స్వతంత్ర రాజ్యాలలో సాయుధ ప్రతిఘటనలు, బానిసల తిరుగుబాట్లు విఫలం కావటంతో అణగారిన ప్రజలు మరింత నిరాశకూ, నిస్పృహకు లోను కాజొచ్చారు.

సమాజంలోని అన్ని వర్గాలలోనూ, అన్ని తరగతులలోనూ యీ స్థితి వ్యాపించిందని ఎంగెల్స్ నొక్కి చెపుతాడు. ఎందుకంటే యీ దుస్థితి నుండి విముక్తి లేదని ప్రజలందరూ భావించారు. "... బ్రహ్మాండమైన రోమన్ ప్రపంచాధిపత్యానికి వ్యతిరేకంగా స్వతంత్రమైన చిన్న చిన్న తెగలు, పట్టణాలు చేసే తిరుగుబాట్లు నిష్ఫలమయ్యేవి. బయటపడే మార్గం ఎక్కడ వుంది. బానిసలకూ, అణగారిన జీవులకూ, దారిద్ర్య పీడితులకూ విముక్తి ఎక్కడ. ఉమ్మడియైన లేదా పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలతో కూడిన యీ విభిన్న ప్రజా బృందాలకు సమిష్టి విముక్తి మార్గం ఎక్కడ?

"ఒక మార్గం దొరికింది, అయితే యీ ప్రపంచంలోకాదు" అని ఎంగెల్స్ రాశాడు.

భూలోకంలోని అణచివేత నుండి విముక్తినీ, స్వేచ్ఛనూ కనలేని ప్రజలు అనివార్యంగా స్వర్గంలో విముక్తినీ, స్వేచ్ఛనూ ఆశించారు.

అయితే కొత్త మతం యొక్క అవసరం ఎందుకొచ్చింది? పాత మతాలలోనే ప్రజలు ఎందుకని ఓదార్పు పొందలేకపోయారు?

పాత మతాలు తెగలకు, జాతులకు చెందినవి. అవి తమ జాతీయ సరిహద్దులను దాటి అవతలకు వెళ్ళలేకపోయాయి. దీనికి తోడు ఈ మతాలు ఎక్కడైతే అభివృద్ధి చెందాయో ఆ రాజ్యాలు ధ్వంసం కావడంతో వాటి పునాదులు కదిలిపోయాయి. సంకుచితమైన జాతీయ పరిస్థితులతో ముడివడని మరింత ఉదారవాద మతం యొక్క ఆవశ్యకత తలయెత్తింది.

రోమన్ సామ్రాజ్యంలోని బహుళ తెగలకు చెందిన అణగారిన ప్రజల అవసరాలను సంతృప్తిపరచేదిగా ఆ మతం వుండగలగాలి.

రోమన్ సామ్రాజ్య పాలకులు ప్రపంచ మత సృష్టికి ప్రయత్నించారు. ఉదాహరణకు సామ్రాజ్యమంతటా అధికారిక పూజా విధానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించారు. దీనితో పాటు భిన్నత్వం కలిగిన అనేక స్థానిక మతాచార విధులతోపాటు అన్ని ప్రాంతాల వారు ఆచరించి తీరవలసిన పూజా పద్ధతిని ఏర్పాటు చేయడానికి రోమన్ ప్రభుత్వం ప్రయత్నించింది. చక్రవర్తిని ప్రార్థించటం, రోమా దేవత (రోమ్ నగర సంరక్షకుడు) ప్రార్థన, జూపిటర్ కాపిటీలియస్ పూజా విధానం ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే యీ రకమైన అధికార మతాచార విధులు అణగారిన ప్రజలకు ఓదార్పును అందించలేక పోయాయి.

కొన్ని మత సిద్ధాంతాలు ప్రజలను ప్రభావితం చేయటంలో అద్భుత విజయాలు సాధించాయి. రోమన్ సామ్రాజ్య కాలంలో కొన్ని ప్రాచ్య మతాచార విధులు వ్యాప్తి చెందాయి. ప్రపంచ మతాచార విధులతో యివి పోలి వున్నవి. సామ్రాజ్యంలోని పశ్చిమార్థంలో ఐసిస్‌ను పూజించటం బాగా వ్యాప్తి చెందింది. రోమ్‌లోనూ, యితర ప్రాంతాలలోనూ భక్తులు ఏర్పడ్డారు. ప్రత్యేకించి రోమన్ సైన్యంలో ఇరానియన్ మిత్ర పూజా విధానం బాగా వ్యాప్తి చెందింది.

అయినప్పటికీ కచ్చితమైన అర్థంలో చెప్పాలంటే యీ సంప్రదాయాలేవీ ప్రపంచ మతంగా మారలేదు.

రోమన్ సామ్రాజ్యంలోని పలు తెగల, పలు భాషల ప్రజానీకాన్ని విభజించడం కాక సమైక్యం చేసిన ఒకే మతం ఆ పాత్రను నిర్వహించింది.

మత ఓదార్పును, అవసరాన్ని ప్రాయికంగా కోరుకున్న బానిసలు, అణగారిన ప్రజలు కొత్త మతం కోసం ఎదురుచూశారు. ప్రాచీన ప్రపంచానికి చెందిన ఏ మతమూ బానిసలకు, అణగారిన ప్రజలకూ ఓదార్పునివ్వలేదు. ఎందుకంటే అవన్నీ ప్రభుత్వ పోషణలో వున్నవి. స్వభావరీత్యా ప్రభువర్గానికి చెందినవి. జానపదుల మతాచారాలు వున్నమాట వాస్తవం. అయితే అవి బానిసల కొరకు వున్నవికావు. వాటిలో ప్రతి ఒకటీ స్థానిక స్థితిగతులతో సన్నిహితంగా ముడిపడి వున్నవి. బానిసలు, దిగువ వర్గాలలోకి చేరిపోయిన ప్రజలు తమ స్వీయ తెగల వాతావరణం నుంచీ, తమ సోదర ప్రజానీకం నుంచీ వేరుపడ్డారు. ప్రాచీన జాతీయ మతాల అవసరం వారికెంతో కాలం లేకపోయింది.

బానిస – యజమాని సమాజంలోని సంక్షోభం సామాజిక చైతన్యంలో కొత్త ధోరణులను రేకెత్తించింది. పేదరికం, బానిసత్వం, శరీరకష్టం పట్ల తిరస్కార భావం కలిగిన ప్రభువర్గాల భావజాలంతో పాటుగానే ప్రాథమికంగా వేరైన నూతన భావాలు సామ్రాజ్యం ఏర్పడిన తొలి దశలో అభివృద్ధి చెందాయి. ఈ నూతన భావాలు 'అల్పజీవి'కి గౌరవాన్నిచ్చి బానిసనూ అతడి మానవ ఔన్నత్యంతో సహా అతడి కనీస అవసరాలనూ, ప్రయోజనాలనూ పట్టించుకొన్నాయి. ఈ నూతన దృక్పథం పత్రికలలోనూ, యితర శాసనాలలోనూ, పుస్తక

రచనలలోనూ కనపడుతుంది.

ఆ రకంగా తొలినాటి క్రైస్తవం బానిసల, అణగారిన ప్రజల మతంగా వున్నది.

***యూదుల విభిన్న విశ్వాసాల*** నుండి యీ నూతన మతం అభివృద్ధి చెందింది. ఒకటి రెండు శతాబ్దాలలో పాలస్తీనాలోనూ యింకా యితర చోట్ల యూదుల మతంలో అనేక శాఖలుండేవి. రక్షకుడైన మెస్సయ్య రానున్నాడన్న నమ్మకంపై ఆధారపడిన విశ్వాసంతో వాటిల్లో కొన్ని వుండేవి. విదేశీ ఆధిపత్యం (గ్రీస్ - సిరియన్, రోమన్) కారణంగా యితరులకన్నా ఎక్కువగా ఇబ్బందుల నెదుర్కొన్న యూదుల మతంలో ప్రత్యేకించి కొన్ని శాఖలలో యీ విశ్వాసం కీలకమైన అంశంగా వుండేది.

యూదుల మతంలోని కొన్ని ధోరణులకు చెందిన వారు, ఉదాహరణకు జెలోతీయులు, ఖడ్గాన్ని ధరించిన వీర పురుషుడు మెస్సయ్య రోమన్ పాలకుల నుంచి ప్రజలకు విముక్తి కల్గిస్తాడని విశ్వసించే వారు. ప్రత్యేకించి మొదటి యూదుల యుద్ధంలోనూ, రెండవ యూదుల తిరుగుబాటులోనూ యీ నమ్మకం ఎక్కువగా పెరిగింది. ఏది ఏమైనప్పటికీ యీ మొదటి, రెండవ తిరుగుబాట్ల పరాజయం మరొక ధోరణికి దారితీసింది. ఆధ్యాత్మిక మెస్సయ్య వస్తాడన్న విశ్వాసం ప్రబలింది. పాలస్తీనాలోని ప్రత్యేక ప్రాంతాలలోని విశ్వాసుల మఠంలో నివసించే వారి బోధలలోని సారాంశమిదే. వారు ఆశ్రమ జీవనం గడుపుతూ బ్రహ్మచర్యాన్ని, సాంఘిక యాజమాన్యాన్ని బోధిస్తూ, బానిసత్వాన్ని అనుమతించే వారుకాదు. మెస్సయ్యను న్యాయ బోధకునిగా వారు భావించేవారు. మిగిలిన అంశాలలో యూదు సూత్రాలకే వారు కట్టుబడేవారు.

క్రైస్తవం పుట్టుకతో సన్నిహితంగా ముడివడిన నజరేయుల శాఖ గురించి ఎక్కువగా తెలియడంలేదు. తాత్కాలికంగా లేదా తమ యావజ్జీవితాలనూ భగవంతునికి అంకితం చేసిన వారిగా నజరేయులను ప్రాచీన కాలం నుండి యూదులు పిలిచేవారు. ఈ శాఖకు చెందిన వారు తమ జుట్టును కత్తిరించుకునేవారు కాదు. మధుపానం చేసేవారుకాదు. మృతదేహాలను తాకేవారు కాదు. యింకా ఇలాంటి ఆచారాలే వుండేవి. జీసస్‌ను సువార్తలలో నజరేయునిగానే చిత్రించారు. నజరేయుడు అనే మాట తరుచుగా సువార్తలలో జీసస్‌కు మరోపేరుగా వాడారు. ఈ పేరును గురించి వివరించేటందుకై నజరేతు నుండి జీసస్ రావటం గురించిన గాథను తరువాత సృష్టించారని కొందరు నమ్ముతారు. ఆయన అనుచరులను కూడా తరుచుగా నజరేయులనే పిలిచారు. ఉదాహరణకు అపొస్తలుడైన పౌలును "నజరేయుల మత భేదమునకు నాయకుడని" (అపొస్తలుల కార్యములు 24-5) నిందించడం జరిగింది. ఖురాన్‌లో ఏసుక్రీస్తు అనుచరులను నజరేయులని పదే పదే ప్రస్తావించడం జరిగింది. జీసస్ అనుచరుల మతాచార శాఖకు బహుశా అసలైన పేరు యిదే కావచ్చు.

ఆయన సహచరులు తరచుగా తమను తాము "విశ్వాసులు", సహోదరులు అని చెప్పుకున్నారు. ప్రారంభంలో వారి వ్యతిరేకులు మాత్రమే వారిని క్రైస్తవులని పిలిచేవారు. దీనినొక నిందా వాక్యంగానే ఉపయోగించేవారు. రెండవ శతాబ్దం ఉత్తరార్ధం నుంచే యీ

విశ్వాసులు తమను తాము క్రైస్తవులని పిలుచుకున్నారు.

క్రైస్తవం యొక్క సామాజిక, జాతి మూలాలను కూడా మరింత చక్కగా నిశ్చయించగలము. మొట్ట మొదటిగా యిది పాలస్తీనాలో కాక ప్రవాస ప్రాంతంలో ఆవిర్భవించింది. క్రైస్తవ సాహిత్యాన్నిబట్టి యిది స్పష్టమవుతున్నది. ఇది పాలస్తీనాలో రాసినదికాదు. దీని రచయితలకు పాలస్తీనా గురించి స్వల్పంగానే తెలుసు ప్రవాసంలో వున్న యూదులకు గ్రీకు తత్వశాస్త్రంతోనూ విగ్రహారాధకులైన ప్రజల శాఖలతోనూ పరిచయముంది. యూదుల మతం సంకుచిత జాతీయ పరిమిత హద్దులను దాటి ప్రపంచమతంగా మార్పిడి చెందే పరిస్థితులు ప్రాప్తించాయి.

బ్రూనో బాయర్ యొక్క సరియైన అంచనాను ఉదహరిస్తూ తదనంతర గ్రీకు తత్వశాస్త్రంతో ప్రగాఢంగా ప్రభావితుడైన అలెగ్జాండ్రియాకు చెందిన యూదు తాత్వికుడు ఫైలో క్రైస్తవ మూల పురుషుడని ఎంగెల్స్ పేర్కొంటాడు. యూదుల జాతీయ స్ఫూర్తి, స్వచ్ఛమైన గ్రీకు సంప్రదాయ విద్యల యొక్క సమ్మేళనం ఫైలో. మానవుని సృష్టి. పతనం వంటి వాటి గురించిన బైబిల్ గాథలను దృష్టాంతాలుగా ఆయన వ్యాఖ్యానించారు. యూదు మతానికి ఆయన గట్టిగా కట్టుబడ్డాడు. భగవంతుడొక్కడే అన్న భావాన్ని నమ్మాడు. అయితే భగవంతునికీ, భౌతిక ప్రపంచానికీ మధ్య పవిత్రమైన మధ్యవర్తి దైవ వాక్యము ఉన్నట్లు కూడా ఆయన నమ్మాడు. గ్రీకు భావవాద తత్వశాస్త్రంలో యిది సాధారణమైన భావన. దైవవాక్యము, దేవుని కుమారుడు అనేవి క్రైస్తవంలో కేంద్ర స్థానంగా మారాయి. అంటే ఏసుక్రీస్తు అన్నమాట.

సమరశీలత గల్గిన యూదు మత స్ఫూర్తిని నింపుకొని తదనంతర క్రైస్తవ సాహిత్యంతో తీవ్ర వైరుధ్యం గలిగిన మొట్ట మొదటి క్రైస్తవ రచన అయిన ప్రకటన గ్రంథాన్ని పరిశీలించినట్లయితే యూదు శాఖల్లోని ఒకదాని నుంచి క్రైస్తవం ఆవిర్భవించిందని స్పష్టమౌతుంది. మౌలికమైన క్రైస్తవ సిద్ధాంతమేదీ యిందులోలేదు. ప్రకటన గ్రంథములో భగవంతుని గురించి, పవిత్రాత్మ గురించి అదే విధంగా తదనంతర క్రైస్తవ ధర్మాలైన సహనము, వినయము, క్షమ గురించి ఏమీ చెప్పలేదు. తద్విరుద్ధంగా యూదు ప్రజలను అణచివేసిన వారిపట్ల విద్వేషాన్ని ప్రకటిస్తుంది. అంతేకాక తదనంతర క్రైస్తవ సాహిత్యంలోని విశ్వజనీనత ప్రకటన గ్రంథంలో వ్యక్తంకాలేదు.

తదనంతర క్రైస్తవం అనేక యూదు లక్షణాలను పదిలపరచుకున్నది. మత స్థాపకుడైన ఏసుక్రీస్తు యూదుగా వర్ణితమయ్యాడు. బైబిల్ ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతం యూదుల దేశమైన పాలస్తీనా. బైబిల్‌లోని అన్ని పాత్రలు యూదులవే. యూదుల పవిత్ర గ్రంథమైన బైబిల్‌ను క్రైస్తవ సాహిత్యంలో చేర్చారు. దీనిని దేవుని ప్రేరణగా చెప్పారు. యూదుల దేవుడైన యాహ్వేను తండ్రిగా (దేవుడు) క్రైస్తవం స్వీకరించింది. యూదు మతంలోని మూల సిద్ధాంతాలు అంటే ప్రపంచాన్ని, మానవుని భగవంతుడు సృష్టించిన విధము, క్రైస్తవ సిద్ధాంతంలో భాగమైంది. యూదుల వ్యక్తిగత మత విధులు క్రైస్తవ మతాచార విధిలో చేరాయి. ప్రధానంగా ***ఈస్టర్, సబ్బాతు పండగ, సున్నతి*** ఆచారంతో సహా కొన్ని

యూదుల ఆచారాలను చాలా కాలం వరకు క్రైస్తవ సమాజాలు పాటించాయి. సున్నతి ఆచారం తొలుత క్రైస్తవుల నిత్యకృత్యంగా వుండి క్రమేణా తొలగిపోయింది.

ఆ రకంగా కచ్చితమైన అర్థంలో చెప్పాలంటే క్రైస్తవం అభివృద్ధియొక్క తొలి దశ యూదుల శాఖలలో ఒకటిగా మాత్రమే వున్నది. అయితే మొదటి శతాబ్దం చివరిలో ***యూదులకు సంబంధంలేని అంశాలను క్రైస్తవ సమాజాలు స్వీకరించాయి.*** స్థానిక మతాచారాలలో వివిధ ధోరణులు పెరగడానికి అవకాశం ఏర్పడింది. యూదు మతంలోని మెస్సయ్య భావనకు ఇవి దగ్గరగా వున్నాయి. ప్రాచ్య మతాచారాలలో సంరక్షక దేవుళ్ళ పూజలున్నాయి. ఈ పూజా విధానం ప్రత్యేకించి అణగారిన వర్గాలలో విస్తృతంగా వ్యాప్తి చెందింది.

ఈజిప్టు, బాబిలోనియా, సిరియాలలోనూ తదనంతర కాలంలో గ్రీస్‌లోనూ సంరక్షక దేవుళ్ళకు చెందిన అనేక మత పూజలు మనకు తెలుసు. ఒసిరిస్, టమ్మూజ్, అడొనిస్, అట్టిస్, డియోనిసస్‌లు సంరక్షక దేవతలుగా వున్నారు. వీరు ప్రకృతి దేవతలుగా కూడా వున్నారు. **తరుగుల్మలతాదులకు** వీరు భావాత్మక రూపము. అయినప్పటికీ ప్రజలలో వీరికి ప్రత్యేక గౌరవముండేది. రక్షణ కొరకు వీరికి మొరపెట్టుకునేవారు. ఈ దేవుళ్ళతో ముడివడిన వ్యవసాయ కార్యకలాపాలలో ఏమాత్రం ఆసక్తిలేని పట్టణ పౌరులలో కూడా వీరు బహుళవ్యాప్తి నొందారు.

ప్రాచీన, ప్రాచ్య రాజ్యాలు పతనమౌతున్న దశలో అక్కడ వివిధ మత విశ్వాసాలు తలెత్తాయి. తెగల, జాతుల సరిహద్దులనతిక్రమించిన మతాలకు బీజాలు పడ్డాయి. ఈ మత సమాజ సభ్యులు ఒక జాతికీ, ఒక మతానికీ చెందిన వారుకాదు. కాని ఒకే విశ్వాసం కలిగినవారు. స్వచ్ఛందంగా మతంలో కలసినవారు.

మరణానంతర జీవితానికి సంబంధించిన భావాలతో వీరి విశ్వాసాలు ముడిపడి వున్నాయనేది ప్రధానమైన విషయం. ఈ బృందాలలో కలవడం వల్ల మరణానంతరం ఉత్తమ జీవితం లభించేదన్న హామీ లభ్యమయ్యేది. ఆత్మరక్షణ గురించిన బోధనలు తప్ప యివి మరేమీకావు. ఈరకమైన మతాచార విధులు హెలెనిజంపై ఆధారపడి యూదు మతంలో అభివృద్ధి చెందిన మెస్సయ్య భావనను, రక్షణ గురించిన బోధనలను ప్రచలితం చేశాయి.

తొలినాటి క్రైస్తవ సమాజాలలో విగ్రహారాధక, యూదుయేతర మతాచార విధులనూ, యితరేతర అంశాలనూ చేర్చడం వల్ల క్రైస్తవ సిద్ధాంతాలలోనూ, ధర్మాలలోనూ చెప్పుకోదగిన మార్పులు సంభవించాయి. విగ్రహారాధకుల మతాచార విధుల నుండి స్వీకరించిన భావాలను క్రైస్తవం అభివృద్ధి చేసింది.

భగవంతుని మరణ, పునరుత్థానాలకు సంబంధించిన క్రైస్తవ బోధలు ప్రాచ్య మతాచారాలలోని దేవుళ్ళ మరణాలనూ, పునరుత్థానాలను ప్రతిబింబించాయి. అట్టిస్ మరణ, పునరుత్థాన ఆచారాలు క్రైస్తవ ఈస్టర్ ఆచారంగా పునర్ వ్యక్తమయ్యాయి. ఈస్టర్‌కు చెందిన ప్రత్యేక ఆచారాలు సైతం అట్టిస్ మరణ పునరుత్థానాలకు సంబంధించిన ప్రాచీనమైన నిశా

పూజలకు ప్రతిరూపమే.

మిత్ర పూజా విధానం సైతం క్రైస్తవులను ప్రభావితమొనర్చింది. క్రీస్తు జన్మదినాన్ని డిసెంబర్ 25న జరుపుకొంటారు. ఈరోజున శీతాకాలం తొలగిపోవడం ప్రారంభిస్తుంది. దానిని మిత్ర జన్మదినంగా పాటించారు.

క్రైస్తవుల మేరీమాత పూజా విధానం ఈజిప్టువాసుల, ఐసిస్ పూజా విధానానికి ప్రతిరూపం. ఐసిస్ పూజా విధానంలో ఉద్రేక గుణమున్నందున అది ప్రపంచ పూజా విధానంగా మారే అవకాశం వున్నది. ఈ పూజా విధానాన్ని నిశ్శేషంగా రూపుమాపేటందుకుగాను స్త్రీ దేవత పూజా విధానాన్ని వాడుకలోకి తేవలసిన అవసరాన్ని క్రైస్తవులు గమనించారు. కనుకనే క్రైస్తవంలో మేరీమాత పూజా విధానం చొరబడింది. ప్రాచీన యూదు మతంలోగానీ నాల్గవ శతాబ్దం వరకూ క్రైస్తవంలో గానీ యీ రకమైన పూజా విధానం లేదు. అధికారిక ముద్రపడని కన్య మేరీ జీవిత చరిత్రలు పుట్టుకురావడం ప్రారంభమైంది. (మేరీ సువార్త. శైశవ సువార్త)

అనేకమైన అంశాలను ఈజిప్టు నుండి, యితర మతాల నుండి స్వీకరించటం జరిగింది.

ఉదాహరణకు సిలువను పూజించే సంప్రదాయం. ఈ సిలువకూ క్రీస్తుకు మరణశిక్షను అమలు జరిపిన సాధనానికి ఎలాంటి సంబంధమూ లేదు. వాస్తవానికి రోమన్లు సిలువ వేసి మరణశిక్ష అమలు జరిపేవారు. అయితే అది **T** అన్న అక్షరాన్ని పోలివుండేది. క్రైస్తవుల సిలువ పూర్తిగా ప్రాచీన మత చిహ్నం. ఈజిప్టు, క్రీట్ తదితర కళా రూపాలలో కన్పిస్తుంది. దీని మూలాన్ని కనిపెట్టడం కష్టం. అయితే సిలువ పట్ల భక్తి ప్రవత్తులకు, క్రీస్తును సిలువ వేసిన గాథకు ఎలాంటి సంబంధం లేదన్నది నిశ్చయం.*

ప్రాచీన క్రైస్తవ శ్మశానాలలో సిలువను పవిత్ర చిహ్నంగా వాడలేదు. గొర్రె, గొర్రె పిల్లను భుజంపై వేసుకున్న గొర్రెలకాపరి, చేప వంటి వాటిని వినియోగించారు. వివిధ రకాలైన సిలువలు తదనంతర కాలంలో మాత్రమే లభ్యమయ్యాయి. జీసస్‌కు సిలువ వేసినట్టు చెప్పే చిత్రాలు కేవలం ఎనిమిది, తొమ్మిది శతాబ్దాలలో మాత్రమే కన్పిస్తాయి.

కన్య మేరీకి పవిత్రాత్మ ద్వారా ఏసు క్రీస్తు జన్మించాడన్న భావన యూదు మతానికి సంబంధించినదికాదు. దేవునికీ మానవ స్త్రీకి మధ్య లైంగిక సంబంధ భావన ప్రాచీన, ప్రాచ్య మతాచార విధులలో విస్తృతంగా వ్యాపించివుంది. ఈ భావనకు మూలాలు ప్రాచీన

---

* సిలువ అనేది మత చిహ్నంగా దాదాపు అన్ని దేశాలలోనూ వున్నది. ప్రాచీన చైనా, ప్రాచీన భారతదేశం, ఆఫ్రికా, అమెరికాలలో యిది కన్పడుతున్నది. చివరకు ఆస్ట్రేలియన్లలో సైతం వనింగాల చిహ్నం కొన్ని సందర్భాలలో పెద్ద సిలువ రూపంలో తయారు చేసే వారు. సిలువకు సంబంధించిన మత ప్రాధాన్యత గురించి వివిధ రకాలైన ఊహాగానాలు వున్నాయి. కొంత మంది దీనిని అగ్నికి గుర్తుగా భావిస్తారు. (బహుశా నిప్పును రగల్చడానికి తొలుత కొయ్యను లాంఛనంగా వాడి వుంటారు). సూర్యుడు లేదా భూసారానికి చిహ్నంగా కొందరు వాడేవారు. స్వస్తిక్ (ఇది కూడా సిలువ రూపంలోనే ఉంటుంది) చిహ్నానికి వివిధ వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఉత్తర అమెరికన్ ఇండియన్లలో ప్రపంచపు నాలుగు దిక్కులు నాలుగు భూతాల పూజతో ముడిపడి వుంది.

విశ్వాసంలో వున్నాయి.

ఈ విధంగా క్రైస్తవంలో యూదు మతానికి చెందిన అంశాలు ప్రాచీన ప్రాచ్య మతాలలోని అంశాలు వున్నాయి.

తొలినాటి క్రైస్తవ సమాజాలలో స్థానిక మతానుయాయులు, ప్రాచ్య, గ్రీస్ –రోమన్ బృందాలు చేరటంతో యూదులకు, ***యూదుయేతర జనులకు మధ్య యీ సమాజాలలో పోరాటం తీవ్రతరమైంది.*** ఇది క్రమక్రమేణా క్రైస్తవం నుండి యూదు ఆచారాల తొలగింపుకు దారితీసింది. మొట్ట మొదటి క్రైస్తవ సాహిత్యాన్ని బట్టి తొలినాటి క్రైస్తవ సమాజాలలోని కొన్ని బృందాలలో యూదు వ్యతిరేక ధోరణులు తీవ్రంగా వుండేవని తెలుస్తున్నది.

ప్రాయికంగా యూదులను ఏసుక్రీస్తు శత్రువుగా సువార్త కథలు చిత్రిస్తున్నాయన్నది స్పష్టం. క్రీస్తు స్వయంగా యూదు అయినప్పటికీ మొత్తం మీద యూదులు క్రీస్తుకు శత్రువులు. ఆయన మరణానికి బాధ్యులైన దోషులు ప్రత్యేకించి పిలాతు ఉదంతం యీ దోషాన్ని నొక్కి చెపుతున్నది. చారిత్రక సత్యానికి విరుద్ధంగా (వాస్తవానికి పోంటియాస్ పిలాతు క్రూర స్వభావం గలిగిన చిన్నపాటి నియంత, మానవతా చర్యలకు సుముఖుడు కాదు) పిలాతును న్యాయ బుద్ధిగల, జాగ్రత్తగల న్యాయమూర్తిగా సువార్తలు వర్ణించాయి. అమాయకులను వధించటం పట్ల భయగ్రస్తుడుగా చూపటం జరిగింది. జీసస్ వధ గురించి పట్టుబట్ట వలదని యూదులకు నచ్చచెప్పేటందుకు ఆయన ప్రయత్నించాడు. ఈ వ్యవహారంతో తనకేమీ సంబంధంలేదని చెప్పేటందుకై ఆయన తన చేతులను నీటితో కడుగుకొంటాడు. జీసస్ వధకు రోమన్లది బాధ్యతలేదని నేరమంతా యూదులపై మోపటానికే యీ మొత్తం వుదంతాన్ని (విభిన్నమైన రీతిలో నాలుగు సువార్తలు పేర్కొన్నాయి) కల్పించారన్నది స్పష్టమే.

నాలుగు సువార్తలలోనూ యూదాను ద్రోహిగా చిత్రించటంలో కూడా లక్ష్యమిదే. పన్నెండు మంది అపొస్తలులలో యూదా ఒకడు. ముప్పై వెండి నాణెముల కోసం ఇతడు జీసస్ శత్రువులతో కలిసినట్లుగా వుంది. యూదా అన్న పేరు యూదు ప్రజలకు ప్రతీక. ఈ వ్యక్తి ద్వారా యూదులందరి మీద బురద జల్లాలని సువార్త రచయితలు ఆశించారు.

ఆ విధంగా యూదు, విగ్రహారాధకుల (యూదు వ్యతిరేకులతో సహా) ఆచార వ్యవహారాల కలగలుపును క్రైస్తవ సిద్ధాంతము, ఆచారాలు, సువార్తలు ప్రతిబింబిస్తున్నాయి.

అత్యంత ముఖ్యులైన యిరువురు అపొస్తలులు పేతురు (యూదు జాతీయుడైన శిష్యుడు), పౌలు (విగ్రహారాధకులకు చెందినవాడు, అలాగని తానే చెప్పుకొన్నాడు) బోధలకు, అభిప్రాయాలకు పై రెండు ధోరణులను ముడిపెట్టవచ్చు. వాస్తవానికి క్రైస్తవమనేది యీ యిరువురు వేటికైతే ప్రాతినిధ్యం వహిస్తున్నారో వాటి కలయిక.

వాస్తవానికి క్రైస్తవం ఒక మతంగా ఏర్పడటంలో కీలకమైన అంశం యూదు మతం నుంచి అది వేరుపడటం. అయితే యీ పరిణామం యూదు సంప్రదాయాల రక్షణకు దారితీసింది. సుదీర్ఘము, కష్టతరము అయిన పోరాటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమైంది.

ఒకటి, రెండు శతాబ్దాలలో క్రైస్తవ సమాజాలలోని యూదులకు (యూదు – క్రైస్తవులు), యూదు యేతర (అన్యజనులు) బృందాలకు మధ్య పోరాటం భీకర రూపం

దాల్చింది. ఈ పోరాట ప్రస్తావనలను తదనంతర క్రైస్తవ సాహిత్యం నుండి తొలగించినప్పటికీ చర్చి ఆమోదించిన గ్రంథాలలో దీని జాడలు కన్పిస్తాయి. మత్తయి (యూదు అని నిస్సంశయంగా భావిస్తున్న వ్యక్తి) చెప్పిన సువార్త పరస్పర విరుద్ధమైన యీ రెండు ధోరణులను కలిగి వున్నది. బోధనల నిమిత్తం పన్నెండు మంది అపొస్తలులను జీసస్ పంపిస్తున్నప్పుడు జీసస్ వారిని యిలా హెచ్చరిస్తాడు. "మీరు అన్యజనుల దారిలోకి వెళ్ళకుడి... ఇశ్రాయేలు వంశములోని నశించిన గొర్రెల వద్దకే వెళ్లుడి". అంటే యూదుల వద్దకు మాత్రమేనన్నమాట (మత్తయి 10, 5-6). ఇదే అభిప్రాయము దాదాపు యివే మాటలలో కనాను మహిళ వుదంతంలో పునరావృతమవుతుంది. ఆమెకు సహాయం చేయటానికి జీసస్ తిరస్కరిస్తాడు. ఎందుకంటే ఆయన "... ఇశ్రాయేలు యింటివారై నశించిన గొర్రెల వద్దకేగాని మరియొకరి వద్దకును నేను పంపబడలేదనెను". అంతేకాక యూదు యేతరులను ఆయన "కుక్కలు"గా వర్ణిస్తాడు (మత్తయి 15:24-26). అయితే యిదే సువార్తలో ఒక శతాధిపతికి (రోమన్) యూదులకన్నా ఎక్కువ ప్రాధాన్యతను జీసస్ యిస్తాడు (మత్తయి 8:10-13) ఈ సువార్త చివరిలో జీసస్ తన శిష్యులను "సమస్త జనులకు బోధించుటకు" పంపిస్తాడు (మత్తయి 28:19)

ఆదిమ క్రైస్తవం యూదుల, విగ్రహారాధకుల విశ్వాసాల కలయిక. అయితే క్రైస్తవంలో వున్న కొత్త భావాలను విస్మరించటం పొరపాటే అవుతుంది. ఎంగెల్స్ చెప్పినట్లుగా మతాభివృద్ధిలో క్రైస్తవం ఒక నూతన దశను సృష్టించింది.

క్రైస్తవంలో కొత్తదనమేమిటంటే **పాపాన్ని గూర్చిన భావన**. ఇదే భావానికి మరో కోణమేమిటంటే రక్షణ భావన. క్రైస్తవంలోని ముఖ్య భావన వాస్తవానికి 'పాపమును గూర్చినదని' ఎంగెల్స్ పదే పదే పేర్కొన్నాడు.

అసంఖ్యాక హృదయాలను స్పందింపచేసే తంత్రిని క్రైస్తవం పట్టుకొన్నది. కష్ట కాలం గురించి, అదే విధంగా సాధారణమైన, శారీరక, నైతిక హీనత గురించిన అన్ని సందేహాలకు పాపచింతనను గూర్చిన క్రైస్తవ సిద్ధాంతం సమాధానమిచ్చింది. అవును అదే మార్గం, యిది తప్ప మరొహటి లేదు. ప్రపంచ దుర్మార్గానికి నీవు నిందల పాలవుతావు, మీరందరూ నిందలకు గురవుతారు. నీవు, నీలోని దుర్మార్గము దీనిని కాదనేవారు ఎవరైనా ఎక్కడ వున్నారు.'

పాపమనే భావన నుండి ప్రధానమైన రెండు నిర్ధారణలు వెలువడ్డాయి. మొట్ట మొదటిదేమిటంటే దురదృష్టాలన్నింటికీ కారణం పాపమన్న భావన. సామాజిక చెడుగులతో నిజమైన పోరాటాన్ని గురించిన ఆలోచన నుండి యిది ప్రజావళిని దూరంగా నిలిపింది. తన మౌలిక ప్రయోజనాల కోసం పోరాడటం నుండి పాపం నుంచి విముక్తి చెందటం వైపుకు దృష్టిని మరల్చింది. రెండవదేమిటంటే యీ సిద్ధాంతం ఒక రకమైన మతపరమైన ఓదార్పును ప్రజలకు సమకూర్చింది. ఎందుకంటే యిది రక్షణ అన్న భావన నుండి వేరుపడలేదు. యావత్ప్రపంచము పాపంలో కూరుకుపోయింది. స్వాభావికంగా ప్రతి ఒక్కరూ పాపులే. ఈ పాప భావన ఆదాము పతనం నుండి పుట్టుకొచ్చింది. అయితే ఎవరో ఒకరు

మానవ జాతిని రక్షించగలరన్న ఆశవున్నది. కనుకనే రక్షకుడైన దేవుడు అన్న అభిప్రాయం చోటు చేసుకొన్నది.

ఈ భావన ఎంతమాత్రం కొత్తదికాదు. ప్రాచీన మతాలలో సంరక్షకులైన దేవతలు వున్నారు. ఆదిమ సమాజ సంస్కృతికి చెందిన కథానాయకుల కల్పనలో దాని మూలాలు వున్నాయి.

క్రైస్తవంలో రక్షణ అన్న భావన కేంద్రంగాను, అత్యంత ప్రధానంగాను మారింది. రక్షణ కల్పించే ఏసుక్రీస్తు క్రైస్తవమతంలో కీలకవ్యక్తిగా మారటానికి కారణమిదే.

ముందుగా పేర్కొన్నట్లుగా ఏసుక్రీస్తు యథార్థ భావన చాలా సంక్లిష్టమైనది ఏసు క్రీస్తు అనేది రెండు మాటలతో కూడుకొని వున్నప్పటికీ అది ఒకే పేరన్న ఆలోచనకు మనం అలవాటుపడ్డాం. ఒకే రకమైన భావనకు యీ పేరు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా భావిస్తున్నాము. రెండు విభిన్నమైన భావనలకు ప్రాతినిధ్యం వహించే రెండు భిన్నమైన పేరులను యిచ్చిన సువార్తలలో యిది సమస్యాత్మక విషయం కాదు. ఏసు అనేది గలిలయ బోధకుని పేరు. ఈయనను కొందరు గొప్ప బోధకునిగాను, మహిమాన్వితునిగాను భావిస్తే మరికొందరు దీనిని బూటకంగా భావిస్తారు.* క్రీస్తు అనేది యూదు పదమైన మెస్సయ్య అను దానికి గ్రీకు అనువాదము. సువార్తలలో దాదాపుగా రెండు పేరులను కలిపి (కథన భాగంలో ఎంత మాత్రంలేదు) వాడలేదు. క్రీస్తు పేరును అరుదుగా మాత్రమే వాడటం జరిగింది. సువార్త కథనం ప్రకారం ఎదురుచూస్తున్న క్రీస్తును లేదా మెస్సయ్యను తానేనని ఏసు ఎన్నడూ ఎవరితోనూ చెప్పలేదు. చివరికి ఆయన అనుంగ శిష్యులు సైతం తమ బోధకుడు క్రీస్తు అన్న విషయంలో నిర్దిష్టంగా లేరు. అయితే వారిలో ఒకరైన పేతురను సీమోను, "నేను ఎవరినని చెప్పుకొనుచున్నారు" అన్న ప్రశ్నకు "నీవు క్రీస్తువు" అని సమాధానమిస్తాడు. ఈ రకమైన జ్ఞానాన్ని కలిగి వున్నందుకుగాను భావి సంఘానికి అధినేతగా అతనిని వెనువెంటనే ఏసు నియమిస్తాడు. అయితే ఏసునైన తాను క్రీస్తునని ఎవరితోనూ చెప్పవద్దని తన శిష్యులను ఏసు గట్టిగా ఆదేశించాడు. ఏసుయే క్రీస్తని విశ్వసించటానికి ప్రజలు సిద్ధంగాలేరు. ఏసు గురించి వారిలా చెప్పుకొనేవారు. "అయినను యీయన ఎక్కడివాడో యెరుగుదుము. క్రీస్తు వచ్చునప్పుడు ఆయన ఎక్కడివాడో యెవరును యెరుగరని చెప్పుకొనిరి" (యెహాను 7:27), తదనంతరం విచారణ సందర్భంగా ప్రధాన యాజకులు "పరమాత్ముని కుమారుడివైన క్రీస్తువు నీవేనా" అని నేరుగా అడిగినప్పుడు దృఢ చిత్తంతో ఏసు ఇచ్చిన సమాధానాన్ని ఆయన దోషి అని నిర్ణయించడానికి సరిపడు సాక్ష్యంగా భావించారు. ఎందుకంటే తనకుతాను ఆయన క్రీస్తునని అంటే రక్షకుడనని చెప్పుకొన్నాడు. (మార్కు 14: 61-64 లూకా 22:65-71).

సువార్త కథల మొత్తం సారాంశం ఒక్కటే. ఎవరి ఘన కార్యాలైతే ఎక్కువగా

---

* ఏసు అనే పేరు (యూదుల ఎషువా) దేవునికేగాని వ్యక్తులకు వాడే వారు కాదని కొంత మంది పరిశోధకులు భావిస్తున్నారు. జీసస్ దేవుని పూజావిధి (పాత నిబంధనలో సూర్యుని నిలిపిన జీసస్ నవిన్ - నూనుకుమారుడైన యెహూషువా గాథ) చాలా కాలం పాటు పాలస్తీనాలో వున్నది.

ప్రచారమవుతున్నాయో ఆ గలిలయ బోధకుడైన ఏసుయే ఎదురు చూస్తున్న మెస్సయ్య, క్రీస్తు అని పాఠకుడికి నచ్చచెప్పటం.

ఈ విధంగా మెస్సయ్య గురించిన సువార్త బోధలు, తొలుదొల్తటి మెస్సయ భావనతోనూ, ప్రకటన గ్రంథంతోనూ విభేదిస్తాయి. ప్రకటన గ్రంథంలో మెస్సయ్య (క్రీస్తు)ను తనదని చెప్పుకొనేది లేని సాధుస్వభావియైన బోధకునిగా వర్ణించలేదు. భయం కలిగించే సార్వభౌమునిగా, న్యాయమూర్తిగా లేదా దేవుని గొర్రెపిల్లగా చెప్పారు.

ఏసుక్రీస్తు సంశ్లిష్ట స్వరూపాన్ని ప్రాతిపదికగా చేసుకొని తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం తల ఎత్తిందంటే అసహజమేమీకాదు. వివిధ తరహాలకు చెందిన తదనంతర శాఖలలో సాగిన పోరాటంలో, ఏసుక్రీస్తు మూలానికి సంబంధించిన విభిన్నాభిప్రాయాలు ప్రక్కదారిపట్టాయి. ఆ విధంగా పాపానికి  సంబంధించిన భావన, రక్షణ, విమోచనకు చెందిన భావన, అటు దేవుడూ, ఇటు మానవుడూ అయిన రక్షకుని భావన క్రైస్తవంలో ప్రధానాంశాలుగా  మారాయి.

ఈ రక్షణ భావాన్ని క్రైస్తవులు ఎలా వూహించారు? విమోచన లేదా త్యాగాల ద్వారా ఉగ్ర దేవతను శాంతింపచేయటం. ప్రాచీన మతాలన్నింటిలోనూ యీ భావన వున్నది. ఆ రకంగా యిది క్రైస్తవంలోని ప్రధాన భావనల్లో ఒకటిగా మారింది. ఆదాము నుండి వారసత్వంగా సంక్రమించిన సకల పాపాలు ఏసుక్రీస్తు స్వచ్ఛంద త్యాగం వల్ల స్వీయ మరణం వల్ల క్షమించబడ్డాయి. ఇది పాపం నుంచి మానవ జాతిని విముక్తి చేసింది. ఏసుక్రీస్తును విశ్వసించటానికీ, రక్షణ హామిని పొందేందుగాను ఆయన బోధనలను పాటించడానికీ యీ కారణం సరిపోతుంది.

ఎంగెల్స్ యీ విధంగా పేర్కొన్నాడు. "విశ్వాసుల దృష్టిలో క్రైస్తవం యొక్క మొట్ట మొదటి విప్లవాత్మకమూ (ఫైలో నుంచి అరువు తెచ్చుకొన్నది), మౌలికమూ అయిన భావన ఏమిటంటే మధ్యవర్తి ద్వారా ఒక్కసారి జరిగిన ఒక మహత్తర స్వచ్ఛంద త్యాగము సర్వకాలములలోని సమస్త మానవులను పాపముల నుండి విముక్తి చేయటం".

అప్పటి నుండి యితర త్యాగాలు అనవసరమనే నిర్ధారణ వెలువడింది. తొలినాటి క్రైస్తవ మత విధులలో సైతం మితిమీరిన త్యాగాలు, ఆచారాలు అదృశ్యం కావటాన్ని మనం  చూస్తాము.

ఏసుక్రీస్తు వేదనలు, మరణము, పునరుత్థానం గురించి వివిధములైన అభిప్రాయాలు వెలువడ్డాయి. కొన్ని యథార్థ ఘటనలకు ప్రతిబింబంగా సువార్త కథలను మనం భావించలేము. మత విశ్వాసాలను మార్చుకొన్న  కొందరిని వధించారనటం యథార్థమే. అయితే యిది చారిత్రక కథన రీతిలో తమ కథను చెప్పటానికి సువార్త రచయితలకు సహాయపడింది. మరోవైపు కాల్పనిక శాఖకు చెందిన వారు చెప్తున్నట్లుగా యీ ఘటనను దైవికమైన పురాణగాథగా నమ్మటానికి సిద్ధంగాలేము.

క్రీస్తు బాధలకు సంబంధించిన సువార్త కథను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం యీ కథ సాహిత్య కల్పన కాదని యిదొక నాటకమని తదనంతర కాలంలో దీనిని గ్రంథంలో

చేర్చారన్న సరికొత్త భావన కలుగుతుంది. ఏదో ఒక ఆచారానికి సంబంధించిన విషయాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా వుంటుంది. ఈ రూపకానికి సువార్త కథనం స్క్రిప్టులాగుంటుంది.

బోధలు, పునరుత్థానానికి సంబంధించిన యీ రకమైన నిగూఢ నాటకాలు ప్రాచీన ఈజిప్టు, గ్రీస్ (ఇలూసియన్ నిగూఢ రచనలు) అట్టిస్ సంప్రదాయంలోనూ వున్నాయి. క్రైస్తవ రచనలుకూడా దేవుని బోధలకూ పునరుత్థానానికీ ప్రతిరూపమని భావించే అవకాశమున్నది. క్రైస్తవ సాహిత్యాన్ని సృష్టిస్తున్న సమయంలో ఈ రూపక రచన పూర్తయి సువార్త గ్రంథంలో చేరి వుంటుంది. తదనంతర కాలంలో దీనిని అధికారిక చరిత్రగా ఆమోదించి వుంటారు.

క్రైస్తవం ఆవిర్భవించిన తొలి శతాబ్దాలను భీకర సైద్ధాంతిక పోరాటాల కాలంగా అభివర్ణించవచ్చు. విభిన్నమైన వర్గ ప్రయోజనాలను యీ పోరాటం ప్రతిబింబిస్తున్నది. ఈ పోరాట కాలంలోనే క్రమక్రమంగా చర్చి రూపొందింది. ఇతర మతాలతో జరిగే పోరాటంలో క్రైస్తవ విజయానికి యిది వెన్నుదన్నుగా నిలబడింది.

తొలినాటి క్రైస్తవ ఆధారాలలో చర్చి నిర్మాణం గురించిన సాక్ష్యాలు లభించడం లేదు. అపొస్తలులు, ప్రవక్తలు దేశాటన చేసే బోధకులుగా చిత్రితమయ్యారు. వివిధ సమాజాలలో వారు కొద్దికాలం పాటు వుండేవారు. అయితే కొద్ది రోజులకన్నా ఎక్కువగా వుండేవారుకాదు. రెండవ శతాబ్దం మొదటి వరకు క్రైస్తవ సమాజాలు ఒక గ్రూపు నాయకత్వంలో వుండేవి. ఈ గ్రూపులోని వారే తదనంతర కాలంలో చర్చి నాయకులుగా మారారు. పవిత్రాత్మచే ప్రభావితులై, అత్మికశక్తి గలిగిన వారుగా వీరిని భావించేవారు. వీరు వివిధ సమాజాల వద్దకు వెళుతూ నేర్పడం, బోధించడం చేసేవారు. అయితే వీరికి అధికారిక హోదా అంటూ ఏమీలేదు.

ఈ సమాజాలలో మొట్ట మొదటి అధికారులు బిషప్‌లు, వారి సహాయకులు (డీకన్స్) చోటు చేసుకొన్నట్లుగా తదనంతర ఆధారాల వల్ల తెలియవస్తున్నది. జన సమూహాల దైనందిన అవసరాలను డీకన్స్ చూస్తే, ఆస్తుల బాధ్యతను బిషప్‌లు చూసేవారు.

ఆ తరువాత చర్చి అధికారులు, పెద్దలు వచ్చారు. మూడవ శతాబ్దిలో నగర నాయకులు, స్వతంత్ర చర్చిల నాయకులు వచ్చారు. నాలుగు అయిదు శతాబ్దాలలో మత గురువులు, ప్రాంతీయ చర్చి సంఘాల నాయకులు అవతరించారు.

క్రైస్తవ చర్చి అభివృద్ధిలో ప్రత్యేకించి ప్రధానమైన అంశమేమిటంటే బిషప్‌ల సంఖ్య పెరగడం. చర్చి అధికారులందరిలోనూ ఆధిపత్య పాత్ర నిర్వహించే మంచి అవకాశం బిషప్‌లకు వుంది. ఎందుకంటే ఆర్థిక విషయాలన్నింటి పైనా అజమాయిషీ వారికే వుంటుంది.

రెండవ శతాబ్దం నుంచీ కేవలం ఆర్థిక వ్యవహారాలలోనేకాక సైద్ధాంతిక అంశాలలో సైతం తమ పాత్రను బిషప్‌లు నొక్కి చెప్పటం మొదలు పెట్టారు. సిద్ధాంతమూ, సంప్రదాయాల విషయంలో బిషప్‌లు ప్రామాణికులయ్యారు. విడివిడి సమాజాల బిషప్‌లు పరస్పరం మద్దతు తెలుపుకొనేవారు. క్రైస్తవ సమాజాలు బలోపేతం కావటంలో యిది ప్రధానమైన పాత్ర నిర్వహించింది.

భీకరమైన అంతర్గత ఘర్షణల అనంతరమే యిది సాధ్యమైంది. ఈ ఘర్షణలు

ఎక్కువగా సైద్ధాంతిక వివాదాల రూపంలో సాగింది. అయితే యీ సిద్ధాంతాల వెనుక విభిన్న జాతులకూ, వర్గ బృందాలకూ ప్రాతినిధ్యం వహిస్తూ వారి ప్రయోజనాలను ప్రతిబింబించే భావజాల ధోరణులున్నాయి.

మొదటి శతాబ్దానికి ముందే క్రైస్తవ సమాజంలో వున్న ధోరణులు ఒకదానికి మరొకటి వ్యతిరేకంగా వున్నాయి. యోహాను ప్రకటన గ్రంథం భిన్న మతావలంబకులైన నికొలైట్‌ల గురించి ప్రస్తావిస్తున్నది. వీరి గురించి మనకు పూర్తిగా తెలియదు.

క్రైస్తవంలో విభిన్న తెగలు, ధోరణుల మధ్య భీకర పోరాటం రెండవ శతాబ్దంలో అభివృద్ధి చెందింది. మార్సియోంటిస్, మోంటానిస్ట్ ఉద్యమాలతో సహా నోస్టిక్ ఉద్యమం, చాలా ఆసక్తికరమైనవి.

తొలినాటి క్రైస్తవంలో నోస్టిసిజం పాత్ర ఏమిటో స్పష్టంకాలేదు. నోసిస్ అనే పదానికి గ్రీకు భాషలో జ్ఞానమని అర్థం. అయితే యథార్థ ప్రపంచం గురించిన ప్రయోగాత్మక జ్ఞానం గురించి నోస్టిక్స్ మాట్లాడరు. దేవుని గురించిన నిగూఢ జ్ఞానం గురించి మాట్లాడతారు. హేతువు ద్వారా దైవత్వం యొక్క నిగూఢతనూ, ప్రపంచం యొక్క సారాంశాన్ని మానవుడు అవగాహన చేసుకోవచ్చునని చెప్పే మార్మిక తత్వవేత్తలు నోస్టిక్స్. సాధారణంగా క్రైస్తవ చరిత్రకారులు నోస్టిసిజాన్ని మత శాఖగా భావిస్తూ వుంటారు. విభిన్నమూ, విరుద్ధమూ అయిన యీ విశ్వాసాన్ని క్రైస్తవ మత సిద్ధాంతవేత్తలు త్వరలోనే అణచివేశారు. నోస్టిసిజం అనేది క్రైస్తవం నుంచి ప్రభవించలేదని తద్విరుద్ధంగా క్రైస్తవమే నోస్టిసిజం నుంచి పుట్టుకు వచ్చిందని మరికొంత మంది పరిశోధకులు భావిస్తున్నారు. దీనిని బట్టి క్రైస్తవంకన్నా నోస్టిసిజమ్ మరింత ప్రాచీనమవుతుంది. ఈ రెండు దృక్పథాలలోనూ కొంత మేరకు సత్యం వున్నది. ప్రాచీన నోస్టిక్ బోధకులు (మొదటి, రెండు శతాబ్దాలు) వాస్తవానికి క్రైస్తవ సిద్ధాంత అభివృద్ధిని ప్రభావితం చేశారు. క్రైస్తవ పితగా పేరొందిన అలెగ్జాండ్రియాకు చెందిన ఫైలో ఒక నోస్టిక్. తదనంతర నోస్టిక్ బోధనలు (రెండవ శతాబ్దం మధ్య నుంచి) యథార్థ క్రైస్తవం నుంచి తొలగిన వాటిగా భావిస్తారు.

తదనంతర హెలినిస్టిక్ భావవాద తాత్వికత నుంచి అభివృద్ధి చెందిన నోస్టిసిజం యొక్క సారాంశం ద్విముఖమైంది. వెలుగు, సదాత్మ మరియు వేదనలతో నిండిన తిమిర లోకము, శుభంకరుడు, ఘనుడూ అయిన దేవుడు సర్వసంపూర్ణుడు (ప్లిరోమా). ఇప్పటి యీ భయంకర ప్రపంచానికి ఆయన సృష్టికర్త కాజాలడు. దిగువ స్థాయికి చెందిన దుష్ట, సంకుచిత మనస్కుడైన దేవుడు యీ ప్రపంచాన్ని సృష్టించాడు. ఇలాంటి దేవుడిని యూదుల యాహ్వేగా కొంత మంది నోస్టిక్‌లు గుర్తిస్తారు. సమీపింప వీలులేని శుభంకరుడైన దేవునికీ అల్పమైన భౌతిక ప్రపంచానికీ మధ్య ప్రత్యక్ష సంబంధం వుండదని వారు విశ్వసిస్తారు. అయితే మానవ జాతిని బాధల నుండి రక్షించి సుప్రకాశమైన భగవంతుని ఆత్మలోకానికి నడిపే మధ్యవర్తి, దైవిక చిహ్నాలు (వాక్యమూ, సారమూ, హేతువు) వున్నాయని నమ్ముతారు. ప్రజలందరికీ యిది సాధ్యంకాదు. ఇది నిజం. కేవలం ఎంపిక అయిన వారికి ఆత్మజీవులకు –"న్యూమాటిక్స్"– (ఆత్మ, గ్రీకు భాషలో ఊపిరి అని అర్థం) మాత్రమే సాధ్యం.

వాక్కును గురించిన నోస్టిక్ బోధనలను క్రైస్తవంలో చొప్పించి రక్షకుడైన క్రీస్తు స్వరూప చిత్రణకు వినియోగించారు. నోస్టిసిజం స్ఫూర్తిని నింపుకొన్న నాల్గవ సువార్త (యోహాను) ఇందుకు ప్రత్యేక ఉదాహరణ (ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద వుండెను. వాక్యము దేవుడై వుండెను...యోహాను 1:1). ఏది ఏమైనా క్రైస్తవుల (యూదయ క్రైస్తవులు) వలె కాకుండా ఎక్కువ మంది నోస్టిక్స్ యూదు మతాన్ని పూర్తిగా తిరస్కరిస్తారు. యూదుల దేవుడైన యాహ్వేను దుష్టశక్తిగా భావించడమే ఇందుకు కారణం. ఈ దేవునికి బదులుగా వెలుగును, ఘనమైన దేవుని, రక్షణ వాక్యాన్ని వారు గౌరవిస్తారు. పాత నిబంధన మొత్తాన్ని పూర్తిగా తిరస్కరించిన మార్సియన్ (రెండవ శతాబ్ది మధ్య భాగం) బోధలలో యూదు మతం పట్ల యీ అయిష్టత స్పష్టంగా వెల్లడవుతుంది. మార్సియన్ తదితర నోస్టిక్‌ల బోధలలో యూదు మత వ్యతిరేక భావాలు తారాస్థాయికి చేరాయి. అయితే క్రైస్తవం యీ దారి తొక్కలేదు. తద్విరుద్ధంగా రక్షకుని గూర్చిన విశ్వాసంతో యూదు మతాన్ని సమన్వయం చేయటానికి ప్రయత్నించింది.

క్రైస్తవంలో నోస్టిసిజం తిరుగులేని ధోరణిగా చలామణి కాలేకపోయింది. ఇది తత్వశాస్త్రాన్ని క్షుణ్ణంగా అభ్యసించిన సంపన్న మేధావుల ప్రాపంచిక దృక్పథం కావటమే యిందుకు కారణం. ప్రజలకు అందుబాటులో వుండే బోధలు కావివి. రక్షకుని సజీవ స్వరూపం అనేది ప్రజలకు కావాలి. అంతేగాని తాత్వికమైన నైరూప్య చిహ్నాలు, ఊహావాద తత్వాలుకాదు. అయినప్పటికీ నోస్టిక్ తత్వశాస్త్రంలోని కొన్ని అంశాలను క్రైస్తవం స్వీకరించింది.

రెండవ శతాబ్దిలో మరో మత ధోరణి వ్యక్తమైంది. మొదటి శతాబ్దంలోని యూదయ క్రైస్తవ పోరాట స్ఫూర్తిని పునరుద్ధరించే ధోరణికి యిది ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది మోంటానిస్టు (సన్యాసత్వము) ఉద్యమంగా పేరుపడింది. ఫ్రిజియాలోని సిబిలి మాజీ పూజారి యీ మోంటానిస్ తెగ స్థాపకుడు. ఈయన గురించి పెద్దగా తెలియటంలేదు. చర్చి విధించే నిబంధనలను, నానాటికీ పెరుగుతున్న బిషప్‌ల అధికారాన్ని యీయన గట్టిగా వ్యతిరేకించాడు. ప్రజలలో ఆయనకెంతో ఆదరణ వుండేది. దేవుని పేరుతో ఆయన బోధలు చేసేవాడు. కఠోరమైన సాధు జీవనం, బ్రహ్మచర్యం (ఆయన అనుచరులు దీనిని పాటించనప్పటికీ) వుండాలని చెప్పేవాడు. ఏసుక్రీస్తు రెండవ రాకతో యీ ప్రపంచం నామరూపాలు లేకుండా పోతుందని ప్రకటించాడు. బానిస యజమానుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని మొట్ట మొదటి విప్లవ ప్రజాతంత్ర క్రైస్తవాన్ని ప్రపంచ మతంగా మార్పిడి చేసే తిరుగులేని క్రమాన్ని అడ్డుకొనే నిష్ఫల యత్నమిది. మోంటానిజం ప్రధానంగా ఫ్రిజియాలో వ్యాప్తి పొందింది. ప్రముఖ క్రైస్తవ మత ప్రచారకుడు టెర్‌టుల్లియస్ దీనితో సంబంధం కలిగివున్నాడు. అయితే బోధల్లోని విప్లవసారాన్ని ఆయన తగ్గించి వేశాడు.

రెండవ శతాబ్ది మధ్య నాటికి క్రైస్తవ సమాజాలపై ధనిక శక్తులు (బానిస యజమానులు, వ్యాపారులు) అదుపును సాధించాయి. ప్రజాతంత్ర ధోరణిని అణచి వేయటంలో వారు జయప్రదమయ్యారు. చర్చికి సంబంధించిన బిషప్పుల నిర్మాణాన్ని పటిష్టమొనర్చేటందుకై మోంటానిజంతో సాగించిన పోరాటంలో బిషప్పుల యొక్క అపొస్తలుల

వారసత్వాన్ని గురించి చెప్పే బోధలు పెరిగాయి. క్రీస్తు స్వయంగా తన శిష్యుల ద్వారా బిషప్పులకు అధికారాన్ని బదలాయించాడని, మత వ్యవహారాలకు సంబంధించి చర్చికి మార్గదర్శకత్వం వహించేందుకై వారిని నియమించాడని ప్రచారం చేశారు.

రెండు, మూడు శతాబ్దాలలో మార్మిక పరలోక శాస్త్ర ధోరణలు తగ్గుముఖం పట్టిన తరువాత నూతన ధోరణులు పుట్టుకు వచ్చాయి. వీటిల్లో ఒకటైన మానిచియన్ ధోరణి ప్రాచ్యంలోనూ, ఇరాన్ మరియు పొరుగు దేశాలలో ప్రజాదరణ పొందింది. క్రైస్తవ జొరాస్ట్రియన్‌ల సమ్మేళనమిది. ఇదొక ప్రత్యేక ద్వంద్వ విశ్వాస ధోరణి. 276లో హతమైన మాని (లేదా మానెస్) పేరు మీద యిది ఆవిర్భవించింది. వెలుగుకీ, చీకటికీ, మంచికీ–చెడుకూ ప్రత్యక్ష వైరుధ్యమన్న భావనే మానిచియాన్ సిద్ధాంత సూత్రము. ప్రజలతో సహా మనం చూస్తున్న ప్రపంచం చీకటి వెలుగుల అంశల యొక్క సమ్మేళనం, మాయాదేహియైన ఏసు వెలుగుకు – చీకటికి, మంచికి–చెడుకు మధ్య తేడా చూడటాన్ని ప్రజలకు నేర్పాడు. ఇదే విషయాన్ని మాని కూడా నేర్పాడు. మాని అనుచరులు మొత్తం పాత నిబంధననూ, కొత్త నిబంధనలో ఎక్కువ భాగాన్ని త్రోసిపుచ్చుతారు. వీరి సమాజాలు వర్గాలుగా చీలిపోయాయి. 'ఎంపికైన' వారితోనూ 'శుద్ధమైన' వారితోనూ ఉన్నతవర్గం ఏర్పడింది వీరు అన్ని రకాల మత కర్మకాండలలో పాల్గొనేవారు. ఇతరులు కొన్నిటిలో మాత్రమే భాగస్వాములవుతారు. క్రైస్తవం, ప్రభుత్వ మతమైన తరువాత మానిచియిజం అణచివేతకు గురైంది. అయితే మధ్య యుగాల నాటి పౌలిసియునిజం, బోగోమైల్ శాఖలలో దాని భావాలు పునరుద్ధరించబడ్డాయి. ఇవి కూడా స్పష్టమైన వర్గ దృక్పథం కలిగినవే.

నాల్గవ శతాబ్దిలో ప్రాయికంగా ఉత్తర ఆఫ్రికాలో వ్యాపించిన డొనాటిస్ట్ శాఖ (బిషప్ డొనాటుస్ పేరు మీద వచ్చినది)లో వర్గ మూలాలకు మరిన్ని ఆధారాలు వున్నాయి. ప్రభుత్వంతో రాజీపడటానికి డొనాటిస్ట్‌లు వ్యతిరేకించారు. వ్యక్తిగత జీవితంలో సైతం ఆదర్శప్రాయంకాని ప్రవర్తన కలిగిన బిషప్‌లనూ, పూజారులనూ గౌరవించటానికి తిరస్కరించారు. నాల్గవ శతాబ్దం నాటికి బానిస యజమాన వ్యవస్థ కలిగిన రోమన్ సామ్రాజ్యంలో సంక్షోభం పెరగడంతో (అప్పటికి సామ్రాజ్యంలో క్రైస్తవం ఆధిక్యత వహిస్తున్నది) డొనాటిస్ట్ ఉద్యమం ధనికులకు వ్యతిరేకంగా పేదలు చేసిన తిరుగుబాటుగా మారిపోయింది. ఇది ధనికుల ఎస్టేట్లపై విరుచుకుపడిన అగోనిస్ట్ (క్రీస్తు వీరులు) లేదా సున్నతి పొందినవారి ఉద్యమంగా ఖ్యాతి చెందింది. ఈ ఉద్యమాన్ని అణచటం ప్రభుత్వానికి కష్టమైంది. ఏడవ శతాబ్దంలో ముస్లింలు జయించేవరకు ఉత్తరాఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో డొనాటిస్ట్ సమాజాలు వున్నాయి.

బహుళ ప్రాచుర్యం పొందిన సిద్ధాంత సమస్యలపై డొనాటిస్ట్ – అగోనిస్ట్‌లు పెద్దగా విరోధించలేదు. చర్చిలో తీవ్ర చీలికను వారు సృష్టించలేదు. కాగా క్రైస్తవం ప్రధాన మతంగా మారిన తరువాత నాల్గవ శతాబ్దంలో అరియస్ శాఖ చర్చికి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. అరియనిజానికి ప్రధాన కేంద్రం ఈజిప్టు. ప్రత్యేకించి హెలెనిస్టిక్ సంప్రదాయాలు బలంగా వున్న అలెగ్జాండ్రియా ప్రధాన కేంద్రంగా వున్నది. అరియస్ అలెగ్జాండ్రియాకు

చెందిన పూజారి. భగవంతుని గురించిన మత బోధకుల ప్రవచనాలలోని పిడివాద అసంగతత్వాన్ని సరిదిద్దేటందుకు, దీని గురించిన ఆలోచనకు సుముఖంగా ప్రజల ఆమోదాన్ని మరింతగా చూరగొనేందుకూ ఆయన ప్రయత్నించాడు. ఏసుక్రీస్తు దేవునికి జన్మించలేదని, ఆయన సృష్టి మాత్రమేనని, తత్ఫలితంగా ఆయన తండ్రికాదని, కేవలం అలాంటివాడు మాత్రమేనని అరియస్ చెప్పేవాడు. గ్రీకులో యీ రెండు భావాల మధ్య తేడాను ఒక్క అక్షరంతో వ్యక్తం చేశాడు. (HOMOOUSION : HOMOIOUSION- అను) అయితే యీ తేడా అప్పటిలో చాలా ప్రాధాన్యతను సంతరించుకున్నది. మహా అయితే యిది రక్షకుడు, క్రైస్తవ సిద్ధాంత స్థాపకుడు అయిన ఏసుక్రీస్తు స్వభావంపై చర్చ మాత్రమే. అరియస్ బోధలపై పెద్ద వివాదమే చెలరేగింది. ఈజిప్టు ప్రజానీకం ప్రత్యేకించి అలెగ్జాండ్రియాలోని వారు అరియస్‌ను సమర్థించారు. ఈ అంశాలపై వీధి పోరాటాలు చెలరేగాయి. సామ్రాజ్యం యొక్క కేంద్రీకృత విధానంలో ఈజిప్టులోని ప్రజలు రాజకీయ అసంతృప్తితో వున్నారు. ఏది ఏమైనప్పటికీ ఐక్యతను నిలబెట్టడం చక్రవర్తికి ఎంతైనా అవసరం. క్రైస్తవుడు కానప్పటికీ కాన్‌స్టాంటిన్ చక్రవర్తి యీ చీలికను అంతమొందించడానికి కఠిన చర్యలు చేపట్టాడు. క్రీ.శ. 325లో నైసీయా అనుచోట తొలి క్రైస్తవ ప్రతినిధి సభను ఏర్పాటు చేశాడు. మత విరుద్ధమైన అరియస్ విశ్వాసాలను యీ సభ ఖండించింది. అప్పటి నుండి అరియస్‌ను అన్యమతస్థునిగానూ, పాపిగానూ సంప్రదాయ చర్చి ముద్రవేసింది.

ఇది ఎలా వున్నప్పటికీ చాలాకాలం వరకు అరియనిజం వునికిలో వున్నది. సామ్రాజ్య సరిహద్దులు దాటి విస్తరించింది. తదనంతర కాలంలో క్యాథలిక్కులుగా మారిన గోథ్‌లు వండాన్స్, లాంగోబర్డ్‌లు యీ భావాలను స్వీకరించారు.

అరియనిజం పరాజయం పాలైంది. కాని తదనంతర కాలంలో యీ రకమైన బోధలే వెలువడ్డాయి. కాన్‌స్టాంట్ నోపుల్‌కు చెందిన బిషప్ నెస్తోరియస్ యీ వాదనలు ముందుకు తెచ్చారు. ఏసుక్రీస్తు మానవుడు, అల్పజ్ఞానంతో ఆయనను పవిత్రత్రయంలోని రెండవ అంశమైన భగవంతుని కుమారునితో కలిపివేశారని ఆయన అన్నారు. క్రీస్తును గర్భమున ధరించిన స్త్రీగానే తప్ప భగవంతుని తల్లిగా కన్యమేరీని పిలవకూడదని చెప్పాడు.

క్రీ.శ. 431లో యుపిసెస్‌లోని మూడవ క్రైస్తవ ప్రతినిధి మండలి మత విరుద్ధమైన నెస్తోరియస్ విశ్వాసాలను చర్చించింది. మండలి వీటిని ఖండించింది. అయితే ద్వివిధ మతాలు దీర్ఘకాలంపాటు వునికిలో వున్న ప్రాచ్యంలో యివి బలమైన ప్రభావాన్ని చూపాయి. ప్రాచ్యంలో స్వతంత్ర మతంగా యీ భావాలు చాలా కాలం వున్నాయి. మధ్య యుగాలనాటి మధ్య ఆసియాలో ప్రధాన పాత్రవహించి యీనాటికీ చిన్న చిన్న తెగలలో నిలబడి వున్నాయి (లెబనాన్‌లోని ఐసోర్స్, మారోనిస్‌లు దక్షిణ భారతంలోని సిరియన్ క్రైస్తవులు).

నాలుగు, అయిదు శతాబ్దాలలో అరియనిజం, నిస్తోరియనిజంలకు వ్యతిరేకంగా పోరాటం సాగుతున్న సమయంలో ఏసుక్రీస్తు స్వభావానికి సంబంధించి ప్రతికూల ధోరణులు పెరిగాయి. ఈ ధోరణికి కట్టుబడి వున్నవారు చెప్పేదేమిటంటే నిజానికి ఏసుక్రీస్తు మానవుడుకాదు. నిజమైన అర్థంలో ఏసుక్రీస్తును దేవుడనేంత వరకు ఆయనలోని మానవ

స్వభావాన్ని ఆయనలోని దైవిక స్వభావం అధిగమించింది. ఆయన స్వభావం ఒక్కటే. అది దైవికమైనది. ఈ బోధనలు మోనోఫిసైట్ శాఖకు పునాదిని ఏర్పరించింది. (గ్రీకులో మోనో అంటే ఒకటి, ఫిసిస్ అంటే స్వభావం.) బిషప్ ఇటికుస్ దీనిని ప్రచారం చేశారు. అయిదవ శతాబ్దంలో తూర్పు రోమన్ సామ్రాజ్యంలో ఇది విశేషంగా వ్యాప్తిచెందింది. క్రీ.శ. 451లో చాల్సిడోన్‌లో జరిగిన నాల్గవ క్రైస్తవ ప్రతినిధి మండలి దానిని ఖండించినప్పటికీ అనేక దేశాలలో యిది నిలదొక్కుకున్నది. బైజాంటియం నుండి చర్చి విముక్తి కొరకు, రాజకీయ స్వాతంత్ర్యం కొరకు ఈ దేశాలలో జరిగిన పోరాటం నుండి యిది ఉద్భవించింది. ఆర్మీనియన్ చర్చి అదే విధంగా కోప్ట్స్, అబిసీనియన్లు, మోనోఫిస్టెట్ బోధలకు కట్టుబడి వుండటాన్నే కొనసాగించారు.

క్రైస్తవ సమాజాభివృద్ధి యొక్క సంక్లిష్ట చరిత్ర క్రైస్తవ సిద్ధాంతాన్ని దెబ్బతీసింది. తొలుత ఒక చిన్న యూదు శాఖగా ఆవిర్భవించిన క్రైస్తవం క్రమక్రమేణా ప్రపంచమతంగా మారింది. వివిధ జాతులకు, వర్గాలకు చెంది నిరంతరం పుట్టుకు వచ్చే నూతన బృందాల అవసరాలను, కోరికలను సంతృప్తిపరచేస్థాయికి విస్తరించింది. తత్ఫలితంగా క్రైస్తవ సిద్ధాంతం మరింత సంక్లిష్టంగా, గందరగోళంగా, వైరుధ్యభరితంగా తయారైంది. క్రైస్తవం వలే అంతర్గత వైరుధ్యాలను, అతార్కిక భావజాలాన్ని కలిగివున్న మరో మతం ప్రపంచంలో వుండటం కష్టమే. క్రైస్తవం యొక్క ప్రధాన భావాలలో కన్పించే వైరుధ్యాలతో పోలిస్తే విభిన్న సువార్తల మధ్య వుండే వైరుధ్యాలు సాపేక్షంగా తక్కువేనని చెప్పాలి.

దేవుడు సర్వశక్తి సంపన్నుడు. సర్వదయాళువు అన్న భావన, స్వీయ మరణంతో ప్రజలందరి పాపాలను పొగొట్టి వేదనలనుభవించిన దేవుడు అన్న భావనతో తీవ్రమైన వైరుధ్యాన్ని కలిగివున్నది.

దేవుడు సర్వదయాళువు, సకలశక్తి సంపన్నుడు అన్న యిదే భావన, మానవులందరూ పాపులని, పాపులు మరణానంతరం శిక్షించబడుదురన్న భావనతో కూడా విభేదిస్తుంది. భగవంతుడు సర్వదయాళువు, సర్వశక్తి సంపన్నుడు అయితే ప్రపంచానికీ, ప్రజలకు మహత్తర అదృష్టాన్ని కల్పించి వుండాలి. అంతేగాని వాళ్ళను శాశ్వత దు:ఖములో ముంచరాదు. ఎందుకంటే వాళ్ళను పాపులుగా మార్చింది ఆయనే.

విధి వాదం గురించిన సిద్ధాంతము స్వేచ్ఛాభీష్టమన్న వాదనతో విభేదిస్తున్నది. భగవంతుడు కొంతమందికి సదాచార జీవనాన్ని, స్వర్గ సౌఖ్యాలను ప్రసాదిస్తే, మరికొంత మందికి పాపాన్ని, మరణానంతరం నరకాన్ని కల్పించాడు. అదే సమయంలో క్రైస్తవ బోధల ప్రకారం సత్కర్మల మార్గాన్ని లేదా పాపమార్గాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను మానవుడు కల్గివున్నాడు. దీని ప్రకారం భగవంతుడు కృపచూపడమో, శిక్షించడమో చేస్తాడు. ఈ వైరుధ్యాన్ని తొలగించటానికి క్రైస్తవ సిద్ధాంతవేత్తలు అనేక విధాలుగా ప్రయత్నించారు. అయితే అన్నీ విఫలమయ్యాయి.

పవిత్ర త్రయం గురించిన క్రైస్తవ భావనే పూర్తిగా తర్కవిరుద్ధమైనది. భగవంతుడు ఒక్కడేనని క్రైస్తవులు చెపుతారు. అయితే అదే సమయంలో తండ్రి, కుమారుడు, పవిత్రాత్మ

అనే మూడు వున్నాయంటారు. తండ్రి తన కుమారుని భూమిపైకి పంపించాడు. అక్కడ యీ కుమారుడు పవిత్రాత్మకు, స్త్రీకి జన్మించాడు. తాను తన తండ్రి అభీష్టాన్ని మాత్రమే నెరవేర్చడానికి వచ్చానని తన అభీష్టాన్ని కాదని యీ కుమారుడు ప్రజలకు నిరంతరం చెప్తూ వచ్చాడు. ఆయన తన తండ్రిని ప్రార్థించాడు. భయంకరమైన మరణాన్ని తట్టుకొనే శక్తిని తనకు యివ్వమని వేడుకొన్నాడు. చివరికి ఈ మరణశిక్ష నుంచి తప్పించమని కూడా కోరాడు. ఏది ఏమైనప్పటికీ ఆయన, ఆయన తండ్రి, ఎవరైతే ఆయన తల్లికి గర్భం తెచ్చి ఆయన తండ్రిగా కూడా వున్నాడో ఆ పవిత్రాత్మ అన్నీ ఒకే దేవుడిలోనివి. మానవ మేధస్సుతో దీనిని అర్థం చేసుకోవటం కష్టం. ఈ గందరగోళానికి వివరణ యివ్వటం సులభమే. పవిత్రత్రయంలో చేరినవి విభిన్న మార్గాల నుంచి వచ్చాయి. యూదుల యాహ్వే – సబాత్, తండ్రి: రక్షకుడైన మెస్సయ్య కుమారుడు : పవిత్రాత్మ ఫ్లిరోమా జ్ఞానవాదులు బోధించిన నిరాకార దైవలోకపు జీవి. యూదుల దేవుడైన యాహ్వేకు పైన దీనిని వుంచటమేకాక చివరికి యాహ్వేకు ప్రతిగా కూడా నిలబెట్టారు. విభిన్న భావజాలాల సూత్ర రహితమైన కలయిక క్రైస్తవ పవిత్ర త్రయానికి దారి తీసింది.

క్రైస్తవ విశ్వాసంలో యింకా అనేక వైరుధ్యాలు, పిడివాదంతో కూడిన తర్కరహితమైన వివరణలు వున్నాయి.

క్రైస్తవం యొక్క యీ సైద్ధాంతిక మిశ్రమ భావజాలంలోని వైరుధ్య స్వభావం, వివిధ ధోరణుల మధ్య యింతే భీకరంగా సాగిన పిడివాద పోరాటంతో పెరిగి పెద్దదైంది. తొలి క్రైస్తవంలోని విభిన్నవర్గ శక్తుల ప్రయోజనాలను యీ పోరాటం ప్రతిబింబిస్తున్నది. అయితే విశ్వాసులైన ప్రజలు యీ వైరుధ్యాలకు దిగ్భ్రాంతి చెందలేదు. దీనిని అర్థం చేసుకోవచ్చు. క్రైస్తవం అనేది బానిసల, అణగారిన ప్రజల మతంగా అభివృద్ధి చెందింది. ఒక మంచి దేవుడిలో, ఒక రక్షకుడిలో విశ్వాసం వారికి కావాలి. మతపరమైన ఓదార్పు వారికెంతో అవసరం వుంది. మతంలో హేతువుకన్నా భావోద్వేగపు పాలు ఎక్కువగా వుంటుంది. ప్రజారక్షణ మత ఉద్యమాలలో యిది మరింత నిజం. ఆధునిక గ్రీకు తాత్వికతతోను, దాని నవీన భావజాలంతోనూ స్ఫూర్తి పొందిన రోమన్ – హెలినిస్టిక్ సమాజపు విద్యాధికులైన యితర వర్గాలకు చెందిన ప్రజలు క్రైస్తవ సమాజాలలో చేరినప్పుడు వారు తమతోపాటు తమ ప్రయోజనాలను, భావజాలాన్ని కూడా తీసుకువచ్చారు. కాని తర్కబద్ధమైన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయలేకపోయారు.

క్రైస్తవం యొక్క నీతి దాని సిద్ధాంతం వలెనే గందరగోళమైనది, అతార్కికమైనది. సుదీర్ఘమైన సైద్ధాంతిక పోరాట కాలంలో క్రైస్తవంలో కనిపించిన నీతి ప్రమాణాలకు, సూత్రాలకు యివి పూర్తిగా విభిన్నమైనవి. స్టోయిక్‌ల నవీన నీతి ప్రయోగాలకు, బానిసల అణగారిన ప్రజల మనోభావాలకు సరిపడే నైతిక సూత్రాలకు తోడు పరాన్న భుక్కులైన బానిస యజమానుల మొరటైన చికాకు పుట్టించే భావజాలాన్ని కూడా క్రైస్తవం స్వీకరించింది.

మన కాలానికి సంబంధించిన నీతికీ, సాధారణ జ్ఞానానికి విరుద్ధంకాని అనేక నైతిక అంశాలు సువార్తలలోను, పత్రికలలోను వున్నాయి. ఉదాహరణకు చెట్టు దాని

పండువలన తెలియబడును. పాత తిత్తులలో కొత్త ద్రాక్షరసం పోయరు: తన జన్మభూమిలో యే ఒక్కరూ ప్రవక్త కాలేకపోవటం, ఏకకాలంలో యే సేవకుడు యిరువురు యజమానులను సేవించలేడు, నోటి నుండి బయటకు వచ్చినదేకాని లోపలికి వెళ్ళునది అపవిత్రమొనర్చదు, నీ సహోదరుని కంటిలోని నలుసుని వెతికే ముందు మొదట నీ కంటిలోని దూలమును తొలగించుకొనుము, విశ్రాంతి దినము మనుష్యుల కొరకే నియమింపబడెను గాని మనుష్యులు, విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు, ఎవరైతే పనిచేయరో అతడు భుజించరాదు వంటివి వున్నాయి. ఈ సాధారణ నైతిక భావాలన్నింటినీ ప్రాచీన తాత్విక - నైతిక విధానాలనుండి ప్రధానంగా స్టోయిన్స్ నుండి ప్రత్యేకించి సెనెకాల నుండి క్రైస్తవం స్వీకరించింది. ఈ సెనెకాలనే క్రైస్తవానికి మేనమామ అని ఎంగెల్స్ వర్ణించాడు.

ఏది ఏమైనప్పటికీ యీ రకమైన ఉత్తమ నీతి సూత్రాలతో పాటే ప్రాథమిక నైతిక అవగాహనలకు వ్యతిరేకమైన ఆలోచనలు కూడా కొత్త నిబంధన గ్రంథంలో కనిపిస్తాయి. ఏసు తన స్వంత తల్లినీ సోదరులనూ బహిరంగంగా పరిత్యజించాడు. (మత్తయి 12: 47-50) తన తండ్రిని ఖననం చేసే కౌటుంబిక, నైతిక విధిని నిర్వర్తించగోరిన శిష్యునికి ఆయన అనుమతి ఇవ్వలేదు (మత్తయి 8:21-22). తనకు పడవలసిన శిక్షను యుక్తిగా తప్పించుకొన్న చురుకైన గృహ నిర్వాహకుని ఉదాహరణగా చూపించి యీ విధమైన సలహాను యిస్తాడు. అన్యాయపు సిరి వలన మీకు స్నేహితులను సంపాదించుకొనుడని మీతో చెప్పుచున్నాను (లూకా 16: 1-9). చివరిగా సువార్తలు యిలా చెపుతాయి. సంపన్నుడు మరింత ధనికుడవుతాడు. లేని వానికి కలిగినదియూ వాని యొద్ద నుండి తీసి వేయబడును. ఇదేదో యాదృచ్ఛికంగా చెప్పినదికాదు. సువార్తలలో యీ మాటలు అయిదు చోట్ల వున్నాయి. మత్తయి, లూకాలో రెండేసి మారులు, మార్కులో ఒకసారి యిలా చెప్పడం జరిగింది. (మత్తయి 13: 12, 25:29, మార్కు 4:25, లూకా 8:18,19-26) ఇది బానిస యజమానుల, వినియోగదారుల నైతిక విలువ అని స్పష్టంగా చెప్పవచ్చు.

క్రైస్తవ నీతిలోని వైరుధ్యం క్రైస్తవ సమాజాల్లోని వర్గ పొందికలోని మార్పు యొక్క ప్రత్యక్ష ఫలితము. మొదట వీటిలో యూదులలోని పేదలు చేరారు. కనుకనే సమరశీల స్వభావం, స్ఫూర్తి కనపడతాయి. ఎప్పుడైతే యీ స్ఫూర్తి మరుగున పడిందో (యూదుల తిరుగుబాటు ఓటమి అనంతరం) అప్పుడు అణగారిన ప్రజల మనోభావాలు, పేదలను శ్లాఘించి ధనికులను ఖండించే రూపంలో క్రైస్తవంలో వ్యక్తమయ్యాయి. అయ్యో ధనవంతులారా మీరు (కోరిన) ఆదరణ మీరు పొందియున్నారు. అయ్యో! ఇప్పుడు (కడుపు) నిండియున్నవారలారా, మీరాకలిగొందురు (లూకా 6:24-25), ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును (మత్తయి 11: 28). ఈ ప్రకారమే కడపటి వారు మొదటి వారగుదురు. మొదటి వారు కడపటి వారగుదురు. (మత్తయి 20:16)

ఒక వైపున బానిసల పట్ల, అణగారిన ప్రజల పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూనే స్వర్గంలో ప్రతి ఫలాన్ని వాగ్దానం చేస్తూనే మరొకవైపు ఈ లోకంలోని బానిసల విముక్తి

ప్రశ్నను సువార్త రచయితలు లేవనెత్తలేదు. బానిసత్వ మనేది ప్రశ్నించవీలుకాని సహజ క్రియగా వారు భావించారు. క్రైస్తవ సమాజాలలో బానిస యజమానులు, ధనికులు చేరటంతో బానిసలంటే ఏ విధమైన హక్కులు లేని ప్రజలన్న అభిప్రాయాన్ని మరింత విశదంగా సువార్తలు ప్రతిబింబించాయి. ఉదాహరణకు లూకా సువార్తలో ఏసు యీ విధంగా తన ముందున్న వారికి సలహా యిస్తాడు. "దున్ను వాడుగాని, మేపువాడుగాని మీలో ఎవనికైనా ఒక దాసుడుండగా, వాడు పొలములో నుండి వచ్చినప్పుడు నీవు యిప్పుడే వెళ్ళి భోజనము చేయుమని వానితో చెప్పునా? చెప్పడు. అంతేకాక నేను భోజనము చేయుటకు ఏమైనా సిద్ధపరచి, నడుము కట్టుకొని నేను అన్న పానములు పుచ్చుకొను వరకు నాకు పరిచారము చేయుము. అటు తరువాత నీవు అన్న పానములు పుచ్చుకొనవచ్చునని చెప్పును. (లూకా 17:7) రోజంతా కఠిన శ్రమ అనంతరం బానిసకు విశ్రాంతి పూర్తిగా అనవసరమని యీ రకమైన సలహా ఇచ్చిన రచయిత ఆలోచించినట్లుంది.

సువార్తలలో వెలిబుచ్చిన సామాజిక, నైతిక సూత్రాలలో అనేక వైరుధ్యాలు వున్నప్పటికీ ఒక నైతిక ప్రమాణం క్రైస్తవంలో ఆధిక్యత సంపాదించింది. సహనం, అణుకువ, అవమానాలను క్షమించడంకు సంబంధించిన బోధనలివి. ఈ సిద్ధాంతాన్ని సువార్తలలో అతిగా చెప్పారు. ఆచరణకు సాధ్యంకాని రీతిలో చెప్పడం జరిగింది. ఏసు యిలా బోధించాడు. మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్ములను శపించిన వారిని ఆశీర్వదించుడి, మిమ్ములను అసహ్యించుకొను వారి కొరకు ప్రార్థన చేయుడి (మత్తయి 5:44). నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక నిన్ను కుడిచెంప మీద కొట్టువాని వైపునకు నీ ఎడమ చెంప కూడా త్రిప్పుము (మత్తయి 5:39). ఈ నీతియే క్రైస్తవం వైపుకు అనేక మందిని అనునిత్యమూ ఆకర్షిస్తున్నది. చాలా మంది దీనిని ఆదర్శనీతిగా విశ్వసిస్తారు. ఏది ఏమైనప్పటికీ యిక్కడొక విషయం చెప్పాలి. మొట్ట మొదటిదేమిటంటే ఎవరో బహు కొద్ది మంది తప్ప క్రైస్తవులెన్నడూ యీ సూత్రాన్ని వాస్తవంలో ఆచరించలేదు. రెండవ దేమిటంటే యీ బోధనలో వున్న భావనను (గౌరవమూ, గౌరవప్రదమైన ఆత్మ నిగ్రహము, తనపట్ల యితరుల పట్ల మర్యాద) తొలినాటి క్రైస్తవం బోధించలేదు. ఇది స్టోయిన్స్ నీతి సూత్రాల నుండి అరువు తెచ్చుకొన్నది. మూడవదేమిటంటే బానిస సమాజపు పరిస్థితిలో సువార్త బోధలు ఆ సమాజపు రక్షణకే నిలబడ్డాయి. అవమానాలను క్షమించాలన్న సూక్తి అందరినీ ఉద్దేశించి చేసినదైనప్పటికీ ప్రాయికంగా యిది తమ అణచివేతదారుల చేత తిట్లు తినే అణగారిన ప్రజలకూ, బానిసలకూ ఉద్దేశించిందనేది స్పష్టం. అంతేగాని బానిస యజమానులకు కాదు. అణకువ, క్షమ అన్న క్రైస్తవ బోధలు తొలి నుంచి దోపిడీదారుల ప్రయోజనాలకే ఉద్దేశించబడ్డాయి.

సమాజాల ఐక్యతకూ, క్రైస్తవ చర్చి నిర్మాణ పటిష్టతకూ శాఖల మధ్య పోరాటం దోహదపడింది. ఈ పోరాట క్రమంలో క్రైస్తవ ఆచారాలు, క్రైస్తవ పూజా విధి మరింత క్లిష్టంగా మారాయి.

తొలినాటి క్రైస్తవ పూజా విధి అత్యత నిరాడంబరమైనది. ఆచారాలనేవి దాదాపుగా లేవనే చెప్పవచ్చు. ప్రజల మధ్య సంబంధాలలో సంక్లిష్టత లేకపోవటం, ప్రజలను విభజించే

మతాచారాలు తలెత్తకపోవడం ఈ పరిస్థితులే యితర సంప్రదాయాల కన్నా క్రైస్తవం బహుళ ప్రజాదరణ పొందటానికి దోహదపడ్డాయి. క్రైస్తవంలోని విప్లవకర అంశాలలో ఒకటేమిటంటే ప్రజలను విభజించే ప్రాచీన మతాచారాలను తుడిచిపెట్టడం ఆ రకంగా అది ప్రపంచ మతంగా రూపుదాల్చింది. బోధకుని స్మృత్యర్థం జరిగే కూటములకు, విందులకు మాత్రమే అసలైన క్రైస్తవ ఆచారాలు పరిమితం ఈ విందుల్లో పాల్గొన్న వారు రొట్టె తిని గ్రంథ పఠనం చేసేవారు. ఇవి ప్రేమ, విస్మయంతో కూడిన సమావేశాలు. అయితే ఇతర మత విధులను ఆచరించే వారు క్రైస్తవ సమాజాలలో చేరినప్పుడు ప్రాచీన ఆచారాలకు చెందిన వివిధ అంశాలను తమతో తీసుకువచ్చారు.

క్రైస్తవ పూజా విధిలో మార్మికత, ప్రార్థనా కార్యకలాపాలు ప్రధాన పాత్ర వహించాయి. దేవుని ఆశీస్సులు పొందటమే వీటి పరమార్థం. క్రైస్తవ మార్మికతలలో అత్యంత పురాతనమైనవీ, అత్యంత ప్రధానమైనవీ బాప్తిజమూ, కూటములు.

కూటముల సమయంలో విశ్వాసులు రొట్టె, ద్రాక్ష సారాయి స్వీకరిస్తారు. క్రీస్తు శరీరానికి, రక్తానికి యివి ప్రతీకలు గణాల ఆచారాల నుండీ ప్రత్యేకించి వ్యవసాయకుల మతాల నుండి అభివృద్ధి చెందిన ప్రాచీన ఆచారాలకు అధునూతన రూపమిది. ఈ ఆచార విధిననుసరించి జీవదాతయైన దేవునికి మనిషినో లేదా జంతువునో ప్రతీకగా భావించి వాటిని చంపి విశ్వాసులు భుజిస్తారు. మిత్ర, అట్టిస్ ఇతర ప్రాచ్య దేవతల పూజలలో యీ రొట్టె, ద్రాక్ష సారాయి కన్పిస్తాయి. పవిత్రమైన యీ ఆహారాన్ని, పానీయాన్ని దేవుని ప్రతిరూపంగా భావించినట్లు కనపడుతున్నది. మిత్ర పూజా విధిలో దేవుని ప్రసాదాన్ని స్వీకరించే ఆచారాన్ని దాదాపుగా ఎలాంటి మార్పులు లేకుండా క్రైస్తవం స్వీకరించింది. అయితే క్రైస్తవంలో గొర్రెను వధించే ప్రాచీన యూదుల పస్కా ఆచారం మిళితమైంది. తనను తాను త్యాగం చేసుకొన్న క్రైస్తవ మత స్థాపకుడు గొర్రె పిల్లగా చిత్రతమయ్యాడు. (ప్రకటన గ్రంథంలో ఆయనను గొర్రె పిల్లగా వర్ణించారు.) క్రైస్తవులు జరుపుకొనే ఈస్టర్ పూజా విధి యీ విధంగానే తలెత్తింది. ఏడాదికొకమారు స్వీకరించే దేవుని ప్రసాదపు విందు వారానికొకసారి మారింది. ఆత్మ త్యాగం చేసిన దేవుని శరీరాన్ని, నెత్తురును యీ విందులో భక్తులు భుజిస్తారు.

బాప్తిజం కూడా ఇతర మతాచార విధుల నుండి అరువు తెచ్చుకున్నదే. నీటితో పరిశుద్ధపరిచే యీ ఆచారానికి మూలాలు ప్రాచీనమైన జ్ఞానోపదేశపు విధులలో వున్నాయి. ప్రాచీన ప్రాచ్య మతాలలోని రహస్య కూటములు, మార్మిక ఆచారాలలో యీ ఉపదేశమనేది నిరంతరం సంప్రదాయకమైన పరిశుద్ధతతో జరిగేది. రహస్య పూజా విధులలోని ఆచారాలను అంగీకరించడాన్ని రెండవ జన్మగా భావించేవారు. ఇలూషినియన్, డైనోసిస్, ఐసిస్‌ల పూజా కార్యక్రమాలలో పవిత్ర స్నానం చేసే ఆచార ముండేది. మండా శాఖ ఆచారాలలో దీనికి చాలా ప్రాధాన్యత వున్నది. (ద్వివిధ సిద్ధాంతాన్ని కలిగి బాప్తిస్మమిచ్చే యోహానును పూజించే యీ శాఖ పుట్టుపూర్వోత్తరాలు తెలియదు. ఈ శాఖకు చెందిన వారు దక్షిణ ఇరాక్‌లోనూ, ఇరాన్‌లోను రెండు మూడు వేల మంది వున్నారు) బాప్తిస్మమిచ్చే యోహానుతో సహా నీటితో

బాప్తిజం ఇచ్చే మండాల ఆచారాన్ని క్రైస్తవం యథావిధిగా స్వీకరించింది. క్రైస్తవంలో నీటితో ఇచ్చే బాప్తిజం అనేది దుర్గుణాలను కడిగి వేసుకొనే ఒక మార్గం. దేని నుంచైతే రక్షకుని మరణం ద్వారా విముక్తి పొందామని ప్రజలు భావిస్తున్నారో ఆ "ఆదిమ పాపం" గురించిన బోధలకు సంబంధించి యిది చాలా ప్రాధాన్యతను వహించింది. నీటితో బాప్తిజం ఇచ్చే సమయంలో యీ "ఆదిమ పాపం" విశ్వాసి నుండి తొలగిపోతుంది.

తదనంతర కాలంలో యితర మార్మిక క్రియలు వచ్చి చేరాయి. దీనితో యీనాడు క్రైస్తవంలో వీటి సంఖ్య మొత్తం ఏడుకు చేరింది. పదమూడవ శతాబ్దం నాటి లియోన్ క్రైస్తవ ప్రతినిధి మండలిలో కేథలిక్ చర్చి తొలిసారిగా యీ సంఖ్యను నిర్ధారించింది. ఆ తరువాత ప్రాచ్య సనాతన చర్చి దీనిని స్వీకరించింది.

ఆ రకంగా రెండు మూడు శతాబ్దాలలో అభివృద్ధి చెందిన క్రైస్తవం అత్యంత సంశ్లిష్టమైనది, గందరగోళమైనది, వైరుధ్యభరితమైనది. కేవలం ఉపరితలంపైనే కనిపించే ఐక్యతను నిలబెట్టడం అత్యంత క్లిష్టతరమైన కార్యం. సర్వశక్తి సంపన్నుడైన భగవంతుని ఏకత్వానికి చెందిన యూదుల బోధలు : ఆధ్యాత్మిక రక్షకుడిగా రూపం మార్చుకొని జనన మరణాలు గలిగిన వ్యవసాయిక దేవతలతో మిళితమైన రక్షకుడు మెస్సయ్య గురించిన యూదుల భావన, ఆత్మ – పదార్థము మధ్య అదే విధంగా వాటి ముఖ్య దైవిక సంబంధమైన – చిహ్నాలకు వ్యతిరేకంగా నోస్టిక్ బోధలు, భక్తుల నిమిత్తం వున్న స్వర్గ రాజ్యం పట్ల మజ్దాయిస్టుల సిద్ధాంతమూ, విశ్వాసమూ, దుష్టాత్మ అంటే సైతాను గురించిన మజ్దాయిస్టుల భావన, అమ్మ తల్లి (దేవుని తల్లి) పట్ల పూర్వ ప్రాచ్యుల ఆరాధన సమ్మేళనమే క్రైస్తవం. ఇదే విధంగా యింకా అనేకమైన వాటిని క్రైస్తవ సిద్ధాంతం స్వీకరించింది. ఆత్మయొక్క పునర్జన్మ పట్ల నమ్మకం కలిగిన ఖనన క్రియలు, దుష్ట శక్తులను పారద్రోలటం, మంత్రాల ద్వారా ఆరోగ్యాన్ని చేకూర్చే పద్ధతులూ, నౌగలిజంతో ముడివడిన ప్రేతాలను పూజించే ప్రాచీనాచారమూ, క్రైస్తవంలో రక్షణ దేవతలన్న భావనకు పరివర్తన చెందాయి. ఇవన్నీ ప్రాచీన గణ వ్యవస్థ ఆచారాలకు, అభిప్రాయాలకు అవశేషాలు. ప్రాచీన టోటమిక్ ఆచారాలలోనూ, అభిప్రాయాలలోనూ యివన్నీ మిగిలి వున్నవి (పరిశుద్ధ భావన, సామాజిక మార్మికతలో విశ్వాసం).

క్రైస్తవులను వేధించడమనేది తొలినాటి క్రైస్తవాభివృద్ధికి ఆటంకమైంది. బానిసల, అణగారిన ప్రజల మూలంగా క్రైస్తవం అభివృద్ధి చెందింది. అన్యాయమైన సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా దోపిడీకి గురవుతున్న ప్రజానీకం ఆకస్మికంగా తెలిపిన నిరసనను సమర్థించింది. విపరీతమైన ప్రచారాన్ని పొందిన యీ మతం ప్రమాదకారిగా మారింది. పాలకవర్గాల నుంచి సైతం వ్యతిరేకతను ఎదుర్కొన్నది.

క్రైస్తవ సమాజాలపై పాలకులు సాగించిన హింసను తదనంతర కాలపు క్రైస్తవులు అతిగా వర్ణించారు. తమ విశ్వాసాన్ని నిలబెట్టుకోవటంలో తొలినాటి క్రైస్తవులు చేసిన త్యాగాలను చర్చి అధిపతులు గర్వంగా చెప్పుకొన్నారు. క్రైస్తవ అమరవీరుల సహనాన్నీ, సాహసాన్ని శతథా శ్లాఘించారు. చిన్నా చితకా వాటిని వదిలివేస్తే పదిసార్లు పెద్ద ఎత్తున

హత్యాకాండ సాగిందని క్రైస్తవ చరిత్రకారులు చెపుతారు. కాని వీటి సంఖ్యగానీ, విస్తృతిగానీ తదనంతర క్రైస్తవ సంప్రదాయం చెప్తున్న స్థాయిలో లేదు. నీరో, డొమిషియన్ చక్రవర్తుల హయాంలో జరిగిన తొలి హత్యాకాండలు పురాణగాథ మాత్రమే. వాస్తవంగా జరగలేదనే భావించవచ్చు. ట్రాజన్ హయాంలో క్రైస్తవులు హత్యాకాండకు గురయిందీ లేనిదీ స్పష్టంకాలేదు. తొలి హత్యాకాండ పెద్దది కానప్పటికీ డేసియస్ (249-51) చక్రవర్తి హయాంలో నమోదైంది. కాగా అతి పెద్దది మూడవ శతాబ్దం చివర నాల్గవ శతాబ్దం ప్రారంభంలో డయోక్లీషియన్, మాక్సిమియన్ కాలంలో జరిగింది. దీనికి కారణం పూర్తిగా రాజకీయమైనదే. ఉనికిలో వున్న రాజకీయ వ్యవస్థకు క్రైస్తవ చర్చి కేవలం వ్యతిరేకమేకాక ప్రమాదకరమైన పోటీదారని ప్రభుత్వం భావించింది. ఏది ఏమైనా యీ హత్యాకాండ క్రైస్తవ సమాజాలలోని వూగిసలాటను తొలగించింది. జీవన్మరణ పోరాటంలో చర్చి నిర్మాణం మరింత బలోపేతమైంది.

క్రైస్తవ సభలపైనా, మత పీఠాలపైనా ఆధారపడేందుకు కొంతమంది చక్రవర్తులు, స్థానిక పాలకులు ప్రయత్నించారు. వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. తొలుత యిది అప్పుడప్పుడు సంభవించింది. అయితే నాల్గవ శతాబ్దం ప్రారంభంలో సామ్రాజ్యానికీ, బలమైన సామాజిక శక్తిగా స్థిరపడిన చర్చికీ మధ్య సత్సంబంధాలు అభివృద్ధి చెందాయి. క్రైస్తవ చర్చికి వ్యతిరేకంగా పోరాడేకన్నా రాజ్య ప్రయోజనాలకు దానిని వినియోగించుకోవటం మేలైన పద్ధతని కాన్‌స్టాంటిన్ చక్రవర్తి నిశ్చయించుకొన్నాడు. ఈ నిశ్చయానికి అనుగుణంగానే క్రీ.శ. 313లో మిలాను శాసనము వెలువడింది. క్రైస్తవులను హతమార్చటాన్ని నిలిపివేయటానికీ, రాజ్యం యొక్క అధికారిక మతంగా క్రైస్తవం వ్యవస్థాపితం కావడానికి కొండ గుర్తుగా ఈ మిలాను శాసనాన్ని భావిస్తారు. అయితే యీరకమైన శాసన ప్రకటన వెలువడినట్లుగా రుజువుకాలేదు. కాన్‌స్టాంటివ్ క్రైస్తవంలోకి మారలేదు. అతడు జీవితాంతం విగ్రహారాధకుడిగానే వున్నాడు. కాని క్రైస్తవాన్ని సమర్థించి యితర మతాలకన్నా దానికి ప్రాధాన్యతనిచ్చాడు. క్రైస్తవ చర్చి సంఘాన్ని అత్యంత బలమైన సామాజిక శక్తిగా భావించి తన స్వీయ పోరాటంలో ఆయన దానిపై ఆధారపడ్డాడు.

మిలాను ప్రకటన కారణంగా రాజ్యవ్యవస్థతో క్రైస్తవ చర్చికి మొదలైన పొత్తు తూర్పు - పశ్చిమ రోమన్ చక్రవర్తుల విధానాలతో మరింత బలపడింది. వారు క్రైస్తవ చర్చిని ఒక పద్ధతి ప్రకారం సమర్థించి అందుకు బదులుగా దాని మద్దతును పొందారు.

క్రైస్తవ చర్చి హోదాలో వచ్చిన యీ మార్పు చెప్పుకోదగిన అంతర్గత మార్పులకు దోవదీసింది. క్రైస్తవం యొక్క సామాజిక పొందిక మారిపోయింది. క్రైస్తవం ఆధిపత్య మతంగా మారటానికి చాలాకాలం ముందే అంటే రెండు, మూడు శతాబ్దాలలో బానిసలతోపాటు పాలకవర్గానికి చెందిన వారు కూడా క్రైస్తవ సమాజ సభ్యులుగా వుండేవారు. ప్రత్యేకించి రాజకుటుంబాలకు చెందిన మహిళలు క్రైస్తవం వైపుకు ఆకర్షితులయ్యారు. ప్రధానంగా క్రైస్తవ చర్చి రోములోని రాజ కుటుంబాల మహిళలలో ఆదరణ పొందింది.

రాజ్య మతంగా మారటానికి ముందు క్రైస్తవం విశేషవ్యాప్తి గలిగినది కాదని

పరిశోధకులు సేకరించిన సమాచారం వల్ల తెలుస్తున్నది. పెద్ద పెద్ద పట్టణాలలో సైతం బహు కొద్ది మంది మాత్రమే అంటే అయిదింట ఒకవంతు లేదా యింకా తక్కువ మంది మాత్రమే క్రైస్తవ సమాజాలలో వున్నారు.

ఎప్పుడైతే ***క్రైస్తవం రాజ్యమతంగా మారిందో*** అప్పుడు సమాజాలు విస్తరించ జొచ్చాయి. మధ్యతరగతి ప్రజలు, బానిస యజమానులు ***మూకుమ్మడిగా*** క్రైస్తవంలో చేరారు. దీనితో క్రైస్తవం బానిసల, అణగారిన ప్రజల మతంగా వుండటానికి బదులు, ప్రజలను అదుపు చేయటంలో పాలక వర్గాలకు తోడ్పడే మతంగా మారిపోయింది.

క్రైస్తవ మత వర్గ స్వభావంలో వచ్చిన యీ మార్పుకు వ్యతిరేకత వెల్లడైంది. మోంటానిస్టు నుండి (2వ శతాబ్దం) డొనాటిస్టు (4వ శతాబ్దం) వరకు గల సనాతనేతర ఉద్యమాల రూపంలో వ్యక్తమైన ప్రజాతంత్ర ధోరణులలో యీ వ్యతిరేకత వెల్లడైంది. కాని అప్పటికే బలోపేతమైన చర్చి వీటిని అణచివేసింది.

ఏది ఏమైనప్పటికీ చాలా కాలం వరకు క్రైస్తవ మత వ్యాప్తి పరిమితంగానే వున్నది. పశ్చిమాన పట్టణాలలో బలంగానూ, పల్లెల్లో బలహీనంగానూ వున్నది. ప్రాచీన విగ్రహారాధన నమ్మకాలే గ్రామీణ ప్రజలలో నిలిచి వున్నాయి. కనుకనే “గ్రామీణ నివాసి” అనే అర్థమిచ్చే లాటిన్ భాషా పదమైన ‘పాగనుస్’ అనే దానిని (పాగస్ – గ్రామము) అవిశ్వాసులకు లేదా క్రైస్తవేతరులకు వాడజొచ్చారు.

ప్రాచ్య హెలినిస్టులు, క్రైస్తవేతరులను యూదయులు అనడానికి బదులుగా ‘ప్రజలు’ అని అర్థమొచ్చే గ్రీకు పదాన్ని వాడారు.

క్రైస్తవం ఆధిపత్య మతంగా మారగానే మోనాస్టిసిజం పేరుతో ప్రత్యేకంగా ఒక వుద్యమం అభివృద్ధి చెందింది. క్రైస్తవ సమాజాలు శక్తివంతమైన చర్చీలుగా మారాయి. ప్రాపంచిక చెడుగుల నుండి రక్షణ కల్పించే ఆశ్రయంగా చర్చి వుండడం మానుకొన్నది. చర్చి సభ్యత్వం పాపాన్నుండి ఎక్కువ కాలం కాపాడలేకపోయింది. దీనితో సనాతన క్రైస్తవులు పాపపంకిలమైన యీ ప్రపంచాన్ని విడిచి ఎడారికి వెళ్ళి భగవంతునికి అంకితమై ఏకాకి జీవనాన్ని గడిపారు. అక్కడ వారు ఆశ్రమ జీవనాన్ని స్వీకరించారు. మొట్ట మొదటి ఆశ్రమాలు ఈజిప్టులో కనిపించాయి. సెయింట్ ఆంటోని, సెయింట్ పకోమియస్‌లను మొట్ట మొదటి సన్యాసులుగా భావిస్తారు. తదనంతర కాలంలో యితర క్రైస్తవ దేశాలలో సైతం ఆశ్రమాలు ఉనికిలోకి వచ్చాయి. మధ్య యుగాల ప్రారంభంలో ఆశ్రమాలనేవి, వివిధ దండ యాత్రల సమయంలో శరణార్థుల శిబిరాలుగా ఉపయోగపడేవి. విరాళాల ద్వారా సంపద పోగుపడటంతో క్రమక్రమేణా అవి బ్రహ్మాండమైన ఆర్థిక శక్తిగా రూపొందాయి.

తొలినాటి క్రైస్తవం నిర్వహించిన చారిత్రక పాత్ర పరిణామక్రమాన్ని విశదీకరించడం అంత తేలికైన పనికాదు. ఇది చాలా సంక్లిష్టమైన పని. ప్రాచీన మతాచారాలతో పోలిస్తే తొలినాటి క్రైస్తవం ఒకడుగు ముందుకు వేసిందనే చెప్పాలి. ఎందుకంటే ఒక ఉమ్మడి భావన చుట్టూ పలు తెగల ప్రజలను సమీకరించింది. సమానత్వం అన్నదే యీ భావన. తొలినాటి క్రైస్తవంలో “ప్రజాతంత్ర – విప్లవ స్ఫూర్తి”ని గురించి సైతం లెనిన్ ప్రస్తావిస్తారు.”*

---

* వి.ఐ.లెనిన్ : రాజ్యము – విప్లవము

సామాజిక నీతి విషయంలో ప్రాచీన మతాల ఆదిమ నైతిక విలువలను దాటి క్రైస్తవం బాగా ముందుకు వెళ్ళింది. అయితే స్టోయిక్స్‌ల నీతిశాస్త్రంతో పోల్చుకొంటే ఒక అడుగు వెనకే వున్నది. సాంస్కృతిక దృక్పథం నుండి చూస్తే ప్రజలు అర్థం చేసుకోగలిగిన దానినే క్రైస్తవం స్వీకరించింది. అయితే శాస్త్రీయత, ఆధునిక తాత్వికత, అత్యున్నత స్థాయి కళారీతులు పునాదిగా గలిగిన ప్రాచీన సంస్కృతికన్నా యిది చాలా దిగువన వున్నది. మహిమల పట్ల, ప్రవచనాల పట్ల విశ్వాసం గలిగి యథార్థ ప్రపంచాన్ని గుర్తించడానికి తిరస్కరించిన క్రైస్తవ భావజాలం ఆధిపత్యం వహించడంతో మొత్తం మీద సంస్కృతి క్షీణత, నైతిక విలువలు ఛిన్నాభిన్నం కావటం, ఆటవికతత్వంలోకి తిరోగమనం సంభవించింది. మధ్య యుగాల ప్రారంభంనాటి ప్రాచీన నాగరికత పతనం యీ విధంగా ప్రారంభమైంది.

సైతాను సృష్టి అన్న భావనతో అజ్ఞానులైన క్రైస్తవ ఛాందసులు అనేక ప్రాచీన సంస్కృతీ చిహ్నాలను నాశనం చేసిన ఉదాహరణలు మనకు అనేకం తెలుసు. శాస్త్రవేత్తలను, కళాకారులను చంపివేశారు. బిషప్ కిరిల్ నాయకత్వంలోని సన్యాసులు, పూజారులు రెచ్చగొట్టడంతో క్రైస్తవ ఛాందసులు క్రీ.శ. 415లో అలెగ్జాండ్రియాలోని హెలినిస్టిక్ విద్యా కేంద్రాన్ని ధ్వంసం చేసి, విజ్ఞాన భాండాగారమనదగ్గ అత్యద్భుత గ్రంథాలయాన్ని తగులపెట్టారు. గణిత, ఖగోళ, తత్వ శాస్త్రాలపై అమూల్య రచనలు చేసిన సుప్రసిద్ధ మహిళా పరిశోధకురాలు హైపాతియాను హత్య చేశారు. క్రీ.శ. 410లో రోమ్‌లోని కళ, శాస్త్ర సంపదను వెస్ట్‌గోత్‌లు, అదేవిధంగా వీరిని మించి 455లో వండాల్స్ ధ్వంసం చేశారు. మతఛాందసత్వమే యీ విధ్వంసానికి ప్రధాన కారణం. కొత్తగా క్రైస్తవంలో చేరిన వారు తమలోని భీకర మతావేశాన్ని యీ విధంగా ప్రదర్శించారు.

రోమన్ సామ్రాజ్య క్షీణదశలో రాజ్య మతంగా మారిన క్రైస్తవం, గ్రీక్ – రోమన్ సంస్కృతులతోపాటు జర్మన్లలోకి, స్లావ్‌లలోకి చొచ్చుకు వెళ్ళింది. నాల్గవ శతాబ్దంలో గోత్స్, వండాల్స్, క్రైస్తవులుగా మారగా అయిదవ శతాబ్దంలో ఫ్రాంక్స్ క్రైస్తవాన్ని స్వీకరించారు. సుదూర ప్రాంతంలోని జర్మన్ తెగలు (అల్మాని, బవేరియన్, ఫ్రిసియన్, ఆంగ్లో – సాక్సన్ తదితరులు) ఆరు, తొమ్మిది శతాబ్దాల మధ్య క్రమ క్రమేణా క్రైస్తవాన్ని స్వీకరించాయి. తొమ్మిది, పది శతాబ్దాల మధ్య స్లావ్ ప్రజలు యీ మతాన్ని స్వీకరించారు. పదవ శతాబ్దం నాటికి ఐరోపా యావత్తు క్రైస్తవాన్ని స్వీకరించింది. ప్రాచ్యానికి వస్తే నాల్గవ శతాబ్దిలోనే కాకసస్ (ఆర్మీనియా, జార్జియా)లోకి క్రైస్తవం చొరబడింది. అయితే జొరాష్ట్ర మతంతో భీషణ పోరాటం చేయవలసి వచ్చింది. ఏడవ శతాబ్దం నుంచి ఇస్లాంతో తలపడవలసి వచ్చింది. తత్ఫలితంగా తూర్పు దేశాలలో క్రైస్తవం వ్యాప్తికి ఆటంకం ఏర్పడింది.

ఏది ఏమైనప్పటికీ ఐరోపాలోని విగ్రహారాధకులలోకి చొచ్చుకు వచ్చిన క్రైస్తవం స్థానిక మతాలను నాశనం చేయలేదు. అందుకు బదులుగా వాటితో మమేకమైంది. స్థానిక ఆచార వ్యవహారాలను, పురాణ పురుషులను తనలో యిముడ్చుకున్నది. మతాల సమ్మేళనం జరిగిన తీరు యిది. స్థానిక దేవతలు క్రైస్తవ సన్యాసులతో కలిసిపోయి వారి పేరులను స్వీకరించాయి. (ఉదాహరణకు ప్రాచీన స్లావ్‌లు తమ పూర్వపు పెరూన్‌ను ఏలియా ప్రవక్తగా

పిలుచుకొన్నారు) వ్యవసాయ రుతువులతో ముడివడిన జానపదుల సంప్రదాయ ఆచార వ్యవహారాలు క్రైస్తవ కాల గణనంతో కలిసిపోయాయి. (ఇపిసెని, ష్రోప్‌టైడ్, వైట్‌సండే మొదలైనవి). పురాణ కథలలో కనిపించే చిన్నా చితకా జీవుల (రకరకాల జల దేవతలు, అడవుల్లో తిరిగే మరుగుజ్జులు, వింత జంతువులు మొదలైనవి.) పేరులు యధావిధిగా నిలిచిపోయాయి. అయితే వీటిని దుష్ట శక్తులుగా భావించవలసిందిగా ప్రజలకు చర్చి బోధించింది.

15, 16 శతాబ్దాలలో మహత్తర అన్వేషణల యుగానంతరం క్రైస్తవ మిషనరీలు తమ మతాన్ని పాత ప్రపంచం నుండి వెలుపలికి తీసుకురావడం ప్రారంభించారు. ఇందుకుగాను కేవలం సిలువను మాత్రమేకాక నిప్పును, ఖడ్గాన్ని కూడా వినియోగించారు. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి విస్తృత వ్యాప్తి గలిగిన మతంగా క్రైస్తవం రూపొందింది.

క్రైస్తవ చర్చిలోని వ్యవహారాలు, సంబంధాలు రాజకీయ చరిత్ర క్రమాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రాక్ పశ్చిమాలుగా రోమన్ సామ్రాజ్యం (3,4 శతాబ్దాలు) రాజకీయంగా, సాంస్కృతికంగా చీలిపోవడంతో క్రమక్రమేణా ప్రాక్, పశ్చిమాలుగా చర్చి వేరుపడింది. పశ్చిమాన చక్రవర్తి అధికారం క్షీణించి తదనంతరం తొలగిపోయి, సామ్రాజ్యం పతనం కావటంతో (476) చర్చి అధినేత, పోప్‌గా పిలిపించుకొన్న రోమ్ బిషప్ అసాధారణ అధికారాన్ని స్వంతం చేసుకొన్నారు. సామ్రాజ్యం వున్న తూర్పు ప్రాంతంలోని (కాన్‌స్టాంట్ నోపిల్, ఆంటియోస్, అలెగ్జాండ్రియా, జెరూసలెం) క్రైస్తవ బిషప్‌లు యింత శక్తివంతులు కాలేకపోయారు. ఆచరణలో చక్రవర్తుల నుంచి వారు స్వతంత్రులుగా వుండలేకపోయారు. బైజాంటియన్‌లో 8, 9 శతాబ్దాలలో విగ్రహాలను ధ్వంసం చేసే ఉద్యమ కాలంలో (అప్పటిలో తూర్పు ఐరోపా చర్చీలలో విగ్రహారాధన వుండేది) చర్చి స్వాతంత్ర్యానికి ఎదురు దెబ్బ తగిలింది. వీటి స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకై చక్రవర్తులు విగ్రహ పూజను నిషేధించి (ఆరకంగా మతాచారాల పట్ల ఆకర్షణను తగ్గించారు.) చర్చీలకు, ఆశ్రమాలకు చెందిన భూములను స్వాధీనం చేసుకొన్నారు. తదనంతర కాలంలో విగ్రహ పూజను పునరుద్ధరించినప్పటికీ (క్రీ.శ. 842) భూములను మాత్రం తిరిగి యివ్వలేదు. చర్చి స్వాతంత్ర్యాన్ని పూర్తిగా అణచివేయడం జరిగింది.

తూర్పు ప్రాంత బిషప్‌లు రోమన్ పోప్ క్రింద వుండకపోవడానికి కారణమిదే. క్రైస్తవ ప్రపంచంలో పోప్ తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించాడు. తూర్పు చర్చి, పశ్చిమ చర్చీల మధ్య నిర్మాణపరమైన, సిద్ధాంతపరమైన విభేదాలు యీ రకంగా రాజకీయ ఘర్షణను ప్రతిబింబిస్తున్నాయి. ఇవి క్రమేణా పెద్దవై క్రీ.శ. 1054లో యీ రెండు చర్చీల మధ్య లాంఛనగతమైన విభజనకు దారితీసింది.

ఈ రెండు చర్చీలను (పశ్చిమ అంటే రోమన్ క్యాథలిక్, తూర్పు అంటే గ్రీకు సనాతన చర్చి) విడదీసి వుంచుతున్న ప్రధాన విభేదాలు యీ విధంగా వున్నాయి.

1. క్యాథలిక్ చర్చి సిద్ధాంతమేమిటంటే పవిత్రాత్మ అనేది తండ్రి నుంచి, కుమారుని నుంచి వస్తుందని. దీనికి విరుద్ధంగా తండ్రి నుంచి మాత్రమే పవిత్రాత్మ వస్తుందని ప్రాచ్య సంప్రదాయ చర్చి చెపుతున్నది. ఈ భేదాభిప్రాయం అత్యంత ప్రధానమైనదని,

సమాధానపరుపదగనిదని క్యాథలిక్, సనాతన చర్చీలకు చెందిన అధిపతులు ఎల్లప్పుడూ చెపుతూ వుంటారు.

2. భగవంతునికి సన్యాసుల సేవల గురించిన క్యాథలిక్ చర్చి సిద్ధాంతం ప్రకారం చర్చి తన యిచ్ఛానుసారం ఉపయోగించే సంపదలో యీ సేవలు కూడా ఒక భాగం.

3. ఈ పవిత్రమైన నిధి నుండే అయినప్పటికీ పాపాల నుండి విముక్తి చేసే పత్రాలను చర్చి అమ్ముతుంది.

4. నరకం గురించిన క్యాథలిక్ బోధనలుకూడా దీనికి సంబంధించినవే (1439లో ఫ్లోరెన్స్‌లో జరిగిన సమావేశంలో ఆమోదించినవి) ఇక్కడ పాపుల ఆత్మలు అగ్ని స్పర్శతో పునీతమై స్వర్గానికి వెళతాయి. చర్చి చేసే ప్రార్థనల ద్వారా (ఇందుకు బంధువులు డబ్బు చెల్లించాలి) నరకంలో ఆత్మలు వుండే కాలం తగ్గుతుంది.

5. కన్య మేరి పవిత్ర గర్భం గురించిన బోధన తొమ్మిదవ శతాబ్దంలో ప్రారంభమై 1854 నాటికి ఒక సిద్ధాంతంగా రూపుదాల్చింది.

6. విశ్వాసానికి సంబంధించిన వ్యవహారాలలో పోప్ ఎన్నడూ పాపం చేయడన్న సిద్ధాంతం 1870లో వునికిలోకి వచ్చింది.

క్యాథలిక్ చర్చి ఆచార వ్యవహారాలు, సనాతన చర్చితో విభేదిస్తాయి. సనాతన చర్చిలో వలె నీటిలో ముంచడంకాక ఒక వ్యక్తిపై నీటిని సంప్రోక్షించడం ద్వారా క్రైస్తవాన్ని యివ్వడం, శిశువులకు బదులుగా పెద్దలకు తైలాభిషేకాన్ని చేయటం, ప్రార్థనా సమావేశాలలో మతస్థులకు మాత్రమే యిచ్చే రొట్టె, ద్రాక్షరసం బదులుగా అన్యులకు కేవలం రొట్టెను మాత్రమే ఇవ్వడం, కూటములలో ఒట్టి రొట్టెను మాత్రమే ఇవ్వడం, అయిదువేళ్ళతో సిలువ గుర్తును వేసుకోవటం ప్రార్థనా కాలంలో లాటిన్ వినియోగం వంటి విభేదాలు వున్నాయి.

క్యాథలిక్కులలో ప్రవర్తనకు సంబంధించిన వ్యత్యాసాలు కూడా వున్నాయి. మతాచార్యులందరూ బ్రహ్మచర్యాన్ని పాటించడం (ప్రాచ్య సనాతన చర్చి ప్రకారం కేవలం సన్యాసినులు, సన్యాసులు మాత్రమే), మతాచార్యత్వాన్ని విడవటానికి వ్యతిరేకంగా నిబంధనలు, కార్డినల్స్ నిర్మాణమూ, పోప్‌కు ప్రథమ స్థానము, క్రైస్తవ ప్రతినిధులు 21 మండళ్ళను గుర్తించటం. సనాతన చర్చి ఏడింటిని మాత్రమే గుర్తిస్తుంది. సవరణలు వున్నప్పటికీ బైబిలును చదవటం పైనా, దానికి భాష్యం చెప్పటం పైనా అన్యులపై ఆంక్షలు, విడాకులపై నిషేధం వున్నాయి.

ఈ విభేదాలు వున్నప్పటికీ శతాబ్దాలుగా క్యాథలిక్ చర్చి శక్తివంతమైన సంఘంగా మారింది. విశ్వాసులను ప్రభావితం చేసి అనేక దేశాలలో బలమైన రాజకీయ శక్తిగా రూపొందింది.

రోమన్ క్యాథలిక్, సనాతన చర్చీలను అనుసరించే వారు ఎక్కువ కాలం రక్తపాత యుద్ధంలో మునిగి వుండనప్పటికీ యీ రెండింటి మధ్య ఎడబాటు యీనాటికీ కొనసాగుతూనే వున్నది. తూర్పు ప్రాంత చర్చీలపై అదుపును సాధించేటందుకుగాను ఆచార వ్యవహారాలలో కొద్దిపాటి రాయితీలను ఇవ్వడానికి క్యాథలిక్ చర్చి అనేక సందర్భాలలో ప్రయత్నించింది. దీని వలన ఫ్లోరెన్స్ (1439), బ్రెస్ట్ (1596) చర్చీలు విలీనమయ్యాయి. పశ్చిమ బైలో

రష్యా, పశ్చిమ ఉక్రేయన్ ప్రజలలో వ్యాపించిన బ్రెస్ట్ చర్చి క్యాథలిక్ పోలెండ్‌కు వారిని సన్నిహితం చేయాలని ప్రయత్నించింది. అయితే యీ ఐక్యత విభేదాలను తొలగించకపోగా వాటిని మరింత తీవ్రం చేసింది. 1940 వరకు యీ పరిస్థితి కొనసాగింది.

మధ్య యుగాలలో ఐరోపాలో సాగిన వర్గ పోరాటం కారణంగా అనేక శాఖలు, మత ధోరణులు తలెత్తాయి. ఫ్యూడల్ మతాచార్యుల అణచివేతకు యిది ఆకస్మిక నిరసనను ప్రతిబింబిస్తున్నది. వీరిలో బైజాంటియన్‌లోని పౌలీషియన్లు వున్నారు. (7 నుంచి 9 శతాబ్దం వరకు) బల్గేరియాలోని బోగోమైలిస్‌లు (10 నుంచి 13వ శతాబ్దం ఆ తరువాత) వున్నారు. పశ్చిమ దేశాలలోని పాటిరినిస్, కాథరిస్ట్‌లు, అల్బిజినిస్‌లు, వాల్డెన్సిన్లు (11 నుంచి 13వ శతాబ్ది వరకు) తదితరులు వున్నారు.

ఈ శాఖలన్నింటికీ మజ్దాయిజము, (ఇరాన్‌లో అభివృద్ధి చెందిన మతము. అహ్రూ మజ్దాను దేవుడిగా భావిస్తారు) మంచికి చెడుకు తరతరాలుగా ఘర్షణ సాగుతున్నదన్న దాని ద్వివిధ సిద్ధాంతమూ పునాదిగా వున్నాయి. మొత్తం భౌతిక ప్రపంచమూ, మానవ శరీరము దుష్టాత్మ (సాతాను) సృష్టియని, మానవుని ఆత్మ దానితో పాటే ఆధ్యాత్మిక సంబంధమైన ప్రతిదీ దయగల భగవంతుని సృజన అని యీ సిద్ధాంతం చెపుతుంది. ఆ రకంగా వీరు మొత్తం భౌతిక ప్రపంచాన్ని దుష్టమైనదిగా భావిస్తారు. చర్చిని దాని ఆచార వ్యవహారాలను తిరస్కరించి తొలినాటి క్రైస్తవుల వలె నిరాడంబరమైన సన్యాసి జీవితాన్ని తిరిగి స్వీకరించవలసిందిగా యీ శాఖల సభ్యులు బోధించారు. ఫ్యూడల్ అధికార బలంతో కూడిన చర్చి ఆకస్మికంగా తలెత్తిన యీ ప్రజా తిరుగుబాటును అణచివేసింది.

ఈ శాఖలను పూర్తిగా బలహీనపరిచేటందుకుగాను 12వ శతాబ్ది చివరిలో మత న్యాయస్థానాన్ని అంటే 'పవిత్ర న్యాయస్థానాన్ని' పోప్ స్థాపించాడు. అన్యమత విశ్వాసాలను కలిగిన వారిని లేదా మత విరోధి అని ఏమాత్రం అనుమానం వచ్చినా అలాంటి వారిని న్యాయస్థానం ముందుకు తెచ్చే వారు. నిందితులను దారుణంగా హింసించిన అనంతరం మంటల్లో కాల్చివేసేవారు. అన్యమతస్తులుగా భావించిన వారినే కాక 'మంత్రగత్తెలనూ' మాంత్రికులను కూడా న్యాయమూర్తులు విచారించసాగారు. మంత్రగత్తెలను, చర్చి శత్రువులను వెదకి వేటాడి విచారించేందుకు వీలుగా 1487లో మల్లియస్ మాలిపికరం అన్న దారుణమైన ఒక గ్రంథం వెలువడింది. వందల వేలాది మంది అమాయకులను యీ పవిత్ర న్యాయస్థానం తగులబెట్టించటమో లేక చచ్చే వరకు హింసింపచేయటమో చేసింది. ప్రత్యేకించి స్పెయిన్‌లో (1478లో రాజ్య న్యాయస్థానం ప్రారంభమైంది) యీ చర్యలు మరింత ఎక్కువగా జరిగాయి.

తూర్పు ఐరోపాతో పోల్చుకొంటే పశ్చిమ ఐరోపాలో రాజకీయ సాంస్కృతిక జీవన విధానం బలంగా వున్నది. ఇక్కడ మత-తాత్విక సాహిత్యం అపారంగా వెలువడింది. ఉనికిలో వున్న ప్రాచీన విద్యా విధానంతోనూ, శాస్త్రంతోనూ మత సిద్ధాంతాలను ముడివేయటానికి ప్రయత్నాలు సాగాయి. తత్ఫలితంగా స్కొలాస్టిక్స్ (12, 13 శతాబ్దాలలో) అనే పేరున ప్రత్యేకమైన మత శాస్త్రం పుట్టుకొచ్చింది. మతపరమైన అనేక అంశాలపై యీ స్కొలాస్టిక్స్‌లు 'శాస్త్రీయ' పద్ధతిలో చర్చలు జరుపుతూ వుండేవారు. ఆనాటికి మహోత్కృష్ట

రచయితగా వున్న అరిస్టాటిల్ తత్వశాస్త్రంతో బైబిలు మరియు సువార్త బోధనలను సమన్వయపరచటానికి ప్రయత్నించేవారు. శాస్త్రాన్ని లేదా అప్పటికే శాస్త్రంగా పేరొందిన తత్వశాస్త్రాన్ని మత సేవలో పెట్టారు. దైవ సిద్ధాంతానికి తత్వ శాస్త్రం దాసుడన్న నానుడి ఆనాడు వాడుకలోకి వచ్చినదే. సుప్రసిద్ధుడైన మొట్ట మొదటి స్కాలాస్టిక్స్‌లు కాంటెర్ బరి ఆర్చి బిషప్ అయిన సెయింట్ అన్సిలెం, పీటర్ అబిలార్ట్, ఆల్బర్ట్ ది గ్రేట్‌లతో పాటు యీనాటికీ తిరుగులేని శాస్త్రవేత్తగా, తాత్వికునిగా క్యాథలిక్కులు భావించే సెయింట్ థామస్ అక్వినాస్‌లు వున్నారు. పారిస్, బోలోజిన్, ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయాలు వీరికి కేంద్రాలుగా వుండేవి.

ఈ రకమైన మత పండితులకు విరుద్ధంగా క్రైస్తవ సిద్ధాంతాన్ని 'హేతుబద్ధం' చేయటానికి ప్రయత్నించిన యితర చర్చి నాయకులు మతము, శాస్త్రము పరస్పరం విరుద్ధమైనవని గుర్తించారు. వీరు మార్మికవాదం వైపు మొగ్గు చూపారు. భగవంతునితో ప్రత్యక్ష సంబంధానికి వారు తహతహలాడారు. సన్యాస జీవితానికి కట్టుబడి చిదానంద స్థితిలో పనిచేశారు. మానవ కారణాన్ని, ఇంద్రియజ్ఞానాన్ని త్రోసిపుచ్చారు. చర్చి సిద్ధాంతాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అందుకు సమానంగా "అది అసంగతమైనది కనుకనే నేను విశ్వసిస్తున్నాను" అన్న టెర్ టుల్లియన్ మాటలు వుటంకించేవారు. ఈ మార్మికవాద ధోరణికి మూలాలు ప్రాచీన దృశ్యవాదంలో వున్నాయి. 12వ శతాబ్దికి చెందిన సెయింట్ బెర్నార్డ్ మధ్య యుగాలలో మార్మిక వాదాన్ని విపరీతంగా ప్రచారం చేశాడు.

మధ్య యుగాలలో నిజమైన శాస్త్రం పట్ల చర్చికి తీవ్రమైన అనుమానాలుండేవి. యధార్థమైన శాస్త్రీయ పరిశోధనను నిర్వహించడానికి జరిగే ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించేది. బైబిలు ఆధిక్యతకు యీ పరిశోధనలు ప్రమాదమని చర్చి భావించటమే యిందుకు కారణం. ప్రత్యేకించి పునరుజ్జీవన కాలంలో శాస్త్రానికి పలు యిక్కట్లు ఎదురయ్యాయి. స్వతంత్ర ఆలోచనాపరులు జైళ్ళలోపడ్డారు. వధ్య శిలల నెక్కారు. లేదా తమ విశ్వాసాలను ఒదులుకొనేలా వారిపై ఒత్తిడి వచ్చింది. బ్రిటన్‌కు చెందిన తత్వవేత్త, శాస్త్రజ్ఞుడు అయిన రోజర్ బేకన్ (13వ శతాబ్దం) ఆశ్రమ చెరసాలలో అనేక సంవత్సరాలు గడిపాడు. కోపర్నికస్ బోధనలను ఖండించి నిషేధించారు. ఇటలీకి చెందిన తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు అయిన గియోనార్డో బ్రూనో, లూసిలియో వానినీలను కిరాతకంగా చంపారు. సుప్రసిద్ధ ఖగోళవేత్త గెలీలియా గెలిలీ, సూర్యుని చుట్టూ భూమి తిరుగుతున్నదన్న సిద్ధాంతాన్ని వదులుకోవలసి వచ్చింది. ఇంకా అనేక మంది శాస్త్రవేత్తలు యీ విధంగానే కష్టాలపాలయ్యారు. నిషేధిత శాస్త్ర సాహిత్య జాబితాను క్యాథలిక్ చర్చి 1559 నుంచి ఎప్పటికప్పుడు తాజాగా ప్రకటించేది. పవిత్ర న్యాయస్థానం చేతిలో ప్రాణాలు పోగొట్టుకొన్న అన్య మతస్తులు, మంత్రగత్తెల వలె అమరులైన శాస్త్రవేత్తల సంఖ్య తొలినాటి క్రైస్తవ అమరజీవుల కన్నా కొన్ని రెట్లు ఎక్కువగా వుంటుంది. క్రైస్తవం వలె శాస్త్రాన్ని, స్వేచ్ఛా యోచనను అణచివేసిన మతం మరొకటిలేదు.

పదహారవ శతాబ్దం ప్రారంభంలో మధ్య, ఉత్తర ఐరోపా దేశాలలో బూర్జువా ఉద్యమం హఠాత్తుగా తలెత్తింది. ఫ్యూడలిజం పైనా దాని మత సంప్రదాయమైన కేథలిజంపైనా

అదే విధంగా చర్చి నిరంకుశత్వంపైనా, దోపిడీపైనా అది తన పోరాటాన్ని ఎక్కుపెట్టింది. సంస్కరణోద్యమంగా యిది ప్రసిద్ధి చెందింది. రోమన్ క్యాథలిజానికి విడిగా అనేకమైన ప్రొటెస్టెంట్ చర్చీలను యీ ఉద్యమకారులు స్థాపించారు. వీటిలో ప్రధానమైనది లూథరన్ చర్చి. ఇది జర్మనీ, స్కాండినేవియాలలో ఆధిక్యతను సంపాదించింది. స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో కాల్వినిజం: స్కాట్‌లాండ్‌లో ప్రెస్బిటిరినియం, ఇంగ్లండ్‌లో ఆంగ్లికనిజం (ఎపిస్కోపలియన్ చర్చి)లు వ్యాపించాయి. ప్రొటెస్టెంట్ చర్చీల సిద్ధాంతం క్యాథలిక్ చర్చితో విభేదిస్తుంది. మొట్ట మొదటిదేమిటంటే మత వ్యవహారాలకు సంబంధించి పవిత్ర గ్రంథాలే ప్రమాణమని యీ సిద్ధాంతం పేర్కొన్నది. (చర్చికే సంపూర్ణ అధికారమున్నదని క్యాథలిక్‌లు, సంప్రదాయ చర్చి వర్గాలు భావిస్తాయి) రెండవదేమిటంటే విశ్వాసానికి ప్రథమ స్థానమివ్వటం (సత్కార్యాలు లేదా చర్చికి విరాళమివ్వటం అత్యంత ప్రధానమైన విషయమని క్యాథలిజం బోధిస్తుంది) మూడవదేమిటంటే వారు కేవలం రెండు మార్మికతలను (ఏడు కాదు) మాత్రమే గుర్తిస్తారు. క్యాథలిక్‌లు నమ్ముతున్నట్లుగా యథాలాపంగాకాక విశ్వాసులతో కూడుకొన్నప్పుడే బాప్తిజం, కూటములు సత్ఫలితాలనిస్తాయని వారు భావిస్తారు.

బలోపేతమైన ఫ్యూడల్ విధానాలకూ, కేంద్రీకృత క్యాథలిక్ చర్చికి వ్యతిరేకంగా యీ సూత్రాలు నేరుగా ఘర్షణపడ్డాయి. మత వ్యవహారాలను చర్చి స్థాయి నుంచి వ్యక్తిగత స్థాయికి ప్రొటెస్టెంట్ వాదం మార్పు చేసింది. చర్చి నిర్మాణాన్ని ధ్వసం చేసి, ఉత్తర ఐరోపాను చర్చి హస్తాల నుండి విడిపించిన సంస్కరణోద్యమం యీ అధికారాన్ని యితర శక్తులకు బదిలీ చేసింది. జర్మనీ, స్కాండినేవియాలలో లూథరన్ చర్చి యీ అధికారాన్ని రాజులకు అప్పగిస్తే స్విట్జర్‌లాండ్, నెదర్లాండ్‌లోని కాల్వినిజం దీనిని రిపబ్లికన్ బూర్జువాలకు అప్పజెప్పింది. కాగా ఇంగ్లండ్‌లోని ఎపిస్కాపలియన్ చర్చి కేంద్రీకృత రాజరికానికి అందచేసింది. కాల్వినిజం వాదం బూర్జువా ప్రొటెస్టెంట్ వాదం యొక్క దృఢమైన రూపం. సాధు జీవనానికి పూర్తిగా అంకితమై కొద్దిపాటి ఛాందసత్వాన్ని గలిగి విధికృతం గురించి యిది బోధిస్తుంది.

సంస్కరణోద్యమ కాలంలో క్యాథలిక్ చర్చి నుండి విడివడిన శాఖలు (అనబాప్తిస్టు, బొహీమియన్ బ్రదరన్ మొదలైనవి) ప్లెబియన్ డెమోక్రటిక్ వుద్యమాలకు ప్రాతినిధ్యం వహించాయి. అయితే అసంఖ్యాకులైన విశ్వాసులను పెట్టుబడిదారులు దోపిడీ చేసేందుకు వీలుగా క్వాకర్లు, మేథోడిస్టులు, బాప్తిస్టులూ, మిన్నోక్రిటీస్ తదితర ప్రొటెస్టెంట్ శాఖలు మార్గాన్ని సుగమం చేయకుండా యివేవీ నిరోధించలేకపోయాయి.

తొలి నుంచి ప్రొటెస్టెంట్ వాదం అనేక ధోరణులుగా, చర్చీలుగా చీలిపోయింది. ఈనాటికీ యీ ధోరణి కొనసాగుతున్నది. దీనికి విరుద్ధంగా క్యాథలిక్ వాదం కచ్చితమైన కేంద్రీకృత మతంగా నిలబడిపోయింది. 1870లో మాత్రం స్విట్జర్లాండ్, దక్షిణ జర్మనీలో క్యాథలిక్‌లలోని ఒక బృందం చీలిపోయింది. పోప్ పాప రహితుడు అన్న నూతన సిద్ధాంతాన్ని ఆమోదించటానికి తిరస్కరించి వీరు చీలిపోయారు. ఈ పాతకాలపు క్యాథలిక్‌లలో చర్చి నాయకత్వంలో కొంత మేరకు ప్రజాస్వామ్య మార్పులను తీసుకురావటంతో పాటు ఆచార వ్యవహారాలను సులభతరంగావించారు. చెకొస్లోవేకియాలో కొంతమంది క్యాథలిక్‌లు

1920లో రోమ్ నుండి విడిపడ్డారు. అయితే యీ విభజన పూర్తిగా రాజకీయపరమైనది. నూతనంగా ఏర్పడిన రాజ్యాలపట్ల వాటికన్ నేతలు విద్వేషాన్ని చూపడంతో యిలా జరిగింది. స్వతంత్రమైన జెక్ క్యాథలిక్ చర్చి ఏర్పాటైంది. ఏది ఏమైన ప్రపంచవ్యాప్తంగా 58 కోట్ల మంది విశ్వాసులున్న జెక్ క్యాథలిక్ వాదంపై యీ చిన్నపాటి చీలికలు పెద్ద ప్రభావాన్ని చూపలేకపోయాయి.

దక్షిణ, పశ్చిమ ఐరోపాలలోని అనేక దేశాలలో క్యాథలిక్ ఆచారాలు కొనసాగుతున్నాయి. పోర్చుగల్, స్పెయిన్, ఇటలీ, ఐర్లాండ్, బెల్జియం, ఆస్ట్రియా, పోలెండ్‌లలో యివి పూర్తి ఆధిక్యతను కలిగి వున్నవి. కాగా ఫ్రాన్స్, హంగరీ, చెకొస్లోవేకియా వాయువ్య యుగోస్లావియా (స్లోవిక్స్, క్రోట్స్)లలో చెప్పుకోదగిన ఆధిక్యతను కలిగి వున్నది. జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ (దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు) ఉత్తర ఆల్బేనియాలలో బాగా వ్యాప్తి చెందింది. స్విట్జర్లాండ్, బ్రిటన్‌లలో చెప్పుకోదగిన సంఖ్యలో క్యాథలిక్‌లున్నారు. మునుపటి సోవియట్ యూనియన్‌లో కూడా క్యాథలిక్‌లున్నారు. ఐరోపా యేతర దేశాలలో లాటిన్ అమెరికాలో క్యాథలిక్‌వాదం బలంగా వున్నది. అమెరికా, కెనడాలలో (ఫ్రెంచ్ మోడియన్లు) క్యాథలిక్‌లు ఎక్కువగానే వున్నారు. ఆఫ్రికా, ఆసియా, ఓషియానాలలో అనేకులను క్యాథలిక్కులుగా మత ప్రచారకులు మార్చివేశారు.

బైజాంటియన్ మూల స్థావరంగా కలిగి వున్న గ్రీక్ సనాతన సిద్ధాంతం తూర్పు ఆగ్నేయ ఐరోపాలలో బాగా వ్యాపించి వుంది. గ్రీకులు, బల్గేరియన్లు, సెర్బ్‌లు, పలువురు మాసిడోనియన్లు, రోమన్‌లు దీనిని ఇప్పటికీ అనుసరిస్తున్నారు. పదవ శతాబ్దంలో క్రైస్తవ మతాన్ని రాజ్య మతంగా స్వీకరించిన (988లో వ్లదిమీర్ రాజు హయాంలో) రష్యాలో సనాతన చర్చి బలంగా వున్నది. రష్యన్లు, బైలో రష్యన్లు, ఉక్రెనియన్లు, మాల్డీవియన్లు, కరేబియన్లు, కోమీలు, మోర్జినియన్లు, సైబీరియాకు చెందిన మారి, ఉడ్‌ముర్ట్‌లు సనాతన చర్చిని అనుసరిస్తున్నారు. కాకసస్‌లో జార్జియన్లు, ఒసెట్లు కొంతమంది మరి యితరులు సనాతన చర్చిని అనుసరించారు. సైద్ధాంతికంగా జారిస్టు రాచరికాన్ని బలపరిచిన చర్చి వాస్తవానికి దానికి లొంగిపోయింది. రష్యన్ సనాతన చర్చికి చెందిన వారు 1589 నుంచి రాజ్యాధికారం నుండి కొంతమేరకు స్వతంత్రం పొందాలని చూశారు. కాని వారి ప్రయత్నం సఫలంకాలేదు. బిషప్‌లను తొలగించడం ద్వారా పీటర్ ది గ్రేట్, చర్చి స్వాతంత్ర్యాన్ని కుదించివేశారు. జార్‌కు లొంగి వుండేలా మత విషయక (Synod) సభను ఏర్పరిచారు. (1721) సనాతన చర్చి నామమాత్రపు అధికారంలతో మిగిలిపోయింది.

ఫ్యూడల్ అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు తెలిపే నిరసన కొన్ని సందర్భాలలో అధికారిక చర్చికి వ్యతిరేకంగా మళ్ళింది. 17వ శతాబ్దం మధ్యలో యీ పరిస్థితులే కొనసాగాయి. బిషప్ నికోన్ సంస్కరణలకు వ్యతిరేకంగా దిగువ స్థాయిలో చర్చీలు తిరుగుబాటు చేశాయి. ప్రాచీన విశ్వాసులకూ, నికోన్ అనుచరులకూ మధ్య సిద్ధాంతపరంగా విభేదాలు లేవు. ఆచార వ్యవహారాలలోనే తేడాలున్నాయి. పాతకాలపు విశ్వాసులు సిలువ గుర్తును కూడా మూడు వేళ్ళతో కాక రెండు వేళ్ళతో వేసుకొనేవారు. అదేవిధంగా హల్లెలూయా అన్న పదాన్ని మూడు సార్లు కాక రెండుసార్లు మాత్రమే ఉచ్చరించేవారు. ఒక్క అక్షరం

కూడా ఎక్కువ లేకుండా జీసస్ నామాన్ని పలికే వారు. ఇంకా యిలాంటివే కొన్ని వున్నాయి. వీటి విషయంలో పాతకాలపు విశ్వాసులు భీకర పోరాటమే జరిపారు. బహిష్కరణలకూ మరణదండనలకూ భయపడలేదు. అత్మ త్యాగానికిసైతం సిద్ధపడ్డారు.

అయితే యీ పాతకాలపు విశ్వాసులు ఐక్యంగా లేరు. వీరు ప్రధానంగా రెండు బృందాలుగా చీలిపోయారు. పొపొవిట్స్‌లకు (పూజారులుండే శాఖలు) సంపన్నులు, వ్యాపారస్తులు మద్దతు ఇచ్చేవారు. యీ శాఖ వారు జార్ చక్రవర్తి ఆధిపత్యాన్ని గుర్తించారు. బెజ్‌పోపోవిట్స్‌లు (పూజారిలేని శాఖలు) ప్రధానంగా మార్పుకు ప్రాతినిధ్యం వహించారు. సంస్కరణలకు ఎడంగా వుంటూ, ప్రభుత్వ ఆధిపత్యానికి లోబడకుండా, జార్‌ను ప్రధాన చర్చినీ క్రైస్తవ వ్యతిరేకులుగా చూసే రైతులు దీనిలో ప్రధానంగా వున్నారు. ఈ పాతకాలపు విశ్వాసులను ప్రభుత్వమూ, రష్యన్ సంప్రదాయ చర్చి దారుణంగా అణచివేసింది. దీనితో వీరు ఓల్గా ప్రాంతంలోని అడవులలోను, ఉత్తరాదిలోను, సైబీరియాలోనూ రహస్య జీవనం సాగించారు. 1905లో మాత్రమే పాతకాలపు విశ్వాసుల చర్చిని చట్టబద్ధమని ప్రకటించారు.

18వ శతాబ్దం నుండి రష్యాలో కొత్త శాఖలు అభివృద్ధి చెందాయి. రైతులలోనూ అదేవిధంగా ఫ్యూడల్ భూస్వాములు, అధికారులు, పోలీసులు, చర్చి నాయకులు సాగించిన అణచివేతకు గురైన వివిధ ప్రజా బృందాలలోనూ చోటుచేసుకున్న అసంతృప్తిని యీ పరిణామం ప్రతిబింబించింది. 18వ శతాబ్ది ప్రారంభంలో అధికారిక సిద్ధాంతాన్ని, చర్చి సంప్రదాయాలను తదితరాలను విసర్జించిన శాఖ ఒకటి తలెత్తింది. క్రిస్తోవరిలు (క్రీస్తు విశ్వాసులు) అనేవారు యీ శాఖ అనుయాయులు సేవ చేయటానికి బదులుగా ప్రార్థనా కూటములలో నృత్యాలు జరిపేవారు. కొంతమంది తమకు పవిత్రాత్మ వుందని చెపుతూ భవిష్యత్ వాణిని వినిపించేవారు (పూనకాల వంటివి). 18వ శతాబ్దపు ద్వితీయార్ధంలో వీరిలో చీలిక వచ్చి స్కోప్ట్స్‌లుగా పేరొందారు. వీరు ఛాందస భావాలు గలిగిన వారు. శారీరకమైన పాపపు కోర్కెలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సభ్యుల పురుషత్వాన్ని తొలగించేవారు.

ఈ మార్మిక శాఖలతోపాటు హేతువాదాన్ని ప్రాతిపదికగా చేసుకొన్నవి కూడా ఉనికిలోకి వచ్చాయి. హేతువాద దృష్టితో క్రైస్తవ సిద్ధాంతానికి భాష్యం చెప్పేటందుకు యీ శాఖల స్థాపకులు ప్రయత్నించారు. డుకోబర్స్ (1750 నుంచి), మోలోకన్స్ (1765నుంచి), డిస్నోయి బ్రదర్‌హుడ్, ఇల్యిన్ ట్సి (19వ శతాబ్ది మధ్య నుంచి) తదితర శాఖలు ఆవిర్భవించాయి. ఒకవైపున యివి సమిష్టి జీవన విధానం పట్ల రైతులకున్న ఆపేక్షను మరోవైపున స్వేచ్ఛా పెట్టుబడిదారీ అభివృద్ధిని వ్యక్తం చేశాయి. ఏదియేమైనా అధికారిక చర్చి పాలనకూ, బలవంతపు విరాళాలకూ, పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా యివి నిరసన తెలిపాయి.

19వ శతాబ్ది మధ్య నుంచి ప్రొటెస్టెంట్ శాఖలు (స్టుండిస్ట్, మిన్నోనిటీస్, తదనంతర కాలంలో బాప్టిస్టులు మొదలైన వారు) పశ్చిమ ఐరోపా దేశాల నుండి వ్యాపించడం ప్రారంభించాయి. కొన్ని సందర్భాలలో యివి రష్యన్ శాఖలకు దగ్గరయ్యేవి. మరికొన్నిసార్లు వాటిని తరమివేసేవి.

ఇలా చాలా శతాబ్దాల పాటు ఐరోపా దేశాలన్నింటిలోనూ ఫ్యూడల్ వ్యవస్థకు క్రైస్తవ చర్చి కేంద్రంగా వుండేది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడం ప్రారంభించగానే క్రైస్తవ సిద్ధాంతాన్ని స్వీకరించటానికి, కొత్త తరహా, చర్చి నిర్మాణాన్ని సమన్వయపరచటానికీ ప్రయత్నాలు సాగాయి. ప్రొటెస్టెంట్ చర్చీలు, శాఖలు ఆవిర్భవించటానికి యీ పరిస్థితే కారణమైంది. అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ విజయాన్ని సాధించి మధ్య యుగాల ఫ్యూడల్ వ్యవస్థ తొలగిపోవడంతో యీ నూతన వ్యవస్థకు అనుకూలంగా క్యాథలిక్ చర్చి తనను తాను మార్చుకున్నది.

అయితే 19వ శతాబ్దంలో ఐరోపాలోను, అమెరికాలోను సోషలిస్టు కార్మికోద్యమాలు ఆవిర్భవించటంతో క్రైస్తవ చర్చీలలో కొత్త మార్పు చోటు చేసుకొన్నది. సోషలిజం వైపుకు అంతకంతకూ మొగ్గు చూపుతున్న ప్రజలలో తన పలుకుబడిని పదిలంగా వుంచుకోవటానికి గాను కార్మిక శ్రేణులలో క్యాథలిక్ చర్చి తన ప్రచారాన్ని ఉధృతం చేసింది. 1840లలో మొదట ఫ్రాన్స్‌లోనూ ఆ తరువాత బ్రిటన్, జర్మనీ తదితర దేశాలలోనూ క్రైస్తవ సోషలిజం ఉనికిలోకి వచ్చింది. క్రైస్తవ కార్మిక సంఘాలు 1880లలో తలెత్తాయి. 1886లో బెల్జియంలోను, 1887లో ఫ్రాన్స్‌లోను యివి ఆవిర్భవించాయి. 20వ శతాబ్దపు ప్రారంభంలో యివన్నీ అంతర్జాతీయ సంస్థలుగా కలిసిపోయాయి. క్యాథలిక్ రాజకీయ పార్టీలు బలంగా వున్న బెల్జియం, ఇటలీ, జర్మనీలలో ప్రత్యేకించి యీ సంఘాలు బలంగా వున్నాయి. తదనంతర కాలంలో మత విశ్వాసులైన రైతులనూ, కార్మికులనూ ఆసరా చేసుకొని కొన్నిచోట్ల పాలక వర్గాలుగా రూపొందాయి. క్యాథలిక్ యువజన, మహిళా, క్రీడా సంఘాలు కూడా పుట్టుకు వచ్చాయి.

శాస్త్రంపట్ల కూడా చర్చి తన వైఖరిని సవరించుకొన్నది. 19, 20 శతాబ్దంలో ప్రకృతి శాస్త్రము ఇతర శాస్త్రాలు బ్రహ్మాండమైన విజయం సాధించాయి. ప్రపంచాన్ని గురించిన బైబిల్ అవగాహనతో వీటికే మాత్రం సంబంధంలేదని యీ విజయాలు రుజువు చేశాయి. అయినప్పటికీ క్రైస్తవ మతవేత్తలలోనూ, చర్చీలలోను (ప్రత్యేకించి 1910లో అమెరికాలో ఉనికిలోకి వచ్చినది) మత ఛాందసత్వం బలంగానే వున్నది. వీరిలో చాలా మంది బైబిల్‌నే నమ్ముకొని శాస్త్రాన్ని దగ్గరకు రానివ్వలేదు. అయితే దూరదృష్టి గలవారు కొందరు క్రైస్తవ సిద్ధాంతాన్ని శాస్త్రాన్ని సమన్వయపరచాలని ప్రయత్నించారు. బైబిల్‌లోని కొన్ని దృష్టాంతాలను చూపడం ద్వారా వీరు యీ రకమైన ప్రయత్నాన్ని చేశారు. ఆ రకంగా ఆధునికత్వం తలెత్తి క్యాథలిక్కులలోను, ప్రొటెస్టెంట్‌లలోనూ వ్యాపించింది.

గతంలో యు.ఎస్.ఎస్.ఆర్‌లోనూ యితర సోషలిస్టు దేశాలలోనూ ప్రభుత్వానికి మద్దతుగా చర్చి తన రాజకీయ వైఖరిని మార్చుకొన్నది. శాంతి, సామాజిక ప్రణాళిక బోధిస్తూ వివిధ దేశాల మధ్య స్నేహ సంబంధాలను నెలకొల్పటానికీ సామ్రాజ్యవాదం నుండి వలసలు విముక్తి చెందటానికి సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాలు చేసే ప్రయత్నాలకు మద్దతుగా నిలబడింది.

# ఇస్లాం మతం

ప్రపంచ మతంగా అభివృద్ధి చెందిన వాటిల్లో ఇస్లాం మూడవదీ, చిట్ట చివరిదీను.(మొదటి రెండూ బౌద్ధం, క్రైస్తవం-అను). విస్తృత వ్యాప్తి చెందిన మతాలలో యిది ఒకటి. ఈ మతానుయాయుల సంఖ్య దాదాపుగా 80 కోట్లు (1985) వుంటుంది. ప్రధానంగా ఉత్తరాఫ్రికా, నైరుతి, దక్షిణ, ఆగ్నేయ ఆసియాలలో యిది వ్యాప్తి చెందింది. దాదాపుగా మొత్తం అరబ్బు ప్రజలు, టర్కీ, ఇరాన్ వాసులలో అత్యధికులు ఇస్లాంను అనుసరిస్తున్నారు. ఉత్తర భారతీయులలో మహమ్మదీయులు అనేకులు వున్నారు. ఇండోనేషియా ప్రజలలో దాదాపుగా అందరూ ఇస్లాం మతావలంబకులే.

ఈ మతం ఏడవ శతాబ్దిలో అరేబియాలో అభివృద్ధి చెందింది. క్రైస్తవం, బౌద్ధ మతాల కన్నా దీని పుట్టుక గురించి స్పష్టంగా తెలుస్తున్నది. ప్రారంభం నుంచి దీనికి లిఖిత చరిత్ర వుండటమే యిందుకు కారణం. అయినప్పటికీ ఎక్కువ భాగం సమాచారం కల్పిత పురాణ గాథయే. మహమ్మదీయుల సంప్రదాయాన్ననుసరించి మక్కాలో జీవించిన అరబ్బు జాతీయుడైన మహమ్మదు ప్రవక్త ఇస్లాం సంస్థాపకుడు. అల్లా నుండి అనేక 'దివ్య ప్రవచనాలను' ఆయన విన్నారని సంప్రదాయకుల విశ్వాసం. వీటినే ఖురాన్‌లో లిఖించారు. అవి ఇతరులకు చేరాయి. యూదులకు పరిశుద్ధ గ్రంథంలోని తొలి అయిదు అధ్యాయాలు, క్రైస్తవులకు బైబిలు వలెనే మహమ్మదీయులకు ఖురాన్ అత్యంత పవిత్ర గ్రంథం. తొలినాటి ఇస్లాం గురించి అధ్యయనం చేయటానికి ఖురాన్ గ్రంథం అత్యంత ప్రధానాధారంగా వున్నది.

మహమ్మదు స్వయంగా ఏమీ రాయలేదు. ఆయన నిరక్షరాస్యుడని తోస్తున్నది. ఆయన మరణానంతరం ఆయన మాటలకు, బోధలకు సంబంధించి వేర్వేరు పాఠాలు ఏర్పడ్డాయి. తొలి, మలి పాఠాలు రెండూ మహమ్మదు పేరుతోనే వున్నాయి. దాదాపు క్రీ.శ. 650లో (మహమ్మదు మూడవ వారసుడు ఉస్మాన్ కాలంలో) యివన్నీ ఖురాన్‌కు (చదువు, వల్లించు) ప్రాతిపదిక అయ్యాయి. ఈ గ్రంథం పవిత్రమైనదిగా ప్రకటితమైంది. దీనిలోని అంశాలు దేవదూత గాబ్రియల్ ద్వారా ప్రవక్తకు తెలిశాయని చెప్తారు. ఖురాన్‌లో కలవని భాగాలను ధ్వంసం చేశారు.

ఖురాన్ గ్రంథం 114 అధ్యాయాలుగా (సురాలు) విభజితమై వుంది. వీటి అమరికలో ప్రత్యేకమైన క్రమమేదీలేదు. కేవలం వాటి సైజును మాత్రమే పరిగణనలోకి

తీసుకొన్నారు. సుదర్ఘీమైన అధ్యాయాలు మొదటిలోనూ చిన్నవి చివరిలోనూ వున్నాయి. మక్కా, సురాలు (తొలి రచనలు), మదీనా సురాలు (తదనంతర రచనలు)అటనట వుండిపోయాయి. ఒకే రకమైన భాగాలు వివిధ సురాలలో పునరావృతమయ్యాయి. సూచనల ద్వారా, నిషేధాల ద్వారా, హెచ్చరికల ద్వారా అల్లా మహిమను, శక్తి సంపన్నతనూ ప్రకటించే స్తుతులున్నాయి. అవిధేయులందరూ భావి జీవితంలో దుఃఖంలో మునిగిపోతారు. క్రైస్తవ సువార్తలలో జరిగినటువంటి సవరణలు ఖురాన్ గ్రంథంలో కనిపించవు. వాస్తవానికివి ముసాయిదాల వలె వుంటాయి.

ఇస్లాం మత సాహిత్యంలోని మరో భాగం **సున్నా**. మహ్మమదు జీవితం గురించి మహిమల గురించి, బోధల గురించిన పవిత్ర గాథలు (హైదిత్‌లు) దీనిలో వున్నాయి. ముస్లిం మత పండితులైన బుఖారి, ముస్లిం ఇబ్ అల్ హజ్జాజ్ తదితరులు తొమ్మిదవ శతాబ్దిలో యీ హైదిత్‌లను సంకలనం చేశారు. అయితే ప్రతి మహమ్మదీయుడూ సున్నాకు విలువనివ్వరు. ఇస్లాం మతానుయాయులలో అత్యధికులైన సున్నీ తెగవారు మాత్రమే దీనిని గురిస్తారు.

ఖురాన్, హైదిత్‌ల ఆధారంగా మహమ్మదు జీవిత చరిత్రను రూపొందించటానికి ముస్లిం పండితులు ప్రయత్నించారు. ఎనిమిదవ శతాబ్దిలో మదీనాలో నివసించిన హోసైన్ ఇబన్ ఇషాక్ మొట్ట మొదటి జీవిత చరిత్రను రచించాడు. ప్రస్తుతం లభించే పాఠం తొమ్మిదవ శతాబ్దిలో సవరించినది.

ఇస్తాం మతానికి గల ఆధారాలను వెలికి తీయటంలోనూ, మహమ్మద్ జీవిత చరిత్రను రూపొందించటంలోనూ ఐరోపా పరిశోధకులు ఎంతో కృషి చేశారు.

క్రీ.శ. 570-632 ప్రాంతంలో మహమ్మద్ జీవించాడన్నది నిస్సందేహం. మొదట తన నూతన సిద్ధాంతాన్ని మక్కాలో ప్రవచించాడు. అక్కడ ఆయనకు కొద్ది మంది అనుచరులు లభ్యమయ్యారు. పిదప మదీనాలో బోధించాడు. అక్కడ ఆయన అనేక మంది అనుచరులను సంపాదించుకోగలిగారు. మదీనాలోని తన మద్దతుదారులను ఆధారం చేసుకొని మక్కా ప్రజలను తనవైపుకు తిప్పుకోగలిగాడు. ఆ తరువాత అరేబియాలోని ప్రధాన భూభాగంలోని ప్రజలను ఐక్యం చేసి ఇస్లాం వైపు నిలబెట్టగలిగాడు. మహమ్మద్ జీవిత చరిత్రలో అద్భుతాలు కన్పించవు (సువార్త తెలిపే ఏసు క్రీస్తు జీవితంలా వుండదు). ఏది ఏమైనప్పటికీ మహమ్మదీయ మత మూలాలు వ్యక్తుల జీవిత చరిత్రలో కాక అరేబియాలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, భావాత్మక స్థితిగతులలో లభ్యమవుతాయి.

ఇస్లాం ఆవిర్భావానికి దారితీసిన ***చారిత్రక పరిస్థితులేమిటి?*** అరేబియా దీర్ఘకాలం పాటు సెమిటిక్ తెగలకు ఆవాసంగా వున్నది. వీరే నేటి అరబ్బుల పూర్వీకులు. వీరిలో కొంత మంది ఒయాసిస్సుల ప్రక్కన, పట్టణాలలో స్థిరపడి వ్యవసాయమూ, చేతివృత్తులు, వాణిజ్యమూ చేపట్టారు. మరికొంత మంది మైదానాలలోనూ, ఎడారులలోనూ సంచార జీవనం సాగిస్తూ ఒంటెలు, గుర్రాలు, మేకలు, గొర్రెలు మేపుతూ వుండేవారు. పొరుగు దేశాలైన మెసపొటేమియా, సిరియా, పాలస్తీనా, ఈజిప్టు, ఇథియోపియాలతో ఆర్థిక,

సాంస్కృతిక సంబంధాలు అరేబియాకు వుండేవి. ఈ దేశాల మధ్య వర్తక మార్గాలు అరేబియా మీదుగా వెళ్ళేవి. ఎర్ర సముద్ర తీరానికి సమీపాన వున్న మక్కా ఒయాసిస్సు ప్రధానమైన వాణిజ్య కూడళ్ళలో ఒకటిగా వుండేది. ఈ వాణిజ్యం వలన కొరేషి ప్రజల తెగ నాయకులు బాగా లాభించేవారు. మొత్తం అరబ్బుల మత కేంద్రంగా మక్కా అభివృద్ధి చెందింది. వివిధ అరబ్ తెగలు పూజించే పవిత్ర విగ్రహాలు, పూజా పరికరాలు కాబాలో వుండేవి.

అరేబియాలో విదేశీయులు కూడా వుండేవారు. యూదు క్రైస్తవ సమాజాలు యిలాంటివే. ఇక్కడి జనులు వివిధ భాషలను మాట్లాడుతూ, విభిన్న మత విశ్వాసాలను కలిగి వుండేవారు. ఒండొరుల విశ్వాసాలు పరస్పరం ప్రభావితమవుతూ వుండేవి.

వర్తక మార్గాలు తూర్పున ఇరాన్ వైపుకు మరలటంతో ఆరవ శతాబ్ది నుంచి అరేబియాలో బిడారు వర్తకం తగ్గిపోయింది. దీనితో శతాబ్దాలుగా ఉనికిలో వున్న ఆర్థిక సమతుల్యత దెబ్బతిన్నది. బిడారు వర్తకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పోగొట్టుకొన్న సంచార జనులు స్థిర నివాసాలేర్పరచుకొని వ్యవసాయాన్ని చేపట్టారు. సాగు భూమి అవసరం పెరగటంతో తెగల మధ్య ఘర్షణలు పెరిగాయి. దీనితో ఏకీకరణ అవసరాన్ని గుర్తించటం మొదలైంది. ఈ పరిణామం ప్రజల ఆలోచనలను ప్రభావితమొనర్చింది. తెగల ఆచారాలను విలీనం చేసేందుకూ, సమున్నతుడైన ఏకైక దేవుడు అల్లాను పూజించేటందుకూ ఉద్యమం తలెత్తింది. అరబ్బుల ఏకైక లోకేశ్వర భావానికి కొంత మేరకు యూదులు, ఆ తరువాత క్రైస్తవులు ఆదర్శమయ్యారు. ***కొంత మంది అరబ్బులు ఒకే దేవుడిని ఆరాధించే హనిఫైత్ సంప్రదాయాన్ని స్వీకరించారు. మహమ్మదు బోధల ప్రారంభానికి*** దారితీసిన పరిస్థితులు యివి. సామాజిక అవసరాలను ప్రతిబింబించిన ఆయన బోధలలో యూదు, క్రైస్తవ, హనిఫైత్స్‌తో పోలిస్తే కొత్తదనం ఏమీలేదు. మహమ్మద్ బోధల్లోని సారాంశమేమంటే అల్లాను మాత్రమే ప్రార్థించాలి. ఆయన అభీష్టానికి పూర్తిగా లోబడాలి. ఇస్లాం అన్న పదానికి అసలైన అర్థం లోబడుట అని " ఆయన తప్ప అన్యదేవుడు లేడు ..... ఆ భగవంతుని ప్రసాదితమే ఇస్లాం మతం...." (3: 16-17)

ప్రారంభంలో మహమ్మదు బోధలను జనులు విశ్వసించలేదు. పైగా వ్యతిరేకించారు. ప్రత్యేకించి ఆయనకు చెందిన కొరేషి తెగ నాయకులు వ్యతిరేకించారు. ప్రాచీన అరబ్ తెగల దేవుళ్ళను పూజించటం మానుకొంటే మత, ఆర్థిక కేంద్రంగా మక్కా వుండబోదని వణిక్ ప్రముఖులు భావించారు. మహమ్మద్ ఆయన అనుచరులు మక్కా నుండి పారిపోవలసి వచ్చింది. క్రీ.శ. 622లో జరిగిన యీ ఘటననే (హిజ్రా) మహమ్మదీయ శకానికి నాందిగా మహమ్మదీయులు పరిగణిస్తారు. మదీనాలోని వ్యవసాయ ప్రాంతాలలో తన బోధలకు మరింత సానుకూల పరిస్థితులు మహమ్మదుకు లభించాయి. మక్కా రాజరికం పట్ల విద్వేషంతో వున్న మదీనా ప్రజలు దానిపై పోరాటానికి సిద్ధంగా వున్నారు. స్థానికంగా వున్న తెగలు మహమ్మదుకు మద్దతిచ్చాయి. యూదు సమాజాల మద్దతు కోసం ఆయన ప్రయత్నించాడు. అనేక మంది సహచరులను సమకూర్చుకొన్న మహమ్మదు క్రీ.శ. 630లో మక్కాను స్వాధీనం చేసుకున్నాడు. మక్కాలోని కొరేషి నాయకులు నూతన మతాన్ని

స్వీకరించడానికి ఒడబడ్డారు. ఏది ఏమైనా యీ చర్య కారణంగా వారు నష్టపోలేదు, లాభించారు. ఒక దాని తరువాత ఒకటిగా యీ నూతన బోధనలను అంగీకరించిన అరబ్ తెగలు ఏకం కావడంతో జాతీయ మత కేంద్రంగా మక్కా ప్రాధాన్యత మరింత పెరిగింది. తొలుత మహమ్మదీయ ఉద్యమం పట్ల వ్యతిరేకతను ప్రకటించిన కొరేషీ నాయకులు తుట్ట తుదకు యిది తమకు లాభకరమని గుర్తించటమే కాక యీ వుద్యమానికి నాయకత్వం వహించారు.

శైశవ ఇస్లాం యొక్క సామాజిక పునాది, సామాజిక మూలాల గురించి సోవియట్ పరిశోధకులలో విభేదాలున్నాయి. పట్టణాలకు, వణిక్ ప్రముఖులకు వ్యతిరేకంగా సంచార బెదోయిన్లు సాగించిన ఉద్యమమని, ప్రాయికంగా యిది భూమి కోసం సాగిన ఉద్యమమని కొంత మంది విశ్వసిస్తారు. మరికొందరి అభిప్రాయం మరో విధంగా వున్నది. మదీనాలోని వ్యవసాయక పేదలు మహమ్మద్‌కు ప్రధానమైన సామాజిక శక్తిగా వున్నారని వీరి ఉద్యమంలో సంచార జీవనులు చేరటంతో తదనంతర కాలంలో యిది సమరశీల రూపం తీసుకొన్నదని వీరి విశ్వాసం. మక్కాలోని బడా వ్యాపారులకు వ్యతిరేకంగా చిన్న మధ్య తరగతి వర్తకులు సాగించిన ఉద్యమమే తొలినాటి ఇస్లాం అని చాలా మంది యిప్పటికీ నమ్ముతున్నారు. అరబ్బులలోని వివిధ సామాజిక బృందాలు ఇస్లాం పేరుతో సమైక్యమవటాన్ని బట్టి చూస్తే యీ అభిప్రాయం సత్యానికి సన్నిహితంగా వున్నట్లు నాకనిపిస్తుంది. ఎంగెల్స్ యీ విధంగా పేర్కొన్నారు. “ఇస్లాం ఒక మతం. ఒకవైపున యిది వర్తకంలోను, చేతి వృత్తులలోను వున్న పట్టణవాసులకు ఉద్దేశించినది. మరోవైపున సంచార జీవనులైన బెదోయిన్‌లను దృష్టిలో పెట్టుకొన్నది.” ఆర్థిక సంక్షోభంతో నలిగిపోయిన సంచార తెగల ప్రయోజనాలను, ఆకాంక్షలను తొలినాటి ఇస్లాం ప్రతిబింబిస్తున్నది. ఇస్లాం సైనిక శక్తికి వీరే జీవగర్ర. మహమ్మదు తొలి అనుచరులు, వర్తకులు అయిన పట్టణ వాసులు ఉద్యమానికి నాయకత్వం వహించారు.

క్రీ.శ. 632లో మహమ్మద్ చనిపోయే నాటికి యీ ***నూతన సిద్ధాంతం*** పూర్తిగా రూపొందలేదు. దీని స్వభావం క్రమరాహిత్యంతో కూడి వున్నప్పటికీ ప్రధానమైన భావాలను ఖురాన్ ద్వారా తెలుసుకోగలము. వీటిని తదనంతర కాలంలో ముస్లిం మత పండితులు అభివృద్ధి చేశారు.

ఇస్లాం సిద్ధాంతం సులభగ్రాహ్యమైనది. ఒక మహమ్మదీయుడు తప్పనిసరిగా ఒకే ఒక దైవమైన అల్లా పట్ల సంపూర్ణమైన విశ్వాసాన్ని కలిగి వుండాలి. మహమ్మద్ ఆయన ప్రవక్త. ఆయనకు ముందు భగవంతుడు యితర ప్రవక్తలను పంపి వున్నాడు. వారు బైబిల్‌లో కనిపించే ఆదాం, నోవహు, అబ్రహాము, మోషే వీరితోపాటు క్రైస్తవుడైన ఏసు. అయితే మొహమ్మద్ వీరందరికన్నా అధికుడు. దేవ దూతలు, దుష్టాత్మలైన జెన్నత్‌లు వున్నారు. (ఈ రెండవది ప్రాచీన అరబ్బు విశ్వాసాల నుండి ఇస్లాంలోకి చేరింది. ఇవి యెల్లప్పుడూ దుష్టాత్మలుగానే వుంటాయి. ఇవి కూడా భగవంతుని శక్తికి లోబడి ఆయన అభీష్టం మేరకు నడుచుకొంటాయి). తీర్పు దినమునందు మృతులను తిరిగి లేపి వారి వారి చర్యలననుసరించి సత్కరించటమో, శిక్షించటమో జరుగుతుంది. సదాచారులు స్వర్గానికి వెళ్తారు. పాపులు,

అవిశ్వాసులు నరకానికి చేరతారు. ప్రతి ఒక్కరి విధిని అల్లా నిర్ణయిస్తున్నందున యీ దివ్య తీర్పు వుంటుంది.

పరిశుద్ధమైన మానవీయ నైతిక గుణాలు అత్యుత్తమమైన స్థాయిలో అల్లాకు వున్నట్లుగా ఖురాను వర్ణించింది. కొన్ని సమయాలలో ఆయన ప్రజలపై ఆగ్రహిస్తాడు. కొన్నిసార్లు క్షమిస్తాడు. ఆయన కొందరిని ప్రేమిస్తాడు, మరికొందరిని ద్వేషిస్తాడు. యూదు, క్రైస్తవ దేవుళ్ళవలెనే అల్లా కూడా ఏ రకమైన సకారణం లేకుండానే కొందరికి సదాచార జీవనాన్ని, ఆనందమయ భవిష్యత్తును మరికొందరికి నీతిమాలిన చర్యలను, దుఃఖాన్ని మరణానంతరం కల్పిస్తాడు. అయినప్పటికీ సువార్తలలో వలెనే ఖురాన్‌లో కూడా అల్లాను తరచుగా దయామయునిగానూ, క్షమా హృదయునిగానూ పేర్కొన్నారు. అల్లాకున్న ప్రధానమైన లక్షణమేమిటంటే అపరిమిత శక్తి, మహా ఘనత్వము. కనుకనే ఖురాన్‌లో అత్యంత ప్రధానమైన సైద్ధాంతిక, నీతి విషయాలలో సూత్రమేమిటంటే అల్లాకు సంపూర్ణంగానూ, అరమరికలు లేకుండానూ లోబడాలన్న ఆజ్ఞ.

ఇస్లాం బోధించే ఆచరణాత్మక, సంప్రదాయ విధులు దాని సిద్ధాంతం కన్నా సులభమైనవి. అవి యీ దిగువ విధంగా వున్నాయి. నిర్దిష్టమైన సమయాలలో రోజులో అయిదుసార్లు ప్రార్థన, ప్రార్థన చేయటానికి ముందు యితర సమయాలలోను పరిశుభ్రంగా వుండటం, పేదల కోసం చెల్లింపులు, వాస్తవానికిది మత పీఠానికి చెల్లిస్తారు (జకత్). ఏడాదిలో ఒక నెల అంతా ఉపవాసం (ఉర్జా, రంజాన్ అంటే, పదవ మాసంలో) వుండటం, పవిత్ర నగరమైన మక్కాకు యాత్ర (హాజ్). విశ్వాసియైన మహమ్మదీయుడు తన జీవితకాలంలో ఒక్కసారైనా మక్కా యాత్ర చేయాలి.

ఈ నియమాలను ఆచరించడం అంతగా కష్టం కానప్పటికీ వీలుకాని సమయాలలో మార్చుకొనే అవకాశం వున్నది. పరిశుభ్రం చేసుకోవటానికి నీరు అందుబాటులో లేనిపక్షంలో దానికి ప్రతిగా ఇసుక, దుమ్ము వాడవచ్చు. అనారోగ్య పీడితులకు, ప్రయాణంలో వున్న వారికీ ఉపవాసం నిర్బంధంకాదు. ఇలాంటి వారు తదనంతర కాలంలో యిన్నేరోజులు ఉపవాస దీక్షను చేయవచ్చు. మహమ్మదీయుల ఉపవాసం క్రైస్తవుల పద్ధతికి విరుద్ధమైనది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినటం, తాగటం పూర్తిగా మానివేయాలి. మిగిలిన సమయంలో తనకిష్టమైనవి తినవచ్చు, తాగవచ్చు. ఆహ్లాదాన్ని పొందవచ్చు.

మహమ్మదీయులు ఆచరించే అనేక సంప్రదాయాలు, నిషేధాలు యూదుల వాటితో పోలి వుంటాయి. ఇలాంటి వాటిలో బాలురకు సున్నతి చేయడం ఒకటి. యూదులలో వలె శైశవ దశలో కానప్పటికీ ఏడు నుంచి పదేళ్ళ వయస్సులో చేస్తారు. పంది మాంసం తినడంపై నిషేధం, విగ్రహారాధనను నిరోధించటానికిగాను భగవంతుని అదే విధంగా జీవించి వున్న మానవుడు లేదా జంతువుల ప్రతిమలపై పూర్తి నిషేధం. ద్రాక్ష సారాయి తాగడంపై కూడా మహమ్మదీయులపై నిషేధం వున్నది. అయితే దీనిని ప్రతిచోటా పాటించటంలేదు.

మహమ్మదీయ మతంలో ఒక అంశమేమిటంటే విశ్వాసం కోసం పవిత్ర యుద్ధం

(జిహాద్) చేయటం. నూతన భూభాగాలను సమైక్యం చేయడం, స్వాధీనంలోకి తెచ్చుకోవడం అన్న అరబ్బుల అవసరం నుండి మహమ్మదీయ ఉద్యమం అభివృద్ధి చెందిందనే విషయాన్ని గమనంలో వుంచుకొంటే దీనిని (జిహాద్) అర్థం చేసుకోవచ్చు. ఖురాన్ యీ విషయాన్ని స్పష్టంగా చెప్తుంది. అనేక దేవతలను నమ్ముకున్నవారితో, అవిశ్వాసులైన వారితో వ్యతిరేకంగా ఏడాదికి ఎనిమిది నెలలపాటు పోరాటం చేయాలి. వారిని నాశనం చేసి వారి సంపదను చేజిక్కించుకోవాలి. మత ఛాందసత్వానికీ, యితర మతాలపట్ల అసహనానికీ యిది స్పష్టమైన గురుతు. ఇతర ప్రపంచ మతాలకన్నా ఇస్లాంకున్న ప్రత్యేక లక్షణం. అయితే ముస్లిం మత పండితులు, లౌకిక పరిశోధకులు జిహాద్ అన్న ఆదేశానికి తదనంతరకాలంలో విభిన్నమైన భాష్యాలను చెప్పారు. వాస్తవానికి అనేకమైన ముస్లిమేతర మతాల అనుయాయులపట్ల కొంత వ్యత్యాసాన్ని ఖురాన్ చూపుతుంది. అనేక దేవతలను ప్రార్థించే వారిపట్ల అదేవిధంగా తెగలకు, బహు దేవతారాధనకు సంబంధించిన సంప్రదాయాలను పాటించే వారిపట్ల తీవ్రమైన శత్రుత్వ వైఖరిని చూపటం జరిగింది. "ఓ విశ్వాసులారా! మీ ప్రక్కనే వున్న అవిశ్వాసులతో యుద్ధము చేయుడు. వారు మీ కఠినత్వమును గ్రహింపవలెను. అల్లాహ్ నిష్ఠాపరుల వెంట వున్నాడని తెలిసికొనవలెను'' (9:123). యూదు, క్రైస్తవ మతానుయాయులపట్ల ఖురాన్ గౌరవాన్ని చూపింది. ఇస్లాంకు యీ మతాలు ప్రాతిపదికగా వుండటాన్ని బట్టి దీనిని అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా ఖురాన్ యీ విధంగా పేర్కొంటున్నది. "అల్లాహ్‌ను గాని, అంతిమ నిర్ణయ దినమునుగానీ విశ్వసించని వారితో, అల్లాహ్ అతని ప్రవక్త నిషేధించిన వాటిని నిషేధంచని వారితో యుద్ధము చేయుడు" (9: 29) ఆచరణలో విభిన్న మతావలంబకుల మధ్య ఇస్లాం వ్యత్యాసాన్ని పాటించలేదు. వీరందరినీ అవిశ్వాసులుగా భావించింది. వీరిని నాశనం చేయటమో లేక లోబరచుకోవటమో జరగాలి.

**ఇస్లాం నీతి** ప్రాథమికమైనది. మంచి మహమ్మదీయుడు న్యాయంగా వుండాలి. మంచికి మంచిని, చెడుకు చెడును ఫలితంగా ఇచ్చేలా ఉదారంగా వుండాలి. పేదలకు సాయపడాలి వంటివి క్రైస్తవంలో వలే కాకుండా ఆచరించటానికి అసాధ్యమైన నైతిక సూత్రాలేవీ దీనిలోలేవు.

ఇస్లాంలోని కుటుంబ నీతి, స్త్రీ, పురుషుల మధ్య సంబంధాలు పితృస్వామ్య తెగల సంప్రదాయాలతో ప్రభావితమయ్యాయి. స్త్రీ లొంగివుండాలి. మగవాడి ఆనందం కోసం అల్లా ఆమెను సృష్టించాడు. ఇదే సమయంలో స్త్రీల మానవీయ, పౌర హక్కులను ఖురాన్ గుర్తించింది. తన భార్యపట్ల భర్త యొక్క క్రూర ప్రవర్తనను అది ఖండించింది. స్త్రీల ఆస్థి హక్కును నిర్దిష్టంగా పేర్కొన్నది. (అంటే వరకట్నమూ, వారసత్వ హక్కులను) అరబ్బులు పాటించే సాధారణ పితృస్వామ్య సంప్రదాయాలలో కన్నా స్త్రీలకు కొంత మేరకు ఖురాన్ వున్నతస్థానమిచ్చింది.

తొలినాటి ఇస్లాంలోని సామాజిక సూత్రాలు యీ పితృస్వామ్య సంప్రదాయాలకు ప్రతి రూపమే. భగవంతుని ముందు మహమ్మదీయులందరూ సమానులే. అయితే ధనికులకు

పేదలకు మధ్య వున్న వ్యత్యాసాన్ని అల్లాయే స్వయంగా ఏర్పాటు చేసిన సహజాతంగా గుర్తించారు. పేదల నిమిత్తం తప్పనిసరిగా చెల్లించవలసినది యీ అంతరాన్ని తగ్గించటానికి ఉద్దేశించినదే. ఏది ఏమైనప్పటికీ వ్యక్తిగత ఆస్తికి ఖురాన్ రక్షణ కల్పిస్తున్నది. వర్తకం ద్వారా వచ్చే లాభాలను న్యాయబద్ధమని పేర్కొన్నప్పటికీ వడ్డీ వ్యాపారాన్ని ఆమోదించలేదు. "భగవంతుడు వర్తకాన్ని అనుమతించి, వడ్డీ వ్యాపారాన్ని నిషేధించాడు" (2:275). వాణిజ్య వర్గాల ప్రయోజనాలకూ అదే విధంగా వడ్డీ వ్యాపారం కారణంగానూ, దాస్యం కారణంగాను ఇబ్బందుల నెదుర్కొంటున్న రైతు, సంచార జనుల ప్రయోజనాలకూ మధ్య రాజీ ఫలితంగా యీ నియమం వచ్చినట్లు కన్పించుతున్నది. అప్పు నిమిత్తం దాస్యం చేయించుకోవటాన్ని ఖురాన్ నిషేధిస్తున్నది.

శైశవ ఇస్లాం సిద్ధాంతాన్ని ఆచారాలను, నీతులను స్థాలీపులాక న్యాయంగా పరిశీలించినప్పుడు యివి ప్రధానంగా యూదు క్రైస్తవ సూత్రాలపై ఆధారపడినట్లు కన్పిస్తాయి. కాని ఇస్లాం అంతకన్నా ప్రాథమికమైన సామాజిక నిర్మాణాన్ని స్వీకరించింది. పతనోన్ముఖ దిశలో వున్న తెగల సంప్రదాయాల నుండి పుట్టుకొచ్చినదిది. ప్రజలకు, ప్రత్యేకించి ఆసియాకు చెందిన సంచార జీవులకు, వ్యవసాయదారులకు ఇస్లాం ఆదర్శాలు సులభగ్రాహ్యంగానూ, స్పష్టంగానూ కన్పించాయి. ఆదేశాలు సంక్లిష్టమైనవి కావు ఆచరణకు సుసాధ్యమైనవి.

ఇస్లాంకున్న యీ ప్రత్యేకతలు, ఏ పరిస్థితులలోనైతే యీ మత ప్రాదుర్భావం జరిగిందో వాటి కారణంగా జనించిన ప్రత్యేకతలు అరబ్బులలో యీ మత వ్యాప్తికి దోహదపడ్డాయి. వేర్పాటువాద తత్వం వైపు మొగ్గు చూపిన తెగల నాయకత్వం నుంచి ప్రతిఘటన ఎదురైనప్పటికీ (మహమ్మదు మరణానంతరం అరబ్బు తెగలు తిరుగుబాటు చేశాయి) అరబ్బు ప్రజలలో ఇస్లాం విజయాన్ని సాధించి త్వరితగతిని వ్యాపించింది. క్రొత్త క్రొత్త భూములను స్వాధీనం చేసుకోవటం ద్వారా సంపన్నులు కావటానికీ, సంక్షోభాన్నుంచి బయటపడటానికీ సులభతరమూ, సుస్పష్టమూ అయిన మార్గాన్ని సమరశీల బెదోయిన్లకు యీ నూతన మతం చూపింది.

మహమ్మదు వారసులు (ఖలీఫాలు అబూబెకర్, ఒమర్, ఉస్మాన్) అతి తక్కువ కాలంలో యిరుగు పొరుగు ప్రాంతాలనూ ఆ తరువాత మధ్యధరా ప్రాంతానికీ, సమీప ప్రాచ్యానికీ చెందిన దూర దేశాలను జయించారు. ఇస్లాం పేరుతో యీ విజయపరంపర సాగింది. బైజాంటిక్, సస్సానిడ్ సామ్రాజ్యాలలోని ప్రజలు అదే విధంగా యితర దేశాలకు చెందిన వారు స్థానిక ఫ్యూడల్ ప్రభువుల దారుణ అణచివేతకు గురై వుండటంతో అరబ్బులను ప్రతిఘటించటానికి సుముఖత చూపలేదన్నది కూడా యధార్థం. అరబ్బులు జయించిన దేశాలలో వ్యవసాయదారులపైనా ప్రత్యేకించి ఇస్లాంను స్వీకరించిన వారిపైనా చెప్పుకోదగిన విధంగా నిర్బంధాలు తగ్గాయి. వివిధ జాతుల ప్రజలు మొత్తంగా నూతన మతాన్ని స్వీకరించటానికి ఇదొక కారణం. అరబ్బుల జాతీయ మతంగా అభివృద్ధి చెందిన ఇస్లాం అతి త్వరలోనే ప్రపంచ మతంగా వ్యాప్తి పొందింది. ఎనిమిది, తొమ్మిది శతాబ్దాల నాటికే ఇస్లాం ఆధిపత్య మతంగా రూపుదిద్దుకొన్నది. స్పెయిన్ నుండి మధ్య ఆసియా వరకూ,

భారతదేశం సరిహద్దుల వరకు గల విశాల భూఖండంలోని ఖలీఫాత్ దేశాలలో వాస్తవానికి యిదొక్కటే మతంగా వున్నది. పదకొండు, పదునెన్మిది శతాబ్దాల మధ్య ఉత్తర భారతంలో ఇస్లాం బాగా వ్యాప్తిచెందింది. దండయాత్రలు కూడా దీనికొక కారణం. 14, 16 శతాబ్దాల మధ్య ఇండోనేషియాలోకి ఇస్లాం వ్యాపించింది. అరబ్, భారత్ వర్తకుల ద్వారా యీ వ్యాప్తి జరిగింది. బలిద్వీపాన్ని మినహాయిస్తే మిగిలిన ఇండోనేషియా ప్రాంతంలో హిందూ, బౌద్ధ మతాల స్థానాన్ని ఇస్లాం ఆక్రమించింది. 14వ శతాబ్దంలోనే గెల్డోన్ హోర్డిలోకి ఇస్లాం ప్రవేశించింది. బుల్గార్లు, నల్ల సముద్ర తీరాన నివసించే ప్రజలు యీ మతాన్ని స్వీకరించారు. కొంత కాలం తరువాత ఉత్తర కాకసస్, పశ్చిమ సైబీరియా ప్రజలు కూడా యీ మతాన్ని స్వీకరించారు.

మతం పేరుతో కొంత మేరకు ప్రజలను ఇస్లాం సమైక్యం చేసినప్పటికీ ముస్లిం దేశాలలో జాతీయ విభేదాలను గానీ, వర్గ వైరుధ్యాలనుగానీ తొలగించలేకపోయింది. తద్విరుద్ధంగా అవి క్రమక్రమేణా అభివృద్ధి చెందాయి. మహమ్మదీయ మతంలోని వివిధ ధోరణులకు చెందిన శాఖోపశాఖలలో యీ వాస్తవం ప్రతిబింబిస్తున్నది.

తొలుదొల్తటిదీ అతి పెద్దదీ అయిన మత భేదం, షియా వాదం (అరబిక్‌లో యీ పదానికి పార్టీ, అనుసరణ, శాఖ అనే అర్థాలు వస్తాయి) తలెత్తటంతో సంభవించింది. అరబ్ విజేతలకు వ్యతిరేకంగా నిలిచిన ఫ్యూడల్ ప్రభువులు వ్యవసాయదారులు అంటే పర్షియన్ల అసంతృప్తికీ, ఘర్షణకు ప్రతిరూపంగా షియా ఉద్యమాన్ని తరచుగా భావిస్తూ వుంటారు. మరో విధంగా చెప్పవలసి వస్తే కేవలం మతం పేరుతో ఇరాన్‌లో సాగిన అరబ్ వ్యతిరేక జాతీయ వుద్యమంగా దీనిని చెప్పవచ్చు. అయితే యిది పాక్షిక సత్యం మాత్రమే. కాని యీ తరహా చిహ్నాలు తదనంతర కాలంలో షియా సంప్రదాయంలో మోసులెత్తాయి. వాస్తవానికిది అరబ్బుల మధ్య అంతర్గత పోరాటంతో, అంటే మహమ్మదు వారసుల మధ్య అధికారం కోసం పెనుగులాటతో ప్రారంభమైంది. నాల్గవ ఖలీఫా అయిన ఆలీ, ప్రవక్తకు రక్త సంబంధీకుడు. ఆయనకు బావమరిది అవుతాడు. ఆలీ మద్దతుదారులు (షియా-ఆలీ, అంటే ఆలీ పార్టీ) అంతకు ముందు వున్న ఖలీఫాల చట్టబద్ధతను గుర్తించలేదు. వీరు యీ కుటుంబం నుంచి వచ్చిన వారు కాదు. మత సామాజికులచే ఎంపికైన వారు మాత్రమే. ఆ రకంగా వారు అధికారాన్ని చేజిక్కించుకొన్నారు. ఖలీఫాల అధికారం కొనసాగింపుపై తలెత్తిన వివాదం రూపంలో అధికారం కోసం ఘర్షణ ప్రారంభమైంది. ఆలీ పార్టీ పరాజయంపాలైంది. ఆలీ హతుడయ్యాడు. అయితే తదనంతర కాలంలో ఆలీ మద్దతుదారులు ఇరాన్, ఇరాక్‌లలో సంఘటితపడ్డారు. అరబ్ ఖలీఫాల అధికారానికి వ్యతిరేకంగా సాగిన నిరసనకు ప్రతి రూపంగా షియా సంప్రదాయం విస్తృతంగా వ్యాపించింది. షియా సంప్రదాయాన్ననుసరించి ఆలీ, ఆయన కుమారులైన హసన్, హుసేన్‌లు విశ్వాసం కోసం మృతి చెందిన త్యాగధనులు. ప్రతియేటా షాహసి-వాహసి నిర్వహణ ద్వారా షియాలు వీరికి నివాళులర్పిస్తూ వుంటారు. ఈ సమయంలో కొంత మంది మతావేశపరులు ఒక రకమైన వున్మాదానికి లోనై ఆయుధాలతో గానీ లేదా యితర రకాలైన ఆటవిక పద్ధతుల ద్వారా గానీ తమను తాము

గాయపరచుకొంటారు. అమరజీవుల స్మృత్యర్థం తమ మత విధేయతను వారు యీ విధంగా ప్రకటిస్తారు.

మహమ్మదు ప్రవక్త యొక్క న్యాయమైన వారసులు, ఇమామ్‌లు ఆయన వంశానికి చెందిన వారై వుండాలే తప్ప, సామాజికులు 'ఎంపిక' చేసిన జనులై వుండగూడదన్న నమ్మకం షియా సంప్రదాయంలోని ముఖ్య లక్షణం. ఎంపిక చేసిన వారికి లభించిన అధికారం ధర్మమార్గాన వచ్చినది కాదు కనుకనే వారు న్యాయబద్ధమైన నేతలు కాదు. ప్రవక్తకు సంబంధించిన గాథల నుండి తొలి ఖలీఫా కాలంలో సంకలనం చేసిన సున్నాలను షియాలు అంగీకరించరు. ఏది ఏమైనప్పటికీ షియాలు ఐక్యంగా లేరు. వీరిలో వివిధ ధోరణులు తలెత్తాయి. ఆలీ వారసులైన పదకొండు మంది న్యాయబద్ధమైన ఇమామ్‌లను గుర్తించిన వారికి ప్రాతినిధ్యం వహించే వారు ఆధిపత్య స్థానంలో వున్నారు. తొమ్మిదవ శతాబ్దికి చెందిన పన్నెండవ ఇమామ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడని యీనాటికీ ఎక్కడో అదృశ్యంగా వున్నాడని విశ్వసిస్తారు. రక్షకునిగా (మహ్‌ది) పునర్దర్శనం ఇవ్వనున్న అంత్యకాలం కోసం ఆయన ఎదురు చూస్తున్నట్లు విశ్వసిస్తారు. షియాలలోని యీ ప్రధానమైన శాఖ ప్రత్యేకించి ఇరాన్‌లో బలంగా వున్నది. 16వ శతాబ్దం ప్రారంభం నుంచి (సపవిద్ వంశస్తుల కాలంలో) అధికార మతంగా మారింది.

షియా సంప్రదాయం నుంచి ఉద్భవించిన యితర శాఖలకు అనుచరులు స్వల్పంగానే వున్నారు. ఇవి కేవలం శాఖా భేదాలుగానే మిగిలిపోయాయి. ఆఫ్ఘనిస్తాన్, బదాహ్‌షాన్ కొండ ప్రాంతాలలో విస్తృతంగా వ్యాపించిన ఇస్మాయిల్ (ఎనిమిదవ శతాబ్దానికి చెందిన దాని సంస్థాపకుడు ఇస్మాయిల్ పేరుతో యిది ఉద్భవించింది) శాఖ యిలాంటి వాటిల్లో ఒకటి. ఇస్మాయిల్ శాఖకు చెందిన అనేక బృందాలు భారతదేశంలోని గుజరాత్, బొంబాయిలలో వున్నాయి. తమ ఇమామ్‌లలో విశ్వాత్మ వుంటుందని ఇస్మాయిల్ తెగవారు విశ్వసిస్తారు. ఈ ఇమామ్‌లు ఆగాఖాన్ వంశ వారసత్వాన్ని స్థాపించారు. ఈ వంశీయులు విలాసవంతమైన లౌకిక జీవనాన్ని గడుపుతూ శాఖానుయాయుల నుండి కప్పాలు పుచ్చుకున్నారు. ఇస్లాం ఆవిర్భావానికి ముందు ఆసియాలోనూ, స్థానిక ప్రజలలోనూ వున్న మత, తాత్విక విధానాలకు చెందిన అనేక భావాలను ఇస్మాయిల్ సంప్రదాయకులు స్వీకరించారు.

కర్మాతియన్లుగా తమను తాము పిలుచుకొన్న ఒక బృందం తొమ్మిదవ శతాబ్దంలో ఇస్మాయిల్ శాఖ నుండి విడిపోయింది. ఇదొక ప్రజాతంత్ర శాఖ. ప్రాయికంగా దీని సభ్యులు అరేబియాలోని బెదోయిన్లు, వ్యవసాయదారులు. వీరు ఉమ్మడి ఆస్తి హక్కులను స్థాపించారు. నయా ప్లేటో వాదులు,నోస్టిక్‌ల బోధలతో ముస్లిం బోధలను సమైక్యం చేయటానికి యీ శాఖ అధిపతులు ప్రయత్నించారు. వీరు మానవుని దివ్య లోక సంబంధితునిగా భావించేవారు కర్మాతియన్ శాఖ పదకొండవ శతాబ్దం వరకు వునికిలో వున్నది.

ఇస్మాయిల్ శాఖ నుండి అస్సాసిన్ శాఖ సైతం ఆవిర్భవించింది. మార్మికవాదము, ముస్లిమేతరులకు వ్యతిరేకంగా మత విశ్వాసం కోసం ఛాందసత్వంతో గూడిన పోరాటముల

యొక్క కలగలుపే యీ శాఖ సూత్రాలుగా వుండేవి. మత యుద్ధాల సమయంలో అస్సాసిన్‌లు భయంకర శత్రువులుగా వుండేవారు. ఫ్రెంచ్ – ఆంగ్ల భాషాపదమైన 'అస్సాసిన్' (హతమార్చటం) యీ శాఖ నుండే పుట్టుకొచ్చింది.

పదకొండవ శతాబ్దంలో ఇస్మాయిల్ శాఖ మరోసారి చీలింది. హాకిం ఖలీఫా అనుచరులు దానికి నాయకత్వం వహించారు. ఈ శాఖ మద్దతుదారులను యీనాడు డ్రూసెస్ (లెబనాన్) అన్న పేరుతో పిలుస్తున్నారు. ఈ శాఖకు ప్రముఖ నాయకుడైన ఇస్మాయిల్ అద్ – దరార్జి ద్వారా యీ పేరు వచ్చింది.

షియా సంప్రదాయానికి విభిన్నంగా ప్రపంచంలోని అత్యధిక మహమ్మదీయులు సనాతన ఇస్లాంను పాటిస్తున్నారు. దీనినే సున్నీ సంప్రదాయమని పిలుస్తారు. ఈ సంప్రదాయాను సారులు సున్నాలను గుర్తిస్తారు. అయితే సున్నీ సంప్రదాయం కూడా ఏకశిలా సదృశంగా లేదు. 8, 9 శతాబ్దాలలో ముతాజిల్ శాఖ ఆవిర్భవించింది. హేతుత్వ ప్రాతిపదికపై మహమ్మదీయ సిద్ధాంతాన్ని వాఖ్యానించటానికి వీరు ప్రయత్నించారు. భగవంతుడు 'న్యాయపరిపాలకుడు' మానవుడి ఇచ్ఛ స్వతంత్రమైనది. ఖురాన్ మానవులు రాసిందేగాని, భగవంతుని సృష్టి కాదని వీరు చెప్పేవారు. బలహీనంగా వున్న తమ అధికారాన్ని పటిష్టం చేసుకోవటానికై యీ శాఖపై ఆధారపడిన ఖలీఫాలు (తొమ్మిదో శతాబ్దం) ముతాజిల్ అనుయాయులను సమర్థించారు. అయితే త్వరలోనే (తొమ్మిదవ శతాబ్దం చివరిలో) ప్రతీఘాత మత ఛాందస వర్గం ఖిలాఫత్‌లో పై చేయి సాధించి ముతాజిల్ అనుయాయులను వేధించటం ప్రారంభించారు. ఖురాన్ శాశ్వత గ్రంథమని మానవులు రచించలేదన్న సిద్ధాంతాన్ని మరింత శక్తివంతం చేశారు. ఇది ఎలా వున్నప్పటికీ మహమ్మదీయుల ఆలోచనలకు సంబంధించిన భవిష్యత్ అభివృద్ధిపై ముతాజిల్ ప్రభావం పడింది.

మహమ్మదీయ సిద్ధాంతానికి సంబంధించి 8, 9 శతాబ్దాలలో నాలుగు శాఖలు అభివృద్ధి చెందాయి. అవి హనిపిట్, షఫీత్, మాలికైట్, హనబలైట్. వీటి సంస్థాపకుల పేరుతో యివి వృద్ధి చెందాయి. హనబలైట్ శాఖ అత్యంత మౌఢ్యంతో కూడుకున్నది. మత సిద్ధాంతానికి స్వేచ్ఛా భాష్యం చెప్పింది. అరేబియాలోని బెదోయిన్ తెగకు చెందిన వెనుకబడిన ప్రజలలో యిది బలంగా నిలదొక్కుకున్నది. ఇదే విధంగా ఉత్తరాఫ్రికాలో మాలికైట్ శాఖ వ్యాపించింది. మిగిలిన రెండు శాఖలు మహమ్మదీయ ప్రపంచంలోని నాగరిక ప్రాంతాలలో ఆదరణ పొందాయి. మత సిద్ధాంతానికి యివి ఇచ్చిన భాష్యాలు ఉదారవాదంతో కూడుకున్నవి. ఈ నాలుగు శాఖల మధ్య ప్రత్యేకమైన ఎడబాటుగాని, శత్రుత్వంగానీ లేవు.

మార్మిక, పాక్షిక సన్యాస జీవిత ధోరణితో కూడిన సూఫీతత్వాన్ని 8, 10 శతాబ్దాల మధ్య ఇస్లాం స్వీకరించింది (సూఫీ అనేది ముతక నూలు బట్ట). షియా సంప్రదాయాన్నుండి యిది ఆవిర్భవించింది. అయితే సున్నీ సంప్రదాయకులు కూడా దీనిని స్వీకరించారు. ***మజ్దావాద*** భావాల ప్రభావం సూఫీతత్వంపై వున్నది. బహుశా చివరికి బౌద్ధ మత ప్రభావము, నయా ప్లేటోవాద ప్రభావం కూడా దీనిపై వుండవచ్చు. పైపై ఆచారాలకు సూఫీవాదులు అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. భగవంతుని పట్ల వాస్తవావగాహనను కలిగి వుండాలని

దైవత్వాన్ని పెంపొందించుకోవాలని వారు వాంఛించారు. వాస్తవానికి వారిలో కొందరు బహుదేవతారాధకులు (భగవంతుడు సర్వాంతర్యామి. యావత్ప్రపంచము భగవంతుని నుండి ఆవిర్భవించినదే). ఈ విధంగా ఖురాన్‌లో చిత్రితమైన అల్లాకు వారు దూరంగా జరిగారు. ఖురాన్‌లో పేర్కొన్న దేవతల నామాలు మార్మిక ప్రాధాన్యత గలవని వారు భావించారు. మార్మిక, బహు దేవతారాధక ధోరణితో కూడిన సూఫీవాదులను తొలుత సనాతన ముస్లిం ఛాందసవాదులు వేధించినప్పటికీ క్రమక్రమంగా వారితో కలిసిపోయారు. నిత్యమూ సంచరించే సన్యాసుల, ఫకీరుల ఆజ్ఞలను సూఫీ అనుయాయులు ఆమోదించేవారు. షేక్‌లు లేదా ఇసాక్‌లు అధినేతలుగా వుండేవారు. సున్నీలు, షియాలు యిరువురూ వీరి ఆజ్ఞలను పాటించేవారు. ఈ ఫకీరులు సన్యాస జీవితం గడుపుతామని ప్రతిజ్ఞ తీసుకున్నప్పటికీ త్వరలోనే వీరు వాగుడుకాయలుగా మారిపోయి అమాయకులను వంచిస్తూ మోసగించేవారు. ఈ ఫకీరుల నాయకులైన ఇషాక్‌లు తమ క్రింది వారిని (ముర్దీలు) వంచించ సాగారు. ప్రార్థనా సమయాలలో కొంతమంది ఫకీరుల ఆజ్ఞలు వున్మాదాన్ని రగిలిస్తే మరికొన్ని మోసపూరితంగా వుండేవి. హు! అన్న మార్మిక కేకకు చాలా ప్రాధాన్యత వున్నదని వారు భావించేవారు.

సూఫీతత్వంతో తారిఖ్ ఉద్యమం చారిత్రకంగా ముడిపడి వున్నది. భగవంతునిలో మమేకం కావడానికిది సన్మార్గంగా తొలుత ముందుకు వచ్చింది. (తారిక్ అంటే అరబిక్‌లో మార్గమని అర్థము) తదనంతర కాలంలో క్రైస్తవులకు, ఇతర అవిశ్వాసులకు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధంలో పాల్గొన్నవారికి ఛాందసత్వాన్ని నూరిపోయటం మొదలుపెట్టింది. తారిఖ్‌ల పోరాట యోధులుగా ముర్దీలు వుండేవారు. తమ ఆధ్యాత్మిక గురువు ఆజ్ఞలను వారు గ్రుడ్డిగా ఆచరించేవారు.

ఆధునిక కాలంలో సామాజికార్థిక, రాజకీయ పరిస్థితులు సంక్లిష్టంగా మారి వర్గ పోరాటాలు తీవ్రతరం కావడంతో కొత్త కొత్త ఇస్లాం శాఖలు బయలుదేరాయి. అరేబియాలోని బెదూయిన్‌లలో వహాబీ సంప్రదాయం 18వ శతాబ్దంలో తలెత్తింది. (మహమ్మద్ బీన్ అబ్దుల్ – వహాబ్ అనుచరులు). పట్టణ వర్తకులు ధనికులు గడిపే సంపన్న విలాస జీవితం పట్ల సంచారుల ఆకస్మిక నిరసనను యీ సంప్రదాయం ప్రతిబింబిస్తున్నది. వహాబీ సంప్రదాయకులు హన్‌బలైట్ సంప్రదాయాలకు గట్టిగా కట్టుబడ్డారు. ఇస్లాం తొలి శతాబ్దాల నాటి నిరాడంబరమైన పితృస్వామ్య జీవనానికి తిరిగి రావాలని వారు కోరారు. ఆచార వ్యవహారాలనూ, నిషేధాలనూ తప్పనిసరిగా పాటించాలని విలాసాలను విడిచిపెట్టాలని, ఐరోపా సంస్కృతీ ప్రభావాన్ని తొలగించుకోవాలని వారు కోరారు. సాధు సంప్రదాయాన్ని వారు అంగీకరించలేదు. భగవంతుడిని మాత్రమే ప్రార్థించేవారు. 20వ శతాబ్ది ప్రారంభంలో తమ శత్రువులపై భీకర పోరాటాన్ని సాగించిన అనంతరం నెజ్డ్ (అరేబియన్ సంధి)లో వహాబీలు ప్రధాన పాత్ర వహించారు. తదనంతర కాలంలో మక్కా మదీనా పట్టణాలతోపాటు హిజాబీపై గెలుపు సాధించారు. వహాబ్ సిద్ధాంతం సౌదీ, అరేబియాలో ఆధిపత్యాన్ని సాధించి ఉభయ ప్రాంతాలను కలిపి వేసింది.

పర్షియా విషయానికొస్తే 19వ శతాబ్దం మధ్యలో పట్టణ పేదల, రైతుల అసంతృప్తి మతరూపాన్ని సంతరించుకొన్నది. తనను తాను బాబ్ (ప్రజలకు భగవంతునికి మధ్యవర్తి)గా పిలుచుకొన్న షిరాజ్‌కు చెందిన మహమ్మద్ ఆలీ వీరి సిద్ధాంత నాయకుడు. ఇది బాబైట్ వుద్యమంగా ప్రసిద్ధి చెందింది. ప్రజల మధ్య సమానత, సోదర భావం వుండాలని వీరు ప్రచారం చేశారు. అయితే మహమ్మదీయులైన పక్షంలో మాత్రమే యిది వర్తిస్తుంది. ప్రజలలోకి నూతన శాసనాన్ని తీసుకు వచ్చేటందుకు ఉద్దేశించిన ప్రవక్త వారసుడినని బాబ్ చెప్పుకొన్నాడు. ఆయన సిద్ధాంతం మార్మిక భావజాలంతో నిండివుండి బహు దేవతారాధనకు దగ్గరగా వుంటుంది. సాధారణ ప్రజలలో విశేషంగా వ్యాప్తి చెందిన బాబైట్ సంప్రదాయాన్ని ఆనాటి ప్రభుత్వం అణచివేసింది. ఈ సంప్రదాయ నాయకులను 1850లో కిరాతకంగా ఉరితీశారు. ఏది ఏమైనప్పటికీ యీ ఉద్యమం ఉనికిని నిలబెట్టుకొన్నది. అయితే సమరశీలత, విప్లవతత్వం కొరవడ్డాయి. బాబ్ మాజీ అనుచరులలో ఒకరైన మీర్జా హుసేన్ ఆలినూరి తనను తాను బహ 'ఒ'ల్లాహ్‌గా పిలుచుకొంటూ బాబ్ సంప్రదాయ, బోధలను గణనీయంగా మార్చివేశాడు. ఈయన కూడా ప్రజలలో సమానత్వాన్ని బోధిస్తూ భూమి హక్కులు తదితరమైన వాటిని నొక్కి చెప్పాడు. హింసను, పోరాటాన్ని ఆయన ఆమోదించలేదు. ప్రేమ, క్షమ, దుష్ట శక్తులపై శాంతియుత ప్రతిఘటనను బోధించాడు. బహుశా క్రైస్తవ ఆదర్శాల ప్రభావం ఆయనపై వుండవచ్చు. ఈయన బోధించిన మహమ్మదీయ సిద్ధాంతాలనూ, శాసన ప్రమాణాలను మార్పు చేయటం జరిగింది. ఈ నూతన బోధలకు బహాయిజం అని పేరు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా యిదెంతో కాలం వుండలేకపోయింది. మేధావి వర్గంలో మాత్రం బాగా వ్యాప్తి చెందింది. ఏది యేమైనప్పటికీ బహాయిజం అనేది ఇస్లాం యొక్క నవీనమైన, సంస్కరించిన ఆధునిక ధోరణి. చివరికి పశ్చిమ ఐరోపా, అమెరికాలలో సైతం యీ సంప్రదాయానికి అనుచరులు ఏర్పడ్డారు.

ఇస్లాం పేరుతో వలస దేశాలలో పెద్ద ఎత్తున విముక్తి ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. 1881–1898 మధ్య సూడాన్‌లో సాగిన **మహ్‌ది వుద్యమం** వీటిల్లో సుప్రసిద్ధమయినది. తనను తాను మహ్‌దీగా (రక్షకుడు, మెస్సయ్య) ప్రకటించుకొన్న మహమ్మద్ అహ్మద్ యీ ఉద్యమ నాయకుడు. వలసవాదులకు వ్యతిరేకంగా ఆఫ్రికన్ ముస్లిం పోరాటాన్ని ఆయన నడిపారు. తూర్పు సూడాన్‌తోపాటు, దూర ప్రాచ్య ప్రాంతాలు, ఎర్ర సముద్రానికి పోయే మార్గములు యీ వుద్యమం ప్రభావం క్రిందకు వచ్చాయి. దాదాపు 20 సంవత్సరాలపాటు యీ పోరాటం సాగింది. ఆంగ్లో, ఫ్రెంచ్ సామ్రాజ్యవాదం ఎంతో కష్టంతోగాని దీనిని అణచివేయలేకపోయింది.

మహమ్మదీయ మతంలోని ఒక ప్రధాన ధోరణి యేమంటే ప్రజా జీవనంలోని అన్ని పార్శ్వాలలోనూ అది ప్రగాఢమైన జోక్యం కల్పించుకొన్నది. అంకిత భావం గలిగిన మహమ్మదీయుని వ్యక్తిగత, కుటుంబ జీవనమూ, యావత్తు సామాజిక వ్యవహారాలు, రాజకీయాలు, శాసనాలూ, న్యాయస్థానాలూ, సాంస్కృతిక జీవనమూ మొదలైనవన్నీ మత శాసనాలకు పూర్తిగా లోబడినవే. పూర్వం ముస్లిం దేశాలలో ప్రభుత్వమూ, మసీదు కలగలసి

వుండేవి. ప్రభుత్వాధినేత (ఖలీఫా)ను ప్రవక్త వారసునిగా పరిగణించేవారు. మత పీఠంలోని వున్నత స్థానాలలో ఆయన సలహాదారులే వుండేవారు. న్యాయస్థానం పూర్తిగా మత పీఠం అదుపులో వుండేది. నేరచట్టమూ, పౌర చట్టమూ రెండూ మత శాసనాలపై అంటే **షరియత్**పై పూర్తిగా ఆధారపడేవి. శాసనానికి భాష్యం చెప్పే మతాధిపతులే షరియత్ అమలును పర్యవేక్షించేవారు.

ఆ రకంగా మత వ్యవహారాలలో కన్నా లౌకిక వ్యవహారాలలోనూ మత పీఠం ఎక్కువగా తలమునకలై వుండేది. మసీదులోని ముల్లాయే బోధకుడిగా వుండేవాడు. షరియత్‌లో నిపుణుడైన కాజ్ న్యాయమూర్తి. షరియత్ విషయంలో ముఫ్తీది చివరి మాట ఉలేమా మత సంరక్షకుడిగా వుంటూ అత్యున్నత స్థాయి మత పాఠశాలలో బోధకుడిగా ఉండేవాడు. మతమూ, శాసనం గురించి ఉలేమాల మండలి తన సిఫార్సులు చేస్తూ వుండేది. ఏ దేశానికాదేశంలో ముస్లింల ప్రధాన మతాధిపతిగా షేక్ ఉల్ ఇస్లాం వుంటాడు. ప్రముఖ మత పండితుడైన యీ అధిపతి పాలకునికి సలహాదారుగా వుండేవాడు. సిద్ధాంతానికీ, రాజకీయాలకూ లేదా చట్టాలకూ సంబంధించిన వివాదాస్పద వ్యవహారాలలో షేక్ ఉల్ ఇస్లాం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తాడు. ఆయన అభిప్రాయాన్ని తిరుగులేనిదిగా భావించేవారు.

ముస్లిం దేశాలలో విద్య పూర్తిగా మతపరమైనది. ప్రాథమిక పాఠశాలలు మసీదులోనే వుంటాయి. ఉన్నత పాఠశాలలు, ***మదరసాలు*** మత విద్యా కేంద్రాలు. ఖురాన్ తదితర మత సాహిత్యాన్ని విద్యార్థులు అధ్యయనం చేస్తూ మత విషయాలను చర్చిస్తారు. బోధనా భాషగా మత సాహిత్య భాషగా అరబిక్ వుంటుంది. అయితే టర్కీ, ఇరాన్ భాషలు అరబిక్ లిపిని చేపట్టినప్పటికీ వాస్తవానికి అది ఉపయుక్తమైనదికాదు.

ఇస్లాం దేశాలలో ముస్లిం మత పీఠం సాధారణంగా ప్రధానమైన ఆర్థిక కేంద్రంగా వుంటుంది. షరియత్ ప్రకారం యీ పీఠానికి స్వంత ఆస్తి వుంటుంది. దీనిని ఎవరూ తప్పించలేరు (వక్ఫ్). దీనికున్న భూములను ఖలీఫాలు (విజయ పరంపర కాలంలో) వ్యక్తులు ఇచ్చినవి. ఈ విశాల భూఖండాల వలన బ్రహ్మాండమైన ఆదాయాలు లభించేవి. కఠినమైన ఆంక్షలతో వీటిని కౌలుకు ఇచ్చేవారు. ఈ రకమైన ఆస్తి పెద్ద మసీదుకు చెంది వుంటుంది.

సనాతన ఇస్లాం యితర మతాలతో రాజీపడనప్పటికీ (బౌద్ధానికి యిది విభిన్నం) ప్రజల విషయానికి వచ్చే సరికి మహమ్మదీయ విశ్వాసాలు తరచుగా ప్రాచీనమైన, ముస్లిం మతావిర్భావానికి ముందరివైన విశ్వాసాలతో కలగలసిపోయాయి. దాదాపు ప్రతిచోటా ప్రత్యేకించి వర్ధమాన దేశాలలో స్థానిక సాధువుల సంప్రదాయాలు వ్యాపించాయి. ఈ ముస్లిం సాధువులు నిజానికి కొన్ని సందర్భాలలో స్థానికమైన రక్షణ దేవతలు. వీరికే మహమ్మదీయ నామాలు ఇవ్వటం జరిగింది. చాలా ప్రాంతాలలో సాధువుల పూజా విధానం ***మజార్‌ల*** పూజా విధానంతో ముడిపడి వుంటుంది. ఈ సాధువులవిగా చెప్తున్న సమాధులు వాస్తవానికి ప్రాచీన స్థానిక ఆలయాలు. అంతేకాక ఇటీవలి కాలంలో ఇస్లాంలో వున్న అనేక ప్రాచీన విశ్వాసాలనూ, ఆచార వ్యవహారాలను కనుగొనటం జరిగింది. ఇవి ప్రత్యేకించి మధ్య ఆసియాకు చెందినవి. వ్యవసాయ దేవతల పూజా విధానానికీ, తెగ పూర్వీకుల

పూజా విధానానికీ సంబంధించినవివి. ముస్లిలందరూ మహిమలలో విశ్వాసాన్ని చూపుతారు. తరచుగా ఖురాన్ పఠనం చేస్తూ వుంటారు. చాలా మంది ముల్లాలు మంత్రాలు చదువుతూ వ్యాధులను నయం చేసే వారుగా వ్యవహరిస్తూ వుంటారు.

శతాబ్దాలపాటు ఇస్లాంకు క్రైస్తవానికి మధ్య సాగిన ఘర్షణలలో (అదే విధంగా మజ్దాయిజంతోనూ ఇతర మతాలతోనూ జరిగిన ఘర్షణలలోనూ) ఇస్లాందే పై చేయిగా వున్నది. ఇస్లాం ఆధిపత్య  మతంగా వున్న మధ్యదరా సముద్ర ప్రాంత దేశాలలో ఎక్కువ భాగం (ఉత్తరాఫ్రికా, ఈజిప్టు, సిరియా, ఆసియా మైనరు) క్రైస్తవం స్థానాన్ని ఇస్లాం స్వీకరించింది. ఇస్లాం వ్యాప్తి చెందకముందు కాకసస్‌లో అత్యధికులు క్రైస్తవులు. తదనంతర కాలంలో వీరిలో ఎక్కువ మంది ఇస్లాంను స్వీకరించారు. (సర్కాసియన్స్, కబర్డీనియన్స్, అజరైన్స్, కొంత మేరకు ఒసెట్స్, అబ్కాసియన్స్) బాల్కన్ ద్వీప కల్పంలో తొలుత క్రైస్తవులుగా వున్న కొన్ని గ్రూపులు అంటే బల్గేరియన్స్, మాసిడోనియన్స్, బోస్నియన్స్, అల్బేనియన్స్ ఇస్లాంను స్వీకరించారు. మహమ్మదీయులు క్రైస్తవులుగా మారిన ఘటన చరిత్రలో సంభవించలేదు. క్రైస్తవుల పునర్విజయం కారణంగా (12 నుంచి 15 శతాబ్దం వరకు) స్పెయిన్, పోర్చుగల్ నుంచి మహమ్మదీయులను వెళ్ళగొట్టారన్నది నిజమే అయినప్పటికీ యిది సైద్ధాంతికంగా ఒక మతం మరో మతంపై విజయం సాధించటం వలన కాక ఇస్లాం అనుచరులను బహిష్కరించే క్రమంలో చోటు చేసుకున్నది.

క్రీస్తు మతంపై మహమ్మదు మతం తరచుగా విజయం సాధించటం ఎందువల్ల జరిగింది;? ఇస్లాం మరింత సులభంగానూ, ప్రజలు అర్థం చేసుకోవటానికి తేలికగాను వుండటమే దీనికి కారణం అన్పిస్తుంది. ప్రత్యేకించి పితృస్వామ్య ఫ్యూడల్ సంప్రదాయాలు బలంగా వున్న ప్రాచ్య దేశాలలో యిది నిజమనిపిస్తుంది.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత యిటీవలి దశాబ్దాలలో అనేక మహమ్మదీయ దేశాలలో మత ప్రభావం పరిమితం చేసేటందుకై బూర్జువా సంస్కరణలు సాగాయి. రెండవ ప్రపంచ యుద్ధం నాటి నుండి కొత్తగా స్వాతంత్ర్యం సాధించిన ఆసియా, ఆఫ్రికా దేశాలలో అభివృద్ధి చెందిన విస్తృత ప్రజాతంత్ర, పురోగమన ఉద్యమం, మహమ్మదీయ సంప్రదాయాలలో మరింత సమూల మార్పులకు దిద్దుబాట్లకు దారితీసింది. స్వభావరీత్యా యీ మార్పులు అనేక సామాజిక,రాజకీయ పరిస్థితులకు అనుగుణ్యంగా వున్నాయి.

ఆనాటి కాలానికి అనుగుణ్యంగా పాత నిషేధాలను సరిదిద్దడం లేదా తొలగించటం, పూజా పద్ధతులను నవీనమొనర్చడం వంటివే ఇవి. మహమ్మదీయ మతం నుంచి ఏవో కొద్దిపాటి రాయితీలకు మాత్రమే యీ మార్పులు పరిమితంకాలేదు. మౌలికమైన పురోగతికి అవి ప్రాతినిధ్యం వహించాయి. అనేక దేశాలలో తలెత్తిన ప్రగతిశీల ఉద్యమాలు చట్టాలను, దైనందిన జీవితాన్ని లౌకిక బద్ధం చేశాయి. మతపీఠాల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. షరియత్ ప్రభావాన్ని పరిమితం చేయటం జరిగింది. రాజ్యం నుంచి మత పీఠం విడివడింది. లౌకిక పాఠశాలలు, ఉన్నత విద్య ప్రవేశించాయి. ప్రత్యేకించి టర్కీలో రిపబ్లిక్ స్థాపనానంతరం (1920లలో ముస్తఫా కెమల్ అటాటర్క్ సంస్కరణలు) సమూల

సంస్కరణలు చోటు చేసుకొన్నాయి. ఆసియా, ఆఫ్రికాలలోని ముస్లిం దేశాలలో వలస పాలన వైదొలగిన అనంతరం, పెట్టుబడిదారీ – సోషలిజం అన్న రెండు పరస్పర విరుద్ధ సామాజిక వ్యవస్థలకు సంబంధించి ఇస్లాం వైఖరి యేమిటన్న ప్రశ్న తలెత్తింది. అనేక ధోరణులు ఆవిర్భవించాయి. ఒక ధోరణికి చెందిన వారు పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాదులు వేసేందుకై ఇస్లాం భావాలను స్వీకరించారు. అయితే, అల్లా ముందు అందరూ సమానమేనన్న ఇస్లాం సిద్ధాంతం ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలకు ముడిపడి వున్నదంటూ విప్లవాత్మక పెటీ బూర్జువా శక్తులు ప్రత్యేకించి అరబ్ దేశాలలోని వారు వక్కాణించారు. ఇదే సమయంలో కమ్యూనిజానికి ప్రతిగా 'ముస్లిం సోషలిజం' సిద్ధాంతవేత్తలు పుట్టుకొచ్చారు. మరికొంత మంది మార్క్సిస్టు వైఖరిని చేపట్టటానికి ప్రయత్నించి పెట్టుబడిదారీ యేతర అభివృద్ధి అన్న 'తృతీయ పంథా'ను ప్రకటించారు. మహమ్మదీయ సిద్ధాంతానికిది అనుగుణంగా వుండేటట్లు చూశారు. మహమ్మదీయ సిద్ధాంతానికి విశాల ప్రాతిపదికపై భాష్యాలు చెప్పటం జరుగుతున్నది.